# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ : విశాఖపట్నం - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 311 - శనివారం - 11 జూలై 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, హైదరాబాద్


## సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం



- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన

4

## అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న విచారణ



అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

4

## నాలుగు దశాబ్దాల తర్వాత..

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం..
- ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు

4





# సోషల్ మీడియాలో అతికి కళ్లెం

## సమాజానికి నష్టం కలిగించేలా తయారైన రోగం

- అసత్యాలతో రాజకీయ బురదజల్లుతున్న ప్రచారం
- ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చే ఆలోచన
- ప్రపంచవ్యాప్తంగా కఠిన చర్యలు అమలుపై అధ్యయనం
- కేబినేట్ నిర్ణాయాలను వివరించిన మంత్రి పార్థసారథి

2

సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే ఒక 'రోగంగా' మారుతోందని ఆంధ్రప్రదేశ్ కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా కీలక అజెండా అంశాలకు ఆమోదం లభించింది. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో విస్తృతంగా చర్చించారు. విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను వేగంగా గుర్తించేందుకు పోలీసు శాఖకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని నిర్ణయించారు. దీనిపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అంతర్జాతీయ చట్టాలపై కేబినెట్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

*- అమరావతి, జూలై 10 (మనసులో మాట)*



## 9,355 కోట్లతో తాగునీటి పథకాలు

- 10 భారీ మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌ల ఏర్పాటు
- నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లు
- 2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు
- పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునీకీకరణ

2

# అంగన్‌వాడీల ధర్నా

## కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలపై పోరుబాట




అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం భారీ ఆందోళనలు చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. విశాఖపట్నంలో జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టగా, విజయవాడ ధర్నాచౌక్‌లో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు.

*- విజయవాడ, జూలై 10 (మనసులో మాట)*

2

# గృహోపకరణాల యూనిట్ ఏర్పాటు చేయండి

- కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్

2





## పోర్టులు, భూములను కట్టబెట్టేందుకే కేబినేట్

- ఐదుగురు మంత్రులు దుమ్మా కొట్టినా పట్టింపు ఏదీ
- మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపాటు

2

# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం
- రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరా కొనసాగుతోంది
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2



### ఎన్ఐఏ కేసుల విచారణకు

# ప్రత్యేక కోర్టు

- 16 పోస్టుల సృష్టికి గ్రీన్ సిగ్నల్
- హైకోర్టులో 'రిజిస్ట్రార్ (కోర్టు అండ్ కేస్ మేనేజ్‌మెంట్)' కొత్త పోస్టు ఏర్పాటు




ఎన్ఐఏ చట్టం కింద నమోదయ్యే కేసుల వేగవంతమైన విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిజిస్ట్రార్ (కోర్టు అండ్ కేస్ మేనేజ్‌మెంట్) పేరుతో కొత్త పోస్టు సృష్టించేందుకు కూడా ఆమోదం తెలిపింది.

3

## భలే మాట!





# గృహోపకరణాల యూనిట్ ఏర్పాటు చేయండి

**కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్**

అమరావతి, జూలై 10: రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ దక్షిణకొరియా పర్యటన ఆరోరోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా గృహోపకరణాలు, నీరు, గాలి శుద్ధి పరికరాల సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలోని గృహోపకరణాల క్లస్టర్‌లో అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, డైకిన్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి సంస్థలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. దేశంలో 40శాతం ఏసీలు, 35శాతం టీవీలు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయన్నారు. ఇందుకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉందని వివరించారు. ఇక్కడి నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడం సులభమన్నారు. దక్షిణ భారతదేశంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి భారతదేశం ఒక విశ్వసనీయ తయారీ భాగస్వామిగా ఉందని తెలిపారు. ఈ అనుకూలతల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో లేదా తిరుపతిలో.. గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ చెప్పారు. దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్, పాసివ్ కాంపొనెంట్స్ తయారీ సంస్థ మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్ , ఇంటర్నేషనల్ సేల్స్ అండ్ రీసెర్చ్ జనరల్ మేనేజర్ బైద్య శర్మతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

**బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం**
**రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరా కొనసాగుతోంది**
**రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు**
**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**




**శ్రీకాకుళం/అమరావతి, మనసులో మాట, జిల్లా ప్రతినిధి, జూలై 10:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని, ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85 శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు. అలాగే 85,683 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64 శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అనుగుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లాల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని రేగిడి అమదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్‌ఎస్‌కే పరిధిలో 731 ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80 ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా, ప్రస్తుతం 90 ఎకరాల వరి, 80 ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు. ఈ ఆర్‌ఎస్‌కే పరిధిలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస, అప్పాపురం, ఎం.ఆర్.పేట గ్రామాలకు తొలి దఫా అవసరంగా 811 బస్తాల యూరియా అవసరమని తెలిపారు. ఇప్పటికే బొడ్డవలస, అప్పాపురం గ్రామాలకు 225 బస్తాలు పంపిణీ పూర్తయిందని, మిగిలిన గ్రామాలకు 219 బస్తాల పంపిణీని యూరియా కార్డులు, ఏపీ ఏ ఐ ఎం ఎస్ ద్వారా చేపట్టే సమయంలో రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో అదనపు డిమాండ్ ఏర్పడిందన్నారు. అదనంగా వెంటనే 444 బస్తాల యూరియాను సమీప రైతు సేవా కేంద్రం నుంచి తెప్పించి అదే రోజు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి, టోకెన్ విధానం, క్యూలైన్ ఏర్పాటు చేసి పంపిణీని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 9,987 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అందులో మార్క్‌ఫెడ్ వద్ద 4,850 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అవసరమైన ఎరువులను ప్రభుత్వం సమయానికి అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# సోషల్ మీడియాలో అతికి కళ్లెం

- సమాజానికి నష్టం కలిగించేలా తయారైన రోగం
- అసత్యాలతో రాజకీయ బురదజల్లుతున్న ప్రచారం
- ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చే ఆలోచన
- ప్రపంచవ్యాప్తంగా చర్యలు అమలుపై అధ్యయనం
- కేబినేట్ నిర్ణాయాలను వివరించిన మంత్రి



**అమరావతి, జూలై 10 (మనసులో మాట):** సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే 'రోగంగా' మారుతోందని ఎపి కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేబినేట్ వివరాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు. విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని ఈ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై అన్ని ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో నైపుణ్యం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అవసరమైతే నియమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, అసత్య ప్రచారం కోసం కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి కార్యకలాపాలకు కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై డీజీపీ, పోలీసు అధికారులు క్యాబినెట్‌కు సమగ్ర నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. విదేశాల్లో అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు, భారత ఐటీ చట్టంలోని లోపాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు వివరించారు. మహిళలను, బాలికలను కించపరిచే పోస్టులు, వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై చట్టాలను మరింత బలోపేతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారని చెప్పారు. రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సోషల్ మీడియా దుర్వినియోగ నియంత్రణపై దేశ, విదేశాల్లో అమలులో ఉన్న ఉత్తమ విధానాలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం) అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# 9,355 కోట్లతో గ్రామాల్లో తాగునీటి పథకాలు

- 10 భారీ మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌ల ఏర్పాటు
- నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లు
- 2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు
- పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణ
- 30కి పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం



**అమరావతి, జూలై 10 (మనసులో మాట):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా కీలక అజెండా అంశాలకు ఆమోదం లభించింది. వాటిలో ముఖ్యంగా.. మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ చేపట్టాలని నిర్ణయించారు. గ్రామాల్లో రూ.9,355 కోట్లతో 10 భారీ మల్టీ విలేజ్ తాగునీటి పథకాల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లతో 2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు చేశారు. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణతో పాటు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్ పనులకు కేబినెట్ ఆమోదం లభించింది. భూసమీకరణ నిర్ణయాలు.. అమరావతిలో రెండో విడత కింద భూములిచ్చే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు సాగు రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. 2026 జనవరి 6 కంటే ముందు తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ మాఫీ వర్తిస్తుంది. భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు ఏటా మెట్ట భూములకు రూ.3 వేలు, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున కౌలు పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీనితో మొత్తం కౌలు మెట్ట రైతులకు రూ.40 వేలకు, జరీబు రైతులకు రూ.60 వేలకు చేరనుంది. రెండో విడత భూసమీకరణ పరిధిలోని 307 ఎకరాల ఇనాం భూములకు గానూ దేవదాయశాఖకు రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. సీఆర్డీఏ ఆమోదించిన సంస్థలకు, ఎన్‌ఎఫ్‌డీబీ భారీ అక్వేరియం-కార్యాలయానికి, అలాగే ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ సంస్థలకు భూకేటాయింపులు జరపనున్నారు. నెల్లూరులో ఐటిసి హోటల్, కడపలో మాధవి హోటల్, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఆమోదించారు. కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్మెంట్ పార్కు ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొత్త పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో భారీ కాన్సర్ట్ (సంగీత/సాంస్కృతిక ప్రదర్శనలు)ల నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని ప్రతిపాదించారు. పర్యాటక ప్రచారానికి రూ.50 కోట్లు కేటాయించారు. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చించారు. విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో 'అంబేద్కర్ గురుకుల సీవోఈ ' ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. విద్యార్థులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల కొరకు రెసిడెన్షియల్ కోచింగ్ ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఓకే చెప్పింది. విశాఖపట్నంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆమోదం లభించింది.

# రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల ధర్నా

## కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలపై పోరుబాట

**విజయవాడ, జూలై 10 (మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీసవేతనం రూ. 26 వేలతో పాటు పెన్షన్, వైద్యసదుపాయం కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు చేపట్టారు. విశాఖ జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రకటించిన విధంగా జీతాన్ని వెంటనే పెంచి కార్యకర్తలపై రాజకీయ వేధింపులను ఆపాలని కోరారు. ప్రస్తుతం వాడుతున్న నవచేతన యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరసన చేపట్టారు.సీ.ఐ.టీ.యు నేత కందారపు మురళి నేతృత్వంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట వేలాది మంది అంగన్వాడి వర్కర్లు తో రిలే నిరాహారదీక్ష చేపట్టారు.అంగన్వాడి వర్కర్ లకు ఈ.ఎస్. ఐ, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు అంగన్వాడి వర్కర్ లకు అందించాలన్నారు. కాగా ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు పెన్షన్, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టారు. పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సేవలంధిస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసనలకు పిలుపిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55,607 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 48,770 మినీ కేంద్రాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీల వేతనాలను పీఆర్సీకి అనుసంధానం చేయడంతో పాటు, గుజరాత్ హైకోర్టు తీర్పునకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. హెల్పర్ల ప్రమోషన్‌కు 5 ఏళ్ల సీనియారిటీ నిబంధనను రద్దు చేయాలని అన్నారు. అంగన్‌వాడీలకు 'తల్లికి వందనం' సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. సిగ్నల్ సమస్యలతో తీవ్ర ఇబ్బంది పెడుతున్న ముఖ గుర్తింపు ఫేస్ యాప్‌ను, పనిభారం పెంచే నవచేతన యాప్‌ను తక్షణమే రద్దు చేయాలి. పెండింగ్‌లో ఉన్న టీఏ, మెయింటినెన్స్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.






# ఎన్ఐఏ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు



**అమరావతి, జూలై 10:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదయ్యే కేసుల వేగవంతమైన విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిజిస్ట్రార్ (కోర్టు అండ్ కేస్ మేనేజ్‌మెంట్) పేరుతో కొత్త పోస్టు సృష్టించేందుకు కూడా ఆమోదం తెలిపింది. ఈ విషయాలను రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయశాఖకు సంబంధించిన రెండు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్ఐఏ చట్టం-2008 కింద నమోదయ్యే కేసులను నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణకు రెండు నోటిఫైడ్ కోర్టులు పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 20 ఎన్ఐఏ కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 19 కేసులు విశాఖలోని మూడో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టులో, ఒక కేసు విజయవాడలోని రెండో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టులో విచారణలో ఉన్నాయని వివరించారు. విశాఖలో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో జిల్లా, సెషన్స్ జడ్జి స్థాయిలో ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేసి, దానికి రాష్ట్రవ్యాప్తంగా అధికార పరిధి కల్పించనున్నట్లు తెలిపారు.

- 16 పోస్టుల సృష్టికి గ్రీన్ సిగ్నల్
- హైకోర్టులో 'రిజిస్ట్రార్ (కోర్టు అండ్ కేస్ మేనేజ్‌మెంట్)' కొత్త పోస్టు ఏర్పాటు

ఈ కోర్టు నిర్వహణ కోసం ప్రత్యేక న్యాయమూర్తితో పాటు మొత్తం 16 మంది సిబ్బంది నియామకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.

### హైకోర్టులో కొత్త రిజిస్ట్రార్ పోస్టు

సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ ఆదేశాలు, కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీ సిఫార్సుల మేరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయిలో రిజిస్ట్రార్ (కోర్టు అండ్ కేస్ మేనేజ్‌మెంట్) పోస్టును రెగ్యులర్ ప్రాతిపదికన సృష్టించేందుకు కూడా మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ పోస్టు ఏర్పాటు ద్వారా జిల్లా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి, కేసుల పరిష్కార వేగం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# కూటమి హయాంలోనే 500కోట్లతో మత్స్యకారులకు వేట నిషేధ భృతి

### జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములు



**టెక్కలి, జులై 10 (మనసులో మాట) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో అర్హత ఉన్న మత్స్యకారులకు రూ.500 కోట్లతో వేట నిషేధ భృతి అందించినట్లు జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములు తెలిపారు. సంతబొమ్మాళి మండలం నౌపాడలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎస్ఎస్ వై పథకంలో మత్స్యకారులకు 50% సబ్సిడీపై బోట్లు, తెప్పులు, ఇంజన్, వలలు 300 యూనిట్లు అందించినట్లు వివరించారు. అదేవిధంగా ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు సబ్సిడీ పై అందిసినట్టు వివరించారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన మత్స్యకార గ్రామాలు దేవునాల్తడ, పెద్దగంగానపేట, ఇద్దువానిపాలెంలో రెండు కోట్లు రూపాయలు చొప్పున ప్రత్యేక సిఆర్పిపి నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎచ్చర్ల మండలం బురగంట్లపాలెం వద్ద రూ. 444 కోట్లతో ఫిషింగ్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు వివరించారు. గత వైకాపా హయంలో జిల్లాలో ప్రమాదవశాత్తు వేటకు వెళ్లి మృతి చెందిన 35 మందికి నష్ట పరిహారం అందజేయలేదని, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో వీరందరికీ రూ 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. విశాఖలో జరిగిన సంఘటనలో మత్స్యకారులుకు రూ .10 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వడం అభినందనీయమని , మత్సాకారుల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం తో సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వాడ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బైపల్లి అప్పన్న, ఏఎంసీ డైరెక్టర్ సూరాడ ధనరాజ్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్తేరు వెంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి విరాళం



**పాయకరావుపేట జులై 10 మనసులో మాట :** సొంతూరు మీద ప్రేమతో విలువైన 54 సెంట్ల భూమిని గ్రామం లోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి అప్ప గించారు ఓ హైకోర్టు న్యా యవాది.. పాయ కరావుపేట నియోజ కవర్గం పాల్తేరు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు 54 సెంట్ల భూమిని తన తల్లిదండ్రులు దేవవరపు లోవరాజు, అప్పలరాజు జ్ఞాపకార్థం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళంగా ఇచ్చారు.. ప్రముఖ అధ్యాపకులు బాబు శ్రీ మాస్టారు చేతులమీదుగా రాంబాబు,మాధవి దంపతులు ఆలయ కమిటీకి శనివారం భూమి పత్రాలను అప్పగించారు.. రాంబాబు గతంలో గ్రామంలోని రామాలయానికి మరో 60 సెంట్ల భూమిని విరాళంగా ఇవ్వడం విశేషం.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,పెద్దలు, గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.

# ఎన్నికల అధికారుల పర్యటన



**శ్రీకాకుళం, మనసులో మాట, జిల్లా ప్రతినిధి, జూలై,10:** భారత ఎన్నికల సంఘం అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం కంపోస్టు కాలనీ సచివాలయాన్ని సందర్శించారు. కలెక్టరేట్ లో ఈఆర్ఓలతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - 2026 (సర్) సమీక్ష అనంతరం సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు ఏ విధంగా చేస్తున్నదీ బిఎల్ఓ వేణుగోపాల్ రెడ్డిని భారత ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఫారాలు ఎన్ని వచ్చాయి, ఎంత శాతం వచ్చాయనే వివరాలను అడిగారు. ఆన్ లైన్ ప్రోసెస్ ఏ విధంగా జరుగుతోందని, ఓటర్ల నమోదు గూర్చి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో , అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్, కన్సల్టెంట్ మల్లికార్జున రెడ్డి, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, తహసిల్దార్ గణపతిరావు, ఎన్నికల డిటి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కన్వేయర్ బెల్ట్ ద్వారా వ్యాపిస్తున్న లోహ ధూళిని నియంత్రించాలి

### ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని

### అధికారికి వినతిపత్రం



విశాఖపట్నం, మనసులోమాట , జులై 10: స్టీల్ ప్లాంట్ నుండి పోర్టు వరకు ఉన్న కన్వేయర్ బెల్ట్, ఖనిజాల నిల్వ యార్డులు, పోర్టు కార్యకలాపాల వల్ల వ్యాపిస్తున్న లోహ ధూళి కాలుష్యాన్ని నియంత్రించి విద్యార్థులు, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని పిడిఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాంతీయ కాలుష్య నియంత్రణా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి పోర్టు వరకు ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా ఇనుము, అల్యూమినియం మొదలగు ఖనిజాల రవాణా జరుగుతోందన్నారు. ఈ కన్వేయర్ బెల్ట్ పనిచేసే సమయంలో సూక్ష్మ లోహ ధూళి పెద్ద మొత్తంలో కిందకు వెలువడుతూ కాలుష్యాన్ని సృష్టిస్తుందన్నారు. పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనం మీదుగా ఈ కన్వేయర్ బెల్ట్ వెళ్లడం వలన ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు ఈ కాలుష్యానికి గురవుతున్నారని చెప్పారు. అదే విధంగా, విశాఖ పోర్టు ప్రాంతంలో బొగ్గు, ఇనుప ఖనిజం, బాక్సైట్ మరియు ఇతర ఖనిజాల దిగుమతి, ఎగుమతి కార్యకలాపాల సందర్భంగా లారీల ద్వారా రవాణా, కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలింపు, నౌకల నుండి దింపడం, నౌకల్లోకి ఎక్కించడం, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడం వంటి ప్రక్రియలలో తగిన దుమ్ము నియంత్రణ చర్యలు అన్ని వేళలా సమర్థవంతంగా అమలు కాకపోవడం వలన సూక్ష్మ ధూళి కణాలు వ్యాపించి పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఎక్కువగా ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం ఇటువంటి ధూళికి గురికావడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలర్జీలు, ఆస్తమా తీవ్రత పెరగడం, ఇతర శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, వారి భవిష్యత్తు, ప్రజల జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని పై అంశాలపై అత్యవసరంగా చర్యలు తీసుకొని కాలుష్యాన్ని నియంత్రించాలని ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ముకుందరావును కోరగా కాలుష్య నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా సహాయ కార్యదర్శి జానకి, రఘు, లక్ష్మణ్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



# పోర్టులు, భూములను కట్టబెట్టేందుకే కేబినేట్

### ఐదుగురు మంత్రులు డుమ్మా కొట్టినా పట్టింపు ఏదీ

### మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపాటు

**అమరావతి,జూలై10:** పోర్టులు, భూములను తమ వారికి కట్టబెట్టటానికే చంద్రబాబు కేబినెట్ సమావేశమంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఐదుగురు మంత్రులు గైర్హాజరయ్యారంటే ఎంత నాన్ సీరియస్‌గా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేబినెట్ సమావేశంలో ప్రజలకు మేలు చేసే అంశాలపై చర్చించటం మానేశారంటూ ఆయన దుయ్యబట్టారు. కేబినెట్‌కి డీజీపీ వెళ్లి సోషల్ మీడియా కట్టడిపై మాట్లాడటం ఏంటన్నారు. టీడీపీ పెయిడ్ ఆర్టిస్టులతో మా పార్టీ నేతలను తిట్టిస్తున్నారు. జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదు. కానీ మావారిపై అక్రమ కేసులు పెట్టి 1,394 మందిని అరెస్టు చేశారు. సోషల్ మీడియా అంటే చంద్రబాబు భయపడిపోతున్నారు. అందుకే టాస్క్ ఫోర్స్ కూడా పెడుతున్నారు. గాదె సాయికృష్ణను దారుణంగా లాకప్ డెత్ చేస్తే ఈ డీజీపీ ఎందుకు మాట్లాడలేదని అంటూ అంబటి ప్రశ్నించారు. క్రాంతికుమార్ ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని అన్నారు. ఇలాంటి వాటిపై కేబినెట్‌లో చర్చించరా?. ఉండవల్లిలో పోలీసు కానిస్టేబుల్ తల పగలకొట్టిన టీడీపీ కార్యకర్తలపై ఎందుకు కేసు పెట్టలేదు?. ఉత్తుత్తి కేబినెట్‌లు కాకుండా ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి. పవన్ కళ్యాణ్ కేబినెట్‌కి ఎందుకు రావటం లేదు?. ఆ కారణాలు ఏంటో సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని అంబటి నిలదీశారు. రావణ్‌కు అన్ని కేసుల్లోనూ బెయిల్ వస్తోందని ఉపా చట్టం ప్రయోగించారు. రావణ్ టీమ్‌లోని ఒక మహిళ జగన్‌ని కలిసి న్యాయ సహాయం కావాలని కోరారు. వైఎస్ జగన్ సరే అన్నారు.. అంతే తప్ప రావణ్‌కు మాకు ఎలాంటి సంబంధం లేదు. టీడీపీ కార్యకర్తలు అడిగినా న్యాయ సహాయం చేస్తాం. తీవ్ర వాదుల మీద పెట్టాల్సిన చట్టాన్ని అమాయకులపై పెట్టటం ఏంటి?. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అంటే ఇదే అంటూ అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

# ఖాతాదారులకు ఆల్మైటీ జెనిసెసం సంస్థ మోసం

### డైరెక్టర్లు అరెస్ట్ చేసిన పోలీసులు

**కాకినాడ, జూలై 10:** అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసిన కాకినాడకు చెందిన ఆల్మైటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సంస్థ డైరెక్టర్లు మోజేష్, లలితాంబికను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15 వేల చొప్పున చెల్లిస్తామని మాయమాటలు చెప్పి సంస్థ భారీగా డిపాజిట్లు సేకరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.48 కోట్ల మేర ప్రజల నుంచి వసూలు చేసినట్లు విచారణలో తేలింది. కొన్ని నెలలుగా పెట్టుబడిదారులకు చెల్లింపులు నిలిపివేయడంతో కాకినాడలోని ఆల్మైటి జెనిసెస్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేపట్టారు. ఆరుగురు ఖాతాదారులు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా సంస్థ డైరెక్టర్లు మోజేష్, లలితాంబికను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన సంస్థ డైరెక్టర్లను కోర్టులో హాజరుపర్చనున్నారు.

# వాహనాల నమోదులో గణనీయ వృద్ధి

### రవాణా శాఖ మంత్రి మండిపల్లిని అడిగిన సీఎం చంద్రబాబు



**అమరావతి, జులై 10:** క్యాబినెట్ సమావేశంలో కమర్షియల్ వాహనాల నమోదులో గణనీయ వృద్ధి పై రవాణా శాఖ మంత్రి మండిపల్లిని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. కమర్షియల్ వాహనాల నమోదులో గణనీయ వృద్ధి చోటు చేసుకుందని మంత్రి వివరణ ఇచ్చారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం, దూరదృష్టితో అమలవుతున్న విధానాల ఫలితంగా రాష్ట్రంలో కమర్షియల్ వాహనాల నమోదులో గణనీయమైన వృద్ధి నమోదైందని, నెలవారీ ఆర్థిక నివేదిక ప్రకారం, ఏప్రిల్, జూన్ త్రైమాసికంలో కొత్త కమర్షియల్ వాహనాల నమోదు 33,234 నుంచి 44,212కు పెరిగిందని తెలిపారు. ఈ వృద్ధికి ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) కొనుగోళ్లు పెరగడం ప్రధాన కారణంగా నిలిచి, డీజిల్, పెట్రోల్ ధరల్లో హెచ్చుతగ్గులు, ప్రభుత్వం ఈవీలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, పర్యావరణహిత రవాణాపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనతో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే ఈ సానుకూల మార్పు సాధ్యమైందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈవీ రంగానికి మరింత ప్రోత్సాహం అందించి రాష్ట్రాన్ని సుస్థిర రవాణా దిశగా ముందుకు తీసుకెళ్తామని మంత్రి తెలిపార



# ఎత్తిపోతల పంచాయితీ!

## కాళేశ్వరం నీటి తరలింపుపై దాగుడు మూతలు

కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్ధం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి. ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది. బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఎపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యసవర కార్యాచరణ సిద్దం చేయాలి. అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.




**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక


# నాలుగు దశాబ్దాల తర్వాత చారిత్రక అడుగు

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం.. ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు



**ఆక్లాండ్ (న్యూజిలాండ్), జూలై 10:** భారత విదేశాంగ చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ఆక్లాండ్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి లక్సన్ స్వయంగా స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ పర్యటనలో ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఇటీవల కుదిరిన సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో భారత్-న్యూజిలాండ్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఆక్లాండ్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడా రంగ ప్రముఖులతో ప్రధాని మోదీ సమావేశమవుతారు. అలాగే న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశాన్ని సందర్శించిన సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలకు కొనసాగింపుగా తాజా పర్యటనను భావిస్తున్నారు. అంతకుముందు మూడు రోజులపాటు ఆస్ట్రేలియాలో పర్యటించిన ప్రధాని మోదీ, ఆ పర్యటన అత్యంత ఫలప్రదంగా సాగిందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ పర్యటనతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన



**న్యూఢిల్లీ, జూలై 10 :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయ మూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, చేతిలోని కేసు పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తిపై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు. ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ:** అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జూలై 7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14 రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్లను పరిశీలించనున్నది. అయోధ్య ఘటనలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని నరేంద్ర కుమార్ గోస్వామి అనే పిటీషనర్ సుప్రీంను ఆశ్రయించారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందిన కాగ్ ఆడిట్ వివరాలను వెల్లడించాలని కోరారు. ఇదే కేసులో అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా పిటీషన్లు వేశారు.



# ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

## అణు కేంద్రం వద్ద పేలిన భవనం

**టెహ్రాన్, జూలై 10:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.



# భారత్‌కు తరలిస్తున్న 22 కేజీల కొకైన్ అమెరికాలో సీజ్



**న్యూఢిల్లీ:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్(జశీఝఱఅవ నావఱఓవస)ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు. ఆపరేషన్ స్ట్రయికర్ పేరుతో సీబీపీ ఆపరేషన్ చేపట్టారు. స్పీకర్లు, ఆంప్లిఫయర్లలో 8 ప్యాకెట్లు, నాలుగు బ్రిక్స్ రూపంలో వైట్ పౌడర్‌ను దాచిపెట్టినట్లు సీబీపీ అధికారులు తెలిపారు. ఆ పౌడర్‌ను కొకైన్ హైడ్రోక్లోరైడ్‌గా గుర్తిస్తూ అధికారులు నిర్ధారణ చేశారు. 22 కేజీలు ఉన్న ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లుగా ఉంటుందని కస్టమ్స్ అధికారులు చెప్పారు.



# పాత తరం మహా నటుడు సీఎస్ఆర్

ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలానికి ముందే అగ్ర నటుడిగా వెలిగిన చిలకాలపూడి

'మాయాబజార్' శకునిగా, 'పాతాళభైరవి' రాజుగా తెలుగు గుండెల్లో శాశ్వత స్థానం

## నేడు 'అభినవ శకుని' జయంతి

తెలుగు నాటకరంగం, వెండితెరపై పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రలకు తనదైన అభినయంతో ప్రాణ ప్రతిష్ఠ చేసిన మహానటుడు చిలకాలపూడి సీతారామాంజనేయులు(సీఎస్ఆర్). జూలై 11న ఆయన జయంతి సందర్భంగా తెలుగు చిత్రసీమ, ప్రేక్షకులు ఆ అభినవ శకునికి ఘన నివాళులర్పిస్తున్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి దిగ్గజాల ప్రవేశానికి ముందే, అంటే 1930ల కాలంలోనే సి.ఎస్.ఆర్ ఒక వెలుగు వెలిగారు. సుమారు 175కి పైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి మూడు దశాబ్దాల పాటు పరిశ్రమపై చెరగని ముద్ర వేశారు.

### రైటర్ టు స్టార్ యాక్టర్..

సి.ఎస్.ఆర్ 1907 జూలై 11న మచిలీపట్నం సమీపంలోని చిలకాలపూడిలో ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి లక్ష్మీనరసింహమూర్తి రెవెన్యూ విభాగంలో పనిచేసేవారు. పొన్నూరులో పాఠశాల విద్యాభ్యాసం పూర్తయ్యాక కొద్దిరోజులు సహకార పర్యవేక్షకుడిగా ఉద్యోగం చేసినా.. నాటకాలపై ఉన్న మక్కువతో రంగస్థల బాట పట్టారు. పద్యాలు పాడటం దేవుడిచ్చిన వరమైతే, కవితలు రాయడంలో ఆయన దిట్ట. అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన 'పతితపావన' అనే నాటకాన్ని రాసి, దర్శకత్వం వహించారు. దేశభక్తి నింపుకున్న ఆయన.. 'తుకారాం' నాటక ప్రదర్శనల ద్వారా వసూలైన రూ. 10,000 నిధులను నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్'కు విరాళంగా అందించి తన ఉదారతను చాటుకున్నారు.

### వెండితెరపై అప్రతిహత ప్రస్థానం

1932లో విడుదలైన 'రామపాదుకా పట్టాభిషేకం' చిత్రంతో సి.ఎస్.ఆర్ సినీరంగ ప్రవేశం చేశారు. 'శ్రీకృష్ణ తులాభారం'లో కృష్ణుడిగా, 'భక్త రామదాసు'లో రామదాసుగా, 'తుకారాం'గా పౌరాణిక, భక్తిరస పాత్రల్లో అద్భుతంగా నటించారు. 1950వ దశకంలో వచ్చిన క్లాసిక్ హిట్స్ ఆయన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. 'పాతాళభైరవి' చిత్రంలో ఉజ్జయిని రాజుగా ఆయన నటన అపూర్వం. భారతదేశపు మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడిన ఘనత ఈ చిత్రానికి దక్కింది. అలాగే, 'దేవదాసు' చిత్రంలో సావిత్రిని వివాహం చేసుకునే ముసలి జమీందార్ పాత్రలో సి.ఎస్.ఆర్ జీవించారు.

### నభూతో నభవిష్యతి.. శకుని పాత్ర

తెలుగు సినీ చరిత్రలో 'శకుని' అనగానే అందరికీ గుర్తొచ్చే ఏకైక రూపం సి.ఎస్.ఆర్. 'మాయాబజార్' చిత్రంలో ఆయన పోషించిన శకుని పాత్ర 'నభూతో నభవిష్యతి'గా నిలిచిపోయింది. ఆయన డైలాగ్ డెలివరీ, మాయావి పాత్రలో చూపించిన హావభావాలు ఇప్పటికీ నటులకు ఒక పాఠ్యపుస్తకం. 'పెళ్ళి చేసి చూడు', 'కన్యాశుల్కం' (రామప్ప పంతులుగా), 'రోజులు మారాయి', 'అప్పు చేసి పప్పు కూడు', 'జగదేకవీరుని కథ' వంటి ఎన్నో అజరామర చిత్రాల్లో ఆయన కీలక పాత్రలు పోషించారు.

### తుది శ్వాస వరకు నటనలోనే..

సి.ఎస్.ఆర్ కుటుంబం కూడా సినీ పరిశ్రమతో ముడిపడి ఉంది. ఆయన సోదరుడు నాగేశ్వరరావు మాయాబజార్, సువర్ణసుందరి వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేయగా.. మరో సోదరుడు సి.వి. రత్నం భరణి స్టూడియోస్ చిత్రాలకు ప్రొడక్షన్ మేనేజర్‌గా వ్యవహరించారు. 1962లో విడుదలైన 'చిట్టి తమ్ముడు' ఆయన కళ్లముందు విడుదలైన చివరి చిత్రం కాగా.. ఆయన మరణానంతరం 1964లో విడుదలైన 'బొబ్బిలి యుద్ధం' సి.ఎస్.ఆర్ నటించిన ఆఖరి చిత్రం. అక్టోబర్ 8, 1963న తన 56వ ఏట ఈ అభినయ చక్రవర్తి కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనా, ఆయన పోషించిన పాత్రలు, పలికిన సంభాషణలు తెలుగు సినీ చరిత్ర ఉన్నంత కాలం సజీవంగానే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జనాభా సమతుల్యతతోనే సుస్థిర ప్రగతి

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

చైనాను దాటి నూట నలభై నాలుగు కోట్లతో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా భారత్

సహజ వనరులపై పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి



ఒక నిర్ణీత భౌగోళిక సరిహద్దుల పరిధిలో జీవించే మానవ సమూహాల ఉనికిని, వారి సంఖ్యా బలాన్ని జనాభాగా పరిగణిస్తారు. ఏ దేశానికైనా ఆ దేశ జనాభా ప్రాథమికంగా ఒక అద్భుతమైన మానవ వనరుగా, ప్రగతి చక్రాలను నడిపించే ఇంధనంగా పనిచేస్తుంది. అయితే, అదే జనాభా ఆయా దేశాల పరిమిత సహజ వనరులను, ఆర్థిక ఉత్పాదక సామర్థ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను, ఉపాధి అవకాశాలను మించి అడ్డూ అదుపూ లేకుండా పెరిగినప్పుడు అది ప్రగతికి ఊతమిచ్చే శక్తిగా కాక, వ్యవస్థలను కుప్పకూల్చే మహా భారంగా మారుతుంది. జనాభా విస్ఫోటనం వల్ల తలెత్తే పర్యావరణ పతనాన్ని, మానవ జీవన ప్రమాణాల క్షీణతను నివారించేందుకు ప్రజల్లో చైతన్యం తేవడమే ప్రతి ఏటా జూలై 11న నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం.

### చారిత్రక నేపథ్యం..

1987 జూలై 11 నాటికి ప్రపంచ జనాభా ఐదు వందల కోట్లకు (5 బిలియన్లు) చేరుకుంది. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని, పెరిగిపోతున్న సంఖ్యపై ప్రపంచవ్యాప్తంగా మేధోమథనం జరగాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి దీనికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఆ తర్వాత, 1989లో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (ఖచీణూ) పాలక మండలి అధికారికంగా ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించగా, 1990 జూలై 11న ప్రపంచంలోని తొంభైకి పైగా దేశాల్లో మొదటిసారిగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. నాటి నుండి నేటి వరకు నిరంతరాయంగా ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక సామాజికాంశంతో ఈ దినోత్సవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

### 800 కోట్లు దాటిన గ్లోబల్ పాపులేషన్..

క్రీస్తుశకం వెయ్యో సంవత్సరంలో భూమిపై కేవలం 40 కోట్ల మంది మాత్రమే ఉండేవారు. కానీ, పారిశ్రామిక విప్లవం, ఆధునిక వైద్య ఆవిష్కరణల ఊతంతో 1804 నాటికి ఆ సంఖ్య వంద కోట్లకు చేరింది. ఆపై రెండు వందల కోట్ల మార్కును అందుకోవడానికి మరో నూట ఇరవై ఏళ్ల సమయం పట్టగా, ఇరవైయో శతాబ్దపు ద్వితీయార్థంలో సంభవించిన వైద్యరంగ పురోగతి, అంటువ్యాధుల నిర్మూలన, శిశుమరణాల రేటు తగ్గడం, సగటు ఆయుర్దాయం పెరగడం వల్ల జనాభా పెరుగుదల ఉధృతి ఊహకందని స్థాయికి చేరింది. 1974లో 400 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా, కేవలం యాభై ఏళ్ల వ్యవధిలోనే రెట్టింపై ప్రస్తుతం 820 కోట్లకు (8.2 బిలియన్లు) పైగా చేరింది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదికల ప్రకారం, రాబోయే 2050 నాటికి ప్రపంచ జనాభా 970 కోట్లకు, ఈ శతాబ్దపు అంతానికి అంటే 2100 నాటికి వెయ్యి కోట్లకు పైగా చేరుకుంటుందని అంచనా. అయితే ఐరోపా, ఉత్తర అమెరికా వంటి అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో జననాల రేటు క్షీణించి, వృద్ధుల జనాభా పెరిగిపోతుండగా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలలో జనాభా పెరుగుదల రేటు అత్యంత వేగంగా సాగుతోంది.

### భారత్‌లో జనాభా ఒత్తిడి - క్షేత్రస్థాయి వాస్తవాలు..

ఈ అంతర్జాతీయ జనాభా పరిణామాల నేపథ్యంలో, భారతదేశం చారిత్రాత్మకమైన మైలురాయిని దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అగ్రగామి దేశంగా అవతరించింది. చైనాను వెనక్కి నెట్టి మన దేశం మొదటి స్థానానికి చేరుకోవడం ఒక రకంగా యువశక్తి (డెమోగ్రాఫిక్ డివిడెండ్) పరంగా మనకు అపారమైన అవకాశాలను అందిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలు దేశ ప్రణాళికాకర్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. మన దేశంలో 1872లో బ్రిటీష్ వారి కాలంలో తొలిసారిగా జనాభా గణన ప్రక్రియ ప్రయోగాత్మకంగా ప్రారంభం కాగా, 1881 నుండి ప్రతి పదేళ్లకు ఒకసారి క్రమబద్ధమైన జనగణన నిరంతరాయంగా సాగుతూ వచ్చింది. స్వతంత్ర భారతంలో 1951లో మొదటి జనాభా లెక్కలు సేకరించగా, చివరగా 2011లో నిర్వహించిన 15వ జనగణన ప్రకారం భారత జనాభా 121 కోట్లుగా నమోదైంది. ఆ తర్వాత దేశంలో పూర్తి స్థాయి అధికారిక జనగణన జరగనప్పటికీ, ప్రస్తుత అంచనాల ప్రకారం దేశ జనాభా 144 కోట్లకు పైగా దాటినట్లు నిపుణులు ధ్రువీకరిస్తున్నారు. ఈ అపారమైన జనాభా ఒత్తిడి వల్ల దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ప్రజారవాణా వ్యవస్థల పైన అంతకుమించిన భారం పడుతోంది. ఏటా కోట్లాది మంది విద్యావంతులైన యువతీ యువకులు ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నప్పటికీ, వారి నైపుణ్యాలకు తగిన ఉపాధి కల్పించడం పాలకులకు కత్తిమీద సాములా మారింది.

### పర్యావరణంపై పడుతున్న పెను సవాలు..

జనాభా విస్ఫోటనం అనేది కేవలం ఒక సంఖ్యాత్మక సమస్యా మాత్రమే కాదు, అది దేశ సామాజిక పర్యావరణ మనుగడకు సంబంధించిన పెను సవాలు. అపరిమితమైన మానవ అవసరాల కోసం పచ్చని అడవులను నరికివేస్తూ కాంక్రీట్ జంగిల్లుగా మారుస్తుండటం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. గతంలో పంటలు పండిన సారవంతమైన సాగుభూములు నేడు బహుళ అంతస్తుల భవనాలుగా, పారిశ్రామిక మండలాలుగా రూపాంతరం చెందుతున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతుండటంతో నీటి ఎద్దడి అల్లాడిస్తోంది. జీవనదులన్నీ పారిశ్రామిక వ్యర్థాలతో, ప్లాస్టిక్ కాలుష్యంతో జీవచ్ఛవాలుగా మారుతున్నాయి. ఒకవైపు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా దేశంలో ఆహారోత్పత్తి పెరుగుతున్నప్పటికీ, ఆ ఉత్పాదకతను మించి జనాభా పెరుగుతుండటంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ దుస్థితి సమాజంలో పేదరికం, తీవ్రమైన పోషకాహార లోపం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలను పెంచి పోషిస్తూ, నగరాల శివార్లలో మురికివాడల విస్తరణకు కారణమవుతోంది. ప్రకృతి ఇచ్చిన వనరులపై ఒత్తిడి పెరిగిన కొద్దీ మానవుల మధ్య నదీ జలాల వివాదాలు, భూమి కోసం ఘర్షణలు, ఉపాధి కోసం వలసలు పెరిగిపోయి అంతర్గత భద్రతకు కూడా ముప్పు వాటిల్లుతోంది.

### మహిళా విద్య - సాధికారతే ప్రధాన ఆయుధం

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 1952లో అధికారికంగా జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రకటించిన ఘనత భారతదేశానిదే. 'చిన్న కుటుంబమే చింత లేని కుటుంబం', 'ఇద్దరు లేదా ఒక్కరు' అనే నినాదాలతో ప్రభుత్వాలు విస్తృత ప్రచారం కల్పించడం వల్ల జాతీయ స్థాయిలో సగటు సంతానోత్పత్తి రేటు (ఢ్ఖీ=) తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ, దేశంలోని కొన్ని వెనుకబడిన రాష్ట్రాలలో, గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న నిరక్షరాస్యత, తీవ్రమైన పేదరికం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, అన్నింటికీ మించి మగసంతానంపై ఉన్న మితిమీరిన వ్యామోహం వల్ల కుటుంబ నియంత్రణ ఆశించిన స్థాయిలో సత్ఫలితాలను ఇవ్వలేకపోయింది.జనాభా నియంత్రణకు, స్థిరీకరణకు మహిళా విద్య, సాధికారత అత్యంత ప్రధానమైన ఆయుధాలని అంతర్జాతీయ సామాజిక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక మహిళ చదువుకుని, ఆర్థికంగా తన కాళ్ల మీద తాను నిలబడినప్పుడు, ఆమె తన వివాహ వయసును, సంతాన నిర్ణయాధికారాన్ని స్వతంత్రంగా తీసుకోగలుగుతుంది. బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడం, వారి ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా బాల్య వివాహాలను అడ్డుకోవచ్చు, తద్వారా జననాల రేటును సహజ సిద్ధంగానే అదుపు చేయవచ్చు. జనాభా నియంత్రణ అనేది ఏదో ఒక ప్రభుత్వ చట్టం ద్వారా లేదా బలవంతపు నిబంధనల ద్వారా సాధించేది కాకూడదు. అది ప్రతి కుటుంబం యొక్క నైతిక బాధ్యతగా సమాజంలో అంతర్గత చైతన్యం తీసుకురావాలి.




**చిన్న కుటుంబం అంటే కేవలం దేశ జనాభాను తగ్గించడం మాత్రమే కాదు; ఆ కుటుంబంలోని ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని, అత్యుత్తమ వైద్య సదుపాయాలను అందించి ప్రయోజకులను చేయడమే అనే సత్యాన్ని ప్రజల ఆలోచనా విధానాల్లోకి చొప్పించాలి. భూమి విస్తీర్ణం పరిమితమైనది, ప్రకృతి ప్రసాదించే వనరులు తరిగిపోయేవి అనే సత్యాన్ని గ్రహించి, సుస్థిరమైన అభివృద్ధి పథంలో దేశం సాగాలంటే జనాభా స్థిరీకరణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలి. పాలకుల ప్రణాళికలు, పౌరుల బాధ్యతాయుత ప్రవర్తన, పర్యావరణ స్పృహ, మహిళా చైతన్యం సమాంతరంగా సాగినప్పుడే అపారమైన ఈ జనాభా దేశానికి అడ్డంకిగా మారకుండా, నవభారత నిర్మాణానికి అద్భుతమైన సంపదగా మారుతుంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం ధరలు మళ్లీ పెరుగుదల

**హైదరాబాద్, జులై 10 :** దేశంలో బంగారం ధరలు మరోసారి స్వల్పంగా పెరిగాయి. వరుసగా రెండో రోజు పసిడి ధరల్లో పెరుగుదల నమోదైంది. అయినప్పటికీ గత నెలతో పోలిస్తే ప్రస్తుతం ధరలు కొంత తక్కువ స్థాయిలోనే ఉన్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,820కు చేరుకుంది. గురువారంతో పోలిస్తే రూ.380 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.350 పెరిగి రూ.1,32,750గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,620 వద్ద కొనసాగుతోంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిల్లో కూడా 24 క్యారెట్ల బంగారం రూ.1,44,820, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,750 వద్ద విక్రయమవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం అత్యధికంగా రూ.1,45,640గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,44,950గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ధరలు దాదాపు హైదరాబాద్ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరల కదలికలు, డాలర్ మారకపు విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ప్రతిరోజూ మారుతున్నాయని బులియన్ వ్యాపారులు తెలిపారు. కొనుగోలు చేసే ముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

# ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓకు రంగం సిద్ధం




**హైదరాబాద్, జులై 10 :** భారతీయ బ్యాంకింగ్ రంగంలో ప్రముఖ సంస్థ స్టేట్ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ తన తొలి ప్రజా వాటాల విక్రయానికి సిద్ధమైంది. ఈ ఐపీఓ కోసం ఒక్కో షేరు ధరను రూ.545 నుంచి రూ.574 మధ్య నిర్ణయించారు. ఒక లాట్‌లో 26 షేర్లు ఉండగా, పెట్టుబడిదారులు కనీసం ఒక లాట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఐపీఓకు దరఖాస్తుల స్వీకరణ జులై 14న ప్రారంభమై 16తో ముగియనుంది. వాటాల కేటాయింపు అనంతరం జులై 21న కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కానున్నాయి. ఈ ఇష్యూ పూర్తిగా ఇప్పటికే ఉన్న వాటాల విక్రయం రూపంలోనే నిర్వహించబడుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా స్టేట్ బ్యాంక్ సుమారు 12.83 కోట్ల షేర్లను, అముండి ఇండియా సంస్థ 7.56 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. దేశంలో విశ్వసనీయ ఆర్థిక సంస్థగా గుర్తింపు పొందిన స్టేట్ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన సంస్థ కావడంతో ఈ ఐపీఓపై పెట్టుబడిదారుల్లో ఆసక్తి నెలకొంది. మార్కెట్ నుంచి భారీ నిధులు సమీకరించడమే ఈ ప్రజా వాటాల విక్రయ ప్రధాన లక్ష్యంగా కంపెనీ భావిస్తోంది.

# విశాఖ పాల ధర పెంపు




**విశాఖపట్నం, జులై 10 :** ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విశాఖ డెయిరీ పాలు, పెరుగు ధరలను పెంచింది. పాల సేకరణ, నిర్వహణ వ్యయాలు పెరగడంతో సవరించిన ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. తాజా ధరల ప్రకారం అర లీటర్ ఫుల్ క్రీమ్ పాల ప్యాకెట్ రూ.34 నుంచి రూ.36కు, లీటర్ ప్యాకెట్ రూ.68 నుంచి రూ.71కు పెరిగింది. అలాగే 400 గ్రాముల పెరుగు కప్పు రూ.32 నుంచి రూ.35కు, ఒక కిలో పెరుగు బకెట్ రూ.95 నుంచి రూ.100కు పెంచారు. ధరల పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పాలు, పెరుగు ధరలు కూడా పెంచడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలు, పెరిగిన నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ వర్గాలు వెల్లడించాయి.

# మీ కారు ఈ-20కి అనుకూలమేనా?

### ఇలా సులభంగా తెలుసుకోండి




**హైదరాబాద్, జులై 10:** దేశవ్యాప్తంగా ఈ--ఇరవై ఇంధనం వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, తమ కారు ఈ ఇంధనానికి అనుకూలంగా ఉందో లేదో తెలుసుకోవాలనే ఆసక్తి వాహనదారుల్లో పెరుగుతోంది. ముఖ్యంగా పాత కార్ల యజమానులు ఈ విషయంపై సందిగ్ధంలో ఉన్నారు. అయితే కొన్ని సులభమైన మార్గాల ద్వారా మీ వాహనం ఈ--ఇరవై ఇంధనాన్ని ఉపయోగించేందుకు అనుకూలంగా ఉందో లేదో సులభంగా నిర్ధారించుకోవచ్చు. ఈ-20 అనేది ఎనభై శాతం పెట్రోలు, ఇరవై శాతం ఇథనాల్ కలిపి తయారు చేసే మిశ్రమ ఇంధనం. చెరకు, ధాన్యాల వంటి పంటల నుంచి తయారయ్యే ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు వాహనాల వల్ల కలిగే కాలుష్యాన్ని కూడా నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఇంధనాన్ని ప్రోత్సహిస్తోంది. మీ కారు ఈ-20 ఇంధనానికి అనుకూలంగా ఉందో లేదో తెలుసుకోవడానికి ముందుగా ఇంధన ట్యాంకు మూతను పరిశీలించాలి. కొత్త వాహనాల్లో సాధారణంగా ఇంధన ట్యాంకు మూత వద్ద ఈ-20 ఇంధనం ఉపయోగించవచ్చని సూచించే ప్రత్యేక గుర్తు లేదా స్టిక్కర్‌ను సంస్థలు అమర్చుతున్నాయి. అలాంటి గుర్తు కనిపిస్తే మీ వాహనం ఈ ఇంధనాన్ని ఉపయోగించేందుకు సిద్ధంగా ఉందని అర్థం. ఇంధన ట్యాంకు మూతపై అలాంటి గుర్తు కనిపించకపోతే వాహనంతో పాటు ఇచ్చే యజమాని పుస్తకాన్ని పరిశీలించడం మంచిది. అందులో ఇంధనానికి సంబంధించిన విభాగంలో ఏ రకమైన ఇంధనాన్ని ఉపయోగించవచ్చో స్పష్టంగా పేర్కొంటారు. ముఖ్యంగా పాత వాహనాల యజమానులకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుంది. యజమాని పుస్తకంలో కూడా స్పష్టత లేకపోతే వాహనం యొక్క గుర్తింపు సంఖ్య ఆధారంగా అధికారిక సేవా కేంద్రాన్ని సంప్రదిం చవచ్చు. ఈ సంఖ్య వాహనం నమోదు ధ్రువీకరణ పత్రంలో, ముందు అద్దం సమీపంలో లేదా డ్రైవర్ తలుపు ఫ్రేమ్‌పై ఉంటుంది. ఆ సంఖ్య ఆధారంగా సంస్థ ప్రతినిధులు మీ వాహనం ఈ-20 ఇంధనానికి అనుకూలమో కాదో నిర్ధారించి చెబుతారు. అదే విధంగా వాహన తయారీ సంస్థల అధికారిక వెబ్‌సైట్లలో కూడా ఈ-20 ఇంధనానికి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. వాహనం మోడల్, తయారీ సంవత్సరాన్ని బట్టి అనుకూలత వివరాలను అక్కడ తెలుసుకోవచ్చు. కాలక్రమేణా ఇంధన ట్యాంకు మూతపై ఉన్న స్టిక్కర్లు చెదిరిపోయిన సందర్భాల్లో ఈ పద్ధతి మరింత ఉపయోగకరంగా ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ-20 ఇంధనానికి అనుకూలంగా రూపొందించిన వాహనాల్లో ఇంజిన్, ఇంధన వ్యవస్థకు సంబంధించిన భాగాలు అధిక ఇథనాల్‌ను తట్టుకునేలా తయారు చేస్తారు. అయితే పాత సాంకేతికతతో రూపొందించిన వాహనాల్లో దీర్ఘకాలం ఈ-20 ఇంధనాన్ని ఉపయోగిస్తే రబ్బరు భాగాలు, ఇంధన వ్యవస్థలోని కొన్ని పరికరాలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందువల్ల ఊహాగానాలపై ఆధారపడకుండా, మీ వాహనం ఈ-20 ఇంధనానికి అనుకూలమో కాదో అధికారికంగా నిర్ధారించుకుని మాత్రమే వినియోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# తగ్గిన అర్హతలతో గిరిజనులకు గృహ రుణాలు




**హైదరాబాద్, జులై 10:** గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వ రంగంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రత్యేక గృహ రుణ పథకాన్ని ప్రారంభించింది. సంప్రదాయ తనఖా, భూ యాజమాన్య సమస్యల కారణంగా బ్యాంకు రుణాలు పొందలేకపోతున్న అర్హులైన గిరిజన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించింది. ప్రస్తుతం ఈ పథకాన్ని గౌహతి, రాయ్‌పూర్ జోన్‌ల పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తుండగా, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. ఈ ప్రత్యేక గృహ రుణ పథకం కింద నెలసరి వేతనం పొందుతున్న ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులు నివాస గృహాలు, ఫ్లాట్లు కొనుగోలు చేయడం, కొత్త ఇల్లు నిర్మించడం, మరమ్మతులు చేయడం లేదా విస్తరణ చేపట్టడం కోసం రుణాలు పొందవచ్చు. ఉద్యోగులకు కనిష్ఠంగా లక్ష రూపాయల నుంచి గరిష్ఠంగా నలభై లక్షల రూపాయల వరకు రుణం అందుబాటులో ఉండగా, స్వయం ఉపాధి పొందుతున్నవారు, వ్యాపారులు, వృత్తి నిపుణులకు ఇరవై ఐదు లక్షల రూపాయల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. రుణాన్ని గరిష్ఠంగా పదిహేనేళ్ల వ్యవధిలో తిరిగి చెల్లించే అవకాశం కల్పించారు. వడ్డీ రేట్లు దరఖాస్తుదారుడి రుణ చరిత్ర, ఆర్థిక స్థితి, ఇతర అర్హతల ఆధారంగా నిర్ణయించబడతాయి. గిరిజన ప్రాంతాల్లో భూమి తనఖా సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉండటంతో వాటిని దృష్టిలో ఉంచుకుని సవరించిన అర్హత నిబంధనలను ఈ పథకంలో అమలు చేస్తున్నట్లు బ్యాంకు తెలిపింది. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని అర్హులైన కుటుంబాలు సులభంగా గృహ రుణాలు పొందగలుగుతాయని బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఎంపిక చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ శాఖల ద్వారా మాత్రమే ఈ రుణ సదుపాయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రజలకు అధికారిక రుణ వ్యవస్థను చేరువ చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రధాన అధికారుల్లో ఒకరైన సుబోధ్ కుమార్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల ప్రజలు గృహ రుణాల విషయంలో ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడం, అధికారిక బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడం, గిరిజన ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# ఆకట్టుకునేలా సోనీ కొత్త కెమెరా



**హైదరాబాద్, జులై 10 :** ఫోటోగ్రఫీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ సోనీ సరికొత్త బ్రిడ్జ్ కెమెరాను మార్కెట్‌లోకి తీసు కొచ్చింది. గతంలో మంచి ఆదరణ పొందిన మోడల్‌కు వారసుడిగా విడుదలైన ఈ కెమెరాలో రూపకల్పనతో పాటు పలు సాంకేతిక మార్పులు చేశారు. లెన్స్ మార్చాల్సిన అవసరం లేకుండా విస్తృత జూమ్ సామర్థ్యాన్ని అందించేలా దీనిని రూపొందించారు. కొత్త కెమెరాలో మెరుగైన ఎలక్ట్రానిక్ వ్యూఫైండర్, ఆధునిక ప్రాసెసర్, కృత్రిమ మేధ ఆధారిత ఆటోఫోకస్ వ్యవస్థను అమర్చారు. మనుషులు, జంతువులు, పక్షులు, వాహనాలు వంటి పలు అంశాలను వేగంగా గుర్తించి ఫోకస్ చేసే సామర్థ్యం ఇందులో ఉంది. అలాగే సులభంగా ఉపయోగించుకునే కొత్త మెనూ వ్యవస్థ, మెరుగైన నియంత్రణ బటన్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. పగటి సమయంలో తీసే చిత్రాలు అత్యంత స్పష్టంగా, సహజ రంగులతో కనిపిస్తున్నాయని ఫోటోగ్రఫీ నిపుణులు పేర్కొంటున్నారు. విస్తృత జూమ్ లెన్స్ కారణంగా ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణులు, క్రీడా ఈవెంట్లు వంటి వాటిని చిత్రీకరించేందుకు ఇది అనువుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. వేగవంతమైన ప్రాసెసర్ కారణంగా చిత్రాల ప్రాసెసింగ్ కూడా త్వరగా పూర్తవుతోంది. అయితే తక్కువ వెలుతురులో చిత్రాల నాణ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం ఈ కెమెరాకు ప్రతికూలంగా మారింది. వెలుతురు తగ్గినప్పుడు చిత్రాల్లో స్పష్టత తగ్గడంతో పాటు శబ్దం ఎక్కువగా కనిపిస్తోందని సమీక్షలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆటోఫోకస్ వ్యవస్థ కూడా లక్ష్యాన్ని గుర్తించడంలో ఆలస్యం చేస్తోందని నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ ఒకే కెమెరాతో విస్తృత జూమ్, ఆధునిక సాంకేతికత, సులభ వినియోగాన్ని కోరుకునే వారికి ఈ కొత్త మోడల్ మంచి ఎంపికగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. పగటి ఫోటోగ్రఫీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారులను ఈ కెమెరా మరింత ఆకట్టుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# కల్యాణ్ జ్యువెలర్స్ షేర్ల జోరు..

### పెట్టుబడిదారులకు భారీ లాభాలు

**హైదరాబాద్, జులై 10 :** దేశీయ ఆభరణాల విక్రయ రంగంలో ప్రముఖ సంస్థ కల్యాణ్ జ్యువెలర్స్ షేర్లు వరుసగా మూడో రోజు కూడా బలమైన లాభాలతో దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన ట్రేడింగ్‌లో ఈ షేరు ఏడు శాతానికి పైగా పెరిగి అత్యధిక స్థాయిని తాకింది. దీంతో పెట్టుబడిదారులకు గణనీయమైన లాభాలు చేకూరగా, కంపెనీ మార్కెట్ విలువ కూడా భారీగా పెరిగింది. గత మూడు ట్రేడింగ్ రోజులలోనే ఈ షేరు దాదాపు 34 శాతం మేర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువకు సుమారు రూ.11,500 కోట్లు అదనంగా చేరాయి. ప్రస్తుతం సంస్థ మొత్తం మార్కెట్ విలువ రూ.48,850 కోట్లకు చేరుకుంది. ఈ ఏడాది ఆరంభంలో ఎదురైన నష్టాలను కూడా ఈ పెరుగుదలతో దాదాపు భర్తీ చేసుకుంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థ ఒకటి ఈ షేరుపై అనుకూల నివేదిక విడుదల చేయడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. సంస్థ షేర్లను కొనుగోలు చేయాలని సూచించడంతో పాటు ఒక్కో షేరుకు రూ.750 లక్ష్య ధరను నిర్దేశించింది. ప్రస్తుతం ఉన్న ధరతో పోలిస్తే భవిష్యత్తులో మరింత పెరుగుదలకు అవకాశం ఉందని పేర్కొంది. ఇటీవల ముగిసిన తొలి త్రైమాసికంలో సంస్థ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 38 శాతం పెరగడం కూడా పెట్టుబడిదారులను ఆకర్షించింది. దీర్ఘకాలంలో కంపెనీ వృద్ధి అవకాశాలు బలంగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో కూడా ఈ షేరు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# చెన్నైలో బిగ్‌బాష్ తొలి విదేశీ మ్యాచ్





**చెన్నై, జులై 10:** ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ పొందిన లీగ్‌లలో ఒకటైన ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా విదేశీ గడ్డపై అధికారిక మ్యాచ్‌ను నిర్వహించనుంది. బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్‌కు సంబంధించిన ప్రారంభ మ్యాచ్‌ను తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మెల్‌బోర్న్‌లో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించిన వివరాల ప్రకారం డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో ఈ చారిత్రాత్మక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు, పెర్త్ స్కార్చర్స్‌తో తలపడనుంది. ఈ పోరులో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ హోం జట్టుగా బరిలోకి దిగనుండటం విశేషం. విదేశీ దేశీయ క్రికెట్ లీగ్‌కు చెందిన అధికారిక మ్యాచ్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం మరో ప్రత్యేకతగా నిలిచింది. ఈ మ్యాచ్ విజయవంతంగా నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక అడుగుగా ఈ మ్యాచ్‌ను అభివర్ణించారు. చెన్నైలో జరిగే ఈ ప్రత్యేక పోరులో గెలుపోటముల కంటే ఆట స్ఫూర్తి, ఇరు దేశాల స్నేహబంధమే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. బిగ్‌బాష్ లీగ్‌ను భారత క్రికెట్ అభిమానులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌తో పాటు చెన్నైలో సాంస్కృతిక, చలనచిత్ర ఉత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా రెండు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆస్ట్రేలియాలో ఐపీఎల్‌కు బాటలు





**మెల్‌బోర్న్, జులై 10 :** భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ సంబంధాలు మరో కీలక మైలురాయిని చేరుకోనున్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ టీ20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా ఆ దేశం వెలుపల మ్యాచ్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం (చేపాక్) స్టేడియంలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ఈ చారిత్రాత్మక ప్రకటనను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సంయుక్తంగా వెల్లడించారు. రెండు దేశాల మధ్య దౌత్య, క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ సహకారం బిగ్‌బాష్ లీగ్‌తో మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను కూడా భవిష్యత్తులో ఆస్ట్రేలియాలో నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా మీడియా కథనాల ప్రకారం, చెన్నైలో బిగ్‌బాష్ ప్రారంభ మ్యాచ్‌ను ప్రతి ఏడాది నిర్వహించేలా ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనికి ప్రతిగా ఆస్ట్రేలియాలో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించాలని క్రికెట్ ఆస్ట్రేలియా భారత క్రికెట్ నియంత్రణ మండలికి ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఈ అంశంపై అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదనకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపితే, భవిష్యత్తులో మెల్‌బోర్న్, సిడ్నీ వంటి నగరాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఏర్పడనుంది. దీంతో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారత అభిమానులు తమ అభిమాన జట్ల మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం దక్కనుంది.క్రీడా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రెండు దేశాల మధ్య క్రికెట్ సహకారం మరింత బలపడటంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా టీ20 క్రికెట్‌కు కొత్త దిశను చూపించే పరిణామంగా నిలిచే అవకాశం ఉంది.

# పర్ఫామెన్స్‌కు విలువ లేదా?

## టీ20ల్లో టీమిండియా వరుస పరాజయాలు

### సిఫార్సుల ద్వారానే ఛాన్స్‌లు..

### టీమిండియా ఎంపికలపై విమర్శలు!

### ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో ఓటమి

**ముంబై:** టీమిండియా గత 5-6 టీ20ల్లో వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో భారత్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఎంపికపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఆటగాళ్ల ఎంపికలో ప్రతిభ కంటే వ్యక్తిగత అనుబంధాలు, లాబీయింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అభిమానులు, నెటిజన్లు.. బీసీసీఐ, సెలెక్టర్లపై విమర్శలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైరల్ పోస్టులో టీమిండియా ఆటగాళ్ల ఎంపికపై నెటిజన్స్ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. అభిషేక్ శర్మకు యువరాజ్ సింగ్ మద్దతు కారణంగా అవకాశం దక్కిందని, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అతని వయస్సు కారణంగా ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని నెటిజన్స్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ మాత్రం దేశవాళీ క్రికెట్‌లో రాణించి తిరిగి భారత జట్టులోకి వచ్చిన ఏకైక ఆటగాడని అభిప్రాయపడ్డారు. శ్రేయస్ అయ్యర్ దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చి జట్టులో చోటు సంపాదించాడని పేర్కొన్నారు. శివమ్ దూబేను స్పిన్ బౌలర్లపై భారీ షాట్లు ఆడగలడనే ఉద్దేశంతో ఎంపిక చేసినా.. స్పిన్ బౌలింగ్‌కే బలవుతున్నాడని విమర్శించారు. తిలక్ వర్మ ఎంపిక వెనుక రోహిత్ శర్మ మద్దతు, ముంబై లాబీ ప్రభావం ఉందని ఆరోపించారు. అక్షర్ పటేల్‌కు 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆడిన కీలక ఇన్నింగ్స్, ఫీల్డింగ్ కారణంగా అవకాశాలు కొనసాగుతున్నాయని.. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాలకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు కారణమని ఆ పోస్టులో నెటిజెన్స్ పేర్కొన్నారు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం ప్రదర్శన కంటే ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రజత్ పాటీదార్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ ప్రస్తుత టీ20 జట్టులోని చాలా మంది ఆటగాళ్ల కంటే మెరుగైన ప్రదర్శన చేయగలరని అభిప్రాయపడ్డారు. ఇషాన్, శ్రేయాస్ మాత్రమే అద్భుత ప్రదర్శనతో జట్టులో చోటు సంపాదించారని ఫాన్స్ పేర్కొంటున్నారు.

# లార్డ్స్‌లో తొలి టెస్టు

## స్మృతి మంధాన అరుదైన ఘనత



భారత మహిళా జట్టు ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఆతిథ్య ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ ఏకైక టెస్టులో.. టీమిండియా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ కెరీర్‌లో అతి పిన్న వయసులో 300 మ్యాచ్‌లు ఆడిన బ్యాటర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన భారత మహిళల జాబితాలో స్మృతి మూడో స్థానంలో ఉంది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన స్మృతి.. ఇప్పటి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఈ జాబితాలో ప్రస్తుతం భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(374) అగ్రస్థానంలో ఉండగా, భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్(333) రెండో స్థానంలో కొనసాగుతోంది. 29ఏళ్ల స్మృతి ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచులు ఆడింది. మొత్తం 10వేలకుపైగా పరుగులు చేసింది. ఇందులో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 67 బంతుల్లో 56 పరుగులు చేసి క్రీజులో కొనసాగుతోంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. లంచ్ బ్రేక్ సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(0), యాస్తికా భాటియా(12) నిరాశ పర్చారు. జెమీమా రోడ్రిగ్స్(35) పరుగులు చేసి ఔటైంది. కాగా స్మృతి మంధాన(56బి), హర్మన్ ప్రీత్ కౌర్(14బి) క్రీజులో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, లారెన్ ఫైలర్, ఇస్సీ వాంగ్ తలొక వికెట్ పడగొట్టారు.



# లార్డ్స్‌లో భారత మహిళలకు చారిత్రక టెస్టు

**లండన్, జులై 10:** టీ20 ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శనతో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో కీలక సవాల్‌కు సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో శుక్రవారం భారత జట్టు బరిలోకి దిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత మహిళలు తొలుత బ్యాటింగ్ ప్రారంభించారు. లార్డ్స్ మైదానంలో భారత మహిళల జట్టు టెస్టు మ్యాచ్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందిన ఈ మైదానంలో తొలి టెస్టు ఆడుతూ భారత మహిళలు చారిత్రక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ మ్యాచ్ ద్వారా ఇరు జట్లు విజయంతో సిరీస్‌ను ముగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగాయి. భారత్ తరఫున టీ20 ప్రపంచ నంబర్-ఒకటి బౌలర్ శ్రీచరణి టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేస్తుండగా, ఇంగ్లండ్ తరఫున క్యాప్సీ, మ్యాడీలు తొలి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారు. ఈ అరంగేట్ర ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మహిళల టెస్టు మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు జరుగుతాయి. ఇంగ్లండ్ తుది జట్టు: నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), టామీ బీమౌంట్, మియా బౌచీర్, హీథర్ నైట్, క్యాప్సీ, అమీ జోన్స్ (వికెట్ కీపర్), మ్యాడీ, సోఫీ ఎకిల్‌స్టన్, ఇస్సీ వాంగ్, లారెన్ బెల్, లారెన్ ఫైలర్. భారత్ తుది జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, యాస్తికా భాటియా, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, సయాలీ, శ్రీచరణి, క్రాంతి గౌడ్.

# టీ20ల్లో శ్రేయస్ అరుదైన రికార్డు

## జట్టు విఫలమైనా 'సర్పంచ్ సాబ్' ఒంటరి పోరాటం!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు వరుసగా నిరాశపరుస్తున్నా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం తన బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఇప్పటికే మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన భారత్.. బ్రిస్టల్ వేదికగా జరిగిన నాలుగో టీ20లోనూ బ్యాటింగ్‌లో తడబడింది. అయితే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒంటరి పోరాటంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ వరుసగా విఫలమైన వేళ శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా బ్యాట్ ఊపాడు. చివరి వరకు అజేయంగా నిలిచిన ఆయన 80 పరుగులు చేసి భారత్‌ను 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగుల వరకు తీసుకెళ్లాడు. శ్రేయస్ తర్వాత భారత బ్యాటర్లలో అత్యధిక స్కోరు కేవలం 22 పరుగులే కావడం ఆయన ఇన్నింగ్స్ ఎంత విలువైనదో చెప్పకనే చెబుతోంది. ఈ ఇన్నింగ్స్‌తో శ్రేయస్ అయ్యర్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. భారత జట్టులో మిగతా ఏ బ్యాటర్ కూడా 25 పరుగులు దాటని మ్యాచ్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు నమోదు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులు ఈ ప్రత్యేక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో తొలి స్థానంలో మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు. అమెరికాపై అజేయంగా 84 పరుగులు చేసిన ఆ మ్యాచ్‌లో మరో భారత బ్యాటర్ 25 పరుగులకు మించి చేయలేదు. రెండో స్థానంలో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఆస్ట్రేలియాపై ఆయన చేసిన అజేయ 82 పరుగుల ఇన్నింగ్స్ సమయంలో మిగతా బ్యాటర్లలో ఎవరూ 21 పరుగులు దాటలేదు. విశేషమేమిటంటే.. ఈ ప్రత్యేక జాబితాలో శ్రేయస్ అయ్యర్ పేరు ఒకసారి కాదు, మూడు సార్లు ఉంది. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులతో పాటు, శ్రీలంకపై అజేయ 73 పరుగులు, మరోసారి ఇంగ్లండ్‌పైనే చేసిన 67 పరుగుల ఇన్నింగ్స్‌లు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జట్టు మొత్తం విఫలమైన సందర్భాల్లో కూడా బాధ్యత తీసుకుని ఒంటరిగా పోరాడే బ్యాటర్‌గా శ్రేయస్ తన విలువను మరోసారి నిరూపించాడు.



మనసులోమాట

# జన నాయగన్‌కు ఏ సర్టిఫికెట్

## పలు మార్పులు సూచించిన సెన్సార్ బోర్డు

తమిళనాడు సీఎం, నటుడు విజయ్ కథానాయకుడిగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అయితే మొత్తం మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో దాదాపు 12 కీలక మార్పులు చేయాలని బోర్డు సూచించింది. ఇందులో భాగంగా విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని. అలాగే 'అంబేడ్కర్ చట్టం' అనే డైలాగ్‌ను మార్చాలని, ఓ పుస్తకం కవర్‌పై అంబేడ్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలని బోర్డు స్పష్టం చేసింది. ఇక దేశభక్తికి సంబంధించిన అంశాల్లో భాగంగా భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు సినిమాలో 'రంగనాథర్', 'ఓం' అనే పదాలతో పాటు 'ఆపరేషన్ మేలుహా' వివరణలో వచ్చే 'న్యూ ఇండియా' అనే పదాన్ని మ్యూట్ చేయాల్సిందిగా పేర్కొంది. సమాజంలో సున్నితమైన అంశాలకు సంబంధించి ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలని బోర్డు వెల్లడించింది. అలాగే సినిమాలో 'షీలా రాణి' అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలని, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన సద్దాం హుస్సేన్ ఉరితీత డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలని సూచించింది. వీటితో పాటు మరికొన్ని సన్నివేశాల్లో వచ్చే వివాదాస్పద పదాలను కూడా మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డు ఆదేశాల జాబితాలో పేర్కొంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ మార్పులన్నింటినీ పూర్తి చేసుకుని జులై 24న 'జన నాయగన్' థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.






# 40 ప్లస్‌లోనూ స్టన్నింగ్ లుక్

## వైరల్ అవుతున్న విమలా రామన్ ఫొటోలు

మలయాళ, తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి విమలా రామన్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. 44 ఏళ్ల వయసులోనూ అదే ఫిట్‌నెస్, అదే గ్లామ-ర్‌ను మెయింటైన్ చేస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది. తమిళ చిత్రం 'పోయి'తో సినీ రంగంలో అడుగుపెట్టిన విమలా రామన్.. అనంతరం 'టైమ్' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. వరుసగా పలు మలయాళ చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తెలుగులో 'ఎవరైనా ఎప్పుడైనా' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. తొలి చిత్రంతోనే అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఇటీవల కాలంలో సినిమాల సంఖ్య తగ్గింది. సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం విమలా రామన్ చాలా యాక్టివ్‌గా ఉంటోంది. తరచూ తన గ్లామరస్ ఫోటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. లైట్ పింక్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో స్టైలిష్‌గా మెరిసిన విమలా.. ట్రెండీ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఎద, నడుము అందాలు హైలైట్ అయ్యేలా ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని ఫొటోల్లో కురులను ముఖంపైకి వదిలి, మరికొన్నింటిలో వెనక్కి సర్దుకుని డిఫరెంట్ లుక్స్‌లో కనిపించింది. ఒక చేతికి బ్రేస్‌లెట్, వేళ్లకు ఉంగరాలు ధరించి తన స్టైలింగ్‌కు మరింత అందాన్ని జోడించింది. మొత్తంగా 40 ప్లస్‌లోనూ తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి నిరూపించిన విమలా రామన్.. తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



# హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు

## పిల్ల జమీందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 10:** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా మోసం బయటపడటం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# ఫిల్మ్ నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

## మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

హైదరాబాద్, జూలై 10: హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహారీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.







# కొత్త కథనంతో వచ్చిన లెనిన్

## అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయి-పోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్య, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్య, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ సబ్జెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్ధం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్ధం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు. ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్ధంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746

# మనసులో మాట

KANCHARLA

## ఉత్తరాంధ్ర

| | | |
|---|---|---|
| విశాఖపట్నం | విజయనగరం | అనకాపల్లి |
| శ్రీకాకుళం | అల్లూరి జిల్లా (పాడేరు) | పార్వతీపురం |

శనివారం 11 జులై 2026 పేజీలు 16





# జీతాలు పెంపుకై అంగన్వాడీల భారీ ఆందోళన

- నెహ్రూ చౌక్ లో మానవహారం
- ఎన్టీఆర్ స్టేడియంలో సభ

**అనకాపల్లి టౌన్ జూలై 10, మనసులో మాట**

అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలనే డిమాండ్ పై శుక్రవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు కార్యాలయం నుండి నెహ్రూ చౌక్ మీదుగా ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. నాలుగు రోడ్లు నెహ్రూ చౌక్ లో మానవహారం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జీతాలు పెంపుదలపై ప్రకటన చేయాలని పెద్ద ఎత్తున అంగన్వాడి కార్యకర్తలు నినదించారు.

ఈ ఆందోళనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకర్రావు లు. అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి అధ్యక్షతన ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడుతూ.....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా అనేక యాప్ లు తీసుకువస్తున్నారు ..మిగతా 2లో

# సీజనల్ జ్వరాలపై అపోహలు వద్దు

- జ్వరాల కోసం ప్రత్యేక డ్రైవ్
- కొండ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి
- పల్లెల్లో పారిశుధ్యం తప్పనిసరి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్




02

## రూ. 4 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన...

- 10 గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు

02





## రేషన్ కోసం లబ్ధిదారులు పడి గాపులు

- గిరిజనులకు తీవ్ర కష్టాలు

02



## జిల్లా పోలీసుశాఖలో భారీగా బదిలీలు

- 19మంది ఎఎస్ఐలు, 42 మంది హెచ్ సి లు, 61 మంది కానిస్టేబుళ్ళు బదిలీ

12

# సీజనల్ జ్వరాలపై అపోహలు వద్దు

- జ్వరాల కోసం ప్రత్యేక డ్రైవ్
- కొండ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి
- పల్లెల్లో పారిశుధ్యం తప్పనిసరి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



సీజనల్ జ్వరాలపై ఎలాంటి అపోహలు వద్దని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే గజపతినగరం నియోజకవర్గ వ్యాప్తంగా వైద్య శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని.. జ్వరాలపై వస్తోన్న కథనాలతో ఎలాంటి అపోహలు వద్దని మంత్రి హితవు పలికారు. ఇప్పటికే వైద్యాధికారులకు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని గజపతి నగరంలో జ్వరాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా వైద్య సిబ్బంది పని తీరులో నాలుగో స్థానం, రోగులకు మందులు అందించే విషయంలో గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రి రెండో స్థానంలో ఉందన్న ఆయన .. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో వైద్య సిబ్బంది పనితీరును ప్రశంసించారు. వర్షాకాలంలో సీజనల్ జ్వరాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ఆశ వర్కర్ల నుంచి వైద్య సిబ్బంది, వైద్యులు అందరూ కూడా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే కొండ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సైతం అవగాహన కల్పించాలన్న మంత్రి అపోహలు విడనాడాలని సూచించారు. ఎవరికైనా జ్వరం వస్తే.. వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి వైద్యుల సూచన మేరకు వైద్యం పొందాలన్నారు. గజపతి నగరం ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టులను, మందులను రోగులకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుదల విషయంలో పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. దోమల నిర్మూలన చేయడంతో పాటు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద మురుగు నీరు లేకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలని, అశ్రద్ధ వహించినట్లయితే మామూలుగా వచ్చే జ్వరం సైతం టైఫాయిడ్ మలేరియా వంటి జ్వరాలు అయ్యే అవకాశం ఉందని, జ్వరాల పట్ల అశ్రద్ధ వహించవద్దని నియోజకవర్గ ప్రజలకు సైతం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

---

## రూ. 4 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన...

- 10 గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు

**అనంతగిరి,జూలై 10 మనసులో మాట**



అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో పైనంపాడు పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాలకు దశాబ్దాల రవాణా కష్టాలకు త్వరలోనే విముక్తి కలలుగుతుందని ఎగువ సొనభ గ్రామం నుంచి కాకరపాడు గ్రామం వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డు రహదారి పనులను స్థానిక ఎంపీటీసీ వంతల తమ్మన్న ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీటీసీ తమ్మన్న మాట్లాడుతూ....

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్మన్ నిధుల నుంచి సుమారు 4 కోట్ల రూపాయల ఖర్చులతో ఈ రోడ్డు పనులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సరికొత్త బీటీ రోడ్డు అందుబాటులోకి రావడం వల్ల ఎగువ సునభ, కాకరపాడు సహా చుట్టుపక్కల ఉన్న దాదాపు 10 గిరిజన గ్రామాలకు శాశ్వతంగా రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు వెళ్లడానికి గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కొర్రా తమ్మన్న, టీడీపీ పంచాయతీ గ్రామ కమిటీ ప్రతినిధి మరియు మాజీ వైస్ ఎంపీపీ సిదారి గుండన్న, బోయిని బొంజుబాబు, కన్వీనర్ కిముడు సుబ్బారావులతో పాటు స్థానిక టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీతాలు పెంపుకై అంగన్వాడీల భారీ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)





ఇప్పటికే పోషణ ట్రెకర్, బాలసంజీవిని, యాప్ , ద్వారా సెంటర్ నిర్వహణ చేస్తున్నాం దీనికి తోడు హెల్త్ డిపార్ట్మెంట్ నిర్వహించే పి ఎం ఎం వి వై , స్క్రీనింగ్ డేటా ఇప్పుడు అంగన్వాడి ఉద్యోగుల చేత బలవంతంగా చేసే పని చేస్తున్నారు, అంగన్వాడిలు క్వాలిఫికేషన్ కి తీసుకొచ్చిన యాప్ లకు పొంతన లేకుండా ఉంది, సాఫ్ట్వేర్ ఉద్యోగులు చేసే ఆన్లైన్ వర్క్ తీసుకొస్తున్నారు వారి వేతనం ఎంత వారికి అప్పచెప్పి పనులు ఎంత అని ప్రశ్నించారు,ఈ యాప్ వలన ప్రీ స్కూల్ పూర్తిగా కుంటుపడే విదంగా ఈ యాప్ వర్క్ ఉంది అంగన్వాడి లను నిర్వీర్యం చేసే విధానాలను అవిలంబిస్తున్నారు వేతనం చూస్తె వర్కర్స్ కి 11,500 రూ, హెల్పర్స్, మినీలు 7,000 రూ, ఇస్తున్నారు వేతనాలు పెంచమని తప తప పోరాటాలు చేసాం ప్రభుత్వం స్పందించకపోక విపరీతమైన పనిభారాన్ని పెట్టి అంగన్వాడి ఉద్యోగులు మానసిక అందుకు గురిచేస్తున్నారు, అలగే సంక్షేమ పథకాలు వర్తింపచేయలేదు, ఉద్యోగులకే కాక వారి కుటుంబ సభ్యులకి కూడా సంక్షేమ పథకాలు దూరం చేసే పరిస్థితి ఏర్పడింది, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ క్రింది డిమాండ్స్ ను పరిష్కరించాలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జి. కుమారి కోశాధికారి వి. వి రమణమ్మ , ప్రాజెక్ట్, సెక్టార్ నాయకత్వం రామలక్ష్మి బుజ్జి కాసులమ్మ రమణి జయ తదితరులు నాయకత్వం వహించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిఐటియు నాయకులు గనిసెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్ రంగలి రాము, ఎం రాజేష్, ఏ రాజు, డి శ్రీనివాసరావు, చలపతి గండి నాయన బాబు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి వారి డిమాండ్స్ అయినా. కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలి.

. నవచేతన యాప్ ను రద్దు చేయాలి ,. సంక్షేమ పథకాలు అంగన్వాడి ఉద్యోగులకు వర్తింపచేయాలి వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని . గ్రాట్యూటీ నిర్దిష్టమైన గైడెన్స్ ఇవ్వాలని. పెన్షన్ పిఎఫ్ ఈఎస్ఐ వంటి సామాజిక భద్రత సౌకర్యాలు చేయాలి . హెల్పర్స్ ప్రమోషన్ కి ఐదు సంవత్సరాల పినియారిటీని రద్దు చేయాలి పెండింగ్ లో ఉన్న టి ఏ బిల్లులు వెంటనే ఇవ్వాలి . బి ఎల్ వో డ్యూటీల నుంచి అంగన్వాడి ఉద్యోగులను మినహాయించాలి. అని తెలిపారు.

# రేషన్ కోసం లబ్ధిదారులు పడి గాపులు

- గిరిజనులకు తీవ్ర కష్టాలు

**అనంతగిరి జులై 10 మనసులో మాట**





అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కివర్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ చౌకధర దుకాణం డిపోలో ప్రభుత్వం పంపిణి చేస్తున్న ఉచిత బియ్యం కోసం లబ్ధిదారులు ఉదయం నుండి పడిగాపులు చేస్తున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు.

ఈ సందర్భంగా ట్యాంగిలబంద రేషన్ లబ్ధిదారులు పాడి బుద్రన్న మాట్లాడుతూ ఈ చౌక ధర దుకాణంలో సుమారు 6 గ్రాముల నుండి నిత్యవసర సరుకులు కోసం డిపోలో ఉన్న 253 కార్డుల లబ్ధిదారులు బియ్యం విడిపించడం కోసం ఒక రోజు పని కేటాయించుకుని సుమారుగా పది కిలోమీటర్ల దూరం గంటల తరబడి నడవవలసిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆయంలో ప్రతి గ్రామంలో లబ్ధిదారులకు ఇంటింటా బియ్యం పథకం అందించే వారిని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పాలన గిరిజనుల కష్టాలు కూటమి నాయకులకు అధికారులకు తెలియడం లేదని రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాల నుండి డిపోకి రావాలంటే గంటల తరబడి నడిచి వచ్చినప్పుడు అందుబాటులో సేల్స్ మెన్ లేకపోతే నిరాశతో తిరుగు ప్రయాణం చేయవలసి వస్తుందని ఆయన ఆరోపించారు ఇటువంటి తరుణంలో సంబంధిత అధికారులు కూటమి నాయకులు ఇంటింటా బియ్యం పంపిణీ పథకం అందుబాటులో తేవాలని ఆయన కోరారు.

# మాడుగులలో ప్రజా దర్బార్‌కు విశేష ప్రజా స్పందన లభించింది

- 414 వినతులు స్వీకరణ – వారంలోపు పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

**వి. మాడుగుల, జూలై 10 (మనసులో మాట):**



మాడుగుల నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టిన "ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ (ఐఏఎస్), జాయింట్ కలెక్టర్ సౌర్య మన్ పటేల్, ఆర్డీవోలు ఆయేషా, రమణ, డీఆర్వో శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, అందిన ప్రతి ఫిర్యాదును వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఒకసారి పరిష్కరించిన సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వీలైనంత వరకు మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అధికారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిడి ఉండదని, విధుల్లో నిర్లక్ష్యం లేదా అవకతవకలు జరిగితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మొత్తం 414 వినతులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 162, ఇతర శాఖలకు సంబంధించినవి 252 ఉన్నాయి. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కూన రవికుమార్

**శ్రీకాకుళం, మనసులో మాట, జిల్లా ప్రతినిధి జులై 10:**





దేశంలో వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దేందుకు శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన నీటి నిర్వహణ, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలకు ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమదాలవలస శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (పీయూసీ) చైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో వ్యవసాయం, భూమి, నీటి వనరులపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసి, వాటిలో రైతులకు ఉపయోగపడే అంశాలను రాష్ట్రంలో అమలు చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి జాతీయ స్థాయి మేధోమథన చర్చలు ప్రజాప్రతినిధులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తు విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధకులు పాల్గొని వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, సాధ్యమైన పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, భూ పరిపాలనలో పారదర్శకతను తీసుకురావడం, నీటి వనరుల సమర్థ నిర్వహణతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునే వ్యవసాయ విధానాలపై నిపుణులు పలు కీలక సూచనలు చేశారు. రైతుల అభ్యున్నతే ధ్యేయంగా సాగిన ఈ సదస్సులో పాల్గొనే అవకాశం లభించడం పట్ల కూన రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## లైన్ కొత్తూరు లో రైతులకు వరి విత్తనాల పంపిణీ

**ఎలమంచిలి టౌన్, జూలై 10, మనసులో మాట,**



మండలంలో లైను కొత్తూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నాడు రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎలమంచిలి మండల తెలుగు మహిళ, మాజీ జెడ్పిటిసి రాజాన నారాయణమ్మ, లైన్ కొత్తూరు మాజీ సర్పంచ్, జనసేన నాయకులు లవుడు లోవ రాజు ఈ విత్తన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో రైతులకు సకాలంలో విత్తనాలు అందించడం జరుగుతుందని, మేలు రకం , అధిక దిగుబడి రకాల విత్తనాలు ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

**రోలుగుంట, జులై 10 మనసులో మాట.**



రోలుగుంట మండలం అర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 శాతం ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న ఈ గ్రామంలో రైతులతో కలిసి సామూహికంగా వరి విత్తనాలకు బీజామృతంతో విత్తన శుద్ధి చేపట్టారు.ఈ సందర్భంగా డివిజన్ ఎంటీ వరలక్ష్మి విత్తన శుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పీఎండీఎస్ అమలు చేసిన నెల రోజుల అనంతరం ఫీల్డ్ విజిట్ కూడా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ నుండి డాక్టర్ అప్పలస్వామి (షుగర్‌కేన్), డాక్టర్ ఎం. చంద్రశేఖర్ రెడ్డి (ఎకనామిక్స్), డాక్టర్ వి. చంద్రశేఖర్ (పథాలజీ), డాక్టర్ డి. ఉమా మహేశ్వరరావు (ఎక్స్టెన్షన్), మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, గ్రామ సర్పంచ్ నూకరాజు, రైతులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, డివిజన్ ఇంచార్జి వరలక్ష్మి, యూనిట్ ఇంచార్జి గంగరాజు, ఐసీఆర్‌పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## బీబీ పట్నం హైస్కూల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి నాయకుల ఎన్నికలు

**రోలుగుంట జులై 10 మనసులో మాట.**




బి.బి.పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. విద్యార్థి నాయకుల ఎన్నికల సందర్భంగా పాఠశాల ప్రాంగణం ప్రజాస్వామ్య పండుగలా మారింది. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బీబీ పట్టణంకు చెందిన ఈ పాఠశాలలో విద్యార్థులు ఎంతో ఆసక్తితో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ చంద్రశేఖర్ రావు పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ క్రమబద్ధంగా సాగింది. ఓటింగ్ సమయంలో విద్యార్థుల్లో ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. ప్రతి ఒక్కరూ తమ అభిరుచికి అనుగుణంగా నాయకులను ఎన్నుకోవడంలో పాల్గొన్నారు.ఈ ఎన్నికల్లో స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్ పిఎల్)గా గంజి లక్ష్మీ ప్రసాద్ విజయం సాధించగా, సెకండ్ (ఎస్ పిఎల్) గా గోదే భవ్య శ్రీ ఎన్నికయ్యారు. విజేతలను సహ విద్యార్థులు అభినందించగా, పాఠశాలలో ఆనంద వాతావరణం నెలకొంది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ విధమైన ఎన్నికలు ఎంతో ఉపయోగకరమని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను చిన్న వయస్సు నుంచే అలవాటు చేయడం ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## కాశీబుగ్గ లో గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం.. మూడు రోడ్ల జంక్షన్ వద్ద కలకలం..

**పలాస, జులై 10 ,మనసులో మాట ..**



కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. శుక్రవారం ఉదయం రోడ్డు పక్కన ఒక వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎవరు? ఎక్కడి వ్యక్తి? ఎలా మృతి చెందారు? అనే కోణాల్లో విచారణ ప్రారంభించారు. రద్దీగా ఉండే మూడు రోడ్ల జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదు. రద్దీగా గా ఉండే మూడు రోడ్ల కూడలి దగ్గర గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. దీంతో స్థానికులు భయపడ్డారు. చనిపోవడానికి కారణం ఇంకా తెలియలేదు. ఈ కేసును కాశీబుగ్గ పోలీసులు విచారిస్తున్నారు. మృతుడు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనే వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పీవీఎన్ మాధవ్ బిజెపి పార్టీ అభివృద్ధికి నిరంతర కృషి.....

- బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి......
- అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి హర్షం...

**అనకాపల్లి రూరల్, జులై 10 (మనసులో మాట):**



రాష్ట్రంలో బిజెపి పార్టీ అభివృద్ధికి అపర్శిశలు కృషి చేసి పార్టీ అభివృద్ధికి దోహదపడిన పివిఎన్ మాధవ్ అభినందనీయులని అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి ఏడాది విజయవంతంగా పూర్తి చేసిన శుభ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అనకాపల్లిలో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాధవ్ నాయకత్వంలో నిరంతర కార్యక్రమాలు చేపట్టి ఎవరు ఊహించని విధంగా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా విశేషంగా బలోపేతం అయిందని వారు కొనియాడారు. మాధవ్ చిన్నతనం నుంచి జాతీయ నేత పీవీ చలపతిరావు క్రమ శిక్షణలో ఆర్ఎస్ఎస్ భావజాలన, నైతిక విలువలు, నీతి నిజాయితీ, ఏ అంశంపైనైనా అనర్గళంగా తనదైన వాగ్దాటితో ఆకర్షించడం ఆయనకు ఆయనే సాటి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు, పార్టీ పెద్దలతో ఆత్మీయ సంబంధాలు కలిగి ఉండడం, మోదీజీ ప్రవేశపెట్టిన దేశ దిశ దశ మార్చిన అద్భుత పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం జరగడం ఆయన కృషి అన్నారు. మాధవ్ పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో వ్యవహరిస్తూ, మరింత పటిష్టం చేసే దిశగా అనేక కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేసి అందరి చేత శభాష్ అనిపించుకున్నారన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ఆయన ప్రత్యేక చొరవ చూపారనికొనియాడారు.రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో మాధవ్ సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని పరమేశ్వరరావు, నాగేశ్వరరావు ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే ప్రజా దర్బార్‌లో 25 వినతుల స్వీకరణ..

- **15 రోజుల్లో పరిష్కారం చూపాలి,అధికారులకు ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆదేశాలు..**



**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. శుక్రవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 25 వినతిపత్రాలు ఎమ్మెల్యేకు అందాయి. రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలతో పాటు రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సంబంధించిన వ్యక్తిగత సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు.ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా చర్యలు తీసుకుని 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించి, పరిష్కార వివరాలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

## ఫసల్ బీమా యోజన ప్రారంభించిన వ్యవసాయ అధికారి రాం ప్రసాద్

**శృంగవరపుకోట, జూలై 10: (మనసులో మాట )**



ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం లో భాగంగా ఖరీఫ్ 2026 , రబీ 2026 27 గాను నమోదు ప్రక్రియ ప్రారంభం అయింది అని, రైతులు స్వచ్ఛందంగా మీసేవ లో నమోదు చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాల నుంచి రైతులు ఆర్థిక రక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కే వి రామ్ ప్రసాద్ తెలిపారు, వరి పంట సాగు చేస్తున్న రైతులు ఎకరాకు ప్రీమియం రూ. 200 ఆగస్టు 15 తేదీ లోపల చెల్లించాలని , ఈ అవకాశం అందరూ సద్వినియోగం చేసుకుంటారని , ఈ భీమా కోసం ఈ పంట నమోదు చేసుకోవాల్సి ఉంది అని, సాగు ధృవీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు, గడువులోగా రైతులు అందరూ ప్రీమియం చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

**రాంబిల్లి జులై 10 మనసులో మాట**



రాంబిల్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాల నివారణ, విద్యా ప్రాధాన్యం, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో రాంబిల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై దినకర్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పంచదార్ల జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళల రక్షణకు అమల్లో ఉన్న చట్టాలు, సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాల్సిన విధానం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలనే అంశాలను వివరించారు. అలాగే విద్యే జీవితానికి పునాది అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు ఉద్యాన పంటల సాగుపై కలెక్టర్ పిలుపు

**గుర్ల జులై 10,(మనసు లో మాట )**



గుర్ల మండలం జమ్ము గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఆయిల్ పామ్ మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి నిర్వహించి, సాగు విధానాలు, తోటల నిర్వహణ, దిగుబడులు, మార్కెటింగ్, ఆదాయం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మిషన్ హార్టికల్చర్" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సాంప్రదాయ పంటల నుంచి అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటల వైపు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటల విస్తరణ ద్వారా రైతుల ఆదాయం పెరగడంతోపాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంట దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే అత్యంత లాభదాయక ఉద్యాన పంటలలో ఒకటని, అనుకూల భూభాగాలు కలిగిన రైతులు ఈ పంట సాగును స్వీకరించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా నాణ్యమైన మొక్కలు, సాంకేతిక మార్గదర్శకాలు, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. అలాగే, ఆయిల్ పామ్ తోటల్లో మైక్రో ఇరిగేషన్ (డ్రిప్ ఇరిగేషన్) విధానాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, దీనివల్ల నీటి పొదుపుతో పాటు పంట పెరుగుదల, దిగుబడులు మెరుగుపడతాయని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించి ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి కె. చిట్టిబాబు, ఎపిఎంఐపి పిడి పివిఎస్ వి లక్ష్మీనారాయణ, ఉద్యానశాఖ అధికారులు ఎం. అనూష, వి.హెచ్.ఏ. రామకృష్ణ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రగతిశీల రైతు కురుమునెల్లి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం పై అవగాహన

**పాలకొండ, జులై 10,మనసులో మాట :**



జూలై 11 ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పట్టణం లో గాయత్రి స్కూల్ ఆఫ్ నర్సింగ్ శిక్షణా కేంద్రం లో వాలంటరీ హెల్త్ అసోసియేషన్ గుంటూరు వారి సౌజన్యంతో, జన చేతన సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ముందుగా "చిన్న కుటుంబం - చింత లేని కుటుంబం కుటుంబం" అనే నినాదాన్ని విద్యార్థినిలచే పలికించడం జరిగింది.అనంతరం శిక్షణా కేంద్రం కరెస్పాండంట్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 1989లో ఐక్యరాజ్యసమితి దీనిని ప్రారంభించిన నాటి నుండి ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన మనం ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. నానాటికీ పెరుగుతున్న జనాభా వల్ల కలిగే సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఈ రోజును ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కేంద్రం డైరెక్టర్ డి.అచ్యుత రావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో జనాభా పెరిగిపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి, ముఖ్యంగా సహజ వనరులు తగ్గిపోయి, నిరుద్యోగం పెరుగుతోందని అన్నారు.జన చేతన కోఆర్డినేటర్ ఎం.సరస్వతి మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో మన దేశం కూడా ముందు వరుసలోనే ఉంది కాబట్టి పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా ఆహారం,నీరు,నివాసం మరియు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు.అలాగే, లింగ సమానత్వం, ఆరోగ్య సంరక్షణ మరియు ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. మనం కేవలం జనాభాను తగ్గించడం గురించే కాకుండా, ఉన్న జనాభాను ఆరోగ్యంగా, నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా ఎలా మార్చుకోవాలనే దానిపై దృష్టి పెట్టాలని కోరారు.

# జర్నలిస్ట్ తిరుమలపై దాడి టీడీపీ నేతపై ఫిర్యాదు

**పలాస, , జులై 10, మనసులో మాట**



శ్రీకాకుళం జిల్లా పలాసలో విధి నిర్వహణలో ఉన్న ఓ జర్నలిస్ట్‌పై దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అక్రమ తవ్వకాల సమాచారాన్ని కవర్ చేయడానికి వెళ్లిన సమయంలో తనపై భౌతిక దాడి జరిగిందని బీఆర్‌కే న్యూస్ (BRK News) రిపోర్టర్ యవ్వారీ తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో పలాస సమీపంలోని గరుడుకండి వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వెనుక చెరువు ప్రాంతంలో రాత్రి వేళ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లారు. రోడ్డుపై నిలబడి తవ్వకాల దృశ్యాలను వీడియో చిత్రీకరిస్తుండగా అక్కడి నుంచి ఒక లారీ బయలుదేరింది. అనంతరం పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి, ఆ తవ్వకాలు టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బద్ద నాగరాజుకు సంబంధించినవని,మొక్కల పెంపకం కోసం మట్టిని తరలిస్తున్నామని చెప్పినట్లు బాధితుడు తెలిపారు. ఈ క్రమంలో అక్కడున్న వ్యక్తులు ఫోన్ చేయడంతో టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బద్ద నాగరాజు, బూర్లె యోగేశ్వర్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకుని తనపై, తనతో ఉన్న స్నేహితుడు.జనసేన నాయకుడు ప్రదీప్పై దాడికి పాల్పడ్డారని జర్నలిస్ట్ ఆరోపించారు. దాడి చేయడమే కాకుండా వారు ప్రయాణిస్తున్న స్కూటీని కిందకు తోసేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ, నిందితులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రామకృష్ణకు అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల భద్రతకు భరోసా కల్పించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, బాధితుడు కూడా వెంటనే 112 అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చి, అనంతరం పలాస-కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# విద్య–ఆరోగ్యం–యోగాతోనే ఉజ్వల భవిష్యత్తు

- శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ కోసం 50 వేల ఆర్థిక సాయం
- ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు
- ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి





**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 10, మనసులో మాట...**

విద్య, ఆరోగ్యం, యోగాతోనే ఉజ్వల భవిష్యత్తు అని ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం గైనకాలజిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో, ప్రసూతి మరియు స్త్రీల వ్యాధుల విభాగం, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం సంయుక్తంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశాభివృద్ధికి జనాభా నియంత్రణతో పాటు మహిళల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, యోగా, పరిశుభ్రత వంటి అంశాలు ఎంతో కీలకమని వివరించారు. యువత చదువుతో పాటు శారీరక దృఢత్వం కోసం ప్రతిరోజూ యోగా, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, రక్తహీనత నివారణ, నెలసరి ఆరోగ్యంపై సరైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అందరికీ కూడా ఉచితంగా బ్లడ్ టెస్ట్ చేయిస్తానని తెలిపారు. అలానే విద్యార్థుల కోరిక మేరకు తాగునీటి ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటుకు 50 వేల రూపాయలు అందజేశారు. అలాగే సోషల్ మీడియా వినియోగంపై కూడా విద్యార్థినులకు విలువైన సూచనలు చేశారు. సోషల్ మీడియాను వినోదానికి మాత్రమే కాకుండా విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారాన్ని నమ్మకుండా, బాధ్యతాయుతంగా డిజిటల్ వేదికలను వినియోగించాలని తెలిపారు. జనాభా నియంత్రణ, మహిళా సాధికారత, ఆరోగ్య పరిరక్షణ, యోగా ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగంపై నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా సాగింది.

# జనతా వారధికి విశేష స్పందన..

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు..



**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**

ప్రజల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమానికి పెద్దపీట వేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు, అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపడతామని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి 'జనతా వారధి' కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని, అందిన ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని తేజేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే బీజేపీ లక్ష్యమని, జనతా వారధి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనతా వారధి కోకన్వీనర్ యర్రగుంట్ల జగన్మోహన్, విజయనగరం ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి సురేష్ సింగ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తలే టీడీపీ బలానికి మూలస్తంభాలు: ఎమ్మెల్యే గోవిందరావు..

**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**



తెలుగుదేశం పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. శుక్రవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ క్యాడర్ సమావేశంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా వివరించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన గౌరవం, బాధ్యతలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. నాయకత్వంపై విశ్వాసంతో, ప్రజల మధ్య నమ్మకాన్ని పెంపొందించేలా ప్రతి కార్యకర్త పనిచేస్తే పార్టీకి మరిన్ని విజయాలు ఖాయమని అన్నారు."ప్రజల మద్దతే పార్టీకి ప్రాణం.. కార్యకర్తలే ఆ బలానికి మూలస్తంభాలు" అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన పి డి ఎస్ యు రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు...





**పలాస, జులై 10 ,మనసులో మాట...**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర విద్యా,వైజ్ఞానిక శిక్షణా తరగతులు శుక్రవారం కాశీబుగ్గ టీకేఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ తరగతుల ప్రారంభానికి ముందుగా PDSU బిగిపిడికిలి జెండాని రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం తరగతుల ప్రారంభోపన్యాసం. ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రాంతానికి ఒక ప్రత్యేక ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యా రంగంలో మార్పులు పట్ల ఒక శాస్త్రీయ అవగాహన ఉన్నటువంటి ప్రాంతమని అన్నారు. ఒక నూతన సమాజాన్ని, దోపిడీ,పీడన లేనటువంటి సమ సమాజాన్ని కోరుకునే పీ డీ ఎస్ యూ ఈరోజు ఈ శిక్షణ తరగతులు నిర్వహించుకోవడం చాలా శుభ పరిణామం అని అన్నారు. శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, M.వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, ఎన్నికలలో విద్యార్థులకు,నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయన్నారు.

కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో కేంద్రీకరణ,కాషాయీకరణ చేస్తుందని,నిరుద్యోగ సమస్య పెంచి ప్రభుత్వ రంగ సంస్థలను,కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని దుయ్య బట్టిందన్నారు.. పెండింగ్లో ఉన్న రియంబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన రేషనాలైజేషన్ ప్రక్రియలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77రద్దు చేయాలని,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు

# మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలి

**పాలకొండ, జులై 10,మనసులో మాట :**



రాష్ట్రంలో మున్సిపాలిటీలు కార్పొరేషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లందర్నీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, అంతవరకు సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు అమలు చేసి సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మన్యం జిల్లా పాలకొండ పట్టణంలో మున్సిపల్ పట్టణ కమిటీ అధ్యక్షులు పడాల వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక హక్కులు కాలరాయడమే కాకుండా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదని తెలిపారు. 14 రకాల పౌర సేవలను ప్రైవేటీకరణ చేస్తూ నిర్ణయం చేయడం అంటే కార్మికులకు భద్రతగా ఉన్న ఉపాధిని నాశనం చేయడమేనని అందుకే అలాంటి నిర్ణయాలపై యూనియన్ పోరాడుతుందని తెలిపారు.

చట్టసభలను గౌరవించాల్సిన ప్రభుత్వం కార్మికుల జీతాల విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను అమలు చేయడం లేదని దానికోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

60 సంవత్సరాల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచడం, రిటైన్ వారికి నష్టపరిహారం, వారి కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. డ్యూటీ లో ఉండి మరణిస్తున్న వారి కుటుంబాలకు ఎలాంటి భద్రత లేకుండా పోయిందని పాలకవర్గాలు అధికారులు కాళ్లు చుట్టూ తిప్పించుకొని కార్మికుల సంఖ్యలను పెంచకుండా ఉన్నవారిపై తీవ్రపని ఒత్తిడికి సిద్ధపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఈ నెల 30వ తేదీన కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల సాధన కోసం, పర్మినెంట్ కోసం కలెక్టర్ ఆఫీసుల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు యూనియన్ పిలుపునిచ్చిందని, కార్మిక వర్గం కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజా క్షేత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్





- శ్రీకాకుళం ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ కార్యక్రమం

**శ్రీకాకుళం, జులై 10, మనసులో మాట:**

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విశాఖ 'ఎ' కాలనీలోని తన క్యాంప్ ఆఫీసులో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే సావధానంగా ఆలకించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే గనిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను నియోజకవర్గ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణను నిలిపివేయాలి..

- కలెక్టరేట్ వద్ద దస్తావేజు లేఖరుల ధర్నా
- లైసెన్సుల పునరుద్ధరణ, ఉపాధి రక్షణకు ప్రభుత్వాన్ని కోరిన సంఘం



**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 10, మనసులో మాట:**

రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు నిలిపివేయాలని కోరుతూ శ్రీకాకుళం దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలంటే రిజిస్ట్రేషన్ వ్యవస్థ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని అన్నారు. దస్తావేజు లేఖరుల లైసెన్సులను వెంటనే పునరుద్ధరించాలని, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల ఉపాధికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరిస్తే వేలాది మంది జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసిన నాయకులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# టీకాల కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేయాలి
## : పశుసంవర్ధకశాఖ ఏడి డాక్టర్ రెడ్డి కృష్ణ





**గంట్యాడ, జులై 10 (మనసులో మాట):**

గంట్యాడ మండలంలో టీకాల కార్యక్రమాన్ని శతశాతం పూర్తిచేయాలని, శుక్రవారం గంట్యాడలో ఏ హెచ్ ఏ లకు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రెడ్డి కృష్ణ సూచించారు. గంట్యాడలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో మండల పరిధిలోని రైతు సేవ కేంద్రాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకుల పనితీరు పై సచివాలయాల వారీగా పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ రెడ్డి కృష్ణ సమీక్షించారు. పాడి రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే చిటిక వ్యాధి, గాలికుంటు వ్యాధి, నీలి నాలుక వ్యాధి టీకాల కార్యక్రమం ప్రగతిపై సమీక్ష జరిపి వారికి పలు సూచనలు ఇచ్చారు. పాడి రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి ముంగిటకే పశువైద్య సేవలు అందించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రెడ్డి కృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో బీసీ గురుకులాలు, హాస్టళ్లు విద్యార్థులకు 'సొంతిళ్లు' లాంటివి
## : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

- 10 శాతం డైట్ ఛార్జీల పెంపు, రూ.500 కోట్ల సాస్కి నిధుల కేటాయింపుపై హర్షం
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీమతి లలిత కుమారి



**శృంగవరపుకోట, జులై 10: (మనుసులో మాట )**

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థుల డైట్ బిల్లులను 10 శాతం పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఎస్.కోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబాపూలే) స్కూళ్ల శాశ్వత భవన నిర్మాణాలకు రూ.500 కోట్ల సాస్కి నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుదు ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామన్నారు. బీసీ బిడ్డల చదువు పట్ల, వారి భవిష్యత్తు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కి ఉన్న చిత్తశుద్ధికి ఈ డైట్ ఛార్జీల పెంపు, నిధుల మంజూరే నిదర్శనమని ఆమె కొనియాడారు. సంక్షేమ హాస్టళ్లలో ప్రస్తుతమున్న డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల దృష్ట్యా ఈ నిర్ణయం వల్ల హాస్టల్ విద్యార్థులకు మరింత నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించే వీలు కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.110 కోట్ల డైట్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడుదల చేసి, బీసీ విద్యార్థుల పట్ల తమకున్న ప్రేమను చాటుకుందని లలిత కుమారి గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ కొద్ది కాలంలోనే ఆరు ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారని, కొత్తగా పది గురుకుల పాఠశాలలను మంజూరు చేశారని ఎమ్మెల్యే లలిత కుమారి వివరించారు. ఇప్పుడు వీటికి శాశ్వత భవనాలు కల్పించాలన్న లక్ష్యంతో ఏకంగా రూ.500 కోట్ల సాస్కి నిధుల మంజూరుకు ఆదేశించడం పట్ల నియోజకవర్గ బీసీ బిడ్డల తరపున సీఎం చంద్రబాబు కి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తుతం మన బీసీ గురుకులాల్లో సొంతింటి కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ఇప్పటికే ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. బీసీ బిడ్డలు ఉన్నత చదువులు అభ్యసించడం కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నారని, విద్యార్థులంతా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోళ్ల లలిత కుమారి ఆకాంక్షించారు.

# 73వ వార్డులో డ్రై డే ఫ్రై డే కార్యక్రమం విజయవంతం

**గాజువాక, జులై 10 (మనసులోమాట)**



జీవీఎంసీ 73వ వార్డు,గౌంతినవాని పాలెంలో జోన్6 ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో డ్రైడే,ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు.డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించే లక్ష్యంతో చేపట్టిన అవగాహన ర్యాలీని వార్డు తెదేపా క్లస్టర్ ఇన్చార్జ్ బలగ బాలు నాయుడు ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి, దోమల లార్వాను నిర్మూలించే చర్యలు చేపట్టారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు.బాలు నాయుడు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.ఇళ్లలో, కూలర్లు, డ్రమ్‌లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతోనే దోమల వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుందన్నారు.

# తమ్మినేనిపై ఐ-టీడీపీ ట్రోల్స్‌ను ఖండించిన రెడ్డి శాంతి

- బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు సరికాదు – అవాస్తవ పోస్టులు తొలగించాలని డిమాండ్..



**పాతపట్నం, జులై 10 మనసులో మాట:**

మాజీ స్పీకర్, సీనియర్ రాజకీయ నాయకుడు తమ్మినేని సీతారాంపై ఐటీడీపీ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ట్రోల్స్, అసత్య ప్రచారాలను వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తెలుగుదేశం పార్టీ సంస్కృతిగా మారిందని ఆమె విమర్శించారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో రెడ్డి శాంతి మాట్లాడుతూ, ప్రజా జీవితంలో సుదీర్ఘ అనుభవం, నిష్కళంకమైన రాజకీయ చరిత్ర కలిగిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఐటీడీపీ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు.ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేసిన బీసీ నాయకుడిని లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్షసాధింపుకు దిగడం బాధాకరమని పేర్కొన్నారు. బీసీ నాయకులపై టీడీపీ అనుసరిస్తున్న వైఖరి వారి చిన్నచూపుకు నిదర్శనమని విమర్శించారు. రాజధాని వికేంద్రీకరణ అంశంపై సభాపతిగా తన బాధ్యతల్లో భాగంగా చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో ట్రోల్స్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన టీడీపీ కూటమి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని రెడ్డి శాంతి ఆరోపించారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం, సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తప్ప ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## జేఎన్‌టీయూ–జీవీ క్యాంపస్‌ను అత్యంత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి

- నేడు జెఎన్‌టీయూ - జీవీ ప్రథమ స్నాతకోత్సవం
- వైస్-చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



జెఎన్‌టియు విజయనగరం క్యాంపస్‌ను అత్యంత ఆదర్శవంతంగా, అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు తెలిపారు. స్థానిక జెఎన్టీయు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం - గురజాడ, విజయనగరం (జెఎన్‌టీయూ-జీవీ) ప్రథమ స్నాతకోత్సవాన్ని శనివారం విశాఖపట్నం లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జులై 11న ఉదయం 11 గంటలకు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్, గౌరవ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా, యూనివర్సిటీ విద్యార్థులకు పట్టాల అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సిఈఓ మయూర్ పట్నాల తదితర ప్రముఖులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు. 2023, 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన సుమారు 34,896 మందికి ఈ కాన్వకేషన్‌లో పట్టాలను అందజేయడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వీరిలో 32,177 మందికి డిగ్రీ, 2,708 మందికి పిజి, 11 మందికి పిహెచ్‌డి, 50 మందికి బంగారు పతకాలు, ఇద్దరికి ఎండోమెంట్ పథకాలు, 37 అఫ్లియేటెడ్ కాలేజీలు, ఇద్దరికి కాన్స్టియేంట్ కాలేజీలు, ఒకరికి గౌరవ డాక్టరేట్ అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అత్యంత వెనుకబడిన ప్రజలు నివసించే ఉత్తరాంధ్రలో అత్యున్నత సాంకేతిక విద్యను అందించి, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు జెఎన్‌టియు పరంగా తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు భారం కాకూడదన్న ఉద్దేశంతో రూ.3వేల తత్కాల్ ఫీజును రద్దు చేశామన్నారు. వారి సౌకర్యార్థంగా వివిధ రకాల సేవలను, సర్టిఫికేట్లను ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి కల్పించేలక్ష్యంతో, వారి పేర్లను నమోదు చేసుకొనేందుకు ఒక వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పేజీలో నమోదు చేసుకున్న వారికి రానున్న మూడేళ్లలో 3వేల ఉద్యోగాలను కల్పించాలన్నది తమ లక్ష్యంగా పేర్కొన్నారు. ఇప్పటికే తమ క్యాంపస్ ఎంఎస్ఎంఈ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌గా ఎంపికయ్యిందని, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఐటిఐ ఎలక్ట్రికల్ ట్రేడ్లో ఉత్తీర్ణులైన వారిలో 30 మందిని ఎంపిక చేశామని, వారికి జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి, త్వరలోనే జర్మనీలో ఉద్యోగాలు చేసేందుకు పంపిస్తామని చెప్పారు. ఆరోగ్యవంతమైన క్యాంపస్‌ను రూపొందించే లక్ష్యంతో వారానికోసారి సేవ్ ఎర్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించి డిగ్రీ పట్టాలను రూపొందించామని విసి వివరించారు.

## 28న గురుపౌర్ణమి వేడుకలు

**విజయనగరం టౌన్, జులై 10 (మనసులో మాట) :**



ఈ నెల 28వ తేదీన జ్ఞాన భాస్కరం అనే పేరుతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నామని బాలక్ రామ్ మందిర్ ట్రస్ట్ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో గోడపత్రికలను తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ సనాతన భారతీయ సంప్రదాయంలో గురువుకు ఎంతో ప్రాధన్యత ఉందని, గురువును ప్రతి ఒక్కరూ పూజించాలని కోరారు. గురుపౌర్ణమి వేడుకల సమన్వయకర్త గురుప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రవచన వాచస్పతి స్వామి రామకృష్ణానంద ప్రవచనం ఉంటుందని, ఆ రోజున ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు ఉపద్రష్ట వేంకట వరప్రసాద్, సుపథ రూపకర్త యు వి ఎ ఎన్ రాజు కూడా ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో నంది అవార్డు గ్రహీత ఈపు విజయ్ కుమార్, ఎం సత్యనారాయణమూర్తి, టి. సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి





**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి)**

స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తన కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన మొత్తం 35 అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు విజయనగరం మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు స్వయం ఉపాధి అవకాశం కల్పించే ఉద్దేశంతో ఆధునిక రిటైల్ నమూనాతో పట్టణంలో పేర్లవారి జంక్షన్ (కన్యకా పరమేశ్వరి కోవెల దగ్గర) లో ఏర్పాటు చేసిన "రీచ్ మై స్టోర్" ను శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీచ్ మై స్టోర్ ప్రజా మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర: 25 కొత్త స్వచ్ఛ రథాలను ప్రారంభించిన ఎంపిపి

**కురుపాం జులై 10 (మనసులో మాట)**



పరిసరాల పరిశుభ్రత, పచ్చదనమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 25 స్వచ్ఛ రథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంను మండల అధ్యక్షుడు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంగు సురేష్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొంగు సురేష్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ స్వచ్ఛ రథాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ప్రజలంతా స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసర రామారావు నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జోగి భుజంగరావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ, మండల పరిషత్ సిబ్బంది, ఇతర ఉన్నతాధికారులు మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రజోలలో వైద్య శిబిరం తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఎస్. భాస్కరరావు.

**కురుపాం, జులై 10 (మనసులో మాట):**





మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కురుపాం మండలం మంత్రజోల గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ తీరును ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో స్వయంగా మాట్లాడి వైద్య సేవలపై సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర రావు మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో "లార్వా వేట" , డ్రై డే , సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు అవగాహన పరిచారు. జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామంలో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, మాదలింగి పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ తనూజ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఓటరు జాబితా ధృవీకరణపై సమీక్ష : లాలం భరత్



**రాంబిల్లి జులై 10 మనసులో మాట**

రాంబిల్లి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు లాలం భరత్ సూచించారు. శుక్రవారం రాంబిల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 96, 97, 98, 99 పోలింగ్ బూత్‌లకు చెందిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఓటరు జాబితా ధృవీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమగ్రంగా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబాబు, అజయ్, ఆనంద్, జనసేన నాయకుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రై డే డ్రై డే తో దోమలు లార్వా లు మటుమాయం : సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు

**శృంగవరపుకోట, జులై 10: (మనుసులో మాట )**



కొత్తవలస మండలం వియ్యంపేట పరిధి లో గల గొల్లలపాలెం లో వైద్యాధికారి ఆదేశారు మేరకు ఇంటింటి ఫీవర్ సర్వేలెన్స్, కాలువలు, డ్రెయిన్లు , గోలెలు, కుండీలు లలో లార్వా లను ఎలిమినేట్ చేసి గ్రామస్తులకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా జ్వరాలు, లక్షణాలు,తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించినట్లు హెచ్. ఎస్. ఈశ్వరరావు తెలిపారు. అనంతరం గ్రామం లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్. ఈశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ షేక్ సెహానాజ్,హెల్త్ అసిస్టంట్ డి సత్యారావు,, ఎమ్, ఎల్. హెచ్. పి. ధనలక్ష్మి, ఏ. ఎన్. ఎమ్. సుగుణ, ఆశ వర్కర్ లక్ష్మి లు పాల్గొన్నారు.

## పంటలభీమా ప్రీమియం ఆగస్టు 15లోగా చెల్లించాలి : శ్యాం కుమార్

**గంట్యాడ, జులై 10 (మనసులో మాట):**



గంట్యాడ మండలంలో వరి పంట భీమా కట్టుకునే ప్రతి రైతు ప్రధానమంత్రి ఫస్లీ బీమా యోజన పథకం కింద బీమా ప్రీమియం ను ఆగస్టు 15లోగా చెల్లించాలని, శుక్రవారం గంట్యాడలో మండల వ్యవసాయ అధికారి బి శ్యాం కుమార్ సూచించారు. ఎకరాకు 200 రూపాయలు వంతున ఆగస్టు 15లోగా చెల్లించి పంటల బీమాను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచి రైతులు సెల్ఫ్ డెకరేషన్ ఇస్తే సరిపోతుందన్నారు. డిక్లరేషన్ ఫారం లో భూమి వివరాలు, ఎంత సాగు చేస్తున్నారు, వరి పంట ఎంత వేశారు వంటి వివరాలు ఫారంలో నింపి రైతు ఇవ్వాలని చెప్పారు. ఈ క్రాప్ లో పంట వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకుని ఉండాలని చెప్పారు. రైతులు కనుక బ్యాంకులో రుణం తీసుకుని ఉంటే బ్యాంకు వారే పంటల బీమా ప్రీమియం చెల్లిస్తారని చెప్పారు. ఒకవేళ రైతులు బ్యాంకు రుణం తీసుకోనట్లయితే రైతులే పంటల బీమా ప్రీమియంగా ఎకరాకు 200 రూపాయలు వంతున చెల్లించాలని ఏవో శ్యామ్ కుమార్ సూచించారు

## తల్లిదండ్రులు తప్పనిసరిగా లీప్ యాప్‌ను వినియోగించాలి

- తమ పిల్లల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల పర్యవేక్షణ కీలకం : ఎంఈఓ నరేష్

**నక్కపల్లి, జూలై 10 (మనసులో మాట) :**



తమ పిల్లల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా లీప్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఎంఈఓ కె.నరేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని పెద బోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాస స్థాయి, బోధన విధానంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లీప్ యాప్ ద్వారా విద్యార్థుల రోజువారీ హాజరు, ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు, విద్యా పురోగతి వంటి అంశాలను తల్లిదండ్రులు సులభంగా తెలుసుకోవచ్చన్నారు. పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారు, ఏ స్థాయిలో ఉన్నారు, బోధన ఎలా సాగుతోంది వంటి సమాచారమంతా యాప్‌లో అందుబాటులో ఉంటుందని వివరించారు. తల్లి దండ్రులు లీప్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని తమ పిల్లల చదువుపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, దీంతో విద్యార్థుల విద్యా నాణ్యత మరింత మెరుగు పడుతుందని ఎంఈఓ నరేష్ పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియ మరింత వేగవంతం కావాలి

- కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్
- అధికారులతో ప్రత్యేక సమీక్ష

**పార్వతీపురం జిల్లా ప్రతినిధి , జూలై 10 మనసులో మాట :**



రాష్ట్రంలో విశిష్టమైన గుర్తింపు కలిగిన పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) 2026 ప్రక్రియ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అధికారులంతా కలిసి కట్టుగా పని చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా ఫోటో ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణకు కేవలం నాలుగు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పరిశీలనలో భాగంగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన వారు.. ముందుగా కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్వో కె.హేమలత, పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఆర్.డీ.ఓ కె.మాధురి, జిల్లాలోని అన్ని నియోజక వర్గాల ఈఆర్వోలతో సమీక్షించారు. ముందుగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఇతర అంశాల గురించి వారు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈఎఫ్ (ఎన్యూమరేషన్ ఫారం) పత్రాల పంపిణీ, వాటిని వెనక్కి తీసుకోవటం, డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాల గురించి నియోజకవర్గాల వారీగా ఆరా తీశారు. ఈ క్రమంలో జిల్లాలోని తాజా పరిస్థితిని, ఓటర్ల జాబితా సవరణకు తీసుకుంటున్న చర్యలను జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి కేంద్ర అధికారులకు వివరించారు.

**పారదర్శకతే ముఖ్యం: ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్**

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ మాట్లాడుతూ..ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈఆర్వోలు అత్యంత కీలక పాత్ర పోషించాలని, ఏ నిర్ణయమైనా పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని, జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అర్హత కలిగిన వారి ఒక్క ఓటు కూడా పోవడానికి వీల్లేదని, అదేవిధంగా అనర్హుల పేర్లు జాబితాలో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈఆర్వోలు తప్పకుండా తమ పరిధిలో ఉండే పోలింగ్ స్టేషన్లను సందర్శించాలన్నారు. తక్కువ ఫలితాలు లేదా తక్కువ ఓటర్ల నమోదు నమోదైన చోట క్షేత్రస్థాయి పర్యటన చేసి, దానికి గల కారణాలను విశ్లేషించుకోవాలని సూచించారు. ఆధార్ అనేది ఇతర కార్డుల తో పాటు ఒక గుర్తింపు కార్డు మాత్రమే అని, ఓటు హక్కుకు అది ఒక్కటే ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను సహేతుకంగా నిర్వహించి, నివేదికలను సకాలంలో సమర్పించాలని చెప్పారు.

## కోటబొమ్మాళి ఎం.పీ.డీవో ఫణీంద్ర కుమార్ కు పదోన్నతి

**టెక్కలి, జులై,10 (మనసులో మాట) :**



టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న కుప్పిలి ఫణీంద్ర కుమార్ కు పార్వతీపురం డి. డి. ఓ గా పదోన్నతి పై బదిలీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు కార్యాలయ ఏ.వో కిల్లారి నారాయణరావు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు శుక్రవారం విలేకరులకు వివరాలు అందజేశారు. గత కొన్నేళ్లుగా మండల అభివృద్ధి అధికారిగా పని చేస్తూ ఎవరిని నొప్పించకుండా అన్ని వర్గాలకు ఆయన సమన్యాయం చేస్తూ వచ్చారు., సిబ్బందిని సైతం సోదర భావంతో తనదైన శైలిలో కలుపుకుంటూ అందరితో ఆడుతూ పాడుతూ పని చేయించి అందరి మన్ననలు ఆయన పొందారు. ఆయన సేవలు కొనియాడదగినవి, ఫణీంద్ర కుమార్ పదోన్నతి పై వెళ్లడం ఒక ప్రక్క ఆనందదాయకమైన, అటువంటి అధికారి దూరమవడం మరో ప్రక్క బాధాకరమని తోటి అధికారులు, సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పెండింగ్ పోర్టు పరిహారం ఇప్పించండి...బాధిత రైతు ఆవేదన

**టెక్కలి, జులై 10 (మనసులో మాట) :**



టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణంతో భూములు కోల్పోయినా పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని పెండింగ్ పరిహారం ఇప్పించండి మహాప్రభు అంటూ బాధిత రైతు జీరు ధర్మారావు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో శుక్రవారం వీరు విలేకరుల ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న ఎకరా 73 సెంట్లు భూమి పోర్ట్ నిర్మాణానికి ఇవ్వగా అందులో 80 సెంట్లు మాత్రమే 21లక్ష 50 వేల రూపాయలు పరిహారం ఇచ్చారని అన్నారు. మిగిలిన పరిహారం ఇవ్వకుండా ఏళ్లు తరబడి అధికారుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాహసిల్దార్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోర్టు నిర్మాణానికి నాతో పాటు మరో 31 మంది రైతులు భూములు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోర్టుకు భూములు ఇచ్చామని తెలిపారు. దీంతో ఎకరాకి అదనంగా ఇచ్చిన 12 లక్షల 50 వేల రూపాయలు కూడా నాకు ఇవ్వలేదని అన్నారు.కొబ్బరి ,జీడి చెట్లు పరిహారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పరిహారం కోసం అడిగితే పోలీస్ కేసులంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. మరోపక్క కె లింగుడు గ్రామంలో సర్వేనంబర్ 164/12,139/6లో మూడు ఎకరాల 51 సెంట్లకు పాస్ పుస్తకాలు కూడా రెవెన్యూ అధికారులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# అంగన్వాడీలు ధర్నా... రాస్తారోకో... మానవహారం...





- నలుపుచీరలతో నిరసన
- అంగన్వాడీ సెంటర్లు బంద్

**విజయనగరం, జూలై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి, నలుపు చీరలు కట్టుకుంటూ విజయనగరం కలెక్టరేట్ వద్ద తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో మానవహారం, రాస్తారోకో పెద్ద ఎత్తున నిర్వహించారు. అంగన్వాడీలు ఆందోళన పెరగడంతో ఐసీడీఎస్ పీడీ అక్కడకు చేరుకుని వారి వద్ద నుంచి వినతిపత్రం స్వీకరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు హామీ ఇవ్వడంతో పాటు స్థానిక సమస్యలు పరిష్కరించనున్నట్లు భరోసా కల్పించారు. శుక్రవారం అంగన్వాడీ కోర్కెల దినోత్సవం, ఐసిడిఎస్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు విజయనగరం జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జిల్లాలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు మూకుమ్మడిగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐసిడిఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టులు తీర్పులిచ్చిన అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్లో ఉన్న మినీ సెంటర్లు అన్నిటినీ మెయిన్స్ సెంటర్లుగా మార్చాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్లు ప్రమోషన్ విషయంలో ఐదు సంవత్సరాల సీనియారిటీ సంబంధించిన జీవో నెంబర్ ఐదును రద్దు చేయాలని, అంగన్వాడీలకు పని భారంగా ఉన్న నవ చేతన్ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న టిఏ బిల్లును ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, ముఖ్యంగా 42 రోజుల పాటు అంగన్వాడీల సమ్మె చేసిన సందర్భంగా 2024 జూలైలో జీతం పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ, అధ్యక్షులు కే సురేష్, అంగన్వాడి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, జిల్లా అధ్యక్షులు కే ప్రభావతి, ఉపాధ్యక్షులు పైడ్రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా నానాజీ నియామకం

**మాడుగుల, జూలై 10 (మనసులో మాట)**



అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం, ఎం. కోటపాడు గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు గుమ్మాల సూర్య చంద్ర జోగారావును జాతీయ రైతు పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా లోమాడుగుల మండలానికి అధ్యక్షుడిగా నియమించారు .ఈ మేరకు జాతీయ రైతు పరిరక్షణ సమితి, రాష్ట్ర కమిటీ చైర్మన్ మండలపు శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షులు ఆడారి వరహాల కన్నారావు లు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేసారు . రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు సమితి నాయకులు తెలిపారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మాల సూర్య చంద్ర జోగారావు మాట్లాడుతూ, రైతుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాలు ప్రతి రైతుకు చేరేలా కృషి చేస్తానని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు గ్రామ పెద్దలు, రైతులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# అంగన్వాడీల వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలి: యూనియన్ నేతలు

**విశాఖపట్నం, మనసులోమాట , జూలై 10:**




అంగన్వాడీలు వేతనాలు పెంచి, కనీస వేతనం చట్టం వర్తింపజేసి, సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల కోరికల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు ఎల్. దేవి, ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. కె.ఎస్.వి. కుమార్, కార్యవర్గ సభ్యులు బి. జగన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జగదాంబ జంక్షన్, సిఐటియు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. నిరసనలో అంగన్వాడి కార్యకర్తలు నల్ల వస్త్రాలు ధరించి, జగదాంబ జంక్షన్ వద్ద ప్రభుత్వానికి సాష్టాంగ నమస్కారం చేస్తూ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు మాట్లాడుతూ గతంలో అంగన్వాడీ వేతనాల పెంపు కోసం 42 రోజుల పాటు జరిగిన సమ్మెకు అప్పటి ప్రతిపక్ష నేతలు, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ఆ కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా అంగన్వాడీ వేతనాలు పెంచకపోవడం బాధాకరం అని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. నవచేతన యాప్ రద్దు చేసి, బిఎల్ఓ డ్యూటీల నుండి మినహాయింపు కల్పించాలన్నారు. పెండింగ్లో ఉన్న మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లగా అప్గ్రేడ్ చేయాలన్నారు. క్రొత్త అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి, పెండింగ్ బిల్లులు, ప్రయాణ చార్జీలు, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలతో పాటు అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

# ఆనందపురం సీఐగా బాధ్యతలు తీసుకున్న ఎర్రం నాయుడు

**విశాఖపట్నం, జూలై 10, మనసులోమాట:**



ఆనందపురం సీఐగా వీవీసీఎం ఎర్రం నాయుడు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సిహెచ్ వాసు నాయుడు గాజువాక బదిలీ కాగా, ఎర్రం నాయుడు టూటౌన్ నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఎర్రం నాయుడుకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఐ వాసు నాయుడు నుంచి ఆయన బాధ్యతలు తీసుకొని, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ 1 మణికంఠ చందోలు, నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రం నాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యతను ఇస్తామని, ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని సీఐ ఎర్రం నాయుడు తెలిపారు.

# వెంకటేశ్వరస్వామి ఆలయానికి భూమి విరాళం అందించిన రాంబాబు దంపతులు

**పాయకరావుపేట జూలై 10 మనసులో మాట.**



సొంతూరు మీద ప్రేమతో విలువైన 54 సెంట్ల భూమిని గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి అప్పగించారు ఓ హైకోర్టు న్యాయవాది..పాయకరావుపేట నియోజకవర్గం పాలేర్రు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు 54 సెంట్ల భూమిని తన తల్లిదండ్రులు దేవవరపు లోవరాజు, అప్పలరాజు జ్ఞాపకార్థం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళంగా ఇచ్చారు.. ప్రముఖ అధ్యాపకులు బాబు శ్రీ మాస్టారు చేతులమీదుగా రాంబాబు ,మాధవి దంపతులు ఆలయ కమిటీకి శనివారం భూమి పత్రాలను అప్పగించారు.. రాంబాబు గతంలో గ్రామంలోని రామాలయానికి మరో 60 సెంట్ల భూమిని విరాళంగా ఇవ్వడం విశేషం.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,పెద్దలు, గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.

# కురుపాం కేంద్రం లో బహిరంగ మరుగు దొడ్లు నిర్మించాలి

**కురుపాం జూలై 10 (మనసులో మాట)**



కురుపాం మండల కేంద్రంలో ప్రతిరోజు వందలాది మంది ప్రజలు వేర్వేరు పనులపై వస్తూ ఉన్నా అందుబాటు లో బహిరంగ మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బోటు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కు వినతి పత్రం అందించారు. ప్రతీ రోజు నిత్యవసర సరుకులు కొనుగోలుకు రాకపోకలు సాగిస్తుంటారని,గిరిజనులు పండించే పంటని కురుపాం గ్రామంలో విక్రయించడానికి వారపు సంతకు వస్తుంటారని. విద్యార్థులు, మహిళలు ప్రతిరోజు ప్రయాణిస్తుంటారని. మరుగుదొడ్డు లేక బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాలు ఇబ్బందిగా మారి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తు తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిధులతో త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూడాలన్నారు. ముఖ్యంగా రావాడ రోడ్ జంక్షన్, మరియు వారపు సంత వద్ద మరుగుదొడ్డు నిర్మించాల్సి ఉందని నీటి వసతి కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ మద్ది దొరబాబు, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ గెంబలి ప్రదీప్ కుమార్, నెమలిపురి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆద్వర్యం గురు పూజోత్సవ వేడుకలు

**మునగపాక, జూలై 10, మనసులో మాట**



మునగపాక మండలం గణపర్థి సంఘ్ మండలి నందు శ్రీ ఆధి గురు వ్యాస మహర్షి జయంతి ఉత్సవాలు సందర్భంగా గురు పూజోత్సవ కార్య క్రమంను ఖండ సంపర్క ప్రముఖ్ కర్రి లక్ష్మి నారాయణ అధ్యక్షత న జరిగాయి. ఈ కార్యక్రమానికి వక్త గా ద్వారపు రెడ్డి.వాసు వచ్చి, గురు పూజొత్సవ వేడుకలు కోసం, ఆది గురు వ్యాస మహర్షి గొప్పతనం కోసం కొనియాడారు. సంఘటిత సమాజమే శక్తి వంతమైన దేశానికి పునాది అని, సనాతన ధర్మానికి మనం అందరం కట్టుబడి ఉండాలి అని, హైందవ ధర్మాన్ని కాపాడు కోవలసిన అవసరం మన అందరికీ ఉందని శ్రీ వాసు తెలిపారు.. ఈ కార్యక్రమంలో గిన్నెవీర మహేశ్వర రావు, యల్లపు శ్రీను స్వామి, రామకృష్ణ స్వామి, కర్రి పవన్, మళ్ళ జగదీశ్, లోవ, దుంగ లక్ష్మణ, గంగాధర్, బీమునికన్న మరియు చూచుకొండ గణపర్తి గ్రామస్తులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# అరబుపాలెంలో పారిశుధ్యం పట్ల అధికారులు శ్రద్ధ వహించాలి

- ఎంపీటీసీ సభ్యులు బొడ్డేడ బుజ్జి

**మునగపాక, జూలై 10, మనసులో మాట**



అరబు పాలెం గ్రామంలో సర్పంచుల పదవీకాలం ముగింపు కావడంతో గ్రామంలోని పారిశుధ్యం పట్ల అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని, డ్రైనేజీలో చెత్త పేరుకుపోయిందని ఫలితంగా నీరు కాలువల ద్వారా వెళ్లడం లేదని, అలాగే వీధి దీపాలు చాలా వరకు గ్రామంలో వెలగటం లేదని అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఎంపీటీసీ సభ్యులు బొడ్డేడ బుజ్జి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిర్దేశిత గడువులోగా ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

- మండలంలో 82 శాతం డిజిటలైజేషన్ పూర్తి : తహసిల్దార్ చిన్ని కృష్ణ

**నక్కపల్లి, జూలై 10 ( మనసులో మాట) :**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తహసిల్దార్ బి. చిన్ని కృష్ణ ఆదేశించారు. మండలంలోని చిన దొడ్డిగల్లు గ్రామంలో చురుగ్గా సాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని శుక్రవారం తహసిల్దార్ చిన్ని కృష్ణ, వేంపాడు పీఏసీఎస్ చైర్ పర్సన్ వెలగా శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈసందర్భంగా తహసిల్దార్ చిన్ని కృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ప్రక్రియ 82 శాతం పూర్తయింది అన్నారు. మండలంలో ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ నెల్లిపూడిలో అత్యధికంగాను, చినబోదిగల్లంలో అత్యల్పంగానూ జరిగిందన్నారు. చినదొడ్డిగల్లులో 84 శాతం పూర్తయింది అన్నారు. చైర్ పర్సన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన గడువు సమీపిస్తున్నందున ప్రజలు అప్రమత్తమై నిర్దేశిత గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్వోలకు అందజేయాలని సూచించారు. అలాగే బీఎల్వోలు కూడా ప్రజల నుంచి అందిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామంలోని ఆరు పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎన్యూమరేషన్ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని బీఎల్వోలు తెలిపారు.

# ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- లింగ నిర్ధారిత వీర్యం, పశువుల బీమాపై అవగాహన పెంచాలి
- జమ్ముపేటలో దేశావాళీ పశువుల ఫారాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**





పాడి రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని పశుసంవర్ధక రంగంలో అధిక ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి సూచించారు. గుర్ల మండలంలోని జమ్ముపేట గ్రామానికి చెందిన కురిమినెల్లి శ్రీనివాసరావు నిర్వహిస్తున్న దేశావాళీ పశువుల ఫారాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఫారంలో చెవి ట్యాగ్‌లు కలిగిన పశువులను పరిశీలించి, పశువుల గుర్తింపు, నిర్వహణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా జన్మించిన ఆడ దూడను పరిశీలించారు. ఈ సాంకేతికత ద్వారా ఆడ దూడలు పుట్టే అవకాశాల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. సుమారు 90 శాతం వరకు ఆడ దూడలే జన్మిస్తున్నాయని రైతు వివరించారు. దీనిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆధునిక సాంకేతికతను విజయవంతంగా అమలు చేస్తున్న రైతును అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాల ఉత్పత్తి పెంపు, రైతుల ఆదాయ వృద్ధికి లింగ నిర్ధారిత వీర్యం వినియోగం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. నాణ్యమైన జాతి అభివృద్ధితో పాటు పాల ఉత్పత్తి సామర్థ్యం పెరిగి పాడి పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ సాంకేతికతపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పశువుల బీమా అమలు గురించి ఆరా తీసిన కలెక్టర్, పశువులకు బీమా చేయించుకోవడం ద్వారా రైతులు అనుకోని నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రతి పాడి రైతు పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమలో ఆధునిక సాంకేతికత, పశువుల ఆరోగ్య సంరక్షణ, బీమా వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రైతుల జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి కె. చిట్టిబాబు, ఉద్యానశాఖ అధికారి ఎం. అనూష, వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ, ఉద్యానశాఖ అధికారులు వి.హెచ్.ఏ. రామకృష్ణ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# కె.జె.పురం జంక్షన్‌లో రిక్వెస్ట్ బస్సు స్టాప్‌కు గ్రీన్ సిగ్నల్

- ప్రజల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు

**వి. మాడుగుల, జూలై 10/ (మనసులో మాట )**



మాడుగుల మండలం కస్పా జగన్నాధపురం (కె.జె.పురం) జంక్షన్‌లో రిక్వెస్ట్ బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు రాపేటి రామకొండా రావు అనకాపల్లి ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ వినతిపై స్పందించిన అనకాపల్లి ఆర్టీసీ అధికారులు, అనకాపల్లి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సులతో పాటు ఇతర డిపో బస్సులు కూడా కె.జె.పురం జంక్షన్ వద్ద ఆగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈ ప్రతిపాదనను విశాఖపట్నం డిపో అధికారులకు కూడా పంపిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే గారి కుమారుడు బందారు అప్పలనాయుడు మాట్లాడుతూ, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తో మాట్లాడినట్లు, కె.జె.పురం జంక్షన్‌కు రిక్వెస్ట్ బస్సు స్టాప్ మంజూరు చేయడానికి అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# సస్పెన్స్ నివేదికతో అధికారుల పదోన్నతులు నిలిచిపోయాయి

- జీవీఎంసీలోని అధికారుల తీరుపై అసంతృప్తి..

**విశాఖపట్నం, జూలై 10 , మనసులోమాట:**



జీవీఎంసీలోని కొందరు ఉద్యోగుల సస్పెన్స్ పై నివేదిక అందిన పదోన్నతులు కల్పించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులను ప్రసన్నం చేసుకుంటే వారిని ప్రమోషన్ల లిస్టులో చేర్చుతారని కొందరు జీవీఎంసీ ఉద్యోగులు అంటున్నారు. వేపగుంట జీవీఎంసీ జోన్ లో నలుగురు ఉద్యోగులపై ఇండ్ల పట్టాల పన్నులు అక్రమంగా వేశారని కౌన్సిల్ మీటింగ్లో ఓ కార్పొరేటర్ ప్రస్తావించగా అప్పటి మేయర్, కమిషనర్ ఆ నలుగురు ఉద్యోగులను సుమారు ఐదు సంవత్సరాల క్రితం సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ అధికారిగా వాసు దేవ రెడ్డిని నియమించగా, 2021, అక్టోబర్‌డిసెంబర్ నెల మధ్యలో నివేదికను ఆ అధికారి జీవీఎంసీ కమిషనర్ కి అందించారు. ఆరు నెలల నుండి ఏడాదిలోపు నివేదికను అనుసరించి క్రమశిక్షణ చర్యలను తీసుకోవలసి ఉంది. అయితే ఆ నివేదికను ఐదేళ్లుగా పక్కన పెట్టేసి, నలుగురు ఉద్యోగుల్లో ఒకరైన సూపర్‌ండెంట్ ఎల్ సురేష్ కి మున్సిపల్ కమిషనర్ గా పోస్టింగ్ ఇవ్వడం విశేషం. ఈయనతో పాటు పదోన్నతి కల్పించాల్సిన ముగ్గురు ఉద్యోగులను నివేదిక రాలేదంటూ సాకు చెబుతూ పక్కన పెట్టేశారు. ముగ్గురు ఉద్యోగుల పదోన్నతి పెండింగ్ లో ఉందని అడిషనల్ ఆఫీసర్ పద్మజ, ఎడిసి జన్ సత్యవేణి చెబుతుండడం విశేషం. ఏసీబీ, విజిలెన్స్ కేసుల్లో ఉన్నవారికి సబ్జెక్ట్ టు కండిషన్ పై ప్రమోషన్లు ఇస్తున్నప్పుడు తమకు ఎందుకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. అలా అయితే జ్ఞానాపురం జీవీఎంసీ జోన్ లో సుమారు 1200 ఇండ్ల పట్టాలకు సంబంధించి ఇంటి పన్నులు, పేర్లు బదిలీల ఫోర్జరీ జరిగింది. అప్పట్లో ఆ స్కాం జీవీఎంసీలో సంచలనం సృష్టించింది. ఈ స్కాములో 20 మంది ఉద్యోగులు ఉన్నారని అప్పట్లో పేర్లతో సహా బయటపడిన, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం గాని, విచారణ అధికారిని నియమించడం గాని నేటి వరకు జరగలేదు. అటువంటప్పుడు వేపగుంట జోన్ లో సస్పెన్షన్ కు గురై, పదోన్నతులు రాకుండా ఉన్న ఆ ముగ్గురు ఉద్యోగులు ఏ పాపం చేశారని వారి మీద అధికారులు వివక్షత చూపిస్తున్నారని కొందరు ఉద్యోగులు బాహాటంగానే కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుత జీవీఎంసీ కమిషనర్ దృష్టి సారించి తమకు న్యాయం చేయాల్సిందిగా వారు అభ్యర్థిస్తున్నారు.

# విశాఖ ఉక్కు హోదాపై కాంగ్రెస్ హామీ : మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్



**విశాఖపట్నం , జులై 10 , మనసులోమాట:**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపుతామని మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతామోహన్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం డాబా గార్డెన్స్, ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులు కాంగ్రెస్ పార్టీని వదిలి వెళ్లారని అందుకే వారికి బిజెపి పాలనలో కష్టాలు వచ్చాయని, తాము అధికారంలోకి వస్తే వారికి ఎస్సీ ఎస్టీ హోదా ఇస్తామని హామీ ఇచ్చారు. బిజెపి 12 ఏళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వ పనితీరును పనితీరుపై దుయ్యబట్టారు. 1992, డిసెంబర్ 6న బాబ్రీ మసీదును పడగొట్టి అయోధ్య రామాలయం నిర్మాణాన్ని కట్టి, రాముడు పేరు మీద వేలకోట్ల రూపాయలను బిజెపి అనుబంధ సంస్థల ప్రతినిధులు సేకరించారన్నారు. అయితే వారంతా రామాలయం పేరు మీద కోట్ల రూపాయల అవినీతి చేశారని, ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాన మంత్రి మోడీ రామాలయం విషయంపై సిబిఐ చేత,సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలిస్తేనా గాజాలో 20 వేల మందికీ పైగా చిన్నారులను అమెరికా, ఇజ్రాయిల్ కలిసి దాడులు చేసి చంపేయడం ప్రపంచ చరిత్రలోనే దారుణం అని భారతీయ విదేశాంగ శాఖ, విదేశాంగ మంత్రులు, ప్రధాని మోడీ ఖండించకపోవడం దారుణం అన్నారు. నెహ్రూ, ఇందిరా, మన్మోహన్ సింగ్, పీవీ వంటి ప్రధాన మంత్రులు భారత దేశాన్ని ఉన్నత స్థానానికి తీసుకువెళ్లగా ప్రస్తుత బిజెపి పాలనలో దేశ పరిస్థితిని చూసి అందరూ నవ్వుకుంటున్నారని, చిన్నారులను చంపేస్తే ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారన్నారు . యుద్ధం ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ ఎందుకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యహును కలిశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భారత విదేశాంగ దీనిపై మాట్లాడకపోవడానికి కారణం, ప్రధాని మిత్రుడు ఆదానీ అమెరికాలో కేసులలో ఇరుక్కుపోవడమే అని తెలిపారు. బైడన్ అమెరికా ప్రెసిడెంట్ గా ఉన్నప్పుడు ఆదానీ లంచగొండి వ్యవహారాన్ని ఒప్పుకోలేదని గుర్తు చేశారు. తన మిత్రుడు ఆదానీ కోసం దేశాన్ని అమెరికా ముందు ప్రధాని మోడీ తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది కాంగ్రెస్ తీసుకువచ్చిందే అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తూ ఉంటే చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడకపోవడం అన్యాయం అన్నారు. ప్రస్తుతం ఏపీ ఆర్థిక సంక్షోభంలో ఉందని, ప్రత్యేక హోదా అవసరమని, దానిని సాధించడంలో జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబునాయుడు విఫలమయ్యారని విమర్శించారు. 19 ఏళ్లు పూర్తి చేయనున్న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు అమ్మకాన్ని ఆపలేక పోవడమే కాకుండా, తిరుపతికి చెందిన నాలుగువేల ఎకరాలను ఆదానీ కొట్టేస్తుంటే చంద్రబాబు మౌనంగా ఉన్నాడని మండి పడ్డారు . బిజెపితో పొత్తు పెట్టుకుని ఏమి సాధించారో చంద్రబాబు చెప్పాలన్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడా పెట్టడంతో జయలలితను ఆనాడు అరెస్టు చేశారని, అదే ఆస్తుల కేసులో జగన్ విషయంలో పదహారేళ్లుగా పరిశీలిస్తున్నామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కోర్టులకు, ఇతర శాఖల విషయంలో మోడీ, అమిత్ షాల ఆమోద ముద్ర వేయాల్సిన పరిస్థితి నేడు దాపురించిందన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని నేడు కాంగ్రెస్ పార్టీని ప్రజలు కోరుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. 75 సంవత్సరాల స్వాతంత్ర పాలనలో ఒక్క ఓబీసీ నేత ముఖ్యమంత్రి కాలేదన్నారు. తమ పార్టీ అధికారంలోకొస్తే కాపు నేతను ముఖ్యమంత్రి చేస్తామని స్పష్టం చేశారు. ప్రశ్నించే విమర్శించే వారిపై కేసులు పెట్టడం సరికాదని, ఆనాడు పివి ప్రధానిగా ఉన్నప్పుడు విమర్శలను ఆహ్వానించే వారని, అది నేడు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రశ్న రావణను అరెస్టు చేసి కేసులు పెట్టడం భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు గార సూర్యరావు, గుత్తుల శ్రీనివాసు, కాంగ్రెస్ మైనార్టీ నేత అబీదా, తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వేత్తలుగా విశ్రాంత ఉద్యోగులు

- **డిఐఈపిసి సమావేశంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**



**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలోని నిరుద్యోగ యువతతోపాటు, విశ్రాంత ఉద్యోగులను సైతం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని, వారికి అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందించి పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని, అందువల్ల వారి పెట్టుబడులను పారిశ్రామిక రంగంవైపు మరల్చాలని సూచించారు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఎంబిఏ విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి, వారు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేటట్టుగా చైతన్య పరచాలని కోరారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), ఎస్ఐపిబి (ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్), ఎంఓయుల సమావేశాలు ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం జరిగాయి. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందించి, వీలైనంత వేగంగా పరిశ్రమలను స్థాపించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు వచ్చిన ధరఖాస్తులు, ఎంఓయుల స్థితిగతులపై చర్చించారు. సింగిల్ డెస్క్ విధానం క్రింద నిర్ణీత కాలవ్యవధిలోగా పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలని చెప్పారు. మా మహామాయ, రాధిక వెజిటబుల్ ఆయిల్స్, జెఎస్‌డబ్ల్యూ పార్క్, స్టీల్ ఎక్సేంజ్ ఆఫ్ ఇండియా, బెర్రీ ఎల్లాయిస్, సూపర్ స్మెల్టర్స్ తదితర కంపెనీల స్థాపనకు, విస్తరణకు అవసరమైన భూసేరణ, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కెవిఐసి 2.0పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జిఎం ఎంవి కరుణాకర్, ఏపిఐఐసి జెడ్ఎం కృష్ణప్రసాద్, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఆర్‌డిఓలు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో



**కోటవురట్ల మనసులో మాట జులై10:**

సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం జల్లూరు సచివాలయంలో సర్ కార్యక్రమానికి సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రజలు పూర్తిచేసి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 90 శాతం వరకు సర్ సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. బీఎల్ఓ ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టాలన్నారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమం మొత్తం పారదర్శకంగా జరగాలన్నారు. ఎటువంటి పొరపాట్లు, తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

# తండ్రి, సవతి తల్లిని హత్య చేసిన కేసులో కొడుకుకు జీవిత ఖైదు

- **ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**



**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

విజయనగరం జిల్లా బొండపల్లి పోలీసు స్టేషనులో 2024 సం.లో నమోదైన హత్య కేసులో నిందితుడు బొండపల్లి ఎస్.సి.కాలనీకి చెందిన డోల లక్ష్మణరావు (23)కు జీవిత ఖైదు, రూ. 2000/ జరిమానా విధిస్తూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత తీర్పు వెల్లడించినట్లుగా శుక్రవారం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. బొండపల్లి ఎస్.సి.కాలనీకి చెందిన నిందితుడు డోల లక్ష్మణరావు (23) తల్లి తన చిన్నతనంలోనే చనిపోగా అతని తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడన్నారు. నిందితుడు తన సవతి తల్లి, తండ్రితో కలిసి నివాసం ఉండేవాడన్నారు. ప్రతి రోజూ సవతి తల్లి, తండ్రి నిందితుడిని ఎందుకు పనికిరాడని, ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మని హేళనచేసేవారన్నారు. దీన్ని భరించలేని నిందితుడు డోల లక్ష్మణరావు 23.02.2024న ఉదయం ఇంటివద్దనే కత్తితో తల్లితండ్రులను పొడిచి చంపేసాడన్నారు. ఈ విషయమై బొండపల్లి, విఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి గజపతినగరం ఎస్ఐ కే.లక్ష్మణరావు కేసు నమోదు చేయగా, అప్పటి గజపతినగరం సిఐ ఎన్.వి.ప్రభాకరరావు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, సమర్ధవంతంగా దర్యాప్తు పూర్తి చేసారన్నారు. అనంతరం సిఐ జి.ఎ.వి.రమణ నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. కేసులో ప్రాసిక్యూషను విజయవంతంగా పూర్తి చేసి, న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశ పెట్టడం, నేరం రుజువుకావడంతో నిందితుడు డోల లక్ష్మణరావుకు శిక్ష పడినట్లు ఎస్పీ తెలిపారు.

# ఉద్దండపురం జంక్షన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం...నలుగురికి గాయాలు



**నక్కపల్లి జూలై 10 (మనసులో మాట) :**

మండలంలోని ఉద్దండపురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రమాదానికి సంబంధించి సీఐ జె. మురళి తెలిపిన వివరాల ప్రకారం పలాస నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఐచర్ వ్యాన్ ఉద్దండ పురం జంక్షన్ లో కూరగాయల లోడ్‌తో యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో పాటు అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న కూరందాసు లోవయ్యను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూరందాసు లోవయ్య తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా వారిని తునిలోని మమత ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జె. మురళి చెప్పారు.

# హౌస్ ఓల్డ్ సర్వేలో "స్క్రిప్టింగ్ ఆప్షన్" ఇవ్వాలి



**టెక్కలి, జులై 10 (మనసులో మాట) :**

ఇటీవలే ప్రభుత్వం నిర్వహించిన హౌస్ హోల్డ్ సర్వే అనంతరం ఇవ్వవలసిన "స్క్రిప్టింగ్ ఆప్షన్" ఇంతవరకు ఇవ్వకపోవడంతో అనేకమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా కొత్తగా వివాహాలు చేసుకున్న వారికి రేషన్ కార్డు పొందేందుకు, పాత రేషన్ కార్డ్ నుంచి తొలగేందుకు రిలేషన్ ఆప్షన్ ఇవ్వవలసి ఉంది. అలాగే గత వైసిపి పాలనలో "ఇన్కమ్ టాక్స్" పేరుతో అర్హులైన అనేకమంది ప్రభుత్వ పథకాలు అందకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో వారి పిల్లలు ప్రైవేట్ సెక్టార్లలో పనిచేసినా వారి తల్లిదండ్రులకు ఇక్కడ పథకాలు నిలిపివేశారు. గతంలో వాలంటీర్లు చేసిన అనేక పొరపాట్లు వలన అర్హులైన వారు అప్పటినుంచి ప్రభుత్వ పథకాలను కోల్పోయారు. ప్రభుత్వం మారితే మళ్లీ మా పథకాలు, మా పెన్షన్లు మాకు వస్తాయని ఆశించిన అనేకమంది ఆశలు అడియాసలు అవుతున్నాయి. ప్రభుత్వం మారి రెండేళ్లు గడుస్తున్న ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందాన వ్యవస్థలు ఉండిపోయాయి. అలాగే అనేకమంది ఆధార్ కార్డు నెంబర్లు వేరొకరి ఆధార్ కార్డుకు అనుసంధానం అయిపోవడంతో ఆ ఇరువురిలో ఒకరు పథకాలకు దూరమవుతున్నారు. ఇటువంటి సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే హౌస్ హోల్డ్ స్క్రిప్టింగ్ ఆప్షన్, డిలేషన్ ఆప్షన్ కచ్చితంగా ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు , ప్రజా ప్రతినిధులు స్పందించి అర్హులకు న్యాయం చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

# నాగులపల్లి హైస్కూల్లో అబ్దుల్ కలాం విగ్రహ ఆవిష్కరణ





- **విగ్రహ ఆవిష్కరణ చేసిన సుందరపు వెంకట సతీష్ కుమార్**

**మునగపాక, జులై 10, మనసులో మాట**

ఎలమంచిలి నియోజకవర్గ మునగపాక మండలం నాగులపల్లి గ్రామంలోజిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవరణంలో అనకాపల్లి జిల్లా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మిస్సైల్ మెన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11,వ వర్ధంతి సందర్భంగా ముఖ్యఅతిథి ఉత్తరాంధ్ర జనసేన పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ సుందరపు వెంకట సతీష్ కుమార్ చేతుల మీదగా అబ్దుల్ కలాం విగ్రహ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, పిఏసిఎస్ పర్సన్ఇన్చార్జ్ ఎల్లపు వెంకట భాస్కరరావు,స్కూల్ కమిటీ చైర్మన్ పొలమర శెట్టి మురళి నూకాలయ్య,జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం,సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి ముసలి నాయుడు, అనకాపల్లి ఆవకాలవ చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు, గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జామి చిన్నమ్ములు, మాజీ ఉపసర్పంచ్ గోసాల గోవిందరాజు,కుర్రి సరోజినీ, ఆడారి గణేష్, మొల్లేటి ఆనంద్, కాళ్ళ చంద్రమోహన్, సాలాపు మురళి,మోటూరు శ్రీ వేణి, చుక్క అనురాధ, సుందరపు ధనలక్ష్మి, కొయ్య రమణ,ఆడారి భాస్కరరావు, పల్లా సన్యాసిరావు తదితరి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మా సమస్యల పరిష్కరించండి.. సిఐటియు

**పార్వతీపురం జూలై 10 మనసులో మాట:**



అంగన్వాడీలకోర్కుల దినం సందర్భంగా పార్వతిపురం లో భారీ ర్యాలీ అంగన్వాడీల జీతాలు పెంచాలని సమస్యలు పరిష్కారం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లాలో కథము తొక్కిన అంగన్వాడీ ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేసి అనంతరం మహా ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి నవ చేతన యాప్ రద్దు చేయాలని బి ఎల్ ఓ డ్యూటీలు మినహాయించాలని పెండింగ్ ఉన్న మినీలను మెయిన్ గా మార్చాలని ఇతర సమస్యలు పరిష్కర చెయ్యాలి ఈ సందర్భంగా ధర్నా దగ్గరకు వచ్చిన డిఆర్ఓ కె హేమలత గారికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు అమర వేణి అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు ఎం ఉమామహేశ్వరి,గంట జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లకు హెల్పర్లకు మినీ వర్కర్లకు 2019 నుండి వేతనాలు పెరగలేదు ఈ కాలంలో నిత్యవసర వస్తు ధరలు విపరీతంగా పెరిగాయి అంగనవాడీలకు రకరకాల యాప్లు తెచ్చి పని భారం పెంచారు ఈ కాలంలో వేతనాలు పెంచాలని చేసిన పోరాటాల ఫలితంగా 2024లో వేతనాలు పెంచుతామని మినిట్స్ కాపీ ఇచ్చారు దాని గురించి కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. 2026 మార్చి 2 తేదీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఇతర సమస్యల పరిష్కారం చేయాలని చేసిన ఆందోళన ఫలితంగా మార్చి 10వ తారీఖున ఐసిడిఎస్ మంత్రి ముఖ్యమంత్రి తో మాట్లాడి త్వరలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ హామీ అమలు కాలేదు.మిగిలిన మినీ సెంటర్లోని మెయిన్ సెంట్రల్ గా మార్చాలని అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు

దవాల రమణారావు ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, గౌర్లి వెంకటరమణ బి వెంకటరమణ జి వెంకటరమణ బి సూరిబాబు పాల్గొన్నారు ఈ ధర్నాకి ఐద్వా జిల్లా కార్యదర్శి బి లక్ష్మి మద్దతు తెలియజేశారు , కోరాడ ఈశ్వరరావు, ప్రాజెక్టుల నాయకులు, వి రామలక్ష్మి, సరళ,సరోజ, దాలమ్మ, పార్వతి, పార్వతి దేవి, గౌరమ్మ,దాలమ్మ, గౌరీ మణి, , తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు

# జిల్లా పోలీసుశాఖలో భారీగా బదిలీలు

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ హోదాల్లో పని చేస్తూ, ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళను శుక్రవారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళ ప్రతి ఒక్కరి నుండి అయిదు పోలీస్ స్టేషనులను ఎంచుకొనే అవకాశం కల్పించి ఏర్పడిన ఖాళీలను బట్టి సిబ్బందికి అందులో ఒక పోలీస్ స్టేషనుకు బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బంది వారు కోరుకున్న స్థానానికి పారదర్శకంగా బదిలీలను చేపట్టామని అన్నారు. 19 మంది ఎఎస్ఐలు, 42 హెడ్ కానిస్టేబుళ్ళు, 61 మంది కానిస్టేబుళ్ళకు జిల్లా ఎస్పీ వివిధ పోలీసు స్టేషన్లుకు బదిలీలు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేసారు. ఎటువంటి సిఫార్సులకు తావు లేకుండా క్రింది స్థాయి సిబ్బంది కోరుకున్న స్థానానికి జిల్లాఎస్పీ బదిలీలు చేపట్టడంతో పోలీసు సిబ్బంది తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ బదిలీల ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఓ పి.శ్రీనివాసరావు, ఎస్బీ సిఐ ఎ.వి. లీలారావు, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరి పాల్గొన్నారు.

# కన్వేయర్ బెల్ట్ ద్వారా వ్యాపిస్తున్న లోహ ధూళిని నియంత్రించాలి..

- **ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని అధికారికి వినతిపత్రం**

**విశాఖపట్నం, జులై 10 , మనసులోమాట:**



స్టీల్ ప్లాంట్ నుండి పోర్టు వరకు ఉన్న కన్వేయర్ బెల్ట్, ఖనిజాల నిల్వ యార్డులు, పోర్టు కార్యకలాపాల వల్ల వ్యాపిస్తున్న లోహ ధూళి కాలుష్యాన్ని నియంత్రించి విద్యార్థులు, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని పిడిఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాంతీయ కాలుష్య నియంత్రణా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి పోర్టు వరకు ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా ఇనుము, అల్యూమినియం మొదలగు ఖనిజాల రవాణా జరుగుతోందన్నారు. ఈ కన్వేయర్ బెల్ట్ పనిచేసే సమయంలో సూక్ష్మ లోహ ధూళి పెద్ద మొత్తంలో కిందకు వెలువడుతూ కాలుష్యాన్ని సృష్టిస్తుందన్నారు. పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనం మీదుగా ఈ కన్వేయర్ బెల్ట్ వెళ్లడం వలన ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు ఈ కాలుష్యానికి గురవుతున్నారని చెప్పారు.

అదే విధంగా, విశాఖ పోర్టు ప్రాంతంలో బొగ్గు, ఇనుప ఖనిజం, బాక్సైట్ మరియు ఇతర ఖనిజాల దిగుమతి, ఎగుమతి కార్యకలాపాల సందర్భంగా లారీల ద్వారా రవాణా, కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలింపు, నౌకల నుండి దింపడం, నౌకల్లోకి ఎక్కించడం, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడం వంటి ప్రక్రియలలో తగిన దుమ్ము నియంత్రణ చర్యలు అన్ని వేళలా సమర్థవంతంగా అమలు కాకపోవడం వలన సూక్ష్మ ధూళి కణాలు వ్యాపించి పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఎక్కువగా ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం ఇటువంటి ధూళికి గురికావడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలర్జీలు, ఆస్తమా తీవ్రత పెరగడం, ఇతర శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, వారి భవిష్యత్తు, ప్రజల జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని పై అంశాలపై అత్యవసరంగా చర్యలు తీసుకొని కాలుష్యాన్ని నియంత్రించాలని ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ముకుందరావును కోరగా కాలుష్య నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా సహాయ కార్యదర్శి జానకి, రఘు, లక్ష్మణ్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్ గడువు ముగుస్తోంది.. వెంటనే ఓటు వెరిఫికేషన్ పూర్తి చేసుకోండి

- అడుగులపుట్టు పంచాయతీలో విస్తృత పర్యటన..
- ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు
- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్....







**పెదబయలు జూలై 10 మనసులో మాట :**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై, ప్రస్తుతం కొనసాగుతున్న సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ) ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను వెంటనే వెరిఫికేషన్ చేసుకుని, అవసరమైన మార్పులు చేర్పులు పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అడుగులపుట్టు పంచాయతీలో డీఆర్ డిపో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడి డిపో ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రం భవనం, పాఠశాల భవనం మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు వంటి సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రైతు భరోసా పథకం అందని రైతుల సమస్యలను అక్కడికక్కడే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా 'తల్లికి వందనం' పథకంలో ఇద్దరు పిల్లలకు లబ్ధి అందగా, మొదటి తరగతి చదువుతున్న మూడో చిన్నారికి లబ్ధి అందలేదని గ్రామస్థులు తెలియజేయడంతో, వెంటనే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిశీలించి అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

# సార్ సర్వే పక్రియ వేగవంతం చేయాలి

- మూడుసచివాలయాలకు విస్తృత పర్యటన
- రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు రేగం చాణక్యరావు



**అనంతగిరి,జులై 10 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం జీనపాడు పినకోట పెద్దకోట కవర్ల గ్రామ పంచాయతీలకు శుక్రవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సార్) సర్వే నిర్వహణపై అనంతగిరి మండలంలో పలు సచివాలయాలకు పర్యటించిన రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు రేగం చాణిక్యరావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గిరిజనులకు ఓటరు సర్వేపై గిరిజనుల్లో ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేస్తూ, బి ఎల్ ఓ సచివాలయ సిబ్బందిని సహకరించాలని ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్వేలో తప్పనిసరిగా పాల్గొని అవసరమైన వివరాలను అందించాలని సూచించారు. శాశ్వత మైగ్రేషన్ ఉన్న కుటుంబాలను ఓటారు జాబితా నుండి తొలగించి 18 సంవత్సరాలు వయో పరిమితి కలిగి ఉన్న యువతి యువకులను కొత్తగా ఓటరు జాబితాలో చేర్పించాలని ఆయన తెలిపారు

బూత్ స్థాయి అధికారులు ఇప్పటి వరకు నిర్వహించిన సార్ సర్వేను నిబంధనలకు అనుగుణంగా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వాలసి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సెంబి సన్యాసిరావు అరకు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు మండల బూత్ కమిటీ అధ్యక్షుడు సేమి సుందర్రావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చొంపి రామ్మూర్తి సచివాలయ సిబ్బంది పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.కే.కే కాలేజీలో ఘనంగా ఏబీవీపీ 78వ ఫౌండేషన్ దినోత్సవ వేడుకలు..

**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**



పాతపట్నం నియోజకవర్గం మెలియాపుట్టి మండలం చాపరలోని ఎస్.కే.కే ఇంటర్మీడియట్ కాలేజీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఫౌండేషన్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి శ్రీ రామ డెంటల్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సలాన శరత్ కుమార్, ఆధ్యాత్మికవేత్త అలియానా వినయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. "లేవండి.. మేల్కొనండి.. గమ్యం చేరే వరకు విశ్రమించకండి" అనే స్వామి వివేకానంద సందేశాన్ని విద్యార్థులకు గుర్తు చేస్తూ, విద్యతో పాటు క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికవేత్త అలియానా వినయ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఏబీవీపీ వంటి జాతీయ విద్యార్థి సంస్థలు విశిష్ట పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. దేశాభివృద్ధికి యువత తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

వేడుకల్లో భాగంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశ నిర్మాణంలో చురుకుగా భాగస్వాములమవుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ ను కలిసిన ఎర్రా వెంకట్రావు

**చీడికాడ, జూలై 10, (మనసులో మాట)**



రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివి మాధవ్ ను జిల్లా బిజెపి ఓబిసిసేల్ అధ్యక్షులు ఎర్రా వెంకటరావు శుక్రవారం కలిశారు రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా మాధవ్ పదవి చేపట్టి సంవత్సరం పూర్తయింది సందర్భంగా వెంకట్రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి మాధవ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి పటిష్టమవుతుందన్నారు బిజెపిలో నాయకులు కార్యకర్తలును మాధవ్ కలుపుకొని పోతు మంచిగా గుర్తింపు పొందుతున్నారు అన్నారు ఆయన సారధ్యంలో బిజెపి గ్రామస్థాయిని రాష్ట్ర వరకు మరింత ప్రతిష్టమవుతుందని వెంకట్రావు అన్నారు

# ప్రజలకు మరింత సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.....



- శాసనసభ్యులు గణబాబు వెల్లడి.....

**మల్కాపురం: జూలై 10: (మనసులో మాట)**

రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, గణబాబు పేర్కొన్నారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ బస్సుల" ఛార్జింగ్ స్టేషన్' పనులను పర్యవేక్షిస్తూ, ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకుని పనులను మరింత వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బాలారం గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 'మినరల్ వాటర్ ప్లాంట్కి

- చొరవ చూపిన ఎం.వి.వి. ప్రసాద్

**కొయ్యూరు, జూలై 10 (మనసులో మాట):**



కొయ్యూరు మండలం బాలారం పంచాయతీ పరిధిలోని బాలారం గ్రామంలో పెరుగుతున్న మూత్రపిండాల సంబంధిత వ్యాధులపై స్పందించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్, గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు.గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను, స్వచ్ఛమైన తాగునీటి ఆవశ్యకతను గుర్తించిన ఆయన, రాంకీ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి ఈ విషయమై విన్నవించారు. ప్రజల ఇబ్బందులను సానుభూతితో అర్థం చేసుకున్న శ్రీకాంత్, బాలారంలో తక్షణమే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో కేవలం బాలారం గ్రామమే కాకుండా, పరిసరాల్లోని మొత్తం ఆరు పంచాయతీల ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. దీనివల్ల ప్రజల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో అప్పన ఆనంద్, సూరిశెట్టి రమణ, ఇందన సత్యనారాయణ, మొండెం రాము, మువ్వల గిరి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

• జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

**పార్వతీపురం జిల్లా ప్రతినిధి, జూలై 10 మనసులో మాట :**



జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారం చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిన నేపథ్యంలో, అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాలను విభజన చేస్తూ కొత్త కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలను సిద్ధం చేసిందన్నారు. ఈ తుది ప్రతిపాదనలను త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల వ్యాప్తంగా భవనాల లభ్యత, భౌగోళిక పరిస్థితులను బట్టి నాలుగు ఫార్మాట్ల ఆధారంగా మార్పులు, చేర్పులతో ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో భవనాల లభ్యత, ఇతర కారణాల రీత్యా 2 పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్చడం జరిగిందని, 5 కేంద్రాల పేర్లను సవరించారన్నారు. అలాగే 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నందున అత్యధికంగా 20 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అన్నారు. కురుపాం నియోజకవర్గంలో లొకేషన్ మార్పులు గానీ, పేర్ల సవరణలు గానీ ఏవీ లేవని, కేవలం 3 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు మాత్రమే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గంలో లొకేషన్, పేర్ల మార్పులు ఏవీ లేకుండానే, కేవలం 9 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. సాలూరు నియోజకవర్గంలో భౌగోళిక పరిస్థితులు, హాబిటేషన్ల దూరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ 5 కేంద్రాల లొకేషన్ మార్పు, 3 కేంద్రాల పేర్ల సవరణతో పాటు 13 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు మరియు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను, తాజా సమాచారాన్ని ఈ సమావేశం ద్వారా వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధుల దృష్టికి తీసుకువస్తున్నట్లు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఈ అర్ ఓ





**ఎస్.రాయవరం, జూలై10, (మనసు లోమాట):** ఎస్ రాయవరం మండలంలో కొనసాగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి రమామణి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ఎస్ రాయవరం, సర్వసిద్ధి, పేట సూది పురం, సైతారు పేట గ్రామాల్లోని సర్ కార్యక్రమం పై ఆమె సమీక్ష నిర్వహించారు. నిర్ణీత సమయంలోగా సవరణ కార్యక్రమం పూర్తిచేయాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని బిఎల్ వో ను ఆదేశించారు.ఈ సందర్భంగా బిఎల్ఓ లకు పలు సూచనలు చేశారు. బిఎల్వోలు పారదర్శకంగా వాటర్ జాబితా సవరణను నిర్వహించాలని, మృతి చెందిన ఓటర్లతోపాటు డబల్ ఎంట్రీ, పూర్తిస్థాయిలో వేరొక ప్రాంతంలో స్థిరపడిన వారిని ఓటర్ జాబితాల నుండి తొలగించాలని ఆమె సూచించారు. ఆమె వెంట స్థానిక ఇంచార్జ్ తహసిల్దార్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల సాధన కోసం ధర్నా

**పాలకొండ, జూలై 10,మనసులో మాట :**



ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో మొదటి ఉద్యమ సన్నద్ధం సభ 2026 జూలై 12 (ఆదివారం) ఉదయం 9.00 గంటలకు శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడుతుందని సంఘ నాయకులు తెలిపారు.
ఈ సభలో ఉద్యోగుల ప్రధాన సమస్యలైన పే రివిజన్ కమిషన్ నియామకం, ఐ ఆర్ ప్రకటించడం, డి. ఏ లు, ఎస్. ఏ ల్ బకాయిల చెల్లింపు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగుల హక్కులు, పే స్లిప్‌లో బకాయిల ప్రతిబింబం, పదోన్నతులు, సీనియారిటీ తదితర అంశాలపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించబడుతుంది. అందువల్ల ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరియు అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మొదటి ఉద్యమ సన్నద్ధం సభను విజయవంతం చేయవలసిందిగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీరామూర్తి పాలకొండ రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సావిత్రి సంయుక్తంగా పిలుపునిచ్చారు.

## దీర్ఘ కాలిక వ్యాధులకు ఆయుర్వేదంతో ప్రయోజనం

**నక్కపల్లి, జూలై 10 (మనసులో మాట):**



అనేక దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద వైద్యంతో సునాయాసంగా నయం చేసుకోవచ్చునని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు అన్నారు. మండలంలోని జానకయ్యపేట గ్రామంలో శుక్రవారం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించినా నయం కాని మొండి రోగాలు ఆయుర్వేద వైద్యంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సుమారు 120 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె. రఘు మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆస్పత్రిలో మందులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసు నాగ సత్యవేణి, సీనియర్ ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్ డీవీఎస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కొండపై నుంచి బండ పడి గ్రానైట్ కార్మికుడు మృతి

**టెక్కలి, జూలై 10 (మనసులో మాట)**



టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు కొండ వద్ద జరుగుతున్న గ్రానైట్ పనులలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొండపై నుంచి బండ పడి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన పల్లి ఎర్రయ్య (62) మృతి చెందాడు. కొండపై పనులు జరుగుతుండగా కొండ కింద మరికొంతమంది పనులు నిర్వహిస్తున్నారు. కొండపై నుంచి బండ దొర్లుకుంటూ వచ్చి ఎర్రయ్య పై పడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఎర్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎర్రయ్యకు భార్య పార్వతి, వివాహితులైన కుమార్తెలు కింజరాపు ఉమా, దేశల్ల హేమలత ఉన్నారు. ఉమ భర్తతోపాటు హైదరాబాదులో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. హేమలత గ్రామం లోనే ఉంటుంది. కుటుంబాన్ని పోషించాల్సిన పెద్దదిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనలో మరికొద్ది మంది కార్మికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ మేరకు కోటబొమ్మాళి ఎస్సై వి. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కూటమి హయాంలో మత్స్యకారులకు 500 కోట్ల నిషేధ భృతి

• జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములు

**టెక్కలి, జూలై 10 (మనసులో మాట) :**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో అర్హత ఉన్న మత్స్యకారులకు రూ.500 కోట్లతో వేట నిషేధ భృతి అందించినట్లు జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములు తెలిపారు. సంతబొమ్మాళి మండలం నౌపాడలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి ఎం ఎస్ ఎస్ వై పథకంలో మత్స్యకారులకు 50% సబ్సిడీపై బోట్లు , తెప్పలు ,ఇంజన్, వలలు 300 యూనిట్లు అందించినట్లు వివరించారు. అదేవిధంగా ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు సబ్సిడీ పై అందిసినట్లు వివరించారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన మత్స్యకార గ్రామాలు దేవునాల్తడ, పెద్దగంగానపేట, ఇద్దువానిపాలెంలో రెండు కోట్ల రూపాయలు చొప్పున ప్రత్యేక సిఆర్పిఫ్ నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎచ్చర్ల మండలం బుడగంట్లపాలెం వద్ద రూ. 444 కోట్లతో ఫిషింగ్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు వివరించారు. గత వైకాపా హయంలో జిల్లాలో ప్రమాదవశాత్తు వేటకు వెళ్లి మృతి చెందిన 35 మందికి నష్ట పరిహారం అందజేయలేదని, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో వీరందరికీ రూ 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. విశాఖలో జరిగిన సంఘటనలో మత్స్యకారులకు రూ .10 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వడం అభినందనీయమని , మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం తో సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వాడ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బైపల్లి అప్పన్న, ఏఎంసీ డైరెక్టర్ సూరాడ ధనరాజ్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం
- రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరా కొనసాగుతోంది
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం/అమరావతి, జిల్లా ప్రతినిధి, జూలై 10 , మనసులో మాట:**



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని, ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85 శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు. అలాగే 85,683 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64 శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అనుగుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లాల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని రేగిడి అమదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్ఎస్‌కే పరిధిలో 731 ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80 ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా, ప్రస్తుతం 90 ఎకరాల వరి, 80 ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు.

## ఏటికొప్పాక హస్తకళాకారులకు ఉచిత వైద్య శిబిరం

- ప్రపంచ స్థాయిలో గుర్తింపు చేస్తున్న ఏటికొప్పాక హస్త కళలు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**యలమంచిలి టౌన్, జూలై 10, మనసులో మాట,**



మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో లక్క బొమ్మలు తయారు చేసే హస్తకళాకారుల నైపుణ్యం ప్రపంచ స్థాయికి ఎదుగుతుంది అని శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం నాడు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల విజయవాడలోని లేపాక్షి ఆడిటోరియంలో హస్తకళాకారుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అక్కడ ప్రదర్శించిన ఏటికొప్పాక హస్త కళా ఖండాలను డిప్యూటీ సీఎం పవన కళ్యాణ్ వీక్షించి కళాకారులను అభినందించారు.అదే స్ఫూర్తితో ఇప్పుడు ఏటికొప్పాకలో కూడా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, హస్తకళాకారులు ఎక్కడ ఉన్నా వారందరికీ ఉచిత వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక లక్క బొమ్మల తయారీకి అవసరమైన అంకుడు చెక్క, లక్క వంటి ముడి పదార్థాల కొరత లేకుండా చూసేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ, కళాకారులకు అవసరమైన ముడి పదార్థాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి. రాజాన సూర్య చంద్ర శేషగిరి (శేషు) కూటమి నాయకులు కాండ్రకోట చిరంజీవి ,అన్నం బాబ్జి,శానా నాని,వైద్య సిబ్బంది, హస్తకళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం...

**అనకాపల్లి టౌన్ జూలై 10 మనసులో మాట**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విశేషసహాయం అందుతోంది. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గానికి చెందిన అత్యవసర చికిత్స పొందిన 7 గురు లబ్ధిదారులుగాను రూ.3,01,443 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జ్ భీమరశెట్టి రామ్కి జనసేన పార్టీ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా రామ్కి మాట్లాడుతూ, ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు నోచుకోలేని కుటుంబాలకు ఈ పథకం గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. గత 24 నెలల కాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సహాయం అందేలా కృషి కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ , అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే చెక్కును అందజేసిన రామ్కి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమరశెట్టి రామ్ చేతులమీదుగా రథయాత్ర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**అనకాపల్లి టౌన్ జూలై 10 మనసులో మాట**

గవరపాలెం అగ్నిమర్రిచెట్టు వద్ద వేంచేసి ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో, దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల జూలై 16 నుంచి 25, 2026 వరకు మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్య ప్రోత్సాహంతో నిర్వహించనున్న రథయాత్ర మహోత్సవం ఆహ్వాన పత్రికను అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి , దేవస్థాన ధర్మకర్తలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీరుపాలెంలో అద్భుతంగా క్రీస్తు విజ్ఞాన మహా సభ





**ఎచ్చర్ల, జూన్ 10, మనసులో మాట:**

శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం జీరుపాలెం గ్రామంలో ఈ రోజు జరిగిన క్రీస్తు సంపూర్ణతపై నీ విశ్వాసం ఏమిటి? అనే అంశం పై క్రీస్తు విజ్ఞాన మహా సభ అత్యంత ఆసక్తికరంగా, ఘనంగా జరిగింది. ఈ మహా సభకు రణస్థలం మండలం మరియు పరిసర మండలాలనుండి అనేక మంది క్రైస్తవ భక్తులు వందలాది మంది తరలి వచ్చారు. స్థానిక జీరుపాలెం, కోటపాలెం, మింది పేట, సీతారామ పురంలలో క్రీస్తు పరిచర్య చేస్తున్న పాస్టర్ రెవరెండ్ సి. హెచ్. రూబెన్ ఆధ్వర్యంలో జరిగింది. లావేరు, రణస్థలం మరియు ఎచ్చెర్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్ సహకారంతో బైబిల్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ హైదరాబాద్ నుండి బిషప్,డా.ఆర్.ఐ.వంశీదర్ వాక్యోపదేశం చేసారు. ఆయన చేసిన త్రిఏక దేవుని గురించిన వివరణ,క్రీస్తు యేసుని యొక్క రక్షణ గురించిన సందేశం ఆద్యంతం అత్యంత ఆసక్తిగా జరిగినది. ఈ మహాసభలో స్థానిక గ్రామ పెద్దలు మరియు అనేక మంది ప్రజలు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ సర్వే గురించి అడిగి చేసుకున్న కిముడు పల్లి ఎంపీటీసీ....

**పెదబయలు జూలై 10 మనసులో మాట :**



అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయితీ సచివాలయం బి ఎల్ ఓ ల తో 23 గ్రామాల ఓటర్ సర్వే ప్రక్రియ గురించి పెదబయలు మండల ఎమ్మార్వో అలాగే ఆర్ఐ ల తొ మాట్లాడిఅడిగి తెలుసుకోవడం జరిగింది అలాగే కిముడుపల్లి 23 గ్రామస్తులందరూ కూడా ఇంకా మిగిలి ఉన్నది నాలుగు రోజులు మాత్రమే ఎవరైతే ఓటర్ సర్వే చేయించుకోలేదో వాళ్లందరూ కూడా బి ఎల్ ఓ స్ ఇవ్వగలరు అలాగే ప్రతి ఒక్క అంగన్వాడీస్ కూడా మీ అప్లికేషన్ ని ఇవ్వవచ్చు కాబట్టి ఎవ్వరు కూడా మిస్ అవ్వద్దు ఒకసారి మిస్ అవుతే ఎమ్మార్వో చుట్టూ ఎంపీడీవో చుట్టూ తిరగాల్సి వస్తుంది ఇంకా పెండింగ్ ఉంది అని చెప్పున్నారు బిఎల్ఓస్ ప్రతి ఒక్క గ్రామస్తులు ప్రతి ఒక్క యువత కూడా తప్పకుండా వినియోగించుకుంటారని కోరుతున్నానని యువ నాయకుడు పాంగి రామారావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలిపారు

# అనకాపల్లి జనసేన కార్యాలయంలో ప్రజా సమస్యల వినతులు...

**అనకాపల్లి టౌన్ జూలై 10**
**మనసులో మాట**



జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక అనకాపల్లి నియోజకవర్గ ప్రజల, కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను విన్న అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

# కంపోస్టు కాలనీ సచివాలయాన్ని సందర్శించిన భారత ఎన్నికల సంఘం అధికారులు

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై,10,**
**మనసులో మాట,:**



భారత ఎన్నికల సంఘం అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం కంపోస్టు కాలనీ సచివాలయాన్ని సందర్శించారు. కలెక్టరేట్ లో ఈఆర్ఓలతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (సర్) సమీక్ష అనంతరం సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు ఏ విధంగా చేస్తున్నదీ బివిఎల్ఓ వేణుగోపాల్ రెడ్డిని భారత ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఫారాలు ఎన్ని వచ్చాయి, ఎంత శాతం వచ్చాయనే వివరాలను అడిగారు. ఆన్ లైన్ ప్రోసెస్ ఏ విధంగా జరుగుతోందని, ఓటర్ల నమోదు గూర్చి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు.

# అనకాపల్లి లో 'లెనిన్' విజయంతో మిన్నంటిన సంబరాలు

- **అక్కినేని అభిమానుల కోలాహలం**

**అనకాపల్లి ప్రతినిధి, జూలై 10**
**(మనసు లో మాట ):**



అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన "లెనిన్" చిత్రం విడుదలై ఘన విజయం సాధించడం తో అక్కినేని అభిమానులలో సందడి నెలకొంది. అనకాపల్లి లో అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో వేడుకలు శుక్రవారం అంబరాన్నంటాయి. అనకాపల్లి శ్రీ వెంకటేశ్వర థియేటర్ ప్రాంగణంలో అభిమానులు అత్యంత వైభవంగా ఈ విజయోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర హాజరయ్యారు. థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, ప్రత్యేక అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. తీన్మార్ డప్పుల మోతలు, బాణసంచా పేలుళ్ల మధ్య అభిమానుల కోలాహలంతో థియేటర్ పరిసరాలు పండగ వాతావరణాన్ని తలపించాయి. ముందుగా మళ్ళ సురేంద్ర అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి, 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లోనే మైల్ రాయిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అనకాపల్లి పట్టణ కింగ్ నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షులు సిహెచ్ అవతారం (అవ్వ), పట్టణ నాగచైతన్య అండ్ అఖిల్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఎస్. భానుచందర్ (అఖి), 82, 83 డివిజన్ల టిడిపి ఇంచార్జ్ పోలరపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, శ్రీ వెంకటేశ్వర థియేటర్ యాజమాన్యం మళ్ళ వెంకట్రావు తో పాటు అనకాపల్లి అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ దుర్గ నాయుడు, కృష్ణ, మల్లేష్, రియాజ్, నాని, సత్యనారాయణ, వంటి, మురళి, అఖిల్, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో శ్రీకాకుళం ఆదర్శంగా నిలవాలి

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై 10 ,**
**మనసులో మాట:**





ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన వారిది ఒక్క ఓటు కూడా పోవడానికి వీల్లేదని, అనర్హుల పేర్లు జాబితాలో ఉండటానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పరిశీలనలో భాగంగా అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్‌తో కలిసి శుక్రవారం శ్రీకాకుళం విచ్చేసిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో విశ్వేశ్వర రావు, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అవినాశ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో ఈఆర్వోలు కీలక పాత్ర పోషించాలని, ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు పారదర్శకంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈఆర్వోలు తప్పకుండా తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించాలని, తక్కువ ఫలితాలు నమోదైన చోట క్షేత్రస్థాయి పర్యటనలు చేసి లోపాలను విశ్లేషించుకోవాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను సహేతుకంగా నిర్వహించి ప్రతిపాదనలు నివేదించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడిన పోలింగ్ స్టేషన్ల వివరాలను అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ వివరిస్తూ.. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియకు మూడు రోజులే సమయం ఉన్నందున తక్షణమే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఓటర్లకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనేది పూర్తిగా భారత రాజ్యాంగానికి, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా జరుగుతుందని, అర్హత గల ఏ ఒక్క ఓటరు మిస్ కాకూడదని, అదే సమయంలో షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ ఓటర్లను తొలగించడం కూడా అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, పూర్తి పారదర్శకంగా దీనిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్, ఈఆర్వోలు పద్మావతి, సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి నాయుడు, జయదేవి, వినాయకం రెడ్డి, అప్పలరాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతి స్కూల్ లో సామూహిక అక్షరాభ్యాసం

**పాలకొండ, జూలై 10,మనసులో మాట:**



స్థానిక హాస్పిటల్ రోడ్డులోని రవీంద్ర భారతి పాఠశాల ఆవరణలో నూతన విద్యార్థుల కొరకు "సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం" అత్యంత వైభవంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది. విద్యా దేవత అయిన శ్రీ సరస్వతీ దేవి ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ వేడుకలో పాఠశాల చైర్మన్ ఎమ్. సుబ్రహ్మణ్యం (మణి) ముఖ్య అతిథిగా వర్చువల్ గా, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎమ్. సుబ్రహ్మణ్యం (మణి) మాట్లాడుతూ ప్రతి బిడ్డ జీవితంలో అక్షరాభ్యాసం అనేది ఒక పవిత్రమైన ఘట్టమని, చిన్నారుల విద్యా ప్రయాణానికి తమ పాఠశాల ద్వారా ఒక శుభారంభం పలకడం సంతోషంగా ఉందన్నారు. రవీంద్ర భారతి విద్యా సంస్థలు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను, నైతిక విలువలను చిన్నారులకు అందిస్తాయని ఆయన హామీ ఇచ్చారు. నూతన విద్యా సంవత్సరంలో చేరిన నర్సరీ, ప్రిస్కూల్ చిన్నారుల చేత పాఠశాల ప్రిన్సిపల్ ఎం. టినేష్ స్వయంగా పలకలపై అక్షరాలు దిద్దించి విద్యాబుద్ధులను ప్రారంభించారు.సరస్వతీ దేవి చిత్రపటానికి వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులకు అక్షరదీక్షచేయించారు.సరికొత్తగా పాఠశాలవాతావరణంలోకి అడుగుపెట్టిన చిన్నారులకు తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతూ క్లాస్ రూమ్‌లను, స్కూల్ ఆవరణను రంగురంగుల బెలూన్లు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.ఈ విద్యా ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న తల్లిదండ్రులు.. పాఠశాల యాజమాన్యం కల్పించిన ఏర్పాట్లు సాంప్రదాయ వాతావరణం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన ప్రాణాధారం

- **చల్లవానిపేట గ్రామంలో పార్టీ క్యాడర్ సమావేశం**

**శ్రీకాకుళం/నరసన్నపేట, జూలై 10,**
**మనసులో మాట..**



జలుమూరు మండలం, చల్లవానిపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్, ఇన్చార్జ్‌లు ముఖ్య నాయకులతో కలిసి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సమక్షంలో ఒక పార్టీ క్యాడర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు. తెలుగుదేశం పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని, ప్రతి క్లస్టర్ ఇన్చార్జ్ తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. క్లస్టర్ ఇన్చార్జ్‌లు, గ్రామీణ స్థాయి ముఖ్య నాయకులు సమన్వయంతో పనిచేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాలని సూచించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం పార్టీలో లభిస్తుందని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ విజయం క్షేత్రస్థాయి కార్యకర్తల క్రమశిక్షణ, నిరంతర శ్రమపైనే ఆధారపడి ఉంది. నాయకులు, ఇన్చార్జ్‌లు విభేదాలకు తావివ్వకుండా, ఒకే తాటిపై నడుస్తూ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

మనసులో మాట
KANCHARLA
అమరావతి
| ఎన్టీఆర్ | పల్నాడు | కృష్ణ |
| --- | --- | --- |
| గుంటూరు | బాపట్ల | ప్రకాశం |

శనివారం 11 జూలై 2026 పేజీలు 16

# మంత్రులపై సిఎం చంద్రబాబు అసంతృప్తి..?!



- పవన్‌కళ్యాన్‌పై విమర్శలకు కౌంటర్‌ఎందుకు ఇవ్వలేదని ప్రశ్న
- మంత్రి, జనసేన అగ్రనాయకుడు నాదెండ్లతో గంట సేపు బేటి
- అనంతరం పోలీస్ అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి
- కూటమికి డ్యామేజ్ కంట్రోల్ కు నివారణ చర్యలు

2



రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం సమాచార యుద్ధం కూడా ప్రధాన పాత్ర పోషిస్తోంది. వివాదాల సమయంలో ఎవరు వేగంగా, సమర్థంగా తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తారన్నదే రాజకీయంగా ప్రభావం చూపే అంశంగా మారుతోంది. అందువల్ల అధికార కూటమి, ప్రతిపక్షం రెండూ తమ కమ్యూనికేషన్ వ్యూహాలను మరింత పదును పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రశ్న రావణ్ విషయంలోజనసేన ఒక్కటే రియాక్టు అవుతోన్న తరుణంలో టిడిపి నేతలు, మంత్రులు మౌనంగా ఉండటం జనసైనికులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈవిషయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పై జరుగతోన్న ప్రచారానిన టిడిపి ఖండంచడం లేదన్న భావన వ్యక్తమయింది. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని భావిస్తున్నారు. అదే విధంగా ముఖ్యమంరతి చంద్రబాబు ఈ విషయమై రియాకుట అయ్యారు. డిప్యూటి సిఎంపై వివిధ రకాలుగా ప్రచారం జరుగతుంటే మీరేమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పారీట జరిగిన నష్టానికి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రతిపక్ష వైసిపి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడంలో సక్సెస్ అయినట్లుగా భావిస్తున్నారు.



## పల్నాడు పారిశ్రామిక ప్రగతిలో నూతన అధ్యాయం

- నరసరావుపేట గడ్డపై కేంద్ర ఆర్థిక మంత్రి వర్యుల పర్యటనకు అపూర్వ ఏర్పాట్లు!
- రూ.1,500 కోట్ల భారీ నిధుల హేమంతంతో వెనుకబడిన పల్నాడు సీమకు నూతనోత్తేజం
- ప్రజాపక్షపాతి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, క్రియాశీలక నేత ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబుల ఆధ్వర్యంలో సమరస్ఫూర్తితో ముందస్తు సమీక్ష



4



5

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

## చర్చి స్థలం.... కబ్జాకు ప్రయత్నం..

- అడ్డుకోవాలని అధికారులకు ఫిర్యాదుఫిర్యాదు

6





## మనసులో మాట వార్తకు స్పందించిన కారంపూడి ప్రత్యేక అధికారి ఘంటా శ్రీనివాసరెడ్డి

9

# మంత్రులపై సీఎం చంద్రబాబు అసంతృప్తి..?!

**అమరావతి బ్యూరో, మనసులో మాట**

రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం సమాచార యుద్ధం కూడా ప్రధాన పాత్ర పోషిస్తోంది. వివాదాల సమయంలో ఎవరు వేగంగా, సమర్థంగా తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తారన్నదే రాజకీయంగా ప్రభావం చూపే అంశంగా మారుతోంది. అందువల్ల అధికార కూటమి, ప్రతిపక్షం రెండూ తమ కమ్యూనికేషన్ వ్యూహాలను మరింత పదును పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రశ్న రావణ్ విషయంలో ప్రభుత్వం ఇరుకున పడింది చెప్పవచ్చు. ఈ అంశానిన ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్ళి ప్రభుత్వాన్ని కార్నర్ చేయడంతో వైసిపి సక్సెస్‌గా భావిస్తున్నారు. దీనికి తోడు ప్రశ్న రావన్ విషయంతలో జనసేన ఒక్కటే రియాక్టు అవుతోన్న తరుణంలో టిడిపి నేతలు, మంత్రులు మౌనంగా ఉండటం జనసైనికులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ విషయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పై జరుగతోన్న ప్రచారానిన టిడిపి ఖండించడం లేదన్న భావన వ్యక్తమయింది. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని భావిస్తున్నారు. అదే విధంగా ముఖ్యమంరతి చంద్రబాబు ఈ విషయమై రియాకుట అయ్యారు. డిప్యూటి సిఎంపై వివిధ రకాలుగా ప్రచారం జరుగతుంటే మీరేమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పారీట జరిగిన నష్టానికి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రతిపక్ష వైసిపి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడంలో సక్సెస్ అయినట్లుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వరుస వివాదాలు అధికార కూటమి,ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఒక ఘటన ముగియకముందే మరో అంశం తెరపైకి రావడంతో రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రశ్న రావణ వ్యవహారం, సాయి కృష్ణ కేసు వంటి అంశాలపై అధికార కూటమి, వైసీపీ



తమ తమ రాజకీయ వ్యూహాలను పదును పెడుతున్నట్లు కనిపిస్తోంది.

**ప్రతిపక్ష వైసిపి ఆరోపణలకు సమాధానం ఎక్కడా..:**

రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం, ప్రశ్న రావణ అంశంపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలకు అధికార పక్షం నుంచి తగిన స్థాయిలో సమాధానాలు రాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారనే ప్రచారం సాగుతోంది. దీనిపై అధికారిక ధృవీకరణ లేక పోయినా, కూటమి ప్రభుత్వానికి ప్రతికూల ప్రచారం పెరగకుండా సమన్వయంతో స్పందించాల్సిన అవసరాన్ని అధికార వర్గాలు చర్చిస్తున్నట్లు సమాచారం.ఇదే సమయంలో, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల అంశంపై కూడా ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై సమన్వయంతో స్పందించాల్సిన అవసరాన్ని కూటమి నాయకత్వం గుర్తుచేసినట్లు తెలుస్తోంది. మరోవైపు, వైసీపీ మాత్రం ఈ పరిణామాలను రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రజా వ్యతిరేక విధానాలు, వివాదాస్పద సంఘటనలు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో చర్చ పెంచే లక్ష్యంతో పార్టీ శ్రేణులను రంగంలోకి దింపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. స్థానిక స్థాయి నుంచి సోషల్ మీడియా వరకు ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత ఉధృతం చేయాలనే వ్యూహం అవలంబిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, అధికారంలో ఉన్న ప్రభుత్వానికి వివాదాల సమయంలో వేగవంతమైన స్పందన, సమన్వయంతో కూడిన కమ్యూనికేషన్ అత్యంత కీలకం. అదే సమయంలో ప్రతిపక్షాలు అలాంటి సందర్భాలను ప్రజల్లో చర్చకు తీసుకెళ్లే ప్రయత్నం చేయడం సహజ రాజకీయ వ్యూహంగా రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

**సాయికృష్ణ, ప్రశ్న రావన్ విషయంలోప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్న వైసిపి:**

సాయి కృష్ణ వ్యవహారం, ప్రశ్న రావణ అంశం వంటి పరిణామాల విషయంలో ప్రభుత్వాన్ని వైసిపి కార్నర్ చేసి విమర్శలు సందిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చలుగా మారిన నేపథ్యంలో, ప్రజల దృష్టిని ఆకర్షించే అంశాలపై అధికార పక్షం,ప్రతిపక్షం రెండూ తమ రాజకీయ ఎజెండాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఈ పరిణామాలు రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

**అధికార కూటమి ముందున్న సవాళ్లు:**

వివాదాలపై వేగవంతమైన అధికారిక స్పందన ఉండాల్సిన అవసరం ఉంది. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం,సోషల్ మీడియాలో ప్రచార యుద్ధానికి సమర్థ వ్యూహం, ప్రజల్లో ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా వివరించడం, ప్రతిపక్ష విమర్శలకు వాస్తవాధారిత సమాధానాలు ఇవ్వడం లాంటి అంశాలలో కీలక భూమిక పోషించాల్సిన అవరం ఉంది.

### సమావేశంలో ముఖ్యమంత్రి ఘాటు వ్యాఖ్యలు:

సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలకు టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అవసరమైతే కొత్తగా పీపీలను నియమించుకోవాలన్నారు. మంత్రివర్గ అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత హననంపై సుదీర్ఘంగా చర్చించారు. డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలు, అసలు విషయాలు వక్రీకరిస్తే మాత్రం ఉపేక్షించవద్దని మంత్రులు గట్టిగా కోరారు.

### వైసీపీ వ్యూహం ఏంటి?

ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో చర్చ పెంచడం, వివాదాస్పద అంశాలను రాజకీయంగా వినియోగించడం, సోషల్ మీడియా, క్షేత్రస్థాయిలో ప్రచారం విస్తరించడం, స్థానిక ఎన్నికల దృష్ట్యా క్యాడర్‌ను చురుకుగా మార్చడం, ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా నిలబెట్టే ప్రయత్నం చేయాలని వైసిపి నిర్ణయం తీసకున్నటుల సమాచారం అదుతోంది.అయితే వైసిపి వ్యూహాలను కూటమి నేతలు ఏ విధంగా ప్రతిస్పందిరో చూడాలి.



## గంజాయి కేసులో 6గురిని అరెస్టు చేసిన తాడేపల్లి పోలీసులు

**తాడేపల్లి జులై 10 (మనసులో మాట )::**

గంజాయి ఇతరులకు అందించే క్రమంలో పోలీసులకు రాబడిన సమాచారంతో రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 70 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపిన సిఐ వీరేంద్ర గతంలో ఇదే కేసులోని ఇద్దరు నిందితులపై కేసులు నమోదు అయ్యాయని, వారిపై ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. గంజాయి రవాణా, సేవించటంపై ఉక్కుపాదం నేపథ్యంలో విస్తృత తనిఖీలను నిర్వహిస్తున్నామని, ఇలాంటి సంఘవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వారి సమాచారం తెలిపితే వారిపై నిఘా పెడతామన్నారు.



## విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు.. రూ. 4.60 లక్షల అపరాధ రుసుం విధింపు

**దాచేపల్లి : జూలై 10 (మనసులో మాట )**

విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం పల్నాడు జిల్లా సూపరెంటెంట్ డాక్టర్. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మాచర్ల డివిజన్ పరిధి దాచేపల్లి రూరల్ సెక్షన్ పరిధిలో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్లు ఈ ఈ సుందర బాబు, ఆపరేషన్ ఈఈ ఎస్. సింగరయ్య తెలిపారు. ఈ తనిఖీలో 50 మంది అధికారులు, 150 మంది సిబ్బంది 50 బృందాలుగా ఏర్పడి 3600 సర్వీసులు తనిఖీ జరిగింది. దాచేపల్లి మండలం పరిధి గ్రామాలలో వివిధ రకాలుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 144 మందిని గుర్తించి రూ. 3.50 లక్షల అపరాధ రుసుం విధించడం జరిగిందన్నారు. విద్యుత్ చౌర్యం నేరం, ఫిర్యాదులను అందించడం లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చు అన్నారు.

## 39 మంది లబ్ధిదారులకు 49 లక్షల 17వేల సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ



**ఒంగోలు జులై 10, (మనసులో మాట)**

శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం నందు 39 మంది లబ్ధిదారులకు 49 లక్షల 17 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.

మనసులో మాట

# తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి: ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**కనిగిరి జులై10, (మనసులో మాట)**

కనిగిరి పట్టణంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కనిగిరి మున్సిపల్ కార్యాలయంలో పట్టణ తాగునీటి సమస్యలు, మున్సిపల్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరాలో నెలకొన్న సమస్యలు, పైప్‌లైన్ నిర్వహణ, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నిరంతర తాగునీటి సరఫరా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ సర్కిల్ నెల్లూరు సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ. మహేష్, పబ్లిక్ హెల్త్ డివిజన్ ఒంగోలు ఇంజనీర్ టి. శ్రీనివాస సంజయ్, పబ్లిక్ హెల్త్ సబ్ డివిజన్ కనిగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయలక్ష్మి, కనిగిరి పురపాలక సంఘం కమిషనర్ పి. శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





## రేషన్ షాపులలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

**వేమూరు, జూలై 10 (మనసులో మాట):**

రేషన్ షాపులను సి ఎస్ డి టి ఫణి కుమార్ తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. వేమూరులోని పులివర్తి మేరీ ఏసుబాబు రేషన్ షాప్ 0731002 ను ఫణి కుమార్ తనిఖీ చేశారన్నారు. సి ఎస్ డి టి మాట్లాడుతూ రేషన్ షాపులో ఉండవలసిన నిత్యవసర సరుకుల నిల్వలో 772 కేజీల బియ్యం, 20 ప్యాకెట్లు పంచదార తక్కువగా ఉన్నాయన్నారు. డీలర్ పై జాయింట్ కలెక్టర్ కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వేమూరు గ్రామ రెవెన్యూ అధికారి గాజుల జితేంద్ర ఉన్నారు.

# పి జి ఆర్ ఎస్ లో 18 అర్జీలు

**కొల్లూరు, జూలై 10 (మనసులో మాట):**

కొల్లూరులో పీజిఆర్ఎస్ కార్యక్రమాన్ని కొల్లూరు MPDO కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పిజిఆర్ఎస్ లో ఇచ్చే అర్జీలను ఆన్లైన్లో నమోదు చేసి అట్టి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అధికారులకు కూడా అర్జీల పరిష్కారం శ్రద్ధ చూపించాలని అన్నారు. పి జి ఆర్ ఎస్ లో మొత్తం 18 అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖ పదకొండు అర్జీలు, పంచాయతీ శాఖ ఆర్యులు, హౌసింగ్ శాఖ ఒక అర్జీ వచ్చిందని తెలిపారు. వీటిని ఆయా శాఖ అధికారులకు పంపించి వెంటనే పరిష్కరించి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. పీజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల అధికారులు సరిగా హాజరు కాకపోవటం గమనార్హం. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఇన్చార్జ్ ఎంపీడీవో నిరంజన్ రావు పాల్గొన్నారు.






## పల్లెటూరి ప్రజలకు గుడ్ న్యూస్.. పాముకాటుకు ఇకపై108లోనూ మందు!

**చిలకలూరిపేట రూరల్ జులై 10 మనసులో మాట**

పల్లెటూర్లో ప్రజలు ముఖ్యంగా రైతులకు ఎదురయ్యే ప్రమాదాల్లో ప్రముఖమైనది పాముకాటు. మన ప్రాంతాల్లో ఉండే అత్యంత విషసర్పాల్లో రెండు, మూడు రకాలే ఎక్కువగా మనకు ఎదురవుతుంటాయి. నాగుపాము, రక్త పింజరి, కట్లపాము ఈ మూడు పాముకాట్లే మనిషి ప్రాణాలను తీస్తుంటాయి. పాము కాటు వేసిన గంటలోపే ఆస్పత్రులకు వెళ్తే ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో మారుమూల గ్రామాల ప్రజలు సరైన సమయంలో ఆస్పత్రులకు వెళ్లలేక ప్రాణాలు కోల్పోతుంటారు. వారి కోసం ప్రభుత్వం ఇకపై 108లోనూ పాముకాటుకు మందును ఉంచింది. ప్రభుత్వం చేసిన ఈ కొత్త ఆలోచనతో ఎంతోమంది రైతులు, ప్రజలు సకాలంలో ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఎవరికి ఏ సమయంలో ప్రమాదం జరిగినా కొద్ది క్షణాల్లోనే 108 అక్కడ ఉంటుంది. ఈ 108లో ఎక్కువగా యాక్సిడెంట్ కేసులే వస్తుంటాయి. దానికి సంబంధించిన మందులే ఉంటాయి. అత్యవసర చికిత్స చేసేందుకు అనుకూలమైన విధంగా 108 వాహనాలను సిద్ధం చేశారు. ఇకపై అందులో పాముకాటు మందు కూడా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# నూజెండ్ల మండల వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌పీఎల్ ఆధారిత రైతు శిక్షణ కార్యక్రమం

**వినుకొండ-- జూలై 10, (మనసులో మాట)**



నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈ రోజు ఆర్‌పీఎల్ (Recognition of Prior Learning) ఆధారిత రైతు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు (ADA) శ్రీ చి. రవి కుమార్, నరసరావుపేట డీఏఏటీటీసీ (DAATTC) శాస్త్రవేత్త డా. ఎం. నాగేశ్, నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి, ఏపీసీఎన్ఎఫ్ (APCNF) సిబ్బంది మరియు మండల రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ Ch. రవికుమార్ మాట్లాడుతూ, రైతులకు యూరియా మరియు డీఏపీ ఎరువుల పంపిణీని APAIMS యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలు, వాటి పంపిణీ విధానం గురించి రైతులకు వివరించారు.

డీఏఏటీటీసీ శాస్త్రవేత్త డా. ఎం. నాగేశ్ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న, కంది తదితర పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, అనువైన వంగడాల ఎంపిక, సిఫార్సు చేసిన ఎరువుల మోతాదులు (RDF) ప్రకారం ఎరువుల వినియోగం, సమగ్ర పంట నిర్వహణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ, నీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో దిగుబడినిచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు మరియు చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తక్కువ నీటితో మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయానికి సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా సాగింది.





# పల్నాడు పారిశ్రామిక ప్రగతిలో నూతన అధ్యాయం

- నరసరావుపేట గడ్డపై కేంద్ర ఆర్థిక మంత్రి వర్యుల పర్యటనకు అపూర్వ ఏర్పాట్లు!
- రూ.1,500 కోట్ల భారీ నిధుల హేమంతంతో వెనుకబడిన పల్నాడు సీమకు నూతనోత్తేజం
- ప్రజాపక్షపాతి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, క్రియాశీలక నేత ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబుల ఆధ్వర్యంలో సమరస్ఫూర్తితో ముందస్తు సమీక్ష.

**నరసరావుపేట, జూలై 10 (మనసులో మాట)::**

వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా, ఆర్థికంగా అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్న జిల్లా యంత్రాంగం, స్థానిక నాయకత్వం మరో మహోజ్వల ఘట్టానికి శ్రీకారం చుట్టాయి. ఈ నెల 17వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు, దేశ ఆర్థిక రథసారథి నిర్మలా సీతారామన్ నరసరావుపేట గడ్డపై అడుగుపెట్టనున్న శుభతరుణాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ చారిత్రాత్మక పర్యటనకు సంబంధించి శుక్రవారం ఉదయం స్థానిక కోడెల శివప్రసాదరావు మున్సిపల్ స్టేడియంలో సభా ప్రాంగణాన్ని, ఇస్సపాలెంలో అత్యంత సురక్షితమైన హెలిపాడ్ నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబులు సంయుక్తంగా పరిశీలించారు. అధికారులను సమన్వయం చేస్తూ వారు సాగించిన క్షేత్రస్థాయి సమీక్షా తీరు అత్యంత ప్రశంసనీయంగా సాగింది. ఈ సందర్భంగా అంకితభావంతో పనిచేస్తూ పల్నాడు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేస్తున్న జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ జూలై 17న జరగబోయే ఈ ప్రతిష్టాత్మక ఆర్థిక సహాయ సదస్సు జిల్లా చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనే సుమారు రూ.1,500 కోట్ల భారీ రుణాలను లబ్ధిదారులకు అందించి, పల్నాడులో ఆర్థిక విప్లవాన్ని తీసుకురాబోతున్నట్లు సగర్వంగా ప్రకటించారు. ఈ రుణమేళాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా పాల్గొనే అవకాశాలు ఉండటం పల్నాడు ప్రజల అదృష్టమన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్, ఉపాధి కల్పన, ముద్ర, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం మరియు ఉన్నత విద్యా రంగాల అభివృద్ధికి ఈ నిధులు ఊపిరి పోయనున్నాయన్నారు. సమాజంలో వెనుకబడిన విస్మరించబడిన వర్గాలైన ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాదారులు, దివ్యాంగులు, హిజ్రాలు తదితర ప్రత్యేక వర్గాలకు పెద్దపీట వేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ఈ బృహత్తర యజ్ఞం యొక్క ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే బ్యాంకుల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులకు సంబంధించిన శాంక్షన్ లేఖలను కూడా అందజేస్తామని వెల్లడించారు. నియోజకవర్గ సమగ్ర శ్రేయస్సే ధ్యేయంగా, నిరంతరం ప్రజాసేవలో



తరిస్తున్న శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆశయాలకు అనుగుణంగా ద్వాక్రా మహిళలు, రైతులు, శ్రామికులు, యువత స్వయం ఉపాధి సాధించేందుకు ఈ మహత్తర సదస్సు ఎంతగానో తోడ్పడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు రూ.300 కోట్ల నిధులు విడుదలై ప్రగతి పథంలో దూసుకుపోతుండగా, ఈ నెల 17న అందజేయబోయే రూ.1,500 కోట్ల రుణాలు పల్నాడు రూపురేఖలను మార్చివేయనున్నాయని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతిష్టాత్మక ఎంఎస్ఎంఈ, అగ్రోటెక్ పార్కుల స్థాపన ద్వారా వేలాది మంది యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుందని వివరించారు. ఈ అపూర్వ ప్రజా సమ్మేళనానికి సుమారు 50 వేల మంది జనసందోహం హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఈ క్రెడిట్ అవుట్‌రీచ్ మహా సభను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. అధికార యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధుల ఈ సమష్టి కృషి, పల్నాడు జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలుపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ మహత్తర ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా ప్రముఖ అధికారులు, బ్యాంకింగ్ రంగ నిపుణులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# రేషన్ షాపులను తనిఖీ చేసిన సిఎస్ డిటి

**కొల్లూరు, జూలై 10 (మనసులో మాట):**

కొల్లూరు రేషన్ షాపులను సిఎస్ డి టి ఫణి కుమార్ శుక్రవారం తనిఖీలు చేశారు. కొల్లూరు లోని ఎస్ వాసు నాయక్ 0730007 రేషన్ షాపును తనికి చేయగా నిత్యావసర సరుకుల నిల్వలలో 2300 కేజీల బియ్యం తక్కువగా ఉన్నాయన్నారు. డీలర్ పై జాయింట్ కలెక్టర్ కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విఆర్వో చిట్టిబాబు లు ఉన్నారు.



# రాష్ట్రస్థాయి క్రీడలకు నకరికల్లు విద్యార్థులు ఎంపిక!

**నకరికల్లు, జూలై 10, మనసులో మాట.**

నకరికల్లు, జూలై 10: యోగా, టెన్నికాయిట్ క్రీడల్లో నకరికల్లు విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జూలై 11 నుండి 12 వరకు ప్రకాశం జిల్లా జరుగుమల్లిలో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీ వంగా వెంకటరెడ్డి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు బాలికలు (షాహీన, లిఖిత, త్రివేణి, తేజస్విని) పాల్గొంటున్నట్లు ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు తెలిపారు. అలాగే త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నలుగురు బాలురు (వరుణ్ కుమార్, శశి కళ్యాణ్, శివ నిఖిల్, రుద్ర శివ గణేష్) ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు జి. యూన్సీరాణి, పి. రాజా, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

# రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణపై మండిపడ్డ దస్తావేజు లేఖరులు

- రేపల్లెలో 'పెన్ డౌన్' ఆందోళన!

**రేపల్లె జూలై 10 మనసులోమాట**

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరించేందుకు తీసుకువచ్చిన జీవో నెంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రేపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు భారీ ఆందోళన చేపట్టారు. అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం కార్యాలయాల వద్ద విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరక బాలమురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ, దశాబ్దాలుగా నమ్ముకున్న ఈ వృత్తిని నిలువునా ముంచేలా ప్రభుత్వం జీవో నెంబర్ 396 ని తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆఫీసులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే రిజిస్ట్రేషన్ల వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటీపీ (ఓ టి పి) విధానం వల్ల ప్రజలు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తుచేశారు. టెక్నికల్ సమస్యలు, సర్వర్ లోపాల వల్ల రిజిస్ట్రేషన్లు సకాలంలో కాక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పుడు ప్రైవేటీకరణతో ఆ భారం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి జీవో 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని. లేనిపక్షంలో పెన్ డౌన్ సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె పరిసర ప్రాంతాల డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ సిబ్బంది (మద్దతుగా) మరియు పెద్ద సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు. దస్తావేజు లేఖరుల సమ్మెతో రేపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి, సుమారు లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందిఅనితెలియజేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం: ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**మార్కాపురం జూలై 10 , (మనసులో మాట)**

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే ప్రజా దర్బార్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తెలిపారు.శుక్రవారం మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ (పీజీ ఆర్ఎస్) కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మొత్తం 66 వినతిపత్రాలు అందాయని తెలిపారు. వీటిలో అధిక శాతం రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలేనని పేర్కొన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## అక్షర రత్న పురస్కార గ్రహీతను అభినందించిన సత్యం, శివం, సుందరం సామాజిక సేవా సంస్థ

**తెనాలి,జూలై10( మనసులో మాట)**

ఈ నెల 5 న శ్రీశ్రీ కళావేదిక విజయవాడ లో జరిగిన ద్విశతాధిక కవి సమ్మేళనం లో సాహిత్య సభలో అక్షర రత్న పురస్కరము తో సత్కరించబడిన తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టిస్ట్ కండక్టర్, సాహితీబంధువు,డాక్టర్ ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ ) ని సత్యం, శివం, సుందరం సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తన్నీరు శివ శంకర్, సంస్థ కార్యవర్గ సభ్యులు కలిసి పురస్కార గ్రహీత ఆళ్ళ నాగేశ్వరరావు ని నాజరుపేట లోని ఆయన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి దుస్సాలుతో సన్మానించారు.ఈ కార్యక్రమం లో నాగిశెట్టి నాగేశ్వరరావు, నాగిశెట్టి వివేకానంద దంపతులు, సంస్థ కార్యవర్గ సభ్యులు, పురస్కార గ్రహీత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ రోజు పురస్కార గ్రహీత జన్మదినము కావడం విశేషం.

# పల్నాడు ప్రగతికి భారీ రుణమేళా

- **తొలి త్రైమాసికంలోనే రూ.1,500 కోట్ల రుణాల పంపిణీ - ఎమ్మెల్యే చదలవాడ**
- **భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో 3.33 లక్షల ఉపాధి కేంద్రాల ఏర్పాటు లక్ష్యం - ప్రాంతీయ మేనేజర్ రవికుమార్**



**నరసరావుపేట, జూలై 10 (మనసులో మాట)::**

పల్నాడు జిల్లాలో స్వయం ఉపాధి, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, సూక్ష్మ వ్యాపారాల అభివృద్ధికి ఊతమిచ్చేలా ఈ నెల 17న నరసరావుపేటలో కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో భారీ రుణమేళా (రుణాల విస్తరణ కార్యక్రమం) నిర్వహించనున్నట్లు నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. శుక్రవారం నరసరావుపేటలోని శాసనసభ్యుల కార్యాలయంలో భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రవికుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు జిల్లాలో పరిశ్రమలు, వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాలకు పెట్టుబడులు అందించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణతో ఈ రుణాల పంపిణీ చేపడుతున్నట్లు చెప్పారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వ పథకాల కింద జిల్లాలో పెద్దఎత్తున రుణాలు అందించామని, ప్రస్తుత ఆర్థికసంవత్సరం తొలి త్రైమాసికంలోనే సుమారు రూ.1,500 కోట్ల రుణాలను వివిధ సంక్షేమ, ఉపాధి పథకాల కింద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.300 కోట్ల రుణాలు విడుదలయ్యాయని, జూలై 17న మిగిలిన రుణాలను అందజేస్తామన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార సంస్కరణల పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ముద్ర రుణాలు, సూక్ష్మచిన్నమధ్యతరహా పరిశ్రమల రుణాలు, వ్యవసాయ, విద్యా రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పథకాల లబ్ధిదారులకు ఈ సందర్భంగా రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. బ్యాంకులకు సంబంధించిన సామాజిక బాధ్యత నిధుల కార్యక్రమాల అనుమతి పత్రాలను కూడా అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గుర్తింపుగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా నరసరావుపేటకు విచ్చేసి డ్వాక్రా మహిళలు, రైతులు, విద్యార్థులు, స్వయం ఉపాధి పొందాలనుకునే యువతకు రుణాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.అటవీ హక్కుల గుర్తింపు పత్రాలు కలిగిన వారు, దివ్యాంగులు, తృతీయ ప్రకృతియుక్తులు (ట్రాన్స్‌జెండర్లు) సహా వివిధ వర్గాల వారితో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ గృహాలకు కూడా రుణాలు అందించే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బ్యాంకుల సామాజిక బాధ్యత నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాలు కల్పించడం, ఆహార శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత సాంకేతికతతో పాఠశాలల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాలు, వ్యవసాయ సాంకేతిక కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను పెంపొందించడం, పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ రుణమేళాకు సుమారు 50 వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని అపారమైన అవకాశాలను వెలికితీసి ప్రజలను ఆర్థికంగా స్వయం సమృద్ధి వైపు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ రుణాల విస్తరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలను కలుపుకుంటూ అన్ని బ్యాంకులకు లక్ష్యాలు నిర్దేశించామన్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జిల్లాలో 3.33 లక్షల ఉపాధి కేంద్రాల ఏర్పాటుకు లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందులో ఒక లక్ష కేంద్రాలను ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించారు. శాసనసభ్యులు విజ్ఞప్తి మేరకు ఈసారి తృతీయ ప్రకృతియుక్తులను (ట్రాన్స్‌జెండర్లను) కూడా స్వయం ఉపాధి పథకాలలో ప్రత్యేకంగా చేర్చినట్లు తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యక్తిగత రుణాలను సమన్వయం చేస్తూ ప్రతి ప్రాంతంలో స్థానిక వనరులకు అనుగుణంగా ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని, జూలై 17న భారతీయ స్టేట్ బ్యాంక్ ఒక్కటే రూ.300 కోట్ల రుణాలను పంపిణీ చేయనున్నట్లు రవికుమార్ తెలిపారు. కేవలం వ్యక్తిగత రుణాలకే పరిమితం కాకుండా గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణ పంపిణీ విధానంలో రుణాలు అందిస్తున్నామని వివరించారు. తాత్కాలిక ఉపాధికంటే శాశ్వత ఉపాధి కల్పించే పరిశ్రమల ఏర్పాటుపై పార్లమెంట్ సభ్యులు (ఎంపీ), శాసనసభ్యుల సూచనల మేరకు దృష్టిసారించామని, ఇందులో భాగంగా మునగాకు, పుట్టగొడుగులు, మిరపకాయల శుద్ధి కేంద్రాలు, సుగంధ ద్రవ్యాల తయారీ కేంద్రాల వంటి పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మునగ సాగు విస్తారంగా ఉన్న ప్రాంతాల్లోనే శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అదనపు ఆదాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ను నూరు శాతం 13వ తేదీ కల్లా పూర్తి చేయాలి

**రేపల్లె జూలై 10 మనసులోమాట**

ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులకు సూచించారు. శుక్రవారం రేపల్లె నియోజకవర్గంలోని యానాది కాలనీ సచివాలయంలో ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి సచివాలయ పరిధిలోని పోలింగ్ స్టేషన్ 25 కు సంబంధించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై బిఎల్ఓ ను ఆరా తీశారు. పోలింగ్ స్టేషన్ 25 పరిధిలో ఇప్పటివరకు 58 శాతం మాత్రమే పూర్తి చేయుటకు గల కారణాలపై బిఎల్ఓ ను ఆయన ప్రశ్నించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గడువు ఈనెల 14వ తేదీతో ముగుస్తున్నందున ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓటర్ల విషయమై బిఎల్ఎ లతో బిఎల్ఓ లకు సమావేశాలు నిర్వహించి ఓటర్ జాబితాలో మరణాలు, ప్రాంతాలు మారుట, డూప్లికేటింగ్ వంటి వాటిని గుర్తించి బిఎల్ఎ లతో చర్చించి వాటిని అన్ మ్యాపింగ్ చేసి డిజిటలైజేషన్ చేయాలని ఆయన సూపర్వైజర్ కు సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూరు శాతం ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో



రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీదేవి, రేపల్లె మండల తహసిల్దార్ శ్రీనివాసరావు, రేపల్లె మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు సూపర్వైజర్ లు మరియు బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఓటర్ నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**వినుకొండ --జులై10,**
**(మనసులో మాట)**

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన SIR (Special Intensive Revision) ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అధికారులు, బీఎల్వోలు పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని వినుకొండ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రముఖ న్యాయవాది & పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి MN ప్రసాద్ గారు మాట్లాడుతూ, సర్ నమోదు కార్యక్రమం తుది దశకు చేరుకున్నప్పటికీ ఇంకా పలు లోపాలు కొనసాగుతున్నాయని అన్నారు. నూజెండ్ల మండలం వి.అప్పాపురం



గ్రామంలో 18 ఓట్లు, మారెళ్లవారిపాలెం గ్రామంలో 42 ఓట్లు, అల్లిబాయిపాలెం గ్రామంలో మరో 40 ఓట్లు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం ఆందోళనకరమన్నారు. సంబంధిత ఓటర్లు స్థానికంగా లేకపోవడం, ఆధార్ కార్డుల్లో వేరే చిరునామాలు ఉండడం వంటి కారణాలతో మ్యాపింగ్ పూర్తి చేయకుండా నమోదు నిలిపివేయడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఓటర్ నమోదుకు ప్రభుత్వం 12 రకాల గుర్తింపు పత్రాలను అనుమతించిన నేపథ్యంలో, కేవలం ఆధార్ కార్డులో చిరునామా ఆధారంగా మాత్రమే నమోదు నిరాకరించడం సమంజసం కాదన్నారు. ఆధార్ కార్డు ఒక్కటే ఓటర్ నమోదుకు ప్రామాణిక పత్రం కాదని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఓటర్ నమోదు ప్రక్రియకు ఇంకా 04 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే సర్ నమోదు కోసం అదనపు గడువు కేటాయించి, ఇంటింటి సర్వే నిర్వహించి, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని M.N ప్రసాద్ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి , నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు కొత్త కృష్ణారెడ్డి , పట్టణ కన్వీనర్ కొత్తమాస శివ , నూజెండ్ల మండల కన్వీనర్ ముప్పరాజు వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకుడు కొత్త వీరాంజనేయరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారి సమావేశం

**చిలకలూరిపేట జులై 10**
**మనసులో మాట**

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈరోజు పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలకు సంబంధించిన పలు అంశాలపై ఎన్నికల అధికారి వివరించారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు తమకు ఉన్న సందేహాలు, అనుమానాలను ఎన్నికల అధికారిని అడిగి నివృత్తి చేసుకున్నారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా,



నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

# చర్చి స్థలం.... కబ్జాకు ప్రయత్నం..

- **అడ్డుకోవాలని అధికారులకు ఫిర్యాదుఫిర్యాదు**

**వినుకొండ - జూలై 10,**
**(మనసులో మాట )**



చర్చి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు తాము కొనుగోలు చేసిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వినుకొండ పట్టణానికి చెందిన తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రతినిధులు పురపాలక కమిషనర్ కు వినతిపత్రం అందించారు.కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కమిషన్ కమిషనర్ను వారు కోరారు. బాధితుల కథనం మేరకు వినుకొండ పట్టణంలోని ఏబీఎం పాఠశాల ఆవరణ లో గల సర్వేనెంబర్ 394/1 లో గల 35.157 సెంట్లు స్థలాన్ని చర్చి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చెస్ ప్రైవేట్ లిమిటెడ్ (పి ఏ బి సి )వారి వద్ద నుండి స్థానిక చర్చి నిర్వాహకులు కొంతమంది కొనుగోలు చేశారు. ఇందుకోసం 15 లక్షల రూపాయల నగదును పీఏబీసీ అధ్యక్షునికి చెల్లించి ఈ మేరకు అగ్రిమెంట్ కూడా కుదుర్చుకున్నారు.అయితే అగ్రిమెంటు తదుపరి నుండి సదరు స్థలాన్ని రిజిస్టర్ చేయవలసిందిగా బాధితులు పీఏబీసీ వారిని ఒత్తిడి చేసినప్పటికీ అందుకు వారు నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. దీంతో కొనుగోలుదారులు నరసరావుపేట సబ్ కోర్టు నందు స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ ధావాను దాఖలు చేశారు. ఆ దావ పెండింగ్లో ఉండగా గురువారం కొంతమంది వ్యక్తులు సదరు స్థలంలో పునాదులు తీయించి షాపుల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని, అలాగే ఆ స్థలంలో ఉన్న వేప చెట్లను కూడా తొలగించారని బాధితులు ఆరోపించారు. కొంతమంది రాజకీయ నాయకుల ప్రమేయంతోనే ఈ స్థలంలో కబ్జాకు ప్రయత్నం జరుగుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ మేరకు పురపాలక సంఘం కమిషనర్ కే. శివరామ్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు దారి వేముల జోసెఫ్ నాగ స్వామి,చాట్ల రామయ్య,బీర్నీడి సంతోష్, బి ఎలియేజర్, పందుల ఫిలిప్, కట్టెంపూడి నాగేశ్వరరావు, కోటా శివకుమార్,పులిగుజ్జు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# సాంకేతికతతో 12 మొబైల్స్ రికవరీ బాధితులకు అందజేసిన రూరల్ ఎస్ఐ అనిల్

**చిలకలూరిపేట జూలై 10**
**మనసులో మాట**

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు ఊరటనిచ్చారు. రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ వహించి, పోలీస్ శాఖలోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సుమారు 12 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేశారు. పోయిన ఈ మొబైల్స్ ను తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఒడిస్సా తదితర సుదూర ప్రాంతాల నుంచి గుర్తించి వెనక్కి రప్పించారు. అనంతరం వీటిని పోలీస్ స్టేషన్ లో సంబంధిత బాధితులకు ఎస్ఐ స్వయంగా అప్పగించారు. పోయిన తమ ఫోన్లు తిరిగి దొరకడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ కుమార్ బాధితులతో మాట్లాడుతూ ప్రజలు తమ సెల్ ఫోన్ల భద్రత పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్స్ పోగొట్టుకున్న వారిలో ఎక్కువ మంది సులభంగా సైబర్ నేరాలకు గురవుతున్నారని ఆయన గుర్తు చేశారు. ఫోన్లలో ఉండే వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# నేడే జాతీయ లోక్ అదాలత్

- **సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి రమేష్ పిలుపు**

**నరసరావుపేట, జూలై 10**
**(మనసులో మాట)::**

స్థానిక న్యాయస్థాన ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టులలో దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న వివాదాలను ఉభయ పక్షాలు సామరస్యపూర్వకంగా, రాజీ మార్గం ద్వారా త్వరితగతిన ముగించుకోవడానికి లోక్ అదాలత్ ఒక చక్కని అవకాశమని పేర్కొన్నారు. నరసరావుపేట కోర్టుల పరిధిలోని అన్ని రకాల సివిల్ కేసులు, చట్టప్రకారం రాజీ పడటానికి వీలున్న క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, భరణం (జీవనభృతి) తగాదాలు, రెవెన్యూ వివాదాలతో పాటు కోర్టుల్లో కేసు దాఖలు కావడానికి ముందున్న ముందస్తు (ప్రీలిటిగేషన్) వ్యాజ్యాలను కూడా ఈ అదాలత్‌లో ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు విలువైన సమయం, ధనం ఆదా అవ్వడమే కాకుండా, కోర్టుల చుట్టూ తిరిగే మానసిక శ్రమ తప్పుతుందని న్యాయ సేవా కమిటీ వెల్లడించింది. అంతేకాకుండా, ఇరుపక్షాల మధ్య పగలు, ప్రతీకారాలు సమసిపోయి స్నేహపూర్వక వాతావరణం, సఖ్యత పెరుగుతుందని పేర్కొంది. కక్షిదారులు ఈ సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ కేసులను శాంతియుత మార్గంలో ముగించుకోవాలని న్యాయమూర్తి కోరారు.



## మానవత్వం చాటుకున్న ఆటోడ్రైవర్లు

- **తోటి డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం**
- **అభినందించిన సీఐ పి. రమేష్**

**చిలకలూరిపేట జులై 10**
**మనసులో మాట**

అనారోగ్యంతో బాధపడుతున్న తోటి డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచి పేట ఆటో డ్రైవర్లు గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక మదర్ థెరిస్సా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆటో డ్రైవర్లందరూ స్పందించి విరాళాలు సేకరించారు. ఆ సేకరించిన ఆర్థిక సహాయాన్ని పేట అర్బన్ సీఐ పి. రమేష్ సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

ఈ సందర్భంగా సీఐ పి. రమేష్ ఆటో డ్రైవర్ల ఉదారతను ప్రత్యేకంగా కొనియాడారు. తోటి డ్రైవర్ కు ఆరోగ్య సమస్య వచ్చిందని తెలియగానే వెనువెంటనే స్పందించి, అందరూ కలిసికట్టుగా ఇలా సహాయం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో అర్బన్, ఎస్సైలు హాజరత్తయ్య, సోమేశ్వరరావు, మదర్ థెరిస్సా ఆటో యూనియన్ ప్రతినిధులు మరియు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు

**రేపల్లె జులై 10 మనసులోమాట**

ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రేపల్లె నియోజకవర్గాన్ని రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఇప్పటికే
1800 కోట్లతో అభివృద్ధి చేశారని టిడిపి నాయకులు జీవి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిని చూడలేని వైసీపీ నాయకులు అవాకులు చావాకులు పేలడం సమంజసం కాదన్నారు రేపల్లె నుండి నిజాంపట్నం వెళ్లే రహదారి తోలుతా నిధులు సక్రంగా రాకపోవడంతో మరల నిధులు తెప్పించి అదే కాంట్రాక్టర్ రహదారిని పూర్తి చేశారన్నారు ఏ ఒక్క కాంట్రాక్టర్ ఇబ్బందులు పడటం లేదని అన్నారు తెలుగుదేశం పార్టీ నాయకులు అన్న గాని శివప్రసాద్ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడంలో ఎటువంటి తప్పు లేదని ఆయన తేల్చి చెప్పారు వైఎస్ఆర్సిపి రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త పీతా నాగమోహన్ విషయం తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని అభివృద్ధికి చేతనందించాలి కానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం పీతా నాగమోహన్ కు సమంజసం కాదని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పంతాన్ని మురళీధర్. తా తా ఏడుకొండలు. పట్టణ టిడిపి అధ్యక్షుడు మేక రామకృష్ణ టిడిపి నాయకులు పాల్గొన్నారు

## ఓటర్ల జాబితా సవరణ (సర్) పై ప్రజల్లో భయాలను పోగొట్టాలి

**చిలకలూరిపేట జూలై 10**
**మనసులో మాట**

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) కార్యక్రమంపై ఓటర్లలో నెలకొన్న అపోహలను, భయాలను ఎన్నికల సంఘం తక్షణమే తొలగించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం. రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ, ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

**ప్రజాధనం ఆదా చేయొచ్చు**

ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ కోసం దేశవ్యాప్తంగా సుమారు పదివేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారని ఆయన తెలిపారు. దేశంలో మొత్తం 99 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటికే 70 కోట్ల మంది తమ ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారని గుర్తుచేశారు. మిగిలిన 29 కోట్ల మందికి కూడా ఆధార్ లింక్ ప్రక్రియను పూర్తి చేస్తే, ఒకరికి ఒకే చోట ఓటు ఉంటుందని, దీనివల్ల దొంగ ఓట్లను అరికట్టడమే కాకుండా వేలాది కోట్ల రూపాయల ఖర్చును ఆదా చేయవచ్చని ఆయన సూచించారు.



**పేదల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం**

ఈ సవరణ ప్రక్రియలో కొన్ని సామాజిక వర్గాల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తారనే ఆందోళన ప్రజల్లో ఉందని రాధాకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని పేదలు, అద్దె ఇళ్లలో నివసించే వారు తరచూ ఇల్లు మారుతుంటారని, కేవలం డోర్ నంబర్ మారినంత మాత్రాన వారి ఓటు హక్కును ఎలా తీసేస్తారని ఆయన ప్రశ్నించారు. అలాగే తండ్రి పేరు బదులు భర్త పేరు నమోదు కావడం, పుట్టిన తేదీల్లో తప్పులు దొర్లడం వంటి చిన్న చిన్న పొరపాట్లను ఆధార్ అనుసంధానం ద్వారా సులభంగా సరిదిద్దవచ్చన్నారు. గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో భారీగా ఓట్లు గల్లంతైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

**బయోమెట్రిక్ విధానం అమలు చేయాలి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన సార్వభౌమాధికారమైన 'ఓటు హక్కు'ను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులు ( బి ఎల్ ఓ) కూడా చిన్న పొరపాటు జరిగితే తమ ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వస్తుందోనని భయాందోళనల మధ్య పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తే ఫేక్ ఓట్లకు పూర్తిగా చెక్ పెట్టవచ్చని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు ఇస్తున్న సలహాలు, సూచనలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని, పారదర్శకంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

## ప్రజాస్వామ్య రక్షణకు ఓకే ఒక్క వజ్రాయుధం" మీ ఓటు "యాగంటి

**మాచర్ల జులై : 10**
**(మనసులో మాట)**

ఓటు కోల్పోతే... ప్రజాస్వామ్యంలో మీ విలువ కోల్పోయినట్టే... యాగంటి..!

జూలై 14లోపు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోండి.. - టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జున రావు..

"ప్రజాస్వామ్యానికి అసలైన బలం ప్రజల ఓటు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండటం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ బాధ్యత" యాగంటి అన్నారు...

మాచర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ లో వున్నా సచివాలయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి బీఎల్ఓలతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు...

అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, జూలై 14వ తేదీలోపు ప్రతి అర్హుడైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేసి తమ ఓటు హక్కును కొనసాగించుకోవాలని పిలుపునిచ్చారు...

ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక ఓటు ఆ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని తెలుగుదేశం పార్టీ ఆ బాధ్యత వుంది అని అన్నారు....

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సర్ కార్యక్రమం అత్యంత కీలకమైనదని తెలిపారు. జూలై 14వ తేదీ లోగా ప్రతి ఇంటికి వెళ్లి బిఎల్ఓ లు ఇచ్చే ఇనుమురేషన్ ఫార్మ్ ను ప్రతి కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా నింపాలని సూచించారు.

"గత వైసీపీ పాలనలో రాజకీయ కక్షతో వేలాది మంది ఓట్లను అక్రమంగా తొలగించారు. మళ్లీ అలాంటి అన్యాయం జరగకుండా ఉండాలంటే ఇప్పుడు మనం అప్రమత్తంగా ఉండాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు, ప్రతి కుటుంబంలోని సభ్యుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ పేరు లేకపోతే వెంటనే బిఎల్ఓ కు దరఖాస్తు చేసుకోవాలి" అని స్పష్టం చేశారు...

"ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతి ఓటు లెక్కలో ఉండాలి. మన హక్కుల కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని వదులుకోవద్దు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, ఈ కార్యక్రమాన్ని 100% విజయవంతం చేయాలి" అని యాగంటి మల్లికార్జున రావు గారు పిలుపునిచ్చారు...

"ఓటు అనేది ఒక సాధారణ గుర్తింపు కాదు... అది రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యాని కాపాడడానికి ఇచ్చిన ఒక్క వజ్రాయుధం...ఒక్కో ఓటు దేశ దిశను నిర్ణయించే శక్తి కలిగి ఉంటుంది. కాబట్టి ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండి, తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో ధృవీకరించుకోవాలి. అవసరమైన ఫారాలను గడువులోగా సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలి" అని ఆయన అన్నారు...

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని అని యాగంటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు... జులై 21వ తారీఖునా ప్రకటించే ముసాయిధి ఓటర్ లిస్ట్ లో మీ ఓటు లేకపోతే మీరు ఓటు హక్కు కోల్పోయినట్టే అని వెల్లడించారు..

సమయం కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉంది కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించడానికి బిఎల్వోలు,బిఎల్ఎలు లు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు..

ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమెర దుర్గారావు గారు ,స్థానిక TDP నాయకులు, కార్యకర్తలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.









# లేనినిబంధనల పేరుతో రైతుల్ని భయాందోళనకు గురిచేస్తూ ప్రభుత్వలక్ష్యాలనునీరుగార్చకండి : ప్రత్తిపాటి

- తమ భూముల్లో బోర్లు వేసుకోవడానికి కొందరు అధికారులు ఎన్.వో.సీలు అడుగుతున్నారన్న రైతుల ఫిర్యాదుపై కలెక్టర్ తో మాట్లాడిన ప్రత్తిపాటి.
- ఎవరికీ ఎలాంటి ఎల్.వో.సీలు సమర్పించాల్సిన అవసరం లేదన, ఓల్టా చట్టం నిబంధనల ప్రకారం బోర్లు వేసుకుంటే సరిపోతుందని రైతులకు స్పష్టత నిచ్చిన ప్రత్తిపాటి.
- పీఎం కిసాన్ నిధులు జమకాలేదన్న రైతుల అభ్యర్ధనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి.
- సాంకేతిక సమస్యలు పరిష్కరించి, త్వరలోనే రైతులకు నిధులందిస్తామని కలెక్టర్ హామీ.
- 'సర్' పై కావాలనే వైసీపీ దుష్ప్రచారం.. సొంతపార్టీ బీఎల్ఏలు సేకరించిన సమాచారాన్ని బీఎల్ఓలు డిజిటలైజ్ చేస్తుంటే.. ఓట్లెలా తొలగిస్తారు : ప్రత్తిపాటి.
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ప్రత్తిపాటి.

**చిలకలూరిపేట జూలై 10 మనసులో మాట**



ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యాలను కొందరు ప్రభుత్వాధికారులు, సిబ్బంది నీరుగారుస్తున్నారని, లేని నిబంధనల పేరిట ప్రజల్లో భయాందోళన రేకెత్తిస్తున్నారని, వారిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ప్రజలందించిన అర్జీలను పరిశీలించిన ప్రత్తిపాటి సంబంధిత అధికారులతో మాట్లాడి, అర్జీదారులను ఇబ్బంది పెట్టకుండా సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు, కొందరు రైతులు తమ భూముల్లో బోర్లు వేసుకోవడానికి అధికారులు ఎన్.వో.సీలు అడుగుతున్నారని, అలానే తమకు ఇంకా పీఎంకిసాన్ నిధులు జమకాలేదన్న మరికొందరు రైతుల సమస్యలపై ప్రత్తిపాటి, పల్నాడు కలెక్టర్ తో మాట్లాడారు. ఆమె నుంచి రైతులకు స్పష్టమైన భరోసా ఇప్పించిన ప్రత్తిపాటి.. సమస్య పరిష్కరించే బాధ్యత తనదని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

బోర్లు వేసుకోవడానికి ఎలాంటి ఎన్.వో.సీలు అక్కర్లేదు.అధికారులు లేనిపోని నిబంధనలతో రైతుల్ని భయాందోళనకు గురి చేయడం సరికాదు.

రైతులు తమ భూముల్లో కొత్తగా బోరు వేయించుకోవాలంటే తహసీల్దార్, లేదా భూగర్భ జలవనరుల విభాగం తరుపున ఎన్.వో.సీ ఇవ్వాలని కొందరు అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని, ఓల్టా చట్టం ప్రకారం భూగర్భ జలాలున్న చోట బోర్లు వేసేలా చూడాలనే నిబంధన ఉందిగానీ, ఇంకెలాంటి అభ్యంతరాలు లేవని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కొందరు రైతులు ఈ విధంగా ఎన్.వో.సీ అడుగుతున్నారని, తన దృష్టికి తీసుకొచ్చారని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఈ విధమైన భయాందోళనలు రేకెత్తించవద్దని వారికి సూచిస్తున్నామన్నారు. ఈ విధంగా ఎలాంటి ఎన్.వో.సీ నిబంధనలు లేవని కలెక్టర్ కూడా స్పష్టంగా చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. పీఎం కిసాన్ నిధులు అందలేదన్న రైతుల ఫిర్యాదుని పరిష్కరిస్తామని కలెక్టర్ చెప్పారు పీఎం కిసాన్ యోజనఅన్నదాతా సుఖీభవ పథకంలో భాగంగా ఇటీవల విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ సాయం తమకు అందలేదని కొందరురైతులు ఫిర్యాదు చేశారని, సమస్యను వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే 22 సార్లు పీఎం కిసాన్ సాయం పొందిన రైతులకు, 23వ సారి అందకపోవడంపై విచారణ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. 2019 ఆగస్ట్ కు ముందు ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పీఎం కిసాన్ యోజన సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు.

'సర్' పై కావాలనే వైసీపీ తప్పుడు ప్రచారం 'సర్' పై వైసీపీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని, బీఎల్ ఏలు ఇంటింటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫామ్ లు అందించి, ఓటర్లు అందించిన సమాచారాన్ని బీఎల్ఓలకు అందిస్తే, ఆ వివరాలను పున:పరిశీలించి డిజిటలైజ్ చేస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తమ పార్టీల బీఎల్ఏలు ఓటర్ల సమాచారం సేకరించి, పూర్తిగా డిజిటలైజ్ చేస్తుంటే వైసీపీ దుష్ప్రచారం చేయడం ఏమిటని ప్రత్తిపాటి ప్రశ్నించారు. నిజంగా అర్హుల ఓట్లు తొలగిస్తే, ఆ పార్టీనేతలు ఆధారాలతో సహా ఈసీకి ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, గట్టినేని రమేష్, పిల్లి కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, బీజేపీ నాయకులు గట్టా హేమ, సి.వి.ఏ.పి యూనిట్ సయ్యద్ మహమ్మద్ అలీ, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 14న వినుకొండలో బిఎస్ఎఫ్ జోనల్ సమావేశాలు

**వినుకొండ -జూలై 10,, (మనసులో మాట )**

బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఈనెల 14వ తేదీన గుర్రం జాషువా జోన్ 3పరిధి లోని ప్రకాశం,మార్కాపురం, పల్నాడు,బాపట్ల జిల్లాల జోనల్ సమావేశం వినుకొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా కో కన్వీనర్ ఎం. రాఘవ రాజు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరేళ్ల రాజు, పల్నాడు జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు, లతోపాటు నాలుగు జిల్లాల పార్టీ అధ్యక్షులు పాల్గొంటారని రాఘవ రాజు తెలిపారు. వినుకొండ పట్టణంలోని అవ్వారు ఫంక్షన్ హాల్ నందు 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ సమావేశాలకు జూన్ 3 పరిధి లోని జిల్లాల కు చెందిన విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




## కుంచనపల్లి ఎంపియుపి స్కూల్ కి 50,000/ వేల రూ... విలువ గల 2 ప్యూరిఫై వాటర్ మిషన్ల,1 బీరువా బహుకరించిన కాజా వెంకటేశ్వరరావు

**తాడేపల్లి జూలై 10 (మనసులో మాట)::**

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, క్రెడై అమరావతి చాప్టర్ ఉపాధ్యక్షులు, కుంచనపల్లి శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ కాజా వెంకటేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఎంపీఎంసీ పరిధిలోని కుంచనపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు 50వేల రూపాయల విలువగల వాటర్ ప్యూరిఫైయింగ్ మిషన్లు 2, ఒక బీరువా బహుకరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు పండ్లు బిస్కెట్లు చాక్లెట్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో క్రెడై చైర్మన్ నాగమల్లేశ్వరరావు,క్రెడై వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వరరావు, అధ్యక్షులు ఎల్.నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ప్రశాంత్, క్రెడై వైస్ ప్రెసిడెంట్ పూర్ణ,జాయింట్ సెక్రటరీ పి. వెంకటేశ్వరావు, మెంబెర్స్ అనిల్ కుమార్,సి ఎస్ ఆర్ కమిటీ కన్వీనర్ పి.శ్రీనివాస్, ఎం సి మెంబెర్స్ కె. ఆంజనేయులు,కె. సుదీర్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్కు అంతరాయం

**దుర్గి జూలై 10 ( మనసులో మాట)**

దుర్గి మండలం లోని ప్రజలకు తెలియజేయునది ఏమనగా రేపు అనగా 11.07.2026న రెండవ శనివారం సందర్భంగా RDSS పనుల నిమిత్తం 33/11KV సబ్ స్టేషన్ దుర్గి పరిధిలోని దుర్గి, ఓబులేశుపల్లె , జంగమేశ్వరపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరియు మండలం లోని ఇతర సబ్ స్టేషన్స్ లో మరమ్మతుల నిమిత్తం మిగతా గ్రామాలకు, ఉదయం 10 గంటల నుండి 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలదని అసిస్టెంట్ ఇంజనీర్ జి సీతారాం తెలిపారు. కావున ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు.



# ఇసుకపల్లి చేనేత వస్త్రాల విక్రయ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

- **చేనేత వస్త్రాలను కొనుగోలు చేసిన జిల్లా కలెక్టర్**

**రేపల్లె జులై 10 మనసులోమాట**

ప్రజా సమస్యల అర్జీ పై క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అర్జీ దారునికి పరిష్కార మార్గాన్ని చూపారు. శుక్రవారం, రేపల్లె నియోజకవర్గం, రేపల్లె మండలంలో, ఇసుకపల్లి గ్రామంలోని శ్రీ భ్రమరాంబ చెన్న మల్లేశ్వర స్వామి వారి పురాణ కాలక్షేప మండపంలో నియోజకవర్గస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించారు. పాలడుగు వెంకటేశ్వర్లు అర్జీకు స్పందించి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పాలడుగు వెంకటేశ్వర్లు సమస్య పరిష్కారానికి సంబంధించి వారి వివరములను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి వారి కార్యాలయంలో ఆన్లైన్ ద్వారా మరియు పాలడుగు వెంకటేశ్వర్లు వారి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యపై అర్జీదారునితో ఫోన్ ద్వారా సంప్రదించి వారి సమస్యపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వారి భూ సమస్య వివాదం మరియు స్థానిక గొడవల విషయాలపై చెరుకుపల్లి ఎస్ హెచ్ ఓ వారితో ఫోన్లో సంభాషణ జరిపి అర్జీ దారుని సమస్యను వివరించి అనంతరం అర్జీదారున్ని పిలిపించి వారితో చర్చించి అందులోని అంశాలపై అర్జీదారునికి ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆయన ఎస్ హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ సంభాషణ అంతయు అర్జీదారునికి వివరించి వారిని కలెక్టర్ సంతృప్తిపరిచారు.

అనంతరం ఇసుక పల్లి గ్రామంలోని చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి కేంద్రమును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వస్త్రాల యొక్క నాణ్యతను, అక్కడ లభ్యమయ్యే వస్త్రాల యొక్క వివరాలను తెలుసుకొని వారి ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఆయన వస్త్రాలను కొనుగోలు చేశారు.

ఈ కార్యక్రమంలో రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీదేవి, ఫోన్ సంభాషణ ద్వారా అర్జీదారుడు మరియు చెరుకుపల్లి ఎస్ హెచ్ ఓ, చేనేత జౌళి అభివృద్ధి అధికారి సిహెచ్ ప్రశాంత్, నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి మాధవి మరియు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**తెనాలి,జూలై10(మనసులో మాట)**

నేడు డి1,డి 2 మరియు డి 3 సెక్షన్ పరిధి లో గల 33 కె.వి. మరియు 11కె.వి. లైన్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా తెనాలి టౌన్, రూరల్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎ.పి. సి.పి.డి.సి.యల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి డిపార్టుమెంటుకు సహకరించగలరని కోరారు.





# చంద్రబాబు అనుభవంముందుచూపుతో ప్రజలకుసంక్షేమపథకాలురాష్ట్రానికిఅభివృద్ధి

- **జగన్ రాష్ట్రంపై మోపిన అప్పులభారాన్ని తగ్గిస్తూనే, చంద్రబాబు ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారు.**
- **చెంగిజ్ ఖాన్ పేటను పంచాయతీగా విభజించాకే, స్థానిక ఎన్నికలు నిర్వహిస్తాం**
- **చెంగిజ్ ఖాన్ పేటలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.**

**యడ్లపాడు జులై 10 మనసులో మాట**

నియోజకవర్గాన్ని, ప్రజల్ని గత పాలకులు గాలికి వదిలేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే ప్రజాసమస్యల్ని పరిష్కరించి, ఊహించలేని అభివృద్ధి సాధించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

శుక్రవారం ఆయన మండలం లోని చెంగిజ్ ఖాన్ పేట పంచాయతీ బన్నీపురంలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, డ్రైన్లకు గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు అనుభవం.. ముందుచూపుతో ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు జగన్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి, ప్రజలపై భారం మోపితే, చంద్రబాబు తన అనుభవం, ముందు చూపుతో రుణభారాన్ని తగ్గిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి అభివృద్ధిని అందిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రభుత్వ పథకం అందని గడప లేదని, ప్రతి కుటుంబానికి క్రమం తప్పకుండా ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సాయం అందుతోందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు ప్రజా సంక్షేమం.. రాష్ట్రాభివృద్ధి కోసం పడుతున్న కష్టాన్ని అందరూ గుర్తించాలన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వ సుపరిపాలన, జగన్ విధ్వంస పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించి, సుదీర్ఘకాలం చంద్రబాబు నాయకత్వానికే మద్దతు తెలపాలని ఎమ్మెల్యే సూచించారు. చౌడవరం ఎన్.హెచ్ నుంచి కొండవీడు కోటకు నేరుగా రోడ్డు మార్గం నిర్మించబోతున్నామని, త్వరలోనే ఈ ప్రాజెక్టు అమల్లోకి వచ్చి, చెంగిజ్ ఖాన్ పేట వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రత్తిపాటి తెలిపారు. చెంగిజ్ ఖాన్ పేట, వంకాయలపాడు, గోపాలపురం పంచాయతీలను ప్రత్యేకంగా విభజించాకే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు తులవ మాణిక్యాలరావు, ఆదిశేషు, ఈ అంజినేయులు, సి.హెచ్ నాగేశ్వరరావు, షేక్ బుడే, ఉదేష్, అన్సర్, పాస్టర్, నరసింహారావు, నారాయణ, డి.ఈ బాల కుమార్, ఎంపీడీవో హేమలత, లుర్దు కుమార్, అధికారులు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# మనసులో మాట వార్తకు స్పందించిన కారంపూడి ప్రత్యేక అధికారి ఘంటా శ్రీనివాసరెడ్డి

**కారంపూడి, జూలై 10, ( పల్నాడు జిల్లా ) మనసులో మాట :**

గత మంగళవారం మనసులో మాట పత్రికలో వచ్చిన "డంపింగ్ యార్డుల ను మరిపిస్తున్న కారంపూడి పట్టణ వీధులు" అనే వార్తకు స్పందించిన అధికారులు. "సర్" కార్యక్రమంలో తలమునకలై,తీరిక లేకుండా తిరుగుతున్న సమయంలో కూడా మనసులో మాట వార్త పత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన కారంపూడి పట్టణ ప్రత్యేక అధికారి మరియు మండల అభివృద్ధి అధికారి ఘంటా శ్రీనివాస రెడ్డి స్పందించి ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుండి అంకాలమ్మ గుడి వైపు వచ్చే వీధిలో ప్రమాద భరితంగా ఉన్న కంకర్ ను తొలగించడం, మరియు ఆర్ అండ్ బి దాచేపల్లి రోడ్డులో దుర్వాసనలను వెదజల్లుతూ, రోడ్డుపై కుంటలను మరిపించే విధంగా ఉన్న మురుగునీటి కుంటలను, చెత్తతో కూరుకుపోయిన తూములను సైతం, పాత టైర్లు వేసి ట్రాక్టర్లతో లాగించి తూములలో అడ్డుగా ఉన్న చెత్త, ప్లాస్టిక్ బాటిల్స్ ను తొలగించి అటు ఎస్సీ వర్గీయుల సమాధుల స్మశానంలోకి మురుగునీరు వెళ్ళనివ్వకుండా ఆ పరిసర ప్రాంతమంతా కూడా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకొని, బాటసారు లకు వాహ




నదారుల బాధలను తీర్చినందుకు, మరీ ముఖ్యంగా ఎస్సీ వర్గీయుల స్మశానంలోకి మురుగునీరు వెళ్ళనీయకుండా చర్యలు తీసుకున్నందుకు ప్రత్యేక అధికారి మరియు ఎంపీడీవో ఘంటా శ్రీనివాస్ రెడ్డికి ఆ ప్రాంత వాసులు, మరి ముఖ్యంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద అంకాలమ్మ గుడి వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అక్కడ ఉన్న కంకరరాళ్లను తొలగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.





# అంగన్వాడీలకు రూ.26 వేల కనీస వేతనం,సామాజిక భద్రత కల్పించాలి సిఐటియు డిమాండ్

- పల్నాడు జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించిన వందలాది మంది అంగన్వాడీలు
- బీఎల్ఓ సహాయక విధుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వినతి
- నరసరావుపేటలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

**నరసరావుపేట, జూలై 10 (మనసులో మాట)::**

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు నెలకు రూ.26 వేల కనీస వేతనంతో పాటు పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఏ.లక్ష్మీ ప్రసన్న, జిల్లా కార్యదర్శి శాంతమణి ఆధ్వర్యంలో వందలాది మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు కలెక్టరేట్‌ను ముట్టడించారు. నరసరావుపేట పట్టణంలోని ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన బహిరంగ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఐసిడిఎస్ ఏర్పడి ఐదు దశాబ్దాలు పూర్తయినా అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి తగిన వేతనాలు, భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును, గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. 2019 నుంచి వేతనాల పెంపు జరగలేదని, 42 రోజుల చారిత్రాత్మక సమ్మె అనంతరం 2024 జూలైలో ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీ కూడా ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో బీఎల్ఓలకు సహాయకులుగా అంగన్వాడీ కార్యకర్తలను నియమించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంజనేయులు నాయక్ కోరారు. ఇప్పటికే పలు యాప్‌ల నిర్వహణతో తీవ్ర పనిభారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న అంగన్వాడీలపై ఎన్నికల విధులు, 'నవచేతన' యాప్ బాధ్యతలను మోపడం తగదన్నారు. రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై. రాధాకృష్ణ, పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కు తగిన నిధులు కేటాయించకుండా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల హామీలను అమలు చేయలేదన్నారు. 1972 గ్రాట్యుటీ చట్టం ప్రకారం సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకొని పదవీ విరమణ ప్రయోజనాలను అందరికీ సమానంగా వర్తింపజేయాలని, మధ్యలో ఉద్యోగం మానేసిన వారికి, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు కూడా చట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లలో ఐదేళ్ల సీనియారిటీ నిబంధనను సవరించాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని, పెండింగ్ టీఏ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ధర్నా నిర్వహణపై ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జై.కృష్ణకిరణ్ జిల్లాలో పర్యటిస్తూ ఆందోళనను అడ్డుకునే ప్రయత్నం చేయడం తగదని నాయకులు విమర్శించారు. అనంతరం యూనియన్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్.. అంగన్వాడీలను బీఎల్ఓలకు సహాయంగా ఉంచే అంశంపై సానుకూలంగా స్పందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.శివకుమారి, షేక్ సిలార్ మసూద్, హనుమంత రెడ్డి, పేరుబోయిన వెంకటేశ్వర్లు, తెలకపల్లి శ్రీనివాస రావు, సూరిబాబు, రాజకుమార్, యూనియన్ నాయకులు జయలక్ష్మి, కవిత, శివపార్వతి, సావిత్రి, నిర్మల, సాయి, మాధవితో పాటు 400 మందికి పైగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

# మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో పాఠశాల విద్యార్థుల క్యాబినెట్ ప్రమాణస్వీకారోత్సవం వేడుక ఘనంగా నిర్వహణ

**రేపల్లె జులై 10 మనసులోమాట**




రేపల్లె పట్టణంలోని స్థానిక మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో వివిధ తరగతుల నుండి విద్యార్థి నాయకులు మరియు లిటరరీ, కల్చరల్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, సోషల్ సర్వీస్ విభాగాలకు సంబంధించి నాయకులను ఎన్నుకొని వారి చేత ప్రమాణ స్వీకార వేడుక అత్యంత వైభవంగా శుక్రవారంనిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ రైల్వే గుంటూరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ గారైన సిహెచ్. ప్రదీప్ మరియు గౌరవ అతిథిగా విజయవాడ సెయింట్ మ్యాథ్యూస్ పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ బాలా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ ముఖ్య అతిథులు ప్రదీప్ విద్యార్థుల ఉద్దేశించి నాయకత్వం అనేది గౌరవంతో పాటు గొప్ప బాధ్యత అని, విద్యార్థులు నిజాయితీ, అంకితభావం, సమయపాలనతో పాటు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ బ్రదర్ కిరణ్ కుమార్ మరియు వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ ప్రదీప్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల విద్యా ప్రమాణాలనుంచి వివరించారు

# కొల్లూరు మండలంలో నేడు విద్యుత్ కు అంతరాయం

**కొల్లూరు,జూలై 10(మనసులో మాట):**



కొల్లూరు, జువ్వలపాలెం, చిలుమూరు, ఈపూరులంక సబ్ స్టేషన్ కింద ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొల్లూరు ఇన్చార్జి ఏఈఈ సాయి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం కొల్లూరులో ఆయన మాట్లాడుతూ విద్యుత్ మరమ్మత్తు పనులు జరుగుతున్నందున చిలుమూరులంక, సుగ్గుణలంక, ఈపూరులంక, చింతల్లంక, పెదలంక, తిప్పలకట్ట, జువ్వలపాలెం, కిష్కిందపాలెం, పోతార్లంక, తడికలపూడి, తురకపాలెం, తోకలవానిపాలెం, కొల్లూరు, తాడిగిరిపాడు, రావింకంపాడు, క్రాప, బోద్దులూరుపాడు, దోనెపూడి, చిన్నపులివర్రు ఈపూరు, చిలుమూరు, అనంతవరం లో నేడు అనగా రెండవ శనివారం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్తు వినియోగదారులు తమకు సహకరించాలన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముద్దాయికి 15 రోజుల జైలు శిక్ష

**దుర్గి జూలై 10 ( మనసులో మాట)**



రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా దుర్గి పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో దుర్గి మండలం, ఆత్మకూరు గ్రామానికి చెందిన ముత్యాల శాంతి రెడ్డి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. గోపాల్ అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, నిందితుడిని మాచర్ల IIవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి & II తరగతి న్యాయ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం నిందితునికి 15 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. బి. గోపాల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమే కాకుండా, ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యుల భద్రతతో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు దుర్గి మండల పరిధిలో నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నేడు రేపల్లెలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**రేపల్లె జులై 10 మనసులోమాట**

రెండవ శనివారంఅనగా నేడు 11వతేది ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు మరియు సాయంత్రం 3:30గంటల నుంచి రాత్రి 6:30గంటల వరకు రేపల్లె టౌన్ లో 33కే వి నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నందున ఇసుకుపల్లి , నిజాంపట్నం రోడ్డుకి ఇరువైపుల, మజీద్ సెంటర్, బస్టాండ్ సెంటర్ , ఓపెన్ థియేటర్ వెనుక వైపు, సింగంబసవపున్నయ్యబజారు,ఎంసిఐ ఏరియా మరియు బేతపూడి, ఉయ్యూరువారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఏ డీ ఈ శ్యామ్ సుందర్ బాబు తెలియజేశారు

మనసులోమాట



## రేపల్లి పట్టణంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి ఆకస్మికంగా తనిఖీ

**రేపల్లె జులై 10 మనసులోమాట**

రేపల్లె మండలంలో రేపల్లె పట్టణంలో ఉన్న ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి ఏ. లక్ష్మి ఆకస్మికంగా సందర్శించి తనిఖీశుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నూతన విధానంలో ఏ పి ఎ ఐ ఎం ఎస్ 2.0 యాప్ మరియు ఎల్ ఎఫ్ ఎం ఎస్ ద్వారా ఎరువుల విక్రయాలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. రైతుల వివరాలు నమోదు చేసే విధానం, బయోమెట్రిక్ మరియు ఓటీపీ ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానానికి అనుగుణంగా అన్ని ఎరువుల డీలర్లు తప్పనిసరిగా ఏ పి ఐ ఎం ఎస్ 2.0 మరియుఎల్ ఎఫ్ ఎం ఎస్ పోర్టళ్లలో నమోదు చేసుకుని, రైతులకు బయోమెట్రిక్ లేదా ఓటీపీ ధృవీకరణ అనంతరం మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. ఈ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అర్హులైన రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఈ తనిఖీలలో సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ డి ఏ ) శ్రీ వి. రమేష్‌బాబు మండల వ్యవసాయాధికారి ఎ. మహేష్‌బాబు మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు...

## పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు విజ్ఞప్తి

- తప్పనిసరి అయిన నీటి పొదుపు

**చిలకలూరిపేట జులై 10 మనసులో మాట**



ఎల్ నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో రుతుపవనాలు విఫలమయ్యాయని, దీని కారణంగా నాగార్జున సాగర్, శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రాజెక్టులలో నీటి మట్టాలు ఏమాత్రం పెరగలేదని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు తెలిపారు. నాగార్జున సాగర్ నిండితేనే కుడి కాలువ ద్వారా చిలకలూరిపేట పట్టణంలోని ఎస్.ఎస్ ట్యాంకులకు త్రాగునీరు సరఫరా అవుతుందని ఆయన వివరించారు. అయితే, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టుల్లోకి నీరు రాలేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం పట్టణ చెరువుల్లో ఉన్న నీటి నిల్వలు కేవలం మూడు నెలలకు మాత్రమే సరిపోతాయని కమిషనర్ వెల్లడించారు. ఈ మూడు నెలల తర్వాత కూడా వర్షాలు పడకపోతే, మనకు వేరే ప్రత్యామ్నాయ నీటి వనరులు లేనందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున, పట్టణ ప్రజలందరూ పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మంత్రి సత్య ప్రసాధా లేక శివప్రసాద

- రేపల్లె నియోజకవర్గం లో ఎవరు శాసనసభ్యులు అర్థం కాని పరిస్థితి
- అయోమయంలో నియోజకవర్గ ప్రజలు

**రేపల్లె జులై 10 మనసులోమాట**



రేపల్లె నియోజకవర్గం లో శాసనసభ్యులు అనగాని సత్యప్రసాధా లేక వారి సోదరుడు శివప్రసాధా అని ప్రజలలోఆలోచన మొదలైందని వైఎస్ఆర్సిపి రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త పీత నాగమోహన్ కృష్ణ అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ శాసనసభ్యులు మంత్రిగా ఉన్నప్పటికీ పరిపాలన అంతా వారి సోదరుడు శివప్రసాద్ నడపటం ఆశ్చర్యంగా ఉందన్నారు నియోజకవర్గంలోని అధికారులు అందరూ శివప్రసాద్ కు వంగి వంగి దండాలు పెట్టే పరిస్థితి ఎందుకు వచ్చిందో అధికారులకు తెలియాలి అధికారులు అంతా పచ్చ చొక్కాలు తొడుకొని కార్యాలయాల్లో పనిచేయడం విడ్డూరంగా ఉందన్నారు దీనికి తోడు రేపల్లె పోలీస్ స్టేషన్ టిడిపి నాయకులకు సెటిల్మెంట్ చేసుకునే అడ్డగా మారిందని ఆయన అన్నారు డిఎస్పి ఆఫీసు టిడిపి కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్జాగా పేకాట ఆడటం వెనక మంత్రి హస్తం ఉందని ప్రజలు బాహాటంగానే నవ్వుకుంటున్నారు. శివప్రసాద్ ఆధ్వర్యంలో పేకాటలు కోడిపందాలు జోరుగా సాగుతున్న పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు నియోజకవర్గంలో టిడిపి నాయకులు ఆడింది ఆట పాడింది పాట లాగా సాగుతుందన్నారు ఇది కాక వైఎస్ఆర్సిపి అభిమానులు కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి శునకానందం పొందుతున్నారు అని అన్నారు వైఎస్ఆర్సిపి నాయకులు కేసులకు భయపడే పరిస్థితి లేదన్నారు ఇటీవల రేపల్లె మున్సిపాలిటీలోని 15,16 వార్డులలో 40 సంవత్సరాల నుంచి అక్కడే ఉంటూ చిన్న షాపులతో జీవనం కొనసాగిస్తున్న రెండు కుటుంబాలు గత కొద్ది రోజుల క్రితం ఆ వార్డులలో కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో భాగంగా రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ నాయకులతో కలిసి ప్రజలతో మమేకమై తిరుగుతూ ఉన్న సమయంలో ఆ రెండు కుటుంబాల వారు మోహన్ కృష్ణకి శాలువాతో సన్మానించారని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు తో వారి షాపులు పోరంబోకు పొలంలో ఉన్నాయని వాటిని కూల్చేయాలని మున్సిపల్ కమిషనర్ తో నోటీసులు జారీ చేయించడం జరిగింది. ఈ నోటీసుల జారీ విషయంపై కూటమి ప్రభుత్వాన్ని, మంత్రి అనగానే సత్య ప్రసాద్ ఆయన అన్న శివ ప్రసాద్ మరియు మున్సిపల్ కమిషనర్ పేదలపై చేస్తున్న ఆకృత్యాలను ఆపకపోతే ప్రజల పక్షాన నిలబడి న్యాయం చేకూరాల చేస్తామని రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ హెచ్చరించారు. డబ్బు సంపాదనే లక్ష్యంగా మంత్రి సోదరుడు శివప్రసాద్ కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ఆయన తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో డబ్బుతోనే అధికారం చేపట్ట వచ్చుననే తలపుతో అందిన కాడికి దోచుకుంటున్నారని అన్నారు. రానున్నది వైసిపి ప్రభుత్వం అని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అధికారులు ఇప్పటైన తమ పద్ధతిని మార్చుకోవాలని లేకుంటే ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన అన్నారు ఈ సమావేశంలో పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు మండల కన్వీనర్ ఎం అనిల్ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కే కృష్ణారెడ్డి వై మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సమస్యలు అధికారులు సమన్వయంతో పరిష్కరించాలి

**రేపల్లె జులై 10 మనసులోమాట**

ప్రజా సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి లో ప్రత్యేక ప్రజా సమస్యల పరిస్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రేపల్లె నియోజకవర్గంలో రేపల్లె మండలం, ఇసుక పల్లి గ్రామంలో శ్రీ భ్రమరాంబ చెన్న మల్లేశ్వర స్వామి వారి పురాణ కాలక్షేప మండపం నందు నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి మాట్లాడుతూ, ప్రజల నుండి స్వీకరించిన అర్జీలలో కొన్నింటికి ఆయన అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మరి కొన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఆయన అన్నారు. అధికారులు అర్జీలను నిశితంగా చదివి అర్థం చేసుకొని క్షేత్రస్థాయిలో వారి సమస్యను పరిశీలించి సరియైన పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీ చాలా ముఖ్యమైనదిగా భావించాలని ఆయన చెప్పారు. అధికారులు నిర్వహించే పనులను ఎప్పటికప్పుడు ఆన్లైన్ విధానం ద్వారా ఎక్సెల్ షీట్ లో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటూ జిల్లాను ర్యాంకింగ్లో 1 నుండి 3వ స్థానంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం జిల్లా ఆయా విభాగాలలో ఏ స్థానంలో ఉందో గమనించి ఆస్థానమును మెరుగుపరిచే విధంగా అధికారులు పనిచేయాలని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది తీసుకునే చర్యలపై వారి పనితనం ఆధారంగా అవార్డులు ఇవ్వడం జరుగుతుందని,అందుకు అధికారులు అవార్డుల కొరకు పోటీ పడుతూ పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులకు తెలిపారు. ఈనెల 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ముద్రించిన వాల్ పోస్టర్ను మరియు బ్యానర్ను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్. వి ఆవిష్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయమ్మ,రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీదేవి, రేపల్లె డిఎస్పి అబ్దుల్ అజీజ్,జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు మరియు పాల్గొన్నారు.








# టెంపుల్, రివర్ టూరిజంకు మహర్దశ

- **స్వదేశీ దర్శన్ పథకం కింద ఏపీలో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి**
- **కృష్ణా నది తీరాన రివర్ టూరిజం అభివృద్ధికి చర్యలు**
- **పర్యాటకులకు గోవా తరహాలో సౌకర్యాలు**
- **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకం**
- **అమరావతి రాజధాని అభివృద్ధితోపాటు చారిత్రక ప్రదేశాలకు మహర్దశ**

**దాచేపల్లి, జూలై 9 : (మనసులో మాట)**

ఏపీలో కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని టూరిజం హబ్బుగా ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. కృష్ణా నది తీరాన ఉన్న ప్రకృతి అందాలు, పర్యాటక ప్రదేశాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. అదేవిధంగా కృష్ణా నది తీరంలో అనేక చారిత్రక దేవాలయాలు ఉన్నాయి. ఆయా దేవాలయాల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కృష్ణా నదిలో ముఖ్యమైన ప్రాంతాలలో బోటింగ్ సౌకర్యం కల్పించి పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం కల్పించనున్నారు. అదేవిధంగా నవ్యాంధ్ర రాజధాని అమరావతికి బౌద్ధమతంతో ప్రత్యక్ష పరోక్ష సంబంధం ఉండడంతో ఏపీని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తయారుచేయాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర పర్యాటక శాఖలు ఏపీలో బౌద్ధ సర్క్యూట్ ను ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. అమరావతి రాజధాని ఐకానిక్ గా పిలవబడే ధ్యాన బుద్ధ విగ్రహం అమరావతి దాన్య కటకం లో 125 అడుగుల ధ్యాన బుద్ధ విగ్రహం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ బౌద్ధ వారసత్వానికి చిహ్నం గా ఉన్న ధ్యాన బుద్ధ విగ్రహం కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కృష్ణా నది ఒడ్డున 4.5 ఎకరాల్లో 2003లో ప్రారంభమై 2015లో పూర్తైన ఈ విగ్రహం ధ్యాన ముద్రలో బుద్ధుని చూపిస్తుంది. ఎనిమిది స్తంభాలు, కమల పునాది అష్టాంగ మార్గానికి ప్రతీకగా ఉంది ఉంది. అడుగుల్లో మూడు అంతస్తుల ప్రదర్శనశాలలు బౌద్ధ కళలను ఆవిష్కరిస్తున్నాయి. రూ.1.85 కోట్లతో ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రణాళికల్లో రాజధాని గేట్‌వేగా అభివృద్ధి చేస్తున్నారు. అమరావతి మహాచైత్య స్తూపంతో కలిసి బౌద్ధ హెరిటేజ్ కేంద్రంగా మారుతోంది. ఈ ప్రాజెక్ట్ సాంస్కృతిక, ఆర్థిక పునరుజ్జీవనానికి దోహదపడుతుంది. బౌద్ధ మతానికి ప్రపంచ ప్రసిద్ధ కేంద్రం. ప్రధానంగా మహాస్తూపం, ధ్యాన బుద్ధ విగ్రహం వంటి స్థలాలు ఉండటంతో ఈ ప్రాంతం ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. అమరావతి మహాచైత్య స్తూపం కు ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉంది. క్రీ.శ. 23 శతాబ్దాల్లో శాతవాహనులు నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద స్తూపాలలో ఇది ఒకటి, బుద్ధుని జీవిత శిల్పాలతో

**ధ్యాన బుద్ధ విగ్రహం:**

125 అడుగుల ఎత్తు గల ధ్యాన ముద్రలో బుద్ధ విగ్రహం, పునరుద్ధరణలో ఉంది. అశోకుడు స్థూపాలు నిర్మించాడని చరిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. ధరణికోట (ధాన్య కటకం)లో బుద్ధుడు కాలచక్రం బోధించినట్లు ప్రసిద్ధి. ఇటీవల బౌద్ధ ఆనవాళ్లు కూడా బయల్పడ్డాయి. శతాబ్దం నుంచి క్రీ.శ. 3వ శతాబ్దం వరకు శాతవాహనుల కాలంలో నిర్మితమైన ప్రపంచ ప్రసిద్ధ బౌద్ధ చైత్యం గా చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఈ మహాస్థూపం వివిధ దశలలో నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతుంది మొదటి దశ (క్రీ.పూ. 43 శతాబ్దాలు): అశోకుడికి ముందు చైత్య కేంద్రం ఏర్పడి ఉండటం వల్ల మౌర్యుల కాలంలో ప్రారంభమైంది. రెండవ దశ: అశోకుడు విస్తరించాడని శాసనాలు చెబుతాయి.

**మూడవ దశ (క్రీ.పూ. 1-2 శతాబ్దాలు):**

శాతవాహనులు, నాగార్జునుడు పునరుద్ధరించి శిల్పకళాపు మహోన్నతి సాధించారు. 14వ శతాబ్దం వరకు బౌద్ధం మతం మరుగున పడింది. 1797లో కల్నల్ కోలిన్ మెకెంజీ త్రవ్వి వెలుగులోకి తీసుకువచ్చారు. శిల్పాలు లండన్ బ్రిటిష్ మ్యూజియంలో నేటికీ ప్రదర్శించబడుతున్నాయి.

అమరావతి (ధరణికోట)లో బుద్ధుడు కాలచక్రం ప్రవచించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అమరావతి మౌర్యులు, శాతవాహనుల పాలనలో రాజధానిగా (ధాన్యకటకం లేదా ధరణికోట అని పిలిచేవారు) చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్ ఈ ప్రదేశ వైభవాన్ని ప్రశంసించాడు. అమరావతి స్తూపం శాతవాహనుల కాలంలో (క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి) నిర్మితమైన బౌద్ధ కళలకు చిహ్నం, కృష్ణదేవరాయలు 1517లో ఇక్కడ తులాభారం చేసి పేదలకు బంగారు పంచారని శాసనాలు చెబుతున్నాయి. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పాలనలో అమరావతి సంస్థానంగా వృద్ధి చెందింది, అమరలింగేశ్వరస్వామి గుడిని పునరుద్ధరించాడు. 2014 ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దీన్ని రాజధానిగా ఎంచుకుంది, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతికి పూర్వ వైభవం సాధించే దిశగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**ఇప్పుడు అందరి అంగీకారంతో రాజధాని**

ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ మతానికి సంబంధించిన చారిత్రక ప్రదేశాలను సందర్శించడానికి ముఖ్యమైన బౌద్ధ సర్క్యూట్ (Buddhist Circuit) ప్రాంతాలను గుర్తించారు.

**అమరావతి (పల్నాడు జిల్లా):**

ఇది అత్యంత ముఖ్యమైన బౌద్ధ క్షేత్రం. ఇక్కడ ప్రసిద్ధ మహాస్తూపం ఉంది, ఇది క్రీ.పూ 3వ శతాబ్దానికి చెందినది. ఇక్కడి ధ్యాన బుద్ధ విగ్రహం (125 అడుగులు) ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. నాగార్జునకొండ : బౌద్ధ దార్శనికుడు, రెండో బుద్ధుడిగా పేరొందిన ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల, 'బుద్ధం శరణం గచ్ఛామి' అని మారు మోగిన ప్రాంతం. ఆగ్నేసియా దేశాలకు బౌద్ధమతాన్ని విస్తరింప చేసిన ప్రాంతం ఆచార్య నాగార్జునుడు ఇక్కడ నివసించినట్లు చరిత్ర చెబుతోంది. ఇది నాగార్జున సాగర్ డ్యామ్ మధ్యలో ఒక ద్వీపంగా ఉంటుంది. ఇక్కడ అనేక స్తూపాలు, విహారాలు ఒక పురావస్తు మ్యూజియం నేటికీ ఉన్నాయి.

**విశాఖపట్నం పరిసర ప్రాంతాలు:**

తొట్లకొండ: సముద్ర మట్టానికి 128 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ కొండపై ప్రాచీన బౌద్ధ విహారాలు ఉన్నాయి. బావికొండ: ఇక్కడ బౌద్ధ భిక్షువులు ధ్యానం చేసుకునేవారు. ఇక్కడ బుద్ధుని అస్థికలు ఉన్నాయని నమ్మే స్తూపాలు బయటపడ్డాయి.

**బొజ్జన్నకొండ & లింగాలకొండ:**

సంకరం గ్రామం వద్ద ఉన్న ఈ కొండలపై రాతితో చెక్కబడిన అద్భుతమైన గుహాలయాలు మరియు స్తూపాలు కనిపిస్తాయి.

**ముఖ్య వివరాలు:**

విజయపురి సౌత్, పల్నాడు జిల్లా (ఆంధ్రప్రదేశ్) / నల్గొండ జిల్లా (తెలంగాణ) సరిహద్దు గా ఉంది

ప్రస్తుతం ఉన్న పాత ఎయిర్‌స్ట్రిప్‌ను అప్‌గ్రేడ్ చేసి, వాటర్ ఏరోడ్రోమ్‌గా (సీప్లేన్ల కోసం) కూడా అభివృద్ధి చేసే యోచన ఉంది. నాగార్జునసాగర్ డ్యామ్, విజయపురి సౌత్ ప్రాంతంలో పర్యాటకాన్ని మెరుగుపరచడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం, నాగార్జునసాగర్‌కు అత్యంత సమీపంలో విజయవాడ విమానాశ్రయం ఉంది. నాగార్జున కొండ ఆగ్నేయాసియా దేశాలకు బౌద్ధమతాన్ని విస్తరించిన ముఖద్వారం, నాగార్జునుడు తన మలి జీవితాన్ని గడిపిన ప్రదేశం గా చరిత్రలో ఉంది. ఇక్కడ సమీపంలోని అనుపు వద్ద అప్పట్లోనే ఆచార్య నాగార్జునుడు విశ్వవిద్యాలయం నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలు నేటికీ ఉన్నాయి. విద్యారంగంలో ఆచార్య నాగార్జునుడు చేసిన కృషికి గుర్తింపుగా గుంటూరు వద్ద ఆయన పేరుతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. అంతేగాక కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యలతో కృష్ణా నది తీరం,

# విద్యార్థి దశ నుంచే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలి



**గుంటూరు జూలై 10(మనసులో మాట )::-** ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయం విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని జర్మనీకి చెందిన ఫ్యూచర్ ఫార్మింగ్ (Future Farming) సంస్థ ప్రతినిధి జాస్పర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జర్మనీకి చెందిన ఫ్యూచర్ ఫార్మింగ్ సంస్థ ప్రతినిధి జాస్పర్, కెన్యా బృంద సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం, ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యవసాయంపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు 2,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో "గ్లోబల్ ఫార్మింగ్ స్కూల్" నమూనాను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి దశలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాస్పర్ మాట్లాడుతూ, గ్లోబల్ ఫార్మింగ్ స్కూల్ నమూనా ద్వారా విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి విధానాలను నేర్చుకోవడంతో పాటు ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంపొందించుకుంటారని తెలిపారు. యువత తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వ్యవసాయాన్ని కూడా ఒక గౌరవప్రదమైన వృత్తిగా స్వీకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి రాజకుమారి, రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రైతులు, రైతు సాధికార సంస్థ అకాడమీ సీనియర్ థిమాటిక్ లీడ్ శ్రీ సుధాకర్, రైతు సాధికార సంస్థ సిబ్బంది, స్థానిక ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చదలవాడ "ప్రజా వేదిక"లో 21 అర్జీల స్వీకరణ



- **తక్షణ పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ**

**నరసరావుపేట జూలై 10 (మనసులో మాట)::** ప్రజా సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యత అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్‌లోని శాసన సభ్యుల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ప్రజా వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొని నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. పెన్షన్లు, నివేశన స్థలాలు, మౌలిక సదుపాయాలు, శానిటేషన్ వంటి పలు సమస్యలకు సంబంధించి మొత్తం 21 అర్జీలు అందాయి. వాటిలో కొన్ని సమస్యలను ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సత్వర పరిష్కారం చూపడమే ప్రజా వేదిక ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు తెలిపారు. మిగిలిన అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



**చీరాల జులై 10 ( మనసులో మాట)**
ప్రజల సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ నందు ప్రజల నుండి స్వయంగా అర్జీలు స్వీకరించిన సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు తమ సమస్యలను ప్రజా దర్బార్ ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అధికారులు కూడా ప్రజా దర్బార్లో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. ఎమ్మెల్యే పాల్గొన్న ప్రజా దర్బార్ కు మొత్తం 20 పైగా అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం 4 అర్జీలు ఇంటి స్థలాల కోసం 10, పింఛన్ల కోసం 1 ఇతర సమస్యలపై మరో ఐదు అర్జీలు వచ్చాయని తెలిపారు.ఈనాటి కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుద్దంటి చంద్రమౌళి, నాసిక వీర భద్రయ్య, ఏఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత ,పట్టణ అధ్యక్షులు సురేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి నాగేంద్రమణి, నాగలక్ష్మి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటుంది

- **జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందిస్తుంది**
- **పొందూరు గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు**
- **సచివాలయంలో సర్ ప్రోగ్రాం పరిశీలన**
- **ఇరిగేషన్ కెనాల్ పరిశీలన, అంగన్వాడి భవనం మరమ్మత్తులు, స్థానిక ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పరిశీలన,**
- **నిరుపయోగంగా ఉన్న క్రిస్టియన్ కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకు పరిశీలన**
- **త్రాగునీటి విషయాన్ని సమీక్షించిన కలెక్టర్**



**టంగుటూరు జులై 10, (మనసులో మాట)**
ప్రజలకు ప్రభుత్వం అన్నివేళలా అందుబాటులో ఉంటుందని అదేవిధంగా జిల్లా యంత్రాంగం కూడా అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి .రాజాబాబు పేర్కొన్నారు. గురువారం రాత్రి టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు పలువురు నాయకులు లేవనెత్తి నటువంటి పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు .అందులో భాగంగా కాలనీలో ఇంటింటికి తిరిగి చెత్త ఎప్పుడు చెత్తను చేస్తున్న విధానాన్ని విధంగా కార్మికులు తీసుకుపోతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ కెనాల్స్, అంగన్వాడి స్కూలు, ఎస్సీ కాలనీ, త్రాగునీటి సమస్యలు, లిఫ్ట్ ఇరిగేషన్( ఎత్తిపోతల పథకం) చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఇతరాలను పరిశీలించిన పిదప జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు సత్వర పరిష్కార దిశగా పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వాటి అమలు తీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే ప్రధాన ఉద్దేశం అని అదేవిధంగా స్థానిక సమస్యలను ప్రజల సమక్షంలోనే ముఖాముఖి నిర్వహించి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి జిల్లాస్థాయిలో నిధులతో కూడిన వైతే కన్వర్జెన్స్ ఫండ్స్ ద్వారా చేపట్టడం జరుగుతుందని లేదా పెద్ద మొత్తంలో నిధులు అవసరమయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. మూడు మండలాలను కలిపే కనెక్టివిటీ గల రోడ్డును పల్లె నిద్ర సమయంలో తన దృష్టికి తీసుకొని వచ్చారని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు, అంగన్వాడి భవనాలు, త్రాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం తో పాటు ప్రభుత్వంపై అవగాహనను తెలుసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. పొందూరు గ్రామస్తులు సమస్యలను తెలియజేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి కూడా ప్రస్తావించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో సర్ ప్రోగ్రాం పై తీసుకుంటున్న చర్యలు గురించి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్న పాప అక్షయకు పుట్టుకతోటే షుగర్ వ్యాధి బాధపడుతున్న దృష్ట్యా ఉచితంగా ఇన్సులిన్ ను ఇచ్చే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డిపిఓ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిఆర్డిఏ పిడి మరియు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏ.ఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల 'ఫైనల్ ఫీస్టా 2026' వీడ్కోలు వేడుకలు

- పరిశోధనలపై దృష్టి పెట్టి దేశ పురోగతిలో భాగస్వాములు కావాలి
- కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి



**నరసరావుపేట జూలై 10 (మనసులో మాట)::**

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారి పాలెం గ్రామంలో ఉన్న ప్రముఖ విద్యాసంస్థ 'ఏ ఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల' నందు శుక్రవారం నాడు నాలుగవ సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థుల వీడ్కోలు వేడుక 'ఫైనల్ ఫీస్టా 2026' అత్యంత వైభవంగా జరిగింది. తృతీయ సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థులు తమ సీనియర్లకు ఈ వీడ్కోలు విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పరిశోధనల పట్ల అంకితభావంతో పనిచేయాలని, తద్వారా తమ భవిష్యత్తును మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం భారతదేశంలో అనేక రకాలైన ఫార్మా పరిశోధనలు జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలను మలుచుకుని రానున్న రోజుల్లో దేశ పురోగతిలో ముఖ్యపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. తమ కళాశాలలో ఫార్మసీ విద్యను పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు దేశ, విదేశాలలో ఎంతో సుస్థిరంగా స్థిరపడినారని, గత 18 సంవత్సరాల నుండి పూర్వ విద్యార్థుల ద్వారా ఎన్నో రకాల సేవా, విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విచ్చేసిన కళాశాల గ్లోబల్ సెక్రటరీ అట్లూరి మానస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావ అలవర్చుకుని తమ తల్లిదండ్రుల ఆశలకు, కలలకు అనుగుణంగా ఎదగాలన్నారు. నాలుగవ సంవత్సరం బి.ఫార్మసీ కోర్సును పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి ఏఎమ్ రెడ్డి విద్యాసంస్థల ద్వారా పలు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను అందించడం ఎంతో సంతోషకరమని తెలియజేశారు. అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు అనుగుణంగా కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు మరియు అన్ని సదుపాయాలతో కూడిన ప్రశాంతమైన కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులకు అందించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ ఘనమైన వీడ్కోలు వేడుకల్లో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. మల్లికార్జున్, డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. కృష్ణారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నేడు నకరికల్లు మండలంలో విద్యుత్ నిలిపివేత!

**నకరికల్లు జూలై10(మనసులో మాట)**

నకరికల్లు మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఏపీసీపీడీసీఎల్ కీలక సూచన చేసింది. ఈరోజు శనివారం (11 072026) మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న 33 కేవీ, 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపీసీపీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (AEE) జి. సుచరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు



# డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ ప్రారంభించిన డాక్టర్ కొత్తపల్లి బాబురావు

**చేబ్రోలు జూలై10(మనసులో మాట)**

మండలం శేకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని వేజెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కొత్తపల్లి బాబురావు శేకూరులో జెండా ఊపి ప్రారంభించారు . శేకూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది కలిసి గ్రామంలో డెంగ్యూ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ కొత్తపల్లి బాబురావు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వైరస్ వలన వస్తుందని కానీ ఒకరి నుంచి ఒకరికి దోమ కాటు వలన



వ్యాప్తి చెందుతుందని తెలిపారు. డెంగ్యూని ప్రారంభ దశలో గుర్తించినట్లయితే సులువుగా చికిత్స చేసి పూర్తిగా నయం చేయవచ్చునని ప్రజల సొంత వైద్యము చేసుకొనుట ద్వారా ఈ వ్యాధి ముదిరి ఆసుపత్రిలో చేరే పరిస్థితిని తీసుకొని వస్తుందని తెలిపారు. డెంగ్యూ వ్యాధిలో జ్వరము, తలనొప్పి, కండరాల నొప్పులు, కనుగుడ్ల నొప్పులు, ఒంటిపై దద్దురు ఒంటి లక్షణాలు కనబడతాయని అరుదుగా కొంతమందిలో చిగుళ్ల వెంట ముక్కు నుండి రక్తము కారుతుంటుందని ఈ లక్షణాలు ఎవరికైనా కనిపించినట్లయితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో తగు పరీక్షలను చేయించుకొని వైద్యాధికారి సలహా మేరకు తగు మందులను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వజ్జా రామారావు, సోమిశెట్టి సాయిబాబు, కొమ్మిరెడ్డి వెంకటరెడ్డి ,కారుమూరి రాజేంద్రప్రసాద్ , సచివాలయ ఆరోగ్య కార్యదర్శి బాణావత్ నాగేంద్రంభాయ్,యం.యల్.హెచ్ పి.శీలంఅనూష,ఆశాకార్యకర్తలు ప్రవంతి, దేవమణి ,బుజ్జి ,ఉమారాణి, సుమతి,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# టీసీఎస్ ప్రాంగణ ఎంపికల్లో విజ్ఞాన్స్ లారా విద్యార్థుల సత్తా

- 62 మందికి ప్రముఖ ఐటీ సంస్థలో ఉద్యోగాలు.. రూ.9.09 లక్షల వరకు వార్షిక వేతనం

**చేబ్రోలు జూలై 10 (మనసులో మాట)::**

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 62 మంది విద్యార్థులు ప్రముఖ బహుళజాతి ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆకర్షణీయమైన వార్షిక వేతనాలతో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఫణీంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు.
ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, ఎంపికైన వారిలో 12 మంది రూ.9.09 లక్షల వార్షిక వేతనంతో ప్రైమ్ రోల్‌కు, 36 మంది రూ.7.09 లక్షల వార్షిక వేతనంతో డిజిటల్ రోల్‌కు, 14 మంది రూ.3.46 లక్షల వార్షిక వేతనంతో నింజా రోల్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యాలను గుర్తించిన టీసీఎస్ సంస్థ ఈ అవకాశాలను కల్పించిందని పేర్కొన్నారు.
విభాగాల వారీగా ఎంపికైన వారిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) నుంచి 30 మంది, సీఎస్‌డీ నుంచి 11 మంది, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) నుంచి 6 మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (సీఎస్ఎం) నుంచి 6 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) నుంచి 5 మంది, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) నుంచి 3 మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (సీఏఐ) నుంచి ఒక విద్యార్థి ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.
విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కళాశాలలో మొదటి సంవత్సరం నుంచే సాంకేతిక విద్యతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కోడింగ్, ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూలు, ప్రత్యేక ప్లేస్‌మెంట్ శిక్షణను అందిస్తున్నామని ప్రిన్సిపల్ వివరించారు. ఈ సమగ్ర శిక్షణ ఫలితంగానే ప్రతి సంవత్సరం ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో విద్యార్థులు అత్యుత్తమ ఉద్యోగ అవకాశాలను సాధిస్తున్నారని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, ప్రతి విద్యార్థికి ఉత్తమ ఉపాధి అవకాశాలు కల్పించడమే విజ్ఞాన్ లక్ష్యమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఫణీంద్ర కుమార్, వివిధ విభాగాల అధిపతులు, ప్లేస్‌మెంట్ విభాగం ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ ఉద్యోగ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నరసరావుపేటలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం



- పెన్షన్, ఇళ్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, జూలై 10 (మనసులో మాట)::**
రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వర్తింపజేయాలని, ప్రభుత్వం తరపున ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రానున్న ఆగస్టు అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నిస్తానని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హామీ ఇచ్చారు. శుక్రవారం నరసరావుపేట ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగులు అంటేనే నిరంతర శ్రామికులు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ కార్మికులుగా వీరు చేసిన కృషి వల్లే నేడు నాలాంటి వారు డాక్టర్లు, ఎమ్మెల్యేలుగా ఎదిగారాని అన్నారు. నేను గుంటూరు మెడికల్ కాలేజీలో చదివే రోజుల్లోనూ తర్వాత ప్రాక్టీస్ పెట్టినప్పుడూ ఆర్టీసీ సిబ్బంది ఎంతో అభిమానంగా నా వద్దకు వచ్చేవారని గుర్తుచేసుకున్నారు. కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యం ఉన్న తాను చిన్నప్పటి నుంచే ఉద్యమాల్లో పాల్గొన్నానని, ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ సాధన కోసం అనేకసార్లు పోరాడానని తెలిపారు. పోలీసుల కంటే ఎక్కువ కష్టపడే ఆర్టీసీ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. వారు సంతోషంగా జీవించేందుకు పెన్షన్ అవసరమని పేర్కొన్నారు.రానున్న ఆగస్టు అసెంబ్లీ సమావేశాల్లో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వర్తింపజేయాలని, ప్రభుత్వం తరపున ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రస్తుతం వస్తున్న రెండు, మూడు వేల రూపాయల పెన్షన్ సరిపోవడం లేదని, కనీసం ఐదు వేల నుంచి పది వేల రూపాయల పెన్షన్ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మానవత్వం ఉన్న నాయకుడు. ఆయన దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తాం. రాష్ట్రంలో సుమారు 36 వేల మంది రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. ఉపాధ్యాయులను ఆదుకున్నట్లే వీరినీ ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ అరవింద బాబు తెలిపారు. శరీరాన్ని సైతం తాకట్టు పెట్టి ప్రజలకు సేవ చేసిన ఆర్టీసీ ఉద్యోగులను ఎవరూ మర్చిపోలేరు. మీ సేవలు ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని ఆయన కొనియాడారు.ఈ సమావేశంలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు పూర్ణచంద్రరావు, వేణు, స్థానిక నాయకులు కపలవాయి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## సి.యం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు, జూలై 10( మనసులో మాట)**
తుళ్ళూరు మండలం వెంకటపాలెం టి.టి.డి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతిపాదిత రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో పర్యటించే అవకాశాలు ఉన్న దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే అవకాశాలు ఉన్న కార్యక్రమంపై స్పష్టత రావాలని, తదనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వచ్చే రహదారి, బందోబస్తు, పార్కింగ్, తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లిలో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర, జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం

- బేడ బుడగ జంగం కమ్యూనిటీకి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలి: రాష్ట్ర అధ్యక్షులు ఎలమర్తి మధు డిమాండ్
- కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి.. స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఉధృత ఉద్యమాలు చేపడతాం: ఎలమర్తి మధు హెచ్చరిక



**తాడేపల్లి జూలై 10 (మనసులో మాట )::**
తాడేపల్లి పోలకంపాడులోని ఆర్ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం అత్యంత ఉత్కంఠభరితంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలమర్తి మధు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎస్సీ జాబితాలోని 59 కులాల్లో సీరియల్ నంబర్-9లో ఉన్న బేడ బుడగ జంగం కమ్యూనిటీ గత 18 సంవత్సరాలుగా తీవ్రమైన అన్యాయానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2008 జూలై 17న జారీ చేసిన జీవో నెం.144 కారణంగా తమ సామాజిక వర్గానికి కుల ధృవీకరణ పత్రాల జారీ నిలిచిపోయిందని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగాలు, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలన్నీ కుల ధృవీకరణ పత్రాలతో అనుసంధానమై ఉండటంతో వేలాది కుటుంబాలు ప్రభుత్వ ఫలాలకు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బేడ బుడగ జంగం పేరుతో జంగం కమ్యూనిటీకి చెందిన కొందరు ఎస్సీ సర్టిఫికెట్లు పొందుతున్నారనే అభిప్రాయంతో ప్రభుత్వం జీవో 144ను తీసుకువచ్చిందని, అయితే దాని వల్ల అసలు రాజ్యాంగబద్ధమైన బేడ బుడగ జంగం కమ్యూనిటీ ప్రజలే తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ప్రస్తుతం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం వరకు అన్ని ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో తాము 2,510 కిలోమీటర్ల పాదయాత్ర, 3,648 కిలోమీటర్ల సైకిల్ యాత్ర, ఆమరణ నిరాహార దీక్షలు, రిలే నిరాహార దీక్షలు సహా అనేక ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. 2018 మార్చి 27న ఉండవల్లి ప్రజావేదిక సమీపంలో లక్షలాది మందితో భారీ సభ నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి బేడ బుడగ జంగం కమ్యూనిటీకి న్యాయం చేస్తానని హామీ పొందామని గుర్తు చేశారు. 2018లో ఏర్పాటు చేసిన జేసీ శర్మ కమిషన్ నివేదికను ప్రతి ప్రభుత్వం కేంద్రానికి పంపించడం వరకే పరిమితమైందని, పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నాయకులు తమ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ తాడిపత్రి, నందికొట్కూరు సహా అనేక నియోజకవర్గాల్లో తమ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కూడా ఈ సమస్యను తన సమస్యగా ప్రకటించారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ బేడ, బుడగ జంగం కమ్యూనిటీ సమస్యకు ఇంకా శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ కులాల జాబితాలో కూడా బేడ బుడగ జంగం పేరు లేకపోవడంతో చిన్నారులు మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు, విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెడ్ బుక్ గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం తమ సమస్యను ఏ బుక్‌లో నమోదు చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. తాడిపత్రి, నందికొట్కూరు సహా రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో యువగళం సందర్భంగా నారా లోకేష్‌కు వినతిపత్రాలు అందజేసి సమస్య వివరించామని, అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వెంటనే చర్చించి జేసీ శర్మ కమిషన్ నివేదికకు ఆమోదం తెచ్చి పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉండవల్లిలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఉద్యమ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం విజయవాడ ధర్నా చౌక్‌లో నెల రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించడంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట కూడా రిలే నిరాహార దీక్షలు చేపడతామని ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తుండిపోయేలా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 18 సంవత్సరాలుగా పేద కుటుంబాలు విరాళాలు సేకరించి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాయని, ఇక భరించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే ఇంటింటి ముందు పాయిజన్ తీసుకుని నిరసన చేపడతామని, ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అయితే ప్రభుత్వం ఉద్యమం ప్రారంభానికి ముందే కేంద్రంతో చర్చించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమకు బీసీ హోదా గానీ, ఇతర రిజర్వేషన్లు గానీ అవసరం లేదని, రాజ్యాంగబద్ధంగా ఎస్సీ జాబితాలో ఉన్న తమ హక్కును మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల్లో బేడ బుడగ జంగం కమ్యూనిటీ ఎస్సీగా గుర్తింపు పొందుతోందని, స్వాతంత్ర్యానికి ముందే ఆంధ్రప్రదేశ్‌కు వలస వచ్చి 2008 వరకు ఇక్కడ కూడా ఎస్సీ ధృవీకరణ పత్రాలు పొందామని వివరించారు. డాక్టర్ బాబాసాహెబ్ Ambedkar రూపొందించిన రాజ్యాంగం కల్పించిన హక్కులను మాత్రమే అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ లేదా ఇతర ప్రత్యామ్నాయ ప్రయోజనాలు తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే న్యాయం చేస్తే తాము కూడా సహకరిస్తామని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఉద్యమాలు, వాటి వల్ల ఏర్పడే అన్ని పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఎలమర్తి మధు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బేడ (బుడ్గ) జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంగువ చిన్న సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు ఊర లతమ్మ, గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఊర వీరమల్లు, విభూది శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వెల్లూరి వెంకటేశ్వరరావు, కర్నూల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఇప్పే నాగమల్లి, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మొతె గౌరేశ్వరరావు, సిరివాటి సుంకన్న, పదిరే సుంకన్న, బయలు పార్టీ తుకారం, ఇంగువ శ్రీనివాసులు, సిరిగిరి శ్రీనివాసులు, ముగ్గు శ్రీనివాసులు, ఇంగువ పెద్దిరాజు, పేర్ల నాగులు, పేర్ల దుర్గ ప్రసాద్, కప్పరి వెంకటేశు, జాతికర్త నాగేశ్వరరావు, శివలింగాల ఏడుకొండలు, మోతే జమ్మయ్య, అశ్వ నాగప్ప, చిరువాటి వన్నూరు, మాదారం దానప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయాలి





- **ప్రజల సంతృప్త స్థాయి పెరిగి తద్వారా అభివృద్ధి సూచికల్లో గుంటూరు జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ**

**గుంటూరు, జూలై 10(మనసులో మాట )::** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని విసి హాల్లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ విధానం పై ముఖ్య శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, వారి సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరిచే విధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తే, తద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి, అభివృద్ధి సూచికల్లో గుంటూరు జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి. నజీనా బేగం, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్,జి జి హెచ్ సూపరింటెండెంట్ డా దుర్గా ప్రసాద్, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్.రమేష్, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సమన్వయ అధికారి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యాలయాల్లో ఆర్.టి.ఐ ప్రక్రియను పరిశీలించిన ప్రధాన కమిషనర్



**గుంటూరు, జూలై 10 (మనసులో మాట )::** ఆర్టీఐ చట్టం ప్రభుత్వ పారదర్శక పాలనను ప్రజలకు తెలియడానికి రూపొందించిన చట్టమమని, చట్ట ప్రకారం ప్రభుత్వ అధికారులు నిర్దేశిత సమాచారం గడువులోగా ఇవ్వాలని, చట్టాన్ని దుర్వినియోగం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ వజ్జా శ్రీనివాస రావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జిల్లా పరిషత్, జిల్లా విద్యా శాఖ, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలలో సిటిజన్ చార్టర్, అధికారుల వివరాలతో కూడిన బోర్డ్ లను పరిశీలించి, ఆర్టీఐ చట్టం సెక్షన్ 4 (1)బి ప్రకారం రిజిస్టర్ల నిర్వహణపై పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అప్పీలేట్ అథారిటీ అధికారులతో సమీక్షించి, రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత ఆర్టీసి కాలనీలోని వార్డ్ సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ, శుక్రవారం ఆర్టీఐ కమిషనర్లు అందరూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ చట్టం 4 (1)బి సెక్షన్ అమలుని నేరుగా పరిశీలించారన్నారు. విజయవాడ, గుంటూరులో పరిశీలించామని, అందులో భాగంగా గుంటూరులో నగరపాలక సంస్థ, ఇతర కార్యాలయాల్లో రిజిస్టర్లు, అనెగ్జలరీలు నిర్వహణ, చట్ట అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. వార్డ్ సచివాలయాల్లో కూడా పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పారదర్శక పాలన ప్రజలకు తెలిసేందుకు ఏర్పడిన చట్టాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు కూడా చట్టపరంగా అర్జీలకు ఇవ్వాల్సిన సమాచారం నిర్దేశిత గడువుకి ముందే ఇవ్వాలని ఆదేశించారు. కొన్ని శాఖలు, విభాగాల్లో లోపాలు గుర్తించామని, ప్రభుత్వ అధికారులు సహకరించాలన్నారు. చట్టంపై ప్రభుత్వ కార్యాలయాల పిఐఓలకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్గిస్తామని తెలిపారు. సమాజానికి మేలు చేసేలా ఉండే సమాచారాన్ని కోరే వారికి గడువులోగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, అలా కాకుండా కొందరు చట్టాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను ఇబ్బంది పెట్టడం, అమాయక ప్రజలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతూ దుర్వినియోగం చేస్తున్నారని గుర్తించామని, అటువంటి వారిపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి. సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ విష్ణు, మేనేజర్ బాలాజి బాష, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణ, పిఐఓలు, అప్పీలేట్ అధికారులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక అపహరణ కేసులో

## నిందితుడు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



**నకరికల్లు జులై 10, మనసులో మాట.** నకరికల్లు మండలం చల్లగుండ్ల అడ్డరోడ్డు గ్రామానికి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలిక అదృశ్యమైన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నకరికల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఈ నెల 5న బాలిక ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, అనంతరం బాలికను సురక్షితంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాలిక వాంగ్మూలం ఆధారంగా సుర్తని వసంత్ అలియాస్ శ్యామ్ (తండ్రి: మల్లయ్య) మాయమాటలు చెప్పి తనను తీసుకెళ్లినట్లు వెల్లడించడంతో, మైనర్ బాలిక కావడంతో పోక్సో చట్టం, అపహరణకు సంబంధించిన సెక్షన్లు చేర్చి కేసును ఆల్టర్ చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. శుక్రవారం ఉదయం నకరికల్లు కారంపూడి అడ్డరోడ్డు ప్రాంతంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, చట్టపరమైన చర్యలు పూర్తి చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు అతడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ సతీష్ వెల్లడించారు.

## ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం పై అవగాహన



**చీరాల జులై 10 ( మనసులో మాట)** జాతీయ విద్యార్థి దినోత్సవంపై మరియు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవంపై బిజెపి నాయకులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానిక భారతి కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ సంఘటనా మంత్రి సాయి మాట్లాడుతూ, 1948లో స్థాపించబడిన ఏబీవీపీ నేటికీ దేశంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, జాతీయ భావజాల వికాసం, విద్యా సంస్కరణలు, సామాజిక సేవా కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి అండగా నిలుస్తోందని తెలిపారు. ఇదే క్రమంలో ఆ పార్టీ స్థానిక నాయకులు డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ చేపట్టిన వివిధ ఉద్యమాలు, పోరాటాలు, విద్యా రంగంలో సాధించిన విజయాలు, దేశభక్తి మరియు సేవా భావంతో యువత ముందుకు రావాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవగాహన సదస్సులో కళాశాల విద్యార్థులు ఏబీవీపీ లక్ష్యాలు, ఆశయాలు, సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఈనాటి కార్యక్రమంలో శనగపల్లి సురేష్ కుమార్, ఏబీవీపీ పూర్వ నాయకులు బండారుపల్లి హేమంత్ కుమార్ , తడవర్తి చంద్రశేఖర రావు , కొర్నేపాటి మహేష్, చీరాల డివిజన్ ఏబీవీపీ నాయకులు హేమంత్, కే బాలు రెడ్డి , జి . హరీష్, జి.సాత్విక్ , జి .గౌతమ్ కె .సాయి చరణ్ , టి. గౌతమ్ వర్ధన్. , డి .ప్రేమ్ కుమార్ జి .హర్షిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మనసులో మాట

KANCHARLA

నిజమే మా బలం.. అదే మా [illegible].. | సంచలన తెలుగు దిన పత్రిక

## కోస్తాంధ్ర

రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ

అమలాపురం | తణుకు | ఏలూరు | భీమవరం

శనివారం 11 జూలై 2026 పేజీలు 16





## "వేతనాల పెంపు.. సంక్షేమ హామీల అమలుకు

# అంగన్వాడీల గళం"

- కూటమి హామీలు అమలు చేయాలి..
- పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ కల్పించాలి
- నవచేతన యాప్ పనులు నిలిపివేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.. అంగన్వాడీల డిమాండ్
- వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీల కలెక్టరేట్ ధర్నా

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

బొమ్మూరు కలెక్టరేట్  జూలై 10 అంగన్వాడీల జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో బొమ్మూరు తూర్పుగోదావరి కలెక్టరేట్ ఎదుట బారీ ధర్నా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వ హామీ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, హెల్త్ డిపార్ట్మెంట్ నవచేతన యాప్ పని అంగన్వాడీల చేత చేయించడాన్నీ మానుకోవాలని, అంగన్వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వర్షంలో కూడా ధర్నా కొనసాగింది. అనంతరం బొమ్మూరు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష ..మిగతా 2లో



## తీపర్రులో 'మా గోదావరి సంకల్ప్'

- మెరుగైన రవాణా సౌకర్యం, అందమైన ఘాట్
- తీపర్రు ను మోడల్ ఘాట్ ఎంపిక
- తదేకం ఫౌండేషన్ సేవలను అభినందించిన
- మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు (మనసులో మాట) జూలై 10**

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు నియోజకవర్గంలోని 'తీపర్రు' గ్రామాన్ని ఆదర్శ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్ ను మోడల్ ఘాట్ గా  తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ మేరకు తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం (జూలై 11, 2026) మధ్యాహ్నం 3 గం.లకు తీపర్రు గ్రామంలో నిర్వహించనున్న మా గోదావరి సంకల్ప్ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ..మిగతా 2లో

## ఓటర్ల జాబితా డిజిటలైజేషన్‌కు ప్రత్యేక డ్రైవ్



- పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరాలు.. ఎన్యుమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ వేగవంతం
- అర్హులైన ఓటరు ఒక్కరూ మిగలొద్దు
- జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 11, 12 తేదీల్లో సర్ ప్రక్రియపై ప్రత్యేక శిబిరాలు నిర్వహణ
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

3

## ఓటు హక్కు భద్రం కావాలంటే...

# ఫారమే కీలకం!



- ఎన్యుమరేషన్ ఫారంలో చిన్న తప్పిదం చేసినా ఓటుపై ప్రభావం
- కొత్త కలర్ ఫొటో తప్పనిసరి.. ఫారం ఇచ్చిన తర్వాత రసీదు తప్పక తీసుకోవాలి

**ఐ. పోలవరం (మనసులో మాట )జులై 10:**

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు ఓటు. ఆ హక్కును ప్రతి అర్హుడికి కల్పించడంతో పాటు ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత. ఇందులో భాగంగానే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. బూత్ లెవల్ అధికారులు ..మిగతా 2లో

## జలజీవన్ మిషన్

# పనులను వేగవంతం చేయాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి

8






## ఓటు హక్కు భద్రం కావాలంటే...
# ఫారమే కీలకం!

(మొదటిపేజీ తరువాయి)

(బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజే స్తున్నారు. ఈ ఫారాన్ని నిర్లక్ష్యంగా నింపితే భవిష్యత్తులో ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణ, పోలింగ్ సమయంలో ఇబ్బం దులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**ఎన్యుమరేషన్ ఫారం ఎందుకు:**
ఓటరు వివరాలను ధ్రువీకరించడం, కొత్త ఓటర్ల సమాచారాన్ని నమోదు చేయడం, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర మా ర్పులను నమోదు చేయడం కోసం ఎన్నికల సంఘం ఈ ఫారాన్ని ఉపయోగిస్తోంది. ఇందులో ఇచ్చే ప్రతి సమాచారం స్పష్టంగా, సరైన ఆధారాలతో ఉండాలి.

**2002 నాటికి ఓటు ఉంటే:**
2002 జనవరి 1 నాటికి ఓటు హక్కు ఉన్న వారు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు నంబరు, పేరు, తండ్రి లేదా భర్త పేరు, శా సనసభ నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ (భాగం సంఖ్య), ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య వంటి వివరాలను నమోదు చేయాలి.

**2002లో ఓటు లేకుంటే:**
ఆ సమయంలో ఓటు లేకపోయినా, తల్లిదండ్రులు, తాతయ్య, నానమ్మ లేదా కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఓటు ఉంటే వారి వి వరాలను నమోదు చేయాలి. వారి ఓటరు గుర్తింపు కార్డు నంబరు, నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్, క్రమ సంఖ్య వంటి వివరాలు ఇవ్వడం వల్ల నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది.

**కొత్త కలర్ ఫొటో తప్పనిసరి:**
ఫారంపై ఇప్పటికే ముద్రించిన పాత ఫొటో ఉన్నా, దానికి పక్కనే తాజా కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటో తప్పనిసరిగా అతికించాలి. దీంతో ఓటరు వివరాలు తాజాగానే నమోదవుతాయి.

**ప్రస్తుత వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి:**
ఫారం చివరి భాగంలో పుట్టిన తేదీ, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు, తల్లి లేదా సంరక్షకుడి పేరు, వారి ఓటరు గుర్తింపు కార్డు నంబరు నమోదు చేయాలి. వివాహితులు జీవిత భాగస్వా మి వివరాలు నమోదు చేయాలి. అవివాహితులు ఆ కాలమ్‌ను ఖాళీగా వదిలేయవచ్చు.

**ఈ పత్రాలు సిద్ధంగా ఉంచండి:**
ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం,10వ తరగతి సర్టిఫికె ట్,పాస్‌పోర్ట్ (ఉంటే), శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఇంటి అద్దె రసీదు లేదా విద్యుత్ బిల్లు వంటి చిరునామా ఆధారాలు

**చేయాల్సినవి:** ప్రతి కాలమ్‌ను పూర్తిగా చదివి జాగ్రత్తగా నింపాలి. పేరు, పుట్టిన తేదీ అన్ని పత్రాల్లో ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. తాజా మొబైల్ నంబరు, చిరునామా నమోదు చేయాలి. అవసరమైన అన్ని పత్రాలు జత చేయాలి. ఫారం సమర్పించిన వెంటనే రసీదు లేదా అంగీకార పత్రం తప్పనిసరిగా తీసుకోవాలి. సందేహాలు ఉంటే వెంటనే బీఎల్‌వోను సంప్రదించాలి.

**చేయకూడనివి:** తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం ఇవ్వకూడదు. ఫారంలోని కాలమ్‌లను ఖాళీగా వదిలేయకూడదు. ఇతరుల పత్రాలను ఉపయోగించకూడదు. పత్రాల్లో మార్పులు చేసి సమర్పించకూడదు. చదవకుండా సంతకం చేయకూడదు. ఒకే వ్యక్తికి భిన్నమైన వివరాలు నమోదు చేయకూడదు. ఓటు హక్కును కాపాడుకోవడం మన బాధ్యతే: ఎన్యుమరేషన్ ఫారం కేవలం ఓ దరఖాస్తు కాదు... భవిష్యత్తులో మీ ఓటు హక్కును భద్రపరిచే కీలక పత్రం.

## "వేతనాల పెంపు.. సంక్షేమ హామీల అమలుకు
# అంగన్వాడీల గళం"

(మొదటిపేజీ తరువాయి)



కార్యదర్శులు సిహెచ్ మాణిక్యాంబ, వై బేబీ రాణి సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం సుందర్ బాబు, బి. పవన్ మాట్లాడుతూ అంగ న్వాడీలకు వేతనాలు పెంచుతామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పి 11 ఏళ్ళు గడుస్తున్నా ఒక్క రూపాయి పెంచలేదని, రాష్ట్రంలో వేతనం పెంచి 7 సంవత్సరాలు గడుస్తుందని, ఈ కాలంలో ని త్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దెలు, గ్యాస్, కరెంట్ బిల్లులు వందల రెట్లు పెంచారని విమ ర్శించారు. ఇచ్చే ఏడువేల జీవితంలో సెంటరు అద్దెల నిర్వహణకై పెట్టుబడులు పెట్టిడానికే సరి పోతుందన్నారు.

వంట కోసం ఇచ్చిన ఇండక్షన్ స్టవ్ వల్ల వచ్చే కరెంటుబిల్లు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్నా రు. ఆయా పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ చేయక పోవడంతో పని భారం మొత్తం టీచర్లపై పడు తుందన్నారు. తక్షణం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రమోషన్లకు 5 ఏళ్ల సర్వీస్ నిబంధన ను తొలగించి స్థానిక ఆయాలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ పేరుతో గర్భిణీ స్త్రీలను, బాలింతలను ఇబ్బందులకు గురిచేయవ ద్దని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపా ధ్యక్షులు అరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు పెరుగు తున్నాయనీ, యుద్ధం సాకుతో పెంచిన ఇంధన ధరలు తగ్గించలేదని విమర్శించారు. ధర్నా అనంతరం డి ఆర్ ఓ కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ మూర్తి, కర్రి రామకృష్ణ, పూ ర్ణిమారాజు, భగత్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్నమణి, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ లు మద్దతు తెలియ జేసారు. అంగన్వాడి జిల్లా నాయకులు అన్నపూర్ణ, మార్తా, రామలక్ష్మి, సూర్యకాంతం, కృష్ణవేణి , లక్ష్మీ , బ్రహ్మం , విజయకుమారి, మాలతి, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# తీపర్రులో 'మా గోదావరి సంకల్ప్'

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తీపర్రు మోడల్ విలేజ్ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అదే విధంగా గోదావరి తీరంలో ప్రతి గ్రామంలో ఈ తరహా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుం టామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షకు అనుగుణంగా తీపర్రు ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా ఎలా సిద్ధం చేయాలి, అలాగే నీరి అనే కేంద్ర ప్రభు త్వ సంస్థ సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత ప్రాంతంగా ఎలా మార్చా లనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగా గ్రామ చెరువు పునరుద్ధరించడం, నీటి గుర్రపు డెక్క తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. గ్రామంలో ఫ్లెక్సీలు లేకుండా ప్లాస్టిక్ రహిత ప్రచారానికి శ్రీకారం చు ట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా యాత్రికులు, పర్యాటకులు తమ గోదావరి దర్శనాన్ని గుర్తుం చుకునేలా "ఐ లవ్ గోదావరి మా తీపర్రు" పేరుతో రెండు సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 25 హోమ్ స్టేలకు సన్నాహాలు చే స్తామన్నారు. అంతేగాక "తీపర్రు గ్రామంలో ఆధ్యా త్మిక శోభ విలసిల్లేలా, స్థానిక పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేలా కార్యక్రమాలు చేపట్టనున్నాం. పర్యావరణ అనుకూల గోదావరి పుష్కరాలపై అవగాహన కల్పించేలా ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సలహాలు, సూచనల తో ముందుకు వెళ్తాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. స్థానికంగా ఉన్న కాలువలో కయాకింగ్ తరహా అడ్వెంచరస్ స్పోర్ట్స్‌ ను ప్రవేశపెడతాం. ఘాట్ వెంబడి వీధి దీపాలు, హెరిటేజ్ స్ట్రీట్ లను అభివృద్ధి చేస్తాం. ఈ ఘాట్ ఎంపికలో స్థానిక గ్రామస్థుల నుంచి అద్భుతమైన మద్దతు, స్వచ్ఛంద సహకారం లభించాయి. త్వరలోనే ఈ ఘాట్, విలేజ్‌కు సంబంధించిన ప్రత్యేక లోగో, స్లోగన్ స్థానిక చరిత్రను వెలికితీసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండటం వల్లే తొలి ప్రాధాన్యతగా తీపర్రు ఘాట్‌ను ఎంచుకున్నాం. దాతల సహకారంతో ఇక్కడ మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మిగిలిన ఘాట్లను కూడా అభివృద్ధి చేస్తాం. అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మా గోదావరి సంక్రాంతి 2027 పేరిట రానున్న జనవరి నాటికి తీపర్రు నమూనాతో ముక్కామల, ముక్తేశ్వరం, కుం దలేశ్వరం, కొవ్వూరు తదితర గోదావరి పరి వాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయనున్నామన్నారు. అదే విధంగా తాము చేపట్టనున్న కార్యక్రమాలను 24 నవంబర్ న కార్తీక పౌర్ణమి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యవేక్షించను న్నారని, 2027 జనవరిలో సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించనున్నట్లు తెలిపారు. తీపర్రు ఘాట్ అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ చొరవ, సహకారం బాగుందని కొనియాడారు. 2014 నుండి తదేకం ఫౌండేషన్ తరపున సామాజిక సేవ చేస్తున్న ట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..2027 గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంద ని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుష్కరాల నాటికి నిడదవోలు నియోజకవర్గంలోని పలు ఘాట్లను సుందరీకరించి, భక్తులకు ఎలాంటి లోటు లేకుండా సకల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో తీపర్రు ఘాట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన తదేకం ఫౌండేషన్ నిర్వాహకులను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అభినందించారు.



# యువత ఉజ్వల భవిష్యత్తు కోసమే జాబ్ మేళా

**పెద్దాపురం (మనసులో మాట) జూలై 10;**

నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తు కోసమే జాబ్ మేళా నిర్వహించినట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. శుక్రవారం పెద్దాపురం మహారాణి కళాశాలలో వికాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు సారధ్యంలో ఏర్పాటుచేసిన జాబ్ మేళా ను ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో కార్పొరేట్ సంస్థల సహకారంతో జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టెక్ మహేంద్ర, యాక్సిస్ బ్యాంక్, హుండాయ్, ఇందుస్, తదితర కార్పొరేట్ సంస్థలో చే నిర్వహించిన జాబ్ మేళాలో 1449 ఉద్యోగాల కల్పన ఏర్పాటులు చేసినట్లు లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్సి నుండి బీటెక్, పిజి వరకు విద్యార్హతలు కలిగిన యువతకు 15,500 నుండి 40,000 వేలు జీతం లభించేలా ఉద్యోగ మేళాను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించటం, ఉద్యోగాల కల్పన వంటి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు ఎమ్మెల్సీ రాజశేఖర్ తెలిపారు. కూటమి నేతలు రాజా సూరిబాబు రాజు, సరోజ వాసు, బదుగు శ్రీకాంత్, అంటే జగదీష్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.





# సమాచార హక్కు చట్టంపై ప్రజా సమాచార అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి

- **రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ వి.ఎస్.కె. చక్రవర్తి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పట్ల ప్రభుత్వ కార్యాలయాల ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు) సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ వి.ఎస్.కె. చక్రవర్తి సూచించారు. క్షేత్రస్థాయిలో సమాచార హక్కు చట్టం అమలు తీరును పరిశీలించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ దరఖాస్తులు, రిజిస్టర్లు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు 2005లో



సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రతి భారతీయ పౌరుడు ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల నుంచి నిర్ణీత గడువులోపు సమాచారాన్ని పొందే హక్కు కలిగి ఉంటారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలులో అర్జీదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని, అందుబాటులో ఉన్న సమాచారాన్ని పూర్తి స్థాయిలో అందించడం పీఐఓల బాధ్యత అని అన్నారు. ఒక దరఖాస్తు రెండో అప్పీలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది చట్టం అమలులో లోపం ఉన్నట్లుగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అందువల్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, చట్టం ప్రకారం 30 రోజులలోపు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు.ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా వ్యక్తిగత శత్రుత్వంతో సమాచారాన్ని కోరే వ్యక్తుల విషయంలో పీఐఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని వి ఎస్ కె చక్రవర్తి సూచించారు. అటువంటి చర్యల వల్ల నిజంగా సమాచారం అవసరమైన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ తరహా దుర్వినియోగంపై ఇటీవల రాష్ట్ర సమాచార కమిషన్ విచారణ నిర్వహించి, కొందరిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. సమాచారం ఇవ్వలేని పరిస్థితుల్లో, అందుకు గల చట్టబద్ధమైన కారణాలను స్పష్టంగా అర్జీదారునికి తెలియజేయాల్సిన బాధ్యత కూడా పీఐఓలపై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో కూడా ఆర్టీఐ సమాచార బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రదర్శించాలని అధికారులను కమిషనర్ చక్రవర్తి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓలు) పాల్గొన్నారు.

## వర్షా కాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు కారణమైన బ్యాక్టీరియా, వైరస్, జన్యువులు, జీవనశైలి వంటి వాటిపై అవగాహన పెంచుకొని తదనుగుణంగా ఆరోగ్య సంరక్షణ విధానాలను మార్చుకోవాలని పి ఎం పి వైద్యులు కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బ్యాక్టీరియా, వైరస్, జన్యుపరమైన మార్పులు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ,మానసిక ఒత్తిడి వంటి జీవన మార్పుల వలన వ్యాధులు వస్తాయి అని అన్నారు.



## అక్కడ కాపులకు సీఎం పదవి ఇచ్చి... ఇక్కడ చెప్పండి

- **చిన్నయ్య దొర**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవిని కాపు సామాజిక వర్గానికి ఇచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్లో హామీలు ప్రకటించాలని మున్సిపల్ ఛాంబర్స్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, సామాజికవేత్త గోరకపూడి చిన్నయ్య దొర అన్నారు. సామర్లకోటలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిన్నయ్య దొర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కాపులు మద్దతు ప్రకటిస్తే, సీఎం పదవిని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి, మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ప్రకటించడం పట్ల చెన్నయ్య దొర స్పందించారు.

గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు కాపులకు హామీ ఇచ్చి, ఆ తర్వాత మోసగించడం జరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ముందుగా అక్కడ ముఖ్యమంత్రి పదవిని కాపులకు అందించి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ లో కాపుల మద్దతును కాంగ్రెస్ పార్టీ కోరాలన్నారు. తెలంగాణలో కాపులకు ముఖ్యమంత్రి పరిధి ఇస్తే, ఆంధ్రప్రదేశ్లో కాపుల



మద్దతు కాంగ్రెస్ పార్టీకి లభిస్తుందని చిన్నయ్య దొర తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలవల్ల కాంగ్రెస్ పార్టీని కాపులు నమ్మేస్థితిలో లేరని చిన్నయ్య దొర తెలిపారు. కాపులకు నమ్మకం కలిగించేందుకు ముందుగా తెలంగాణలో ముఖ్యమంత్రి పదవిని కాపులకు ఇవ్వాలని, అప్పుడే కాంగ్రెస్ పట్ల కాపులకు నమ్మకం ఏర్పడుతుందని చిన్నయ్య దొర తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముందుగా కాపులకు ఒక నమ్మకం, భరోసా కల్పించాలని అప్పుడే చింతా మోహన్ ప్రకటన పట్ల కాపులకు నమ్మకం ఏర్పడుతుందని చిన్నయ్య దొర తెలిపారు.

## ముంచుకొస్తున్న గడువు

- **సర్ వేగం చేస్తూ సమయం పెంచాలి**

**కొత్తపేట( మనసులో మాట) జూలై 10**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గతనెల జూన్ 14 నుండి జరుగుచున్న ప్రక్రియ ఈనెల జూలై 14 తో ముగియనున్న నేపద్యంలో కొత్తపేట నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాలు ప్రజలకు భూత్ లవారీ నూరుశాతం పంపిణీ జరిగిన ఎన్యూమరేషన్ పారాలు అధికారులు డిజిటలైజేషన్ ను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. ఇప్పటకీ ఇంకా నమోదుకాకుండా కొంతమంది ఇళ్లు మార్పులు ,అడ్రస్ మార్పులు,వలస వెళ్లినవారు,చనిపోయిన వారి వివరాలు సమాచారం తెలుసుకొని కేవలం ఐదురోజులు మాత్రమే గడువు ఉన్నది కనుక సర్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేసి నూరు శాతం అందరకీ ఓటు ఉండేలా అధికారులు వేగవంతం చేసి జిల్లాలో కొత్తపేట నియోజకవర్గాన్ని మొదటిస్దానంలో ఉండేలా అదికారులు కృషిచేయాలని పాలూరి అధికారులను కోరారు.

# వేతనాలు పెంచాలని కాకినాడలో కదం తొక్కిన అంగన్వాడీలు

- **నవచేతన యాప్ రద్దుచేసి, పని ఒత్తిడి తగ్గించాల డిమాండ్**

**కాకినాడ (మనసులో మాట ) జూలై 10**




అంగన్వాడీల జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ముట్టడి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వ హామీ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, హెల్త్ డిపార్ట్మెంట్ నవచేతన యాప్ పని అంగన్వాడీల చేత చేయించడాన్నీ మానుకోవాలనిఈ ఈ సందర్భంగా నినాదాలు చేశారు. అంగన్వాడీ లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ ఇవ్వాలని ధర్నాకు హాజరైన ఐసిడిఎస్ పిడి చెరుకూరి లక్ష్మీ కి వినతిపత్రం అందించారు. వర్షంలో కూడా ధర్నా అనంతరం పిఠాపురం రాజాగారి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఏరుబండి చంద్రావతి, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పి 11 ఏళ్ళు గడుస్తున్నా ఒక్క రూపాయి పెంచలేదని, రాష్ట్రంలో వేతనం పెంచి 7 సంవత్సరాలు గడుస్తుందని, ఈ కాలంలో నిత్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దెలు, గ్యాస్, కరెంట్ బిల్లులు వందల రెట్లు పెంచారని విమర్శించారు.

ఇచ్చే ఏడువేల జీవితంలో సెంటరు అద్దెల నిర్వహణకై పెట్టుబడులు పెట్టిడానికే సరిపోతుందన్నారు. రాజకీయ వత్తిళ్లతో తొలగించిన పెద్దాపురం వర్కర్ ఉద్యోగాన్ని తిరిగి ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశంపై జిల్లా శిశు సంక్షేమ అధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పు పట్టారు. పోరాడి సాధించుకున్న గ్రాడ్యుటి అమలును జిల్లా అధికారులు నిబంధనల పేరుతో, అపాయింట్మెంట్ ఆర్డర్లు లేవనే సాకుతో కార్మికులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. వంట కోసం ఇచ్చిన ఇండక్షన్ స్టవ్ వల్ల వచ్చే కరెంటుబిల్లు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్నారు. జగ్గంపేట, తాళ్ళరేవు ప్రాంతాలలో ఆయా పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడంతో పని భారం మొత్తం టీచర్ల పై పడుతుందన్నారు.

తక్షణం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రమోషన్లకు 5 ఏళ్ల సర్వీస్ నిబంధనను తొలగించి స్థానిక ఆయాలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుడ్లు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ పేరుతో గర్భిణీ స్త్రీలను, బాలింతలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. పిడి స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ వందనం సమర్పణ చేసి కార్యక్రమాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, షేక్ పద్మ, నక్కేళ్ళ శ్రీను, దారపురెడ్డి క్రాంతి, పలివెల వీరబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మద్దతు తెలియజేసారు. అంగన్వాడి జిల్లా కమిటీ సభ్యులు ధనలక్ష్మి, ఎస్తేరు రాణి, ఎం.రాజేశ్వరి, వీరవేణి, వీరమణి, సునీత, భాందవి, చామంతి, మంగదేవి, ఎన్. రాణి, జిల్లా కోశాధికారి రమణమ్మ, జ్యోతి, విజయ, విజయశాంతి, బుల్లెమ్మ, రత్నకుమారి, సుజాత, శ్రీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.





# ధర్మవరంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- **ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**

**ప్రత్తిపాడు (మనసులో మాట) జూలై 10**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గం ప్రత్తిపాడు మండలానికి చెందిన ధర్మవరం గ్రామంలో రైతు సేవా కేంద్రం, వెల్నెస్ సెంటర్‌ను జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి బాబీతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు . గ్రామంలో సుమారు రూ.21 లక్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ.అనంతరం మండల స్థాయి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను స్వీకరించిన ఎమ్మెల్యే. ప్రజా దర్బార్‌లో పాల్గొన్న తహసీల్దార్ ఎం. సూర్యప్రభ, ఎంపీడీఓ ఎం.వి.ఆర్. కుమార్ బాబు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల కొమ్ముల కన్నబాబు,స్థానిక నాయకులు బొల్లు చిన్నోడు, బొండాడ నారాయుడు, ముప్పన బోయిన ఏసుబాబు, బొల్లు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



# హిల్ రాక్ మినరల్స్ క్వారీపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

- **జె.అన్నవరంలో రోడ్ మెటల్,బిల్డింగ్ స్టోన్ క్వారీకి అనుకూలంగా స్పందించిన స్థానికులు,ఎన్జీఓలు**

**ఏలేశ్వరం (మనసులో మాట) జూలై 10**




కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె. అన్నవరం గ్రామంలో ప్రతిపాదిత హిల్ రాక్ మినరల్స్ రోడ్ మెటల్,బిల్డింగ్ స్టోన్ క్వారీ ప్రాజెక్ట్ పై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం నిర్వహించారు.రెవెన్యూ డివిజనల్ అధికారి పి. కృష్ణమూర్తి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ (ఈఈ) ఐ. సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,స్వచ్ఛంద సంస్థల (ఎన్జీఓ) ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. జె.అన్నవరం గ్రామంలోని సర్వే నంబర్ 297లో 3.276 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఈ క్వారీ ప్రాజెక్టులో రోడ్ మెటల్,బిల్డింగ్ స్టోన్ ఉత్పత్తి చేయనున్నారు.

ఏడాదికి సగటున 1,52,460 క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో, రూ.50 లక్షల అంచనా వ్యయంతో ప్రాజెక్టును ప్రతిపాదించారు.ఈ సందర్భంగా స్థానికులు,ఎన్జీఓల ప్రతినిధులు మాట్లాడుతూ క్వారీ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు .పర్యావరణ నిబంధనలను పాటిస్తూ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

# శభాష్ కాకినాడ 2 టౌన్ సిఐ అప్పల నాయుడు సేవలు

- **డయాలసిస్ పేషెంట్ ని సకాలంలో ఆసుపత్రికి చేర్చిన సిఐ సిబ్బంది**

**కాకినాడ మనసులో మాట జూలై 10**

గురువారం రాత్రి కాకినాడ సబ్ డివిజన్ నైట్ రౌండ్స్ లో ఉన్న టూ టౌన్ పిఎస్ సిఐ ఎం. అప్పలనాయుడు గాంధీనగర్ సుబ్బయ్య హోటల్ ఏరియాలో, 20 సంవత్సరముల వయస్సు ఉన్న ఒక అమ్మాయి డయాలసిస్ పేషెంట్ ఊపిరి అందక ఇబ్బంది పడుతూ రోడ్డు ప్రక్కన నిస్సహాయంగా పడి ఉంటే అటువైపుగా వెళ్తున్న నైట్ బీటు సిబ్బంది చూసి 108 కి ఫోన్ చేసి తెలియ పరచగా సకాలంలో 108 రానందు వల్ల సిఐ కి నైట్ బీట్ సిబ్బంది తెలియ పరచగా సిఐ అప్పలనాయుడు వెంటనే వచ్చి సిఐ వెహికిల్లో స్వయంగా ఎక్కించి అపోలో హాస్పిటల్ లో ఎమర్జెన్సీ వార్డు నందు జాయిన్ చేసారు ఆమె ప్రాణ పరిస్థితుల నుండి కాపాడారు. సీఐ పోలీస్ సిబ్బంది చేసిన సేవలు ప్రజలు అంత హర్షం వ్యక్తం చేశారు.



# బోటు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- తొండంగి బోటు అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**



కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ తొండంగి మండలం పరిధిలో జరిగిన బోటు అగ్నిప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడి, కాకినాడ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావుతో కలిసి పరామర్శించారు. ప్రమాదంలో యేరిపల్లి కోటేశ్ (తండ్రి తాతీలు), యేరిపల్లి ప్రసాద్(తండ్రి గోపి) తీవ్రంగా గాయపడగా, దులం రామకృష్ణ (తండ్రి బండియ్య) మోస్తరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులు, వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అడిగి తెలుసు కున్నారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో స్వయంగా చర్చించి, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అవసరమైన మందులు వైద్య సదుపాయాలను సకాలంలో అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని, తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు.







## గొల్లపాలెం రక్షిత మంచినీటి చెరువు చేపల వేలంపాట వాయిదా

**కాజులూరు, (మనసులో మాట) జూలై 10**

గొల్లపాలెం రక్షిత మంచినీటి చెరువులో సహజసిద్ధంగా పెరిగిన చేపల వేలంపాట శుక్రవారం జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఈ విషయాన్ని కాకినాడ జిల్లా పరిషత్ రెవెన్యూ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు ప్రకటన మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించాల్సి ఉండగా, మొత్తం ఎనిమిది మంది డిపాజిట్ దారులు నిర్ణీత డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి, సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రాలతో హాజరయ్యారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూసినా వేలంపాట ప్రారంభం కాకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్‌ను ప్రశ్నించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అయితే ముందుగానే డిపాజిట్ చెల్లించి, అవసరమైన పత్రాలన్నీ సమర్పించిన అనంతరం చివరి నిమిషంలో వేలంపాటను వాయిదా వేయడం నిబంధనలకు విరుద్ధమని డిపాజిట్ దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వెనుక రాజకీయ జోక్యం ఉందని కొందరు డిపాజిట్ దారులు ఆరోపించారు. ఇప్పటికే వేలంపాటలో పాల్గొనేందుకు ఖర్చులు చేసి, సమయం వెచ్చించిన తమకు నష్టం జరిగిందని, సంబంధిత అధికారులు తక్షణమే కొత్త తేదీని ప్రకటించి పారదర్శకంగా వేలంపాట నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు త్వరితగతిన స్పష్టత ఇచ్చి, వేలంపాటకు కొత్త తేదీ ప్రకటించాలని డిపాజిట్ దారులు కోరుతున్నారు.

## జనన, మరణ ధృవీకరణకు సత్వర చర్యలు

**పెద్దాపురం, (మనసులో మాట) జూలై 10**

సామర్లకోట మున్సిపల్ పట్టణ పరిధిలో జనన మరణ ధ్రువీకరణకు సత్వర చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బోలి వారి వీధిలో గోలి సీతారామలక్ష్మి అనే మహిళ మృతి చెందినట్లు సమాచారం అందటంతో వెంటనే జనన మరణ సెక్షన్ ఏఎస్ఓ బిఆర్వి చౌదరి, హెల్త్ అసిస్టెంట్ ఎం సత్యనారాయణ డిజిటల్ అసిస్టెంట్ వై జయరాజు ఘటనా స్థలంలో విచారణ నిర్వహించి తక్షణమే మరణ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయడం జరిగిందన్నారు. స్థానిక సిఎస్ రత్నం రాజు ఆసుపత్రిలో జన్మించిన ఇద్దరు శిశువులకు కూడా తక్షణమే జనన ధ్రువీకరణ రిజిస్ట్రేషన్ నిర్వహించి, ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు. ప్రజలకు జనన మరణ ధ్రువీకరణ పత్రాలను సులభంగా తక్షణమే అందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని కమిషనర్ కనకారావు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## పెద్దాపురం పెద్దిరాజు చెరువులో మట్టి దొంగలు

- కోట్లాది రూపాయల మట్టి రవాణా.. ప్రేక్షక పాత్రలో అధికారులు

**పెద్దాపురం, (మనసులో మాట) జూలై 10**



పెద్దాపురం నుండి కట్టమూరు వెళ్లే పుంత రోడ్డు రహదారిలో ఉన్న పెద్దిరాజు చెరువులో మట్టి మాఫియా దొంగలు పడ్డారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగారాన్ని తలపించేలా జిల్లాలో మట్టికి భారీ డిమాండ్ నెలకొని ఉంది. పెద్దిరాజు చెరువులో పెద్ద ఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాతో దళారులు కోట్లాది రూపాయల అక్రమ మట్టి వ్యాపారాన్ని సాగిస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించడం సర్వత్ర అనుమానాలకు తావిస్తోంది. చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అనే మూడు కోతుల కథను తలపిస్తూ ఇరిగేషన్, గనుల శాఖ, రవాణా శాఖలు ప్రేక్షక పాత్ర వహించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన వచ్చును అంటూ ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ప్రతినిత్యం వందల కొద్ది లారీలు ఈ రహదారిలో అక్రమ మట్టి రవాణాతో సైరా విహారం చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పాత పెద్దాపురం, కట్టమూరు పుంత రోడ్డు ప్రజలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా చెరువులో నూతులను తలపించేలా గోతులు ఏర్పడటంతో భారీ ప్రమాదం పొంచి ఉందని స్థానికులు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా వర్షం నీరు చెరువుకు చేరకుండా మట్టి వ్యాపారులు చేస్తున్నారని, తద్వారా చెరువు ఆయ కట్టు ప్రాంత పంట పొలాలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండ దండలతోనే మట్టి తవ్వకాలు,రవాణా సాగుతున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విజిలెన్స్ అధికారులు ఇప్పటికైనా మట్టి తవ్వకాలు, రవాణా, అధికారుల పాత్ర పై చర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# గోదావరి వరదలు, అధిక వర్షాలపై ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలి



- **జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్**

**అమలాపురం(మనసులోమాట**

రానున్న వర్షాకాలంలో గోదావరి నదికి వరదలు సంభవిస్తే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు మండలాల వారీగా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి శాంతి కమిటీ సమావేశంతో పాటు, గోదావరి వరదలు అధిక వర్షాల సన్నద్ధత, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రగతి అంశాలపై అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండల డివిజన్ వారీగా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి ఉత్సవాలు నిర్వహణ విగ్రహాలు, బరియల్ గ్రౌండ్ ఏర్పాటులో ఎటువంటి వివాదాలు ఉత్పన్నం కాకుండా శాంతియుతంగా పోలీసు రెవెన్యూ ఆర్ అండ్ బి శాఖలు వ్యవహరించాలని సూచించారు జూలై నుండి అక్టోబర్ వరకు తుఫానులు, వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పటిష్టమైన వ్యూహంతో వ్యవహరించాలన్నారు. వరదల వల్ల పంట కాల్వలు, మురుగు కాల్వలు, చెరువులు, ఏర్లకు గండ్లు పడే అవకాశం ఉన్న బలహీనమైన ప్రదేశాలను ముందుగానే గుర్తించి పటిష్టం చేయాలన్నారు గోదావరి నది మొదటి, రెండు, మూడు ప్రమాద హెచ్చరికల సమయంలో ముంపునకు గురయ్యే గ్రామాలు, జలదిగ్బంధంలో చిక్కుకునే రహదారులను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ప్రణాళికలు ఉండాలన్నారు.

ముంపు ప్రాంత గ్రామాలలో ప్రజలకు ఇబ్బంది లేకుండా 3 నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను సిద్ధంగా ఉంచాలన్నారు. అత్యవసర రెస్క్యూ ఆపరేషన్ల కోసం జిల్లాకు ఒక ఎన్డీఆర్ఎఫ్, ఒక ఎస్డీఆర్ఎఫ్ బృందం రానున్నాయన్నారు. స్థానికంగా బోట్లు, ఈత గాళ్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. అవేర్' పోర్టల్ ద్వారా రాబోయే ఐదు రోజుల వాతావరణ పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేస్తూ తదనుగుణంగా అప్రమత్తం కావాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ వరద సహాయక చర్యల్లో పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, రెవెన్యూ విభాగంతో సమన్వయం చేసుకుంటూ సేవలందిస్తుందని స్పష్టం చేశారు.

**అనంతరం ఓటర్ల జాబితా :**

ప్రత్యేక సమగ్ర సవరణ పై జిల్లా జాయింట్ కలెక్టర్ వైభోమ్ నిధియాదేవి మాట్లాడుతూ జిల్లాలో 20,000 ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించాల్సి ఉండగా, ప్రస్తుతం డిజిటైజేషన్ ప్రక్రియ 82 శాతం పూర్తయిందని తెలిపారు. ప్రగతిలో వెనుకబడిన అధికారులు తమ పని తీరును మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను నిశితంగా పరిశీలించిన జేసీ. ఓటర్ల జాబితా సవరణలో ఇంటింటి సర్వేను విజయవంతంగా పూర్తి చేయడానికి వచ్చే మూడు రోజులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఈ ప్రక్రియ సాగుతోందని, ప్రతి నియోజకవర్గంలో ఓటర్ల సహాయార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా బీఎల్ఓ లకు ప్రత్యేక అధికారులు దిశానిర్దేశం చేయాలని సూచించారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తులు త్వరితగతిన అందజేయాలి

- **తాహసీల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదేశం**

**కాజులూరు, (మనసులో మాట) జూలై 10**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మిగిలిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీలోపు తప్పనిసరిగా అందజేయాలని కాజులూరు తాహసీల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ, శీల గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తాహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం మండలంలో ఇప్పటికే 85 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన 15 శాతం ఓటర్లు సుదూర ప్రాంతాల్లో ఉండటంతో వారికి కూడా దరఖాస్తులు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. అయితే, కొంతమంది నుంచి ఇప్పటికీ నింపిన ఎస్ఐఆర్ దరఖాస్తులు అందలేదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను ధృవీకరించి, నింపిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీలోపు సంబంధిత బూత్ లెవల్ అధికారులు లేదా రెవెన్యూ సిబ్బందికి అందజేయాలని కోరారు. ప్రజల సహకారంతో మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వీరబాబు, బూత్ లెవెల్ అధికారులు సూర్యనారాయణమూర్తి, శ్రావణి, కె పద్మ, నూక వరలక్ష్మి, అశోక్, పద్మజ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జులై 15 వ తేదీ నుండి 24 వ తేది వరకు వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు

- **వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న వెల్లడి**

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ రూరల్ కొవ్వూరులో వారాహి అమ్మవారి ప్రాంగణంలో గుప్త నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న శుక్రవారం తెలిపారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 15వ తేదీ ఉదయం 5 గంటలకు మాలధారణ దీక్ష ప్రారంభం అవుతుందని కాశీ క్షేత్ర పరిపాలకురాలుగా అమ్మవారి కీర్తి ఎంతో ఉందన్నారు. భక్తులు సమస్యలు నుంచి త్వరితగతిన బయట పడేందుకు అమ్మవారిని ఉపాసనతో ప్రార్థించాలని, ఉదయం వేళల్లో అమ్మవారికి దీపారాధనలు చేసి రాత్రి వేళల్లో పూజిస్తే అనుకున్న పనులు జరుగుతాయని వివరించారు. అమ్మవారికి పానకం, చక్రపొంగలి, దద్దోజనం నైవేద్యంగా సమర్పించాలన్నారు. అమ్మవారు భూదేవత అయినందున క్యారెట్, బీట్రూట్, చిలకడ దుంపలు, కాయ గూరలుతో పాటు భూమి నుంచి వచ్చే ఆహార పదార్థాలు అన్నీ ప్రసాదం రూపం లో పెట్టవచ్చన్నారు. తమ ప్రాంగణంలో నిర్విరామ అన్నదానం, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. మామూలు రోజులు కన్నా అమ్మవారిని ఆషాడమాసంలో భక్తితో పూజించడం వలన కుటుంబం అంతటికీ అనుగ్రహం వేగంగా లభిస్తుందన్నారు. దీక్ష చేపట్టే వారు భూశయనం, బ్రహ్మచర్యం, ఒంటి పూట భోజనం, కాయగూరల భోజనం తిని నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేసారు. గుప్త నవరాత్రుల తర్వాత తాను విశ్రాంతి తీసుకుంటానని, ఆలయం స్థాపించి నప్పటి నుండి నిర్విరామంగా అమ్మవారికి సేవలు చేస్తున్నానని తమ కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఇంటిలో పూజించే అమ్మవారిగా కొలిచామని లక్ష్మీ ప్రసన్న తెలిపారు. రాష్ట్రస్థాయిలో కొవ్వూరు అమ్మవారికి ఇంత ఆదరణ లభిస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్త కాళ్ళ సత్యనారాయణ తో పాటు అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## మాత శిశు మరణాలు సంభవించ కుండా రోటరీ ఆరోగ్య శిబిరాలు

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

మాతా శిశు మరణాలను తగ్గించేందుకు రోటరీ ఇంటర్నేషనల్ మాతా శిశు ఆరోగ్య రక్షణ మాసోత్సవంలో బాగంగా యాంటినెటల్ కేర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయం అని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ధరణి కన్స్ట్రక్షన్స్ అధినేత టి.వి. రమణారావు అన్నారు. కాకినాడ పర్లవపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో యాంటినెటల్ కేర్ క్యాంప్ నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ మజ్హర్ హుస్సేన్ అధ్యక్షత వహించగా రోటరీ అసిసెంట్ గవర్నర్ టి.వి.రమణరావు ముఖ్యఅతిధిగా పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ స్త్రీల వైద్యనిపుణురాలు డా.ఎ.ఎల్. సత్యవతి సారధ్యం లో గైనకాలజిస్టు డా. సుష్మా, డా.విజేత, డా. కృష్ణవేణి, డా. నాగలక్ష్మి, డా.సరోజిని లు పాల్గొని క్యాంపు వచ్చిన 127 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈసందర్భంగా అసిసెంట్ గవర్నర్ టి.వి. రమణరావు మాట్లాడుతూ కాకినాడ నగరంలో రోటరీక్లబ్ మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తోందని వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఇప్పటికే బాలికల ఆరోగ్య అంశంపై రోటరీ క్లబ్ కాకినాడ మహేష్ బాబు ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని ఆయన గుర్తు చేశారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని రమణారావు అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని వివరించారు. పర్లోపేట వంటి ప్రాంతంలో రోటరీ క్లబ్ కాకినాడ మాత శిశు సంరక్షణ కోసం ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మహిళా వైద్యానికి సంబంధించిన డా.ఎ.ఎల్.సత్యవతి మాట్లాడుతూ మాతృ మరణాలను తగ్గించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అడిషినల్ డి.ఎం. అండ్ హెచ్.ఓ. డా.సుబ్బరాజు మాట్లాడుతూ రోటరీ క్లబ్ యాంటినెటల్ క్యాంప్ నిర్వహించినందుకు వైద్య ఆరోగ్యశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కాకినాడ కార్యదర్శి మణికంఠ పాస్ట్ ప్రెసిడెంట్ తడాల బుజ్జి, ఎక్సెల్ రమేష్, అండాళ్, గమిని కాశీ విశ్వనాథ్, అహ్మద్, ఇంజనీర్ వేమూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# రూ.105 కోట్లతో కాకినాడ స్మార్ట్ సిటీ పనులకు ఊపిరి

- నిలిచిపోయిన ప్రాజెక్టులన్నీ వేగంగా పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో గత కొంత కాలంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.105 కోట్లు విడుదల చేయడం నగరాభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శుక్రవారం అన్నారు.ఆర్థిక పరమైన సవాళ్లు ఉన్నప్పటికీ కాకినాడ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రికి నగర ప్రజల తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సినిమా రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కాకినాడ నగర పాలక సంస్థ నూతన కార్యాలయ భవనాన్ని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, స్మార్ట్ సిటీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొండబాబు పరిశీలించారు. అనంతరం ఆయన



మీడియాతో మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ప్రారంభమైన సమయం లో నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.నగరపాలక సంస్థకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కార్పొరేషన్ భవనం నిర్మించడం, అన్ని పరిపాలనా కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం, దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అనేక ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను రూపొందించామని ఆయన చెప్పారు.

అయితే ప్రభుత్వం మారిన తర్వాత గత ఐదేళ్లలో స్మార్ట్ సిటీ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించక పోవడంతో అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచి పోయాయని విమర్శించారు. కార్పొరేషన్ నూతన భవనంతో పాటు ఇతర స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు కూడా అసంపూర్తిగా మిగిలి పోయాయని తెలిపారు.కాకినాడ నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త వాటర్ స్కీమ్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. అలాగే నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో జాతీయ రహదారి 216ను అనుసంధానించే మూడో వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదించి, దానికి అవసరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.

మోడల్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం, జన్మభూమి స్టేడియం అభివృద్ధి వంటి పలు కీలక ప్రాజెక్టులు కూడా గత ప్రభుత్వ హయాంలో నిలిచి పోయాయని ఆయన అన్నారు.ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలోని అసంపూర్తి పనులను పూర్తి



చేసేందుకు రూ.105 కోట్లు విడుదల చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులతో కార్పొరేషన్ భవనం సహా వివిధ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కార్పొరేషన్ భవనాన్ని కమిషనర్‌తో కలిసి పరిశీలించినట్లు పేర్కొన్న ఆయన, అవసరమైన సాంకేతిక మార్పులు, చేర్పులు చేసి నాణ్యతతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. మూడో వంతెన నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి కాకినాడను ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. వెంకట్రావు, డి ఈ ఆదినారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మణికంఠ, మచ్చరాజు, సి.వి.ఎ.పి బృంద సభ్యులు మేచినేని దివ్య రాణి , బండారు జ్యోతి సుష్మ, వడ్డి సూర్య కుమారి,నంబారు సాయి పూజసంబంధిత కాంట్రాక్టర్ సుధాకర్, స్మార్ట్ సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బి.ఇడి ఆన్లైన్ మోడరేషన్ ను ప్రారంభించిన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ

**రాజానగరం (మనసులో మాట) జూలై 10**

తెలుగు రాష్ట్రాలలో మొట్ట మొదటిసారిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బి.ఇడి ఆన్లైన్ మోడరేషన్ బోర్డు విధానాన్ని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ ప్రారంభించారు.శుక్రవారం యూనివర్సిటీలో బి.ఇడి కళాశాలలకు ఆన్లైన్ మోడరేషన్ బోర్డును ప్రారంభించి వివరాలు తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణలో అతి కీలకమైన ప్రాజెక్ట్స్, రికార్డ్స్, యాక్టివిటీస్ మోడరేషన్ ప్రక్రియను ఆన్లైన్ విధానంతో ఆధునికరించామని అన్నారు. రాష్ట్రంలో ఏ విశ్వవిద్యాలయంలోను లేని విధంగా జిపిఎస్, ఫేస్ రికగ్నిషన్ వంటి నూతన సాంకేతిక పద్ధతులతో ఆన్లైన్ మోడరేషన్ ప్రక్రియను ప్రవేశపెట్టామన్నారు. దీని ద్వారా ప్రతి బి.ఇడి కళాశాలలో ఉన్నత శిక్షణ ఇవ్వచ్చు అని, ప్రతి కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు అందుబాటులో ఉంటారని, శిక్షణలో ఉన్న ఉపాధ్యాయ విద్యార్థులు కళాశాలకు నిత్యం హాజరవుతారని చెప్పారు . రికార్డ్స్ అన్నీ కూడా ఆన్లైన్ ద్వారా పేపర్ లెస్ విధానంలో ఉంటాయని, దీని ద్వారా పారదర్శకంగా మోడరేషన్ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. ఆయా కళాశాలల ఆధ్యాపకులకు ప్రత్యేక కార్యశాలలు నిర్వహించి సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. బి ఓ ఎస్ చైర్మన్ బీ.ఇడీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. సుబ్బారావు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 40 బిఇడి కళాశాలలకు గత నెల రోజుల నుండి అవగాహన కల్పించామని, విద్యార్థులు వ్రాసిన ప్రాజెక్టులను ఆన్లైన్ ద్వారా సబ్మిట్ చేస్తారని, మూల్యాంకనం కూడా ఆన్లైన్ లోనే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎగ్జామినేషన్స్ డా.టి. హైమావతి అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

- పుష్కర్ నగర్లు, పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించిన జిల్లా యంత్రాంగం

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**



తూర్పుగోదావరి జిల్లాలో రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మహేష్తో పాటు వివిధ శాఖల అధికారులు శుక్రవారం రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పర్యటనలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, తాత్కాలిక వసతి, హోల్డింగ్ ఏరియాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్, జీఎస్ఎల్ వెనుక ప్రాంతం, దేవాన్ చెరువు జీరో పాయింట్, కేశవ హాస్పిటల్ రోడ్, గమన్ వంతెన కాతేరు అండర్‌పాస్ ప్రాంతం, కాతేరు లోని సీటీఆర్ఐ భూములు, వ్యవసాయ కళాశాల సమీప ప్రాంతం, తిరుమల బస్ గ్రౌండ్, తిరుమల పాపయ్య నగర్ సమీప ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. అనంతరం కొవ్వూరు చేరుకుని అక్కడ నుంచి తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు.



ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పార్కింగ్, హోల్డింగ్ ఏరియాలు, పుష్కర్ నగర్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను సమీక్షించారు. అలాగే ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర సేవల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ ఉదయం 7 గంటల నుంచి రాజమహేంద్రవరం లోని పుష్కర్ ఘాట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పుష్కరాల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన పెంపు ఉండాలి



**నూజివీడు (మనసులో మాట) జులై 10:**

నూజివీడు పట్టణంలోని కోనేరు పేటలో గల టిటిడి కళ్యాణమండపం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు డిఎస్పి కే వివి ఎన్ వి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధానంగా సైబర్ నేరాలు, నూతన చట్టాలపై ప్రజలలో అవగాహన పెంపొందాలని సూచించారు. వయస్సు మళ్ళిన పెద్దలు ఏటీఎం కార్డు వినియోగించడంలో అయోమయానికి గురి అయిన సందర్భంలో పొంచి ఉన్న కేటుగాళ్లు నగదు కాజేస్తుంటారని సోదాహరణంగా తెలిపారు. నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిందని, ఫోను వినియోగం లో జాగ్రత్త వహించకపోతే బ్యాంకు ఖాతాలు ఖాళీ కావడం ఖాయం అంటూ హెచ్చరించారు. మనకు తెలియని లింకులు, ఏవో గొప్ప గొప్ప అవకాశాలు పేరుతో యువతను, పెద్దలను సైతం వలవేసి ఉచ్చులోకి సైబర్ నేరగాళ్లు లాగుతున్నారు తస్మాత్ జాగ్రత్త అన్నారు. కొన్ని సందర్భాలలో ఇతర రాష్ట్రాల నుండి మనకు తెలియని నంబర్లతో ఫోన్లు చేసి బెదిరించి, లక్షల రూపాయలలో కాజేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఓటిపిలు, పిన్ నంబర్లు బహిర్గతం చేయవద్దన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కొత్త టెక్నాలజీ ప్రవేశించిన తరువాత, ఈ టెక్నాలజీని మంచి కోసం వినియోగిస్తే అందరూ హర్షిస్తారు అన్నారు. డబ్బులు కాల్ చేసేందుకు, బాలికలు, మహిళలను మోసగించేందుకు అగంతకులు అనేక కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఎలాంటి అనుమానాలు వచ్చినప్పటికీ 112 నంబర్ కు తక్షణమే ఫోన్ సమాచారం అందించాలన్నారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం ఎల్లవేళలా శక్తి యాప్ రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు. ప్రతి బాలిక, ప్రతి మహిళ వారి వారి ఫోన్లలో శక్తి యాప్ ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. మన ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగించుకోవడం ద్వారా సమాజంలో సమున్నతంగా, సగౌరవంగా జీవించేందుకు క్రమశిక్షణతో ముందడుగు వేయాలన్నారు. మనం చేసే తప్పులు, నేరాలు ఎవ్వరికి తెలియదు అనే అపోహ నుండి బయటకు రావాలని, ఎట్టి పరిస్థితుల లోనూ నేరం చేసిన వారిని చట్టం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులు పట్టణ ఎస్సై కే నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మున్షి, కొంపెల్ల కృష్ణకుమారి, పోలీసు సిబ్బంది, శ్రీ మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు, స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.





## చర్చ్ మందిర ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అమలాపురం( మనసులోమాట) జూలై 10:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, సిరిపల్లి గ్రామంలో నిర్వహించిన యేసుపాదం ఫౌండేషన్ చర్చ్ మందిర ప్రతిష్ఠ కార్యక్రమంలో శుక్రవారం పి. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రార్థనా మందిరం ప్రజలకు ఆధ్యాత్మిక సేవలకు కేంద్రంగా నిలవాలని ఆకాంక్షిస్తూ, క్రైస్తవ సోదర సోదరీమణులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, చర్చ్ నిర్వాహకులు, క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థలో ఘనంగా జాతీయ మత్స్య రైతు దినోత్సవం

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాకినాడ రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ ఎస్ ఐ ఎఫ్ టి (షిఫ్ట్ ) నందు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ప్రిన్సిపల్ ఎస్ఐఎఫ్టీ కాకినాడ, డాక్టర్. ఎస్. అంజలి , జిల్లా మత్స్యశాఖ అధికారి వి .కృష్ణారావు ఆఫ్కాఫ్ వైస్ చైర్మన్.బలసాడి రంగారావు ,అప్సడా డైరెక్టర్ కొండ బాబు హాజరయ్యారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణ రావు మాట్లాడుతూ జాతీయ మత్స్య రైతు దినోత్సవం జరుపుకోవడానికి గల ముఖ్య కారణాలను తెలిపారు. ప్రేరేపిత ప్రజననము యొక్క ప్రయోగాలను వివరించి దేశంలో ఆహార భద్రత పెంపొందించడానికి ప్రోటీన్ అవసరతలను పెంపొందించడానికి చేపలను విరివిగా ఉత్పత్తి చేసే సాంకేతిక పద్ధతులను అభివృద్ధి పరిచిన డాక్టర్ హీరాలాల్ చౌదరి సేవలను కొనియాడుచూ జాతీయ మత్స్య దినోత్సవం గల కారణాలను తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ప్రిన్సిపల్ ఎస్ ఐ ఎఫ్ టి, డాక్టర్.ఎస్.అంజలి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్యశాఖ అమలు చేయుచున్న వివిధ పథకాలను సద్వినియోగపరుచుకుని ఆక్వా రైతులు మత్స్యకారులు ఆర్థిక ప్రకృతిని సాధించాలని తద్వారా దేశంలో మన రాష్ట్ర సుస్థిర ఆర్థిక అభివృద్ధికి మన రాష్ట్రంలో మత్స్యశాఖ ద్వారా జరుగుతున్న కృషిని వివరించారు. అదేవిధంగా జాతీయ మత్య రైతు దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను ప్రేరేపిత ప్రజమనము ద్వారా డాక్టర్ హీరాలాల్ చౌదరి అల్కొని వంటి శాస్త్రవేత్తలు యొక్క కృషిని కొనియాడారు.





## పారదర్శకంగా ఓటర్ల ధ్రువీకరణ

**నూజివీడు (మనసులో మాట) జులై 10:**

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) పై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. నూజివీడు సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల ధ్రువీకరణ కొనసాగుతుందన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరం అన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ ఓ) క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలనకు రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ) సమన్వయంతో సహకరించాలన్నారు. ఓటరు జాబితాలో ఉన్న గైర్హాజరైన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన, మరణించిన ఓటర్ల వివరాలను నిబంధనలను మేరకు ధృవీకరించేందుకు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారులు, మండల తహశీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.






## మిషన్ హరితోదయం పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

**ఏలేశ్వరం( మనసులో మాట) జూలై 10**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లోని ఏలేశ్వరం లో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ హరితోదయం నినాదం తో ఏలేశ్వరం పట్టణంలో సుమారు 200 మంది విద్యార్థులతో భారీ పర్యావరణ అవగాహన ర్యాలీ శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది.ఈ ర్యాలీలో విద్యార్థులు మొక్కలు నాటుదాం ప్రకృతిని కాపాడుదాం, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండండి, నీటిని ఆదా చేయండి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం వంటి సందేశాలతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజినల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ , ప్రిన్సిపాల్ టి. వి. వి.రమణ ఉపాధ్యాయ బృందం, సిబ్బంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపు నిచ్చారు.



# ధర్మవరంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

**ప్రత్తిపాడు (మనసులో మాట) జూలై 10**




కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గం ప్రత్తిపాడు మండల ధర్మవరం గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించచారు. ఈ సందర్భంగా ప్రతిపండి నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు తమ తమ సమస్యలను శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా దృష్టికి తీసుకుని వచ్చారు .ఈ ప్రజా దర్బార్‌కు నియోజకవర్గం లోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, తమ సమస్యలు, ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం తో ఆమె స్పందించు వారి వారి సమస్యలు పరిష్కారానికి తాను కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు .బాధితులు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో అందజేయగా, ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుతో శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి అధిక శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని కొన్ని సమస్యల విషయంలో కూడా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు . ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే



స్పష్టం చేసారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# ఏఐబీయూజీ సభ్యునిగా రమణారావు

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూలై 10:**



అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలోని అఖిల భారత ఇంజనీరింగ్ & సాంకేతిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యామండలి సభ్యునిగా (ఏఐబీయూజీ) తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ఇన్చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ. రమణారావు నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన అఖిల భారత సాంకేతిక విద్యామండలి అధికారులకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన ఈ బాధ్యతను గౌరవంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. ఆయనను ఏపీ నిట్ అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# ప్రజాభిప్రాయ సేకరణసభ అస్సాగో పరిశ్రమలో కాకుండా గుమ్మలదొడ్డి గ్రామంలో నిర్వహించాలి

- **జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్**

**గోకవరం (మనసులో మాట) జూలై 10:**

గోకవరం మండలం గుమ్మల దొడ్డి గ్రామంలో నిర్మాణం చేసిన ప్రాణాంతకమైన కాలుష్యకారక అస్సాగో ఇథల్ ఆల్కహాల్ పరిశ్రమ ప్రతిరోజు రెండు లక్షల నుండి మూడు లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచుకునే దానికి ప్రజాభిప్రాయ సేకరణ సభను అసాగో పరిశ్రమ ఆవరణలో కాకుండా గుమ్మల దొడ్డి గ్రామం నడిబొడ్డున జరిపించాలని జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివగణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక గోకవరం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శివ గణేష్ మాట్లాడుతూ ప్రాణాంతకమైన, కాలుష్యకారక అస్సాగో పరిశ్రమ వల్ల వారి ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే మాత్రం కాలుష్యకారక పరిశ్రమ యాజమాన్యానికి అండగా ఉండి పరిశ్రమ నిర్వహణను నిరాటంకంగా జరిపిస్తూ ప్రజలకు నరక యాతన చూపిస్తున్నారని, ప్రజలకు అండగా ఉండవలసిన ఎమ్మెల్యే ప్రాణాంతకమైన పరిశ్రమ యాజమాన్యానికి అండగా నిలబడ్డారని జగ్గంపేట ఎమ్మెల్యే ను శివ గణేష్ ఎద్దేవా చేశారు.

గుమ్మలదొడ్డి, అచ్యుతాపురం, బాబాజీ పేట, వెదురుపాక గ్రామాలకు స్థానిక జగ్గంపేట ఎమ్మెల్యే ఏ అధికారిక కార్యక్రమానికి కానీ, మరే ఇతర కార్యక్రమాలు కానీ హాజరు కావడానికి భయపడుతున్నారని, అస్సాగో పరిశ్రమ పట్ల ఆ ప్రాంత ప్రజలు నిలదీస్తారని భయపడి ఆ ప్రాంతానికి శాసనసభ్యుడు వెళ్ళడానికి భయపడుతున్నారని శివ గణేష్ దుయ్య భట్టారు.ప్రాణాంతకమైన అసాగో పరిశ్రమ గుమ్మల దొడ్డి గ్రామం నుండి తరలించుకుపోయే వరకు కాంగ్రెస్ పార్టీగా ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటామని శివ గణేష్ భరోసా ఇచ్చారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసిల్దార్ తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ పై ప్రచారం చేయవలసిన అవసరం ఉందని, ప్రజాభిప్రాయ సేకరణ రోజు పోలీస్ ఆంక్షలు లేకుండా ప్రజలందరూ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ సంరక్షణ కార్యకర్తలు తదితరులు పాల్గొనే విధంగానూ,ఆయా బాధిత గ్రామాల ప్రజలు వారి వారి అభ్యంతర, నిరాభ్యంతర నిర్ణయాలను తెలియజేసే దానికి అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మీడియా ముఖంగా శివ గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నక్క సత్యనారాయణ, గోకవరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్రాల రత్నాజీరావు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ గొంప కొండబాబు యాదవ్, బ్లాక్ టు అధ్యక్షుడు బొల్లం బాపిరాజు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బదిరెడ్డి ప్రసాద్, జగ్గంపేట నియోజకవర్గం రైతు కాంగ్రెస్ అధ్యక్షుడు కోలపర్తి వీర వెంకటరమణ, జిల్లా కాంగ్రెస్ సభ్యుడు మాసారపు అప్పారావు, గోకవరం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏగుపాటి మహేష్ బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా బాధిత గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు

- **జాతీయ పునర్నిర్మాణంలో విద్యార్థుల పాత్రపై సెమినార్**

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 10:**

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జగ్గంపేట నగర శాఖ ఆధ్వర్యంలో "జాతీయ పునర్నిర్మాణంలో విద్యార్థుల పాత్ర" అనే అంశంపై సెమినార్ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏబీవీపీ పూర్వ కార్యకర్త, ప్రస్తుతం మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల పూజా అనూష మాట్లాడుతూ, ఏబీవీపీ ఆవిర్భావం, చరిత్ర, లక్ష్యాలు, భావజాలం, అలాగే ఏబీవీపీతో తన విద్యార్థి దశలోని అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాతలు. జాతీయ పునర్నిర్మాణం అనేది కేవలం భవనాలు, రహదారులు నిర్మించడం మాత్రమే కాదని, దేశంలో విలువలు, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు కలిగిన పౌరులను తీర్చిదిద్దడం కూడా జాతీయ పునర్నిర్మాణంలో భాగమే అని అన్నారు.విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా సమాజ సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని,సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, అవగాహన కార్యక్రమాలు, గ్రామాభివృద్ధి, విద్యా సేవ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ దే



శాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. అలాగే, ఏబీవీపీ స్థాపన నుంచి విద్యార్థుల్లో జాతీయ చైతన్యం, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమాజానికి సేవ చేసే అనేక మంది నాయకులను అందించిందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థి జీవితం వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజం, దేశం పట్ల బాధ్యతను పెంపొందించుకునే స్వర్ణయుగమని, ప్రతి విద్యార్థి రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. .ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జగ్గంపేట భాగ్ కన్వీనర్ జశ్వంత్, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# తుని గొల్లప్రోలు రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుల

- పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి
- సౌత్ కోస్ట్ రైల్వే జియం కు లేఖ రాసిన
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తుని, గొల్లప్రోలు రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను తక్షణమే పునరుద్ధరించాలని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌ను లేఖ రాశారు. తుని, పరిసర ప్రాంతాల ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నం సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం లోక్‌మాన్య తిలక్ టెర్మినల్ (ముంబై) ఎల్‌టిటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తుని రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మకం గా హాల్ట్ మంజూరు చేసినప్పటికీ, ఇప్పటి వరకు అమలు చేయలేదని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

తుని ఏ గ్రేడ్ రైల్వే స్టేషన్గా ఉండి, సంవత్సరానికి సుమారు రూ.20 కోట్ల ఆదాయం సమకూరుస్తోందని, తుని, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాలతో పాటు వందకు పైగా గ్రామాల ప్రజలు ఈ స్టేషన్‌పై ఆధారపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా హెటెరో, డెక్కన్ ఫైన్ కెమికల్స్, డివీస్ ల్యాబొరేటరీస్, ఆరోబిందో ఫార్మా వంటి పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలుపులమ్మ తల్లి ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఈ హాల్టులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు . ఇప్పటికే ఆమోదం పొందిన హాల్టులను త్వరితగతన పునరుద్ధరించాలని కోరారు.అదేవిధంగా గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో సింహాద్రి ఎక్స్‌ప్రెస్, బొకారో ఎక్స్‌ప్రెస్ హాల్టులను పునరుద్ధరించాలని, విజయవాడ విశాఖపట్నం ప్యాసింజర్ రైలు సేవను తిరిగి ప్రారంభించాలని, ప్రయాణికుల డిమాండ్ మేరకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు గొల్లప్రోలులో హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ప్రస్తుతం గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న యార్డ్ రీమోడలింగ్ పనుల్లో అవసరమైన ప్లాట్‌ఫాం విస్తరణ పనులను కూడా చేర్చి పూర్తి చేయాలని, తద్వారా భవిష్యత్తులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తన లేఖలో రైల్వే అధికారులను కోరారు

# వాడపల్లి వెంకన్న ఆలయ నిత్యన్నదాన పథకానికి రూ లక్ష విరాళం



**కొత్తపేట (మనసులో మాట ) జూలై 10**

ఏడు శనివారాల వెంకన్నగా పేరు పొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి, నిడదవోలు కు చెందిన గుంటుపల్లి నాగ సూర్య చంద్రం, కుటుంబ సభ్యులు రూ, 1,00,005 వేంకటేశ్వర స్వామి నిత్య అన్న ప్రసాద నికి విరాళం ని చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డీసీ నల్లం సూర్యచక్రధరరావు లకు అందజేశారు. ఆలయ ఇంచార్జ్ వై శ్రీనివాస్ దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి స్వామి తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

# రూ.1.60 కోట్లతో తణుకులో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

**తణుకు (మనసులో మాట), జూలై 10:**



తణుకు పట్టణంలోని 3, 4 వార్డుల ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 7.25 కిలోమీటర్ల పొడవైన డ్రెయిన్ల నిర్మాణ పనులకు తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

వర్షాకాలంలో డ్రెయిన్లు సరిగా లేకపోవడంతో నీరు నిల్వ ఉండటం, పారిశుధ్య సమస్యలు తలెత్తడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కొత్తగా నిర్మించనున్న డ్రెయిన్ల ద్వారా వర్షపు నీరు వేగంగా వెళ్లిపోవడంతో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

ఈ పనులు పూర్తయిన తర్వాత ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని, దోమల వ్యాప్తి తగ్గడంతో పాటు సీజనల్ వ్యాధులను కూడా నియంత్రించేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే చెప్పారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజల సౌకర్యాల దృష్ట్యా పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.

తణుకు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్య రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొమ్మేటి వెంకట సుధాకర్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి తమరాపు రమణమ్మ తమరాపు సత్యానారాయణ ,గుబ్బల శ్రీనివాస్ ,

స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలి



- ఏనుగు వీధి రామాలయంలో మహిళల సామూహిక కుంకుమ పూజలు

**కిర్లంపూడి,(మనసులో మాట) జూలై 10:**

హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి,రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని కిర్లంపూడికి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ కాకినాడ జిల్లా కిర్లంపూడి మండల కేంద్రంలోని ఏనుగు వీధి కాపుల రామాలయంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.రామాలయ కమిటీ సభ్యులు,స్థానిక పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా రామాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని ప్రజల మధ్యకు రావాలని భగవంతుడిని ప్రార్థించామని తెలిపారు.భగవంతుని కృపతో పాటు ప్రజల ఆశీస్సులు కూడా ఆయనకు మెండుగా ఉన్నాయని,నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏనుగు వీధి కాపుల రామాలయ కమిటీ సభ్యులు,స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు,ముద్రగడ అభిమానులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా దర్బార్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కాకినాడ సిటీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు అన్నారు . శుక్రవారం నాడు శాసనస భ్యుడు వారి క్యాంప్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను కొండబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ ను నిర్వహిస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటు లో ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలు నుండి వచ్చిన సమస్యల అర్జీలను పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు .ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లీపూడి వీరు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు



# నేడు నూజివీడులో విద్యుత్ సరఫరా నిలిపివేత

**నూజివీడు (మనసులో మాట) జూలై 10:**



నూజివీడు పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీఎస్పీడీసీఎల్ పట్టణ ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 33/11 కె.వి సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా డం డం గార్డెన్స్, గాంధీనగర్, యానాదుల కాలనీ, జగనన్న కాలనీ, కుమ్మరిపేట, అజరయ్య పేట, సబ్ కలెక్టర్ ఆఫీస్ ఏరియా, శ్రీనివాస సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, స్టేషన్ తోట, గొడుగు వారి గూడెం, రెడ్డిగూడెం రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంద న్నారు.

# హత్య కేసు ఛేదించిన త్రీ టౌన్ పోలీసులు

- ముగ్గురు నిందితులు అరెస్ట్
- సి.ఐ కె.వి.ఎస్. సత్యనారాయణను అభినందించిన
- ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ (మనసులో మాట) జూలై 10**



కాకినాడ నగరంలో మొజ్జు సతీశ్ హత్య కేసు ను త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) మహంతి కిషోర్ కుమార్, సీ.ఐ కె.వి.ఎస్. సత్యనారాయణ లు వివరాలు వెల్లడించా రు. ఈ ఏడాది మే నెల లో 10వ తేదిన మొజ్జు సతీశ్ మృతదేహం అనుమానాస్పద స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం రావడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. దర్యాప్తు లో భాగంగా పోస్ట్ మార్టం రిపోర్ట్ ఆధారంగా హత్య కేసు గా నమోదు చేసి దర్యాప్తు కొనసాగించడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలు తో కేసు పై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు ఎస్పీ మహంతి కిషోర్ కుమార్ పర్యవే క్షణలో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి దర్యా ప్తు నిర్వహించామని చెప్పారు. దర్యాప్తు లో భాగంగా శుక్రవారం కుంచె ప్రభు తేజ, కుంచె నాని, పెరుగు అంజలి అలియాస్ రాణి లను అరెస్ట్ చేశామని చెప్పారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించి న ద్విచక్ర వాహనం, మసాలా దాంచే కర్ర, ప్లాస్టి క్ గొట్టం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడు ప్రభు తేజ వద్ద మృతుడు సతీష్ హెల్పర్ గా పనిచేసే వాడని అన్నారు. నిందితుడు ప్రభు తేజ కాకినాడ కుర్రోడు పేరుతో వీడియోలు తీసేవాడని తెలిపారు. మృతి చెందిన సతీష్ ప్రభు తేజ ఇంట్లో 30 వేల రూపాయల నగదు, మూడు సెల్ ఫోన్లు దొంగిలించాడని, అవి తిరిగి ఇవ్వకపో వడం తో పాటు దూషించడం వల్ల హత్య చేయాలని పథకం రూపొందించారని దర్యాప్తు లో తేలిందని చెప్పారు. మే 9 తేదీ న మృతుడిని తీవ్రంగా కొట్టి గొంతు నులిమి హత్య చేశారని చెప్పారు. అనంతరం మృత దేహాన్ని సీ సీ కెమెరాలు లేని మార్గం ద్వారా ద్విచక్ర వాహనం పై తీసుకు వచ్చి సాంబమూర్తి నగర రెండవ వీధిలో చెట్టు కింద పడేశారని వివరించారు. కేసు ను త్వరితగతిన ఛేదించిన త్రీ టౌన్ సి ఐ కె వి ఎస్. సత్యనారాయణ, ఎస్ ఐ సత్యనారాయణ చౌదరి, ఎ ఎస్ ఐ శ్రీనివాసు, హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్ మురళీ రాజు లను, క్రైమ్ పోలీస్ సిబ్బంది నీ ఎస్పీ బిందు మాధవ్ తో పాటు జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు

# అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో 78 మంది గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు



**రంపచోడవరం (మనసులో మాట) జూలై 10**

పోలవరం జిల్లా అడ్డతీగల మండలం

అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా పిఎంఎ స్ఎంఎ కార్యక్రమం నిర్వహిం చారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో శు క్రవారంనాడు ప్రతి నెలా9,10 తేదీలలో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం 71 మంది గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్ష లు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి గైనకాలజిస్ట్ డాక్టర్ మోమినా ఆధ్వర్యంలో ఈ వైద్య పరీక్షలు జరిగాయి అలాగే మరి కొంతమంది గర్భిణీ లకు అవసరమైన 38 మందికి స్కానింగ్ చేసి 26 గర్భిణీలకు , రక్తహీనత గమనించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మిగతా కొంతమందిని గమనించి డెలివరీ దగ్గరగా ఉన్న వారిని ముందుగా వచ్చి జాయిన్ అవ్వాలని సూచన చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన గర్భిణీలు, ఆశా వర్కర్లు మరియు ఏఎన్ఎం లకు హాస్పటల్ సూపర్డెంట్ పి మహేష్ రెడ్డి భోజన వసతిని ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత కార్యక్రమంలో భాగంగా జనరల్ మెడిసిన్ డాక్టర్ నారాయణ,అ నూష, రేష్మ మాట్లాడుతూ, ప్రస్తు తం వర్షాకాలం దృష్ట్యా వ్యాప్తి చెం దుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డాక్టర్ మహేష్ రెడ్డి గారు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల వ్యాప్తి, వాటి ప్రధాన లక్షణాల గురించి వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే ఆసుపత్రికి వచ్చి వైద్య సలహాలు పొందాలని ఆయన స్పష్టం చేశారు.

గర్భిణీలకు ఆసుపత్రి కౌన్సిలర్ నారె వాసు మాట్లాడుతూ, గర్భి ణీలు గర్భం దాల్చినప్పటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కొత్తగా వచ్చిన వారికి అలాగే పాత వారికి అవగాహన కల్పించి వివరించారు. ముఖ్యంగా ప్రసవ సమయంలో రక్తహీనత వంటి సమస్యలు రాకుండా తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి తల్లులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎ న్ఎంలు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణీలు పాల్గొన్నారు. అలాగే ఎల్లవరం పి హెచ్ సి స్టాఫ్ పా ల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి

- కొత్తపేట ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట( మనసులో మాట )జూలై 10**




ప్రజా దర్బార్ లో ప్రజలు సమర్పించే వినతుల పట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఎప్పటిక ప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనం తో వ్యవహరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం వాడపాలెం, ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామాల్లో ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. మొత్తం ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జుజవరపు హరి, ముళ్ళపూడి భాస్కరరావు, గ్రామస్తులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కలెక్టరేట్ జిల్లా కోర్టు కాంప్లెక్స్లో ప్రతివారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

- కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ

**కాకినాడ, జూలై 10**



కాకినాడ నగరంలోని జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు (డిస్ట్రిక్ట్ కోర్టు) కాంప్లెక్స్ లో ప్రతి వారం ప్రత్యేక శా నిటేషన్ డ్రైవ్ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం గా ఉంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారా యణ తెలిపారు. శుక్రవారం ఉదయం నగరంలోని 37వ డివిజన్ పరిధిలో ఉన్న జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు కాంప్లెక్స్ ను కమిషనర్ స్వయంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా కార్యాలయాల పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రభుత్వ కా ర్యాలయాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టరేట్, జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో ఇకపై ప్రతి వారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త సేకరణ, పరిసరాల శుభ్రత పనులను క్రమం తప్పకుండా చేపడతామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం నగరపా లక సంస్థ బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమం లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎ. సత్తిబాబు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండి నరేంద్ర, సచి వాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన



- **మత్స్యశాఖ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 10**

జాతీయ చేపల రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడియం లోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ, 1957 జూలై 10వ తేదిన ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఉన్న సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి డాక్టర్ అలీ కున్హీ మెజర్ కార్ప్ చేపల విజయవంతమైన ప్రేరేపిత సంతానోత్పత్తి (ఇండకడ్ బ్రీడింగ్ ) సాంకేతికతను అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం జూలై 10 వ తేదిని జాతీయ చేపల రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు.ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల నాణ్యమైన చేపల విత్తనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, మత్స్యరంగ అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. ప్రపంచంలో మంచినీటి చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో కొనసాగుతున్నదని తెలిపారు. చేపల పెంపకం గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఉపాధి వనరుగా మారి వేలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తోందని నిర్మల కుమారి తెలిపారు. చేపలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారమని, ఆహార భద్రతకు కూడా అవి కీలకమని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి చేపల విత్తనాలు వదలడం ద్వారా ఆహార ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని కూడా పెంచవచ్చని సూచించారు.ఈ సందర్భంగా అక్వా రైతులు మత్స్యరంగ ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న విశేష సేవలను గుర్తించి సత్కర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్, అనపర్తి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పులకుర్తి శ్రీనివాసు, శ్రీకృష్ణపట్నం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొల్లాం రత్నంలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఎం. బ్రహ్మానందం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మత్స్య సహకార సంఘం జేఏసీ ఏ. సత్తిబాబు, జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల సభ్యులు, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత పాటించండి

**వి.ఆర్.పురం. (మనసులోమాట) జూలై 10;**



దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా వైరస్, ఎల్లో ఫీవర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. వీటి ద్వారా తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనీ, దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలనీ, పరిసరాల పరిశుభ్రత పాటించండి అని ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత అన్నారు. శుక్రవారం ఉమ్మడివరం గ్రామంలో రేఖపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న 11 మంది కి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కోతులు గుట్ట ఆసుపత్రికి రిఫేర్ చేయడం జరిగిందని తెలిపారు. వారు అక్కడ వైద్యం పొందుతున్నారని గ్రామంలో తమ సిబ్బందితో ఇంటింటా సర్వే చేపట్టామని, గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత వాడే నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు కొత్త నీరు ఉండేలా చూడాలని, అలా ఉండకపోతే లార్వా అభివృద్ధి చెంది వాటి ద్వారా డెంగ్యూ కారక దోమలు వ్యాప్తి చెందుతాయని, అందుకు ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులు నివారణకు హెల్త్ క్యాంపులు నిర్వహించటం జరుగుతుంది అని ఆమె తెలిపారు. వాగు నీరు, గోదావరి నీళ్లను గ్రామాల వారు కచ్చితంగా కాచి చల్లారిసి వడపోసుకుని తీసుకోవాలని సూచించారు. ఉమ్మడివరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పిహెచ్ఎన్ భద్రకాళి, స్థానిక ఆశ వర్కర్ ఏఎన్ఎం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అయినవిల్లి మండలంలో 83శాతం (సర్ )ప్రక్రియ పూర్తి

- **తహసిల్దార్ విద్యాపతి**

**అయినవిల్లి (మనసులో మాట) జూలై 10 :**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )ప్రక్రియ అయినవిల్లి మండలంలో 83 శాతం పూర్తయినట్లు తహసిల్దార్ విద్యాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బిఎల్ఓ లు 21 గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ శర వేగంతో నిర్వహిస్తున్నామని తాహసిల్దార్ తెలిపారు. మిగిలిన 17 శాతం మూడు రోజుల్లో పూర్తి చేస్తామని దీనికి సంబంధించి ఓటర్ల సవరణ కార్యక్రమంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి, ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి బిఎల్ ఓ లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.



# రోడ్డు ప్రమాదానికి గురైన విద్యార్థికి అక్షర విద్యా సంస్థలు ఆర్థిక సాయం



**జగ్గంపేట (మనసులో మాట) జూలై 10:**

అక్షర జూనియర్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం ఎం.పి.సి. చదువుతున్న యర్రా వీరవెంకట రమణ అనే విద్యార్థి ఇటీవల ఒక తీవ్రమైన రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.ఈ విషయం తెలుసుకున్న కాలేజీ యాజమాన్యం,అక్షర విద్యాసంస్థలు మానవతా దృక్పథంతో స్పందించి, ఆ విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం 50,000/ (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ ఆర్థిక సహాయాన్ని అక్షర విద్యా సంస్థల చైర్మన్ పాటంశెట్టి సతీష్ బాబు, కరస్పాండెంట్ ఆళ్ళ రవి కిషోర్,ప్రిన్సిపాల్ నీలం చక్రధర్,కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది మరియు తోటి విద్యార్థుల సహకారంతో బాధితుడి కుటుంబానికి అందజేయడం జరిగింది. ప్రమాదానికి గురైన విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# ప్రమాదకరంగా ఉన్న చింత చెట్టుకొమ్మలు తొలగించారు

**వి.ఆర్.పురం. (మనసులోమాట) జూలై10;**



శ్రీరామగిరి గ్రామం వద్ద ఇటీవల గాలివాన బీభత్సం సృష్టించి చింతచెట్టు కొమ్మలు విరిగి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న కొమ్మలను తొలగించాలని, వివిధ పత్రికల్లో వార్తలు రావటంతో స్పందించిన అధికారులు శ్రీరామగిరి గ్రామానికి చెందిన వల్లి సుందరం ఇంటి పైన విరిగి వేలాడుతున్న చెట్టు కొమ్మలను చెట్టును ఎంపీడీవో ఇమ్మానియేలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ శ్రీరామగిరి మాజీ ఉపసర్పంచ్ గుండెపూడి లక్ష్మణరావు ప్రత్యేక చొరవతో గురువారం చెట్టు కొమ్మ లను సిబ్బందితో తొలగించారు. అయితే కొన్ని కొమ్మలు ఇంటిపై పడడంతో ఇంటి పై కప్పు రేకులు ధ్వంసం అయ్యాయి. అదే ముందుగానే కొమ్మలు తొలగించి ఉంటే ఇంటి రేకులు పగిలేయి కావని బాధితుడు వాపోయాడు. చెట్టును తొలగించడంలో జాప్యం జరిగినప్పటికీ పూర్తిగా ప్రమాదంగా ఉన్నటువంటి అన్ని కొమ్మలను తొలగించినటువంటి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఇమ్మానియేల్ ను వారి కృషిని వారి సిబ్బందినీ గ్రామస్తులు, బాధితులు ధన్యవాదాలు తెలిపారు.



# ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.





**వి.ఆర్.పురం. (మనసులోమాట) జూలై 10;**

మండలంలోని ఉమ్మడివరం,రెడ్డిగుంపు నాగేంద్ర పురం, రామాపురం తదితర గ్రామాలలో ప్రజానీకం డెంగ్యూ, మలేరియా జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వైద్య అధికారులు గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని మండల ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలోని పిహెచ్సీ ని పరిశీలించి అక్కడ ఉన్న రోగుల ఆరోగ్యపరమైన విషయాలను, వారికి జరుగుతున్న వైద్యతీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఉమ్మడివరం, రెడ్డి గుంపు గ్రామాలలో ఎక్కువగా డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడి ప్రజలు అనారోగ్యాలకు గురైన వారి దగ్గరకు వెళ్లి వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పర్యటనలో ఉన్న జిల్లా వైద్య అధికారులు డి ఎం అండ్ హెచ్ ఓ, అడిషనల్ డి ఎం హెచ్ ఓ లను కలిసి తక్షణమే డెంగ్యూ, మలేరియా నివారణ కొరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే ఇంటి ఇంటికి వెళ్లి ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య అధికారులను కోరారు. దానితోపాటుగా ఏజెన్సీలోని దోమ కాటు ఎక్కువగా ఉన్నదని, దోమల నివారణ కొరకు దోమల మందు పిచికారి చేయించి,తక్షణమే దోమతెరలు పంపిణీ చేయాలని వారిని కోరారు. ఉమ్మడివరం గ్రామంతో పాటు రెడ్డిగుంపు, నాగేంద్రపురం, రామాపురం మొదలైన గ్రామాలన్నింటిలో ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించాలని, మండలంలో ఒకే ఒక్క డాక్టర్ ఉండడం వలన పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని, గ్రామాల్లో క్యాంపులకు ఉన్న ఒక డాక్టర్ వెళ్తే, హాస్పిటల్లో డాక్టర్ లేని పరిస్థితి నెలకొందని తక్షణమే మరో డాక్టర్ ను నియమించాలని, రానున్నది వరదల కాలము కాబట్టి అదనపు డాక్టర్ నియమించి వైద్యం అందించాలని తెలిపారు. డెంగ్యూ వైద్య నివారణ కొరకు ప్రతి ఒక్కరూ కోతులగుట్ట వైద్యశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రేఖపల్లి పిహెచ్సి లో కూడా డెంగ్యూ కి సంబంధించిన మందులు ఉంచి ట్రీట్మెంట్ చేయించాలని జిల్లా అధికారులను ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. స్పందించిన జిల్లా అధికారులు తక్షణమే మరో డాక్టర్ ను ఏర్పాటు చేసే విధంగా పై అధికారులతో మాట్లాడతామని, డెంగ్యూ కి కూడా రేఖపల్లి హాస్పిటల్లో వైద్యం అందించేలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని, గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించి డెంగ్యూ మలేరియా జ్వరాలను నివారణ చేయడం కోసం ప్రయత్నం చేస్తామని ఎంపీపీ కి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం.శ్రీరామ్మూర్తి, కమ్మచిచ్చు. సత్యనారాయణ, కుంజ కన్నయ్య, నాల్లారపు.ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే అభివృద్ధి సంక్షేమాలు;





- **ఎమ్మెల్యే చినరాజప్ప**

**సామర్లకోట (మనసులో మాట)జూలై 10;**

కూటమి పాలనలోనే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు సాధ్యపడతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం సామర్లకోట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టౌన్ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ అధ్యక్షతన పార్టీ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. గత వైసిపి పాలనలో రాష్ట్రం హస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో అభివృద్ధికి శ్రీకారం చుట్టడమే కాకుండా, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమాల విశిష్టతను నేతలు ప్రజా ప్రతినిధులు ప్రజలకు చాటి చెప్పాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సమావేశ అనంతరం పట్టణంలోని 10,11 వార్డుల్లో విజయోత్సవ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ పార్టీ నేతలు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, అందుగుల జార్జి చక్రవర్తి, గోల్టి సత్యనారాయణ, నిమ్మకాయల కిరణ్, గంగాధర్, ముసిరెడ్డి శ్రీరాములు, యార్లగడ్డ రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ అందుగుల మణికుమారి, మహిళా నేతలు రామలక్ష్మి, పిల్లా సత్యవతి, సుష్మా మోహిని, కాళ్ల రవీంద్ర, కాపవరపు కుమార్, పడాల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు

# ముద్రగడ త్వరగా కోలుకోవాలని కిర్లంపూడి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

**కిర్లంపూడి,(మనసులో మాట) జూలై 10:**

హైదరాబాద్ సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి రావాలని కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మదీనా జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మసీద్ కమిటీ పెద్దలు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి రావాలని శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడమే కాకుండా, అల్లాను వేడుకున్నామన్నారు.అల్లా ఆశీస్సులతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి వస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ షాబుద్దీన్, ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖయ్యూం భాషా,షేక్ ఇబ్రహీం(ఐ జి ) షేక్ అహ్మద్, షేక్ బషీర్, షేక్ కాలేషా, షేక్ కరీముల్లా షా, పలువురు కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# ద్వారపూడిలో రూ.15.75 లక్షలతో ఎస్.సి కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన...

**మండపేట ( మనసులో మాట) జులై 10**

మండపేట మండలం, ద్వారపూడి గ్రామంలో ఎస్.సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, ప్రజల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నిర్విఘ్నంగా సాగాలని ఆకాంక్షిస్తూ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళకు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఎస్.సి సామాజిక వర్గ ప్రజల చిరకాల కోరికైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సి.ఎస్.ఆర్ గ్రాంటు ద్వారా రూ.15.75 లక్షలు నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన చేయడంపై స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారు చోరీ



**గండేపల్లి (మనసులో మాట) జూలై 10:**

నిద్రిస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారం చోరీకి గురి అయ్యింది.గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండేపల్లి మండలం కే.గోపాలపురం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ఆవరణను నిద్రిస్తున్న బి .సావిత్రి అనే మహిళ నుండి నగలు ను దుండగులు అపహరించారు. శుక్రవారం జగ్గంపేట సీఐ తిరుపతి రావుమరియు గండేపల్లి ఎస్సై యు వి శివ నాగబాబు లు బాధితురాలు వద్ద నుండి వివరాలు సేకరించారు. ఇంటిలో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి నగలు ఆపరించడంతో జగ్గంపేట సిఐ తిరుపతిరావు గోపాలపురం గ్రామానికి చేరుకుని బాధితురాలతో నేలపై కూర్చుని వివరాలు సేకరించారు. నిందితులను పట్టుకొని బాధితురాలకు న్యాయం చేస్తామని సీఐ తిరుపతిరావు తెలిపారు.

## ఎంఆర్‌పి రేటు కంటే రూ.10 నుండి రూ.20 అదనపు వసూళ్లు......

- **పట్టించుకోని అధికారులు. విలవిల్లాడుతున్న మందుబాబులు.....**
- **తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.....**

**చింతలపూడి( మనసులో మాట) జులై 10 :**

ఏలూరు జిల్లా చింతలపూడి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు మద్యం దుకాణాల్లో అక్రమ వసూళ్ల పర్వం జోరుగా సాగుతోంది. అని సమాచారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన 'ఎంఆర్‌పి' (గరిష్ట విక్రయ ధర) కంటే అదనపు ధరలకు విక్రయిస్తూ మందుబాబుల జేబులకు నిర్వాహకులు చిల్లులు పెడుతున్నారు. ప్రతి క్వార్టర్ బాటిల్ లేదా బీరుపై రూ. 10 నుండి రూ. 20 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**నిబంధనలు బేఖాతర్.. బోర్డులు మాయం!**

నిబంధనల ప్రకారం ప్రతి మద్యం దుకాణం ముందు ధరల పట్టిక ప్రదర్శించాల్సి ఉండగా, మండలంలోని పలు దుకాణాల్లో అది ఎక్కడా కనిపించడం లేదు.

ఎవరైనా కస్టమర్లు రేటు ఎందుకు ఎక్కువ అని ప్రశ్నిస్తే... "మాకు పై మామూళ్లు, రవాణా ఖర్చులు ఎక్కువవుతున్నాయి..

నచ్చితే తీసుకోండి లేదంటే లేదు" అంటూ నిర్వాహకులు దురుసుగా సమాధానం చెబుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజల అభ్యర్థన.. తక్షణ చర్యలు అవసరం!**

ఈ దోపిడీపై చింతలపూడి మండల ప్రజలు, పలువురు సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, చింతలపూడి మండలంలోని మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు అమ్ముతున్న దుకాణాల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పిచ్చుకలంకలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- **పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బండారు**

**కొత్తపేట (మనసులో మాట )జూలై 10**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్ద ఈ నెల 13వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు చేపడుతున్న ఏర్పాట్లను కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పరిశీలించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో కలిసి పిచ్చుకలంక ప్రాంతంలో పర్యటించి సభా వేదిక, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీరు, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు.

పిచ్చుకలంక ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనతో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్ రాజు, జల్లి కామేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో పునః నిర్మాణ పనులు స్థపతి ఎడ్వైజర్ సుందరరాజన్

- **చరిత్రలో నిలిచిపోయేలా నిర్మాణం**
- **వెయ్యి సంవత్సరాలైన చెక్కుచెదరదు**
- **గ్రామ ప్రజలు అదృష్టవంతులు**

**ఐ పోలవరం మండలం, మనసులో మాట, జులై 10:**



మురమళ్ల లో నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణ పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం గా జరుగుతున్నాయని దేవాదాయశాఖ స్థపతి ఎడ్వైజర్ శ్రీ సుందరరాజన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ పునః నిర్మాణ పనులను చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అర్చకులు బ్రహ్మశ్రీ యనమంద్ర సత్య సీతారామ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయ మాట్లాడుతూ శ్రీ స్వామి వారి ఆలయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనుభవజ్ఞులై శిల్పి లతో ఆలయాన్ని నిర్మిస్తున్నారని ఇప్పుడు నిర్మించే ఆలయం సుమారు వెయ్యి సంవత్సరాలైన చెక్కుచెదరకుండా నిర్మాణం రూపుదిద్దు కుంటోందని తెలిపారు. ప్రస్తుతం బేస్ మెంట్ పనులు పూర్తఅయ్యి గర్భాలయానికి సంభందించిన జరుగుతున్నాయని పనులు శాఖ పరంగా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. గ్రామ ప్రజలు ఎంతో అదృష్టం చేసుకొన్నారని అన్నారు. నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమూనా పరిశీలించారు. పలు సూచనలు సలహాలు అందించారు. ఏర్పాట్లు అసిస్టెంట్ కమిషనర్ వి. సత్యనారాయణ పర్యవేక్షించారు. తొలుత స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. శేష వస్త్రం, ప్రసాదం చిత్ర పటం అందించి వేద ఆశీర్వచనం అందించారు.

# మరిడమ్మ జాతర పక్కా భద్రత; డీఎస్పీ తిలక్





**పెద్దాపురం (మనసులో మాట) జూలై 10;**

పెద్దాపురం మరిడమ్మ తల్లి ఆషాడ మహా జాతరకు పక్కాగా భద్రత ఏర్పాటులు చేపడతామని పెద్దాపురం డిఎస్పి బాలగంగాధర్ తెలిపారు. శుక్రవారం పెద్దాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కే శ్రీనివాసరావు తో కలిసి మరిడమ్మ తల్లి ఆలయాన్ని, ఆలయ పరిసరాలను పరిశీలించారు. జూలై 13 నుండి మరిడమ్మ తల్లి ఆషాడ మహా జాతర వేడుకలు 45 రోజులపాటు జరగనున్నాయి. దేశ నలుమూలల నుండి లక్షలాదిగా భక్తులు పెద్దాపురం మరిడమ్మ తల్లి ఆషాడ జాతరకు తరలివస్తారు. అమ్మవారి మహా జాతర వేడుకలను పురస్కరించుకొని క్యూ లైన్లు, అత్యవసర ద్వారం, విఐపి దర్శన ఏర్పాట్లు, తదితర అంశాలపై డిఎస్పి బాలగంగాధర్ తిలక్ పరిశీలన చేశారు. ఆషాడ ఉత్సవాల భద్రత ఏర్పాట్లపై దేవాలయ అధికారులకు, పోలీసులకు డిఎస్పి తిలక్ పలు సూచనలు, సలహాలు అందించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను ఆలయ ప్రతినిధులు రమణ, క్రాంతి, శివ, అర్చకులు పోలీసులకు వివరించారు.

మనసులో మాట

KANCHARLA

రాయలసీమ

| | | |
|---|---|---|
| చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం |
| కర్నూలు | కడప | నెల్లూరు |

శనివారం 11 జులై 2026 పేజీలు 16


# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



05



## రుణాల పేరిట అక్రమ వసూళ్లు చేస్తేకఠిన చర్యలు

# జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

- అక్రమ వసూళ్లపై కలెక్టర్ హెచ్చరిక
- రుణాల పేరుతో మోసాలకు చెక్
- డబ్బు అడిగితే వెంటనే ఫిర్యాదు
- డీఆర్‌డీఏ కాల్ సెంటర్ ఏర్పాటు
- ఫిర్యాదులకు: 9390505066

**చిత్తూరు,జూలై10,(మనసు లో మాట):**

జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన లో హెచ్చరించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో ఇటీవల మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు లింకేజీలు, స్త్రీ నిధి, సిఐఎఫ్, వడ్డీ లేని రుణాలు, జీవనోపాధి యూనిట్లు మంజూరు చేయిస్తామని అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ , వెలుగు పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల బలోపేతం,

..మిగతా 2లో



## ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో ఘనంగా

# 7వ వార్షికోత్సవం

- ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో 7వ వార్షిక కాన్వొకేషన్ ఘనంగా నిర్వహించి, 2026 ఉత్తీర్ణులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు.
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు ప్రదానం చేశారు.

**ఏర్పేడు, జూలై 10 (మనసులో మాట) :**

తిరుపతిలోని ఐఐఎస్ఈఆర్ (IISER)లో 7వ వార్షికోత్సవం సందర్భంగా కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2026లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్య అతిథి నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి, ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య చేతుల మీదుగా డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య, మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ఐఐఎస్ఈఆర్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించి ఉన్నత శిఖరాలకు చేర్చే సంస్థగా నిలుస్తోందని తెలిపారు.

## దేశ భాషలంటే తెలుగే లెస్స: రిజిస్టరర్ ఇంద్ర ప్రీత్ సింగ్ కోహ్లీ



13



10

## ప్రపంచ జనాభా దినోత్సవానికి పోస్టర్ల విడుదల

# రుణాల పేరిట అక్రమ వసూళ్లు చేస్తేకఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

మహిళలఆర్థిక స్వావలంబన , జీవనోపాదుల పెంపు, ఉపాధి అవకాశాలు కల్పన, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల అమలు, మహిళా సాధికారత లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు కలెక్టర్ వివరించారు. అయితే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రుణాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు . ప్రభుత్వ పథకాల పేరుతో లేదా అధికారిక సేవల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడినా ప్రయత్నించినా స్వయం సహాయక సంఘ



సభ్యులు సంబంధిత ఆధారాలతో జిల్లా కలెక్టర్ కు కానీ ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులకు నేరుగా గాని లేక రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం చిత్తూరు డిఆర్డిఏ లో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను9390505066 నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. స్వయం సహాయ సంఘ సభ్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ వసూళ్లకు లొంగొద్దని, ఎవరైనా నగదును డిమాండ్ చేస్తే వెంటనేww అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. సంఘాల్లోని మహిళలకు అర్హతను బట్టి ప్రత్యేక ప్రభుత్వ వ్యవస్థ ద్వారా రుణాలు పారదర్శకంగా మంజూరు చేస్తారన్న విషయాన్ని సంఘ సభ్యులు గుర్తించాలన్నారు. సభ్యులు పారదర్శకత, జవాబుదారితనం, అవినీతి రహిత వ్యవస్థను బలోపేతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ తెలిపారు.

# సజ్జల రామకృష్ణారెడ్డి తో బద్వేలు YSRCP అదనపు సమన్వయకర్త భేటీ

**బద్వేలు, మనసులో మాట,జూలై 10:**

YSR కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ని బద్వేలు నియోజకవర్గ YSRCP అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో బద్వేలు నియోజకవర్గం లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల



అమలు తీరుపై సజ్జల కి నల్లేరు విశ్వనాథ రెడ్డి వివరించారు. పార్టీ శ్రేణులను మరింత ఉత్తేజంగా పనిచేసేలా చూడాలని, ప్రజలకు వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయాలని ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ప్రైవేట్ పాఠశాలలపై బెదిరింపులు, బలవంతపు వసూళ్లకు చెక్

- ఏఎస్పీ రవి మనోహరాచారి హెచ్చరిక.

**తిరుపతి ప్రతినిధి, జులై 10 (మనసులో మాట) :**

ప్రైవేట్ పాఠశాలలపై బెదిరింపులు, బలవంతపు వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తిరుపతి అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రవి మనోహరాచారి హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా శాఖ ప్రతినిధులు గురువారం ఏఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు కొందరు వ్యక్తులు విద్యార్థి సంఘాలు, సామాజిక సంఘాలు, కుల సంఘాల పేరుతో వెళ్లి విరాళాలు, సంక్షేమ నిధులు, ప్రకటనలు తదితర పేర్లతో బలవంతంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే తప్పుడు ప్రచారం, నిరాధార ఫిర్యాదులు, ఆందోళనలు చేపడతామని బెదిరిస్తున్నారని ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలు, ఆధారాలను కూడా సమర్పించారు. వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన ఏఎస్పీ శ్రీ రవి మనోహరాచారి మాట్లాడుతూ, ప్రైవేట్




పాఠశాలలకు ఎవరైనా అనుమతి లేకుండా వెళ్లి డబ్బులు డిమాండ్ చేసినా, బెదిరింపులకు పాల్పడినా లేదా బలవంతపు వసూళ్లకు ప్రయత్నించినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని అన్ని పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ఇటువంటి ఫిర్యాదులపై పోలీసులు వెంటనే స్పందించి, సమగ్రంగా విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. విద్యా సంస్థల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, విద్యాసంస్థల భద్రతకు జిల్లా పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని ఏఎస్పీ స్పష్టం చేశారు.ఏఎస్పీ సానుకూల స్పందనకు అప్పుస్మా తిరుపతి జిల్లా శాఖ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి బెదిరింపులు, బలవంతపు వసూళ్లు లేకుండా ప్రశాంతంగా విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసు శాఖతో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ పూర్తి చేయండి – జేసీ గోవిందరావు



- -తిరుపతిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విధానాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**తిరుపతి ప్రతినిధి, జులై 10 (మనసులో మాట)**

ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదేశించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిరుపతి పట్టణంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విధానాన్ని జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జేసీ తిరుపతి పట్టణంలోని పోస్టల్ కాలనీ, కెన్నెడీ నగర్, బైరాగిపట్టెడ, దొడ్డాపురం వీధి పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వారీగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లకు దిశానిర్దేశం చేశారు. ఏఎస్డీ లిస్ట్ తయారీ, ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి అంశాలను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.ప్రత్యేక సవరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించకుండా పూర్తి బాధ్యతతో పనిచేయాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా చూడాలని జేసీ గోవిందరావు స్పష్టం చేశారు.

# తిరుమలలో చోరీ కేసు ఛేదించిన టు టౌన్ పోలీసులు – నిందితుడు అరెస్ట్



**తిరుపతి ప్రతినిధి, జులై 10 (మనసులో మాట)**

తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.60,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే, 0607 2026న జార్ఖండ్‌కు చెందిన ఒక భక్తుడు తన కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనార్థం వచ్చి తిరుమలలోని ANC రూమ్ నెం.414Eలో బస చేశారు. రూమ్ లాక్ చేసి శ్రీవారి దర్శనానికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కిటికీ ద్వారా ప్రవేశించి సుమారు రూ.95,000 నగదు చోరీ చేశారు. బాధితుడు టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు క్రైమ్ నెం. 59/2026, U/s 305(a), 331(4) BNS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ద్వారా ముద్దాయిని గుర్తించి, 09072026 సాయంత్రం తిరుమలలో అరెస్ట్ చేశారు.నిందితుడు ఉప్పు గోవర్ధన్, 25, తిరుపతి రూరల్ మండలానికి చెందినవాడు. నిందితుడు గత రెండు నెలల క్రితం తిరుమలలో శానిటేషన్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ చోరీకి పాల్పడ్డాడు. ఇతడు గతంలో కూడా పలు దొంగతనం కేసులలో అరెస్టై విచారణ ఎదుర్కొంటున్నాడని పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి రూ.60,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని, న్యాయస్థానంలో హాజరుపరిచారు.

# మావిళ్లపాడు మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన - తహసీల్దార్ రాజేంద్ర





**దొరవారిసత్రం, జూలై 10 (మనసులో మాట):** దొరవారిసత్రం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న సంక్షేమ పథకాల పనితీరును స్వయంగా పరిశీలించేందుకు దొరవారిసత్రం మండల తహసీల్దార్ రాజేంద్ర శుక్రవారం మావిళ్లపాడు గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు కూర్చుని భోజనం చేస్తున్న ప్రాంగణాన్ని సందర్శించి, వడ్డిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు. వంట గదిలోని సామాగ్రి, నిల్వ విధానాన్ని పరిశీలించారు. తహసీల్దార్ రాజేంద్ర స్వయంగా విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి, మెనూ, చదువు, తరగతి గదుల్లో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.తదుపరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి గదిలో పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతం, ఎన్రోల్‌మెంట్ వివరాలు, ఇతర పరిపాలనా అంశాలను సమీక్షించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ బృందంతో చర్చించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం



**పలమనేరు జూలై 10( మనసులో మాట ):** పలమనేరు నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతో బైరెడ్డిపల్లికి చెందిన మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగవరం మండలంలోని సాయి బాలాజీ టవర్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య, కంటిపొర (క్యాటరాక్ట్) శస్త్రచికిత్స శిబిరాన్ని శుక్రవారం పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. చెన్నైకి చెందిన ప్రముఖ శంకర్ నేత్రాలయ వైద్య నిపుణులు అత్యాధునిక పరికరాలతో శిబిరంలో సేవలందిస్తుండగా, స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే శిబిరాన్ని పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. రోగులకు నిర్వహిస్తున్న పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆర్థిక ఇబ్బందులు, దూర ప్రయాణాల కారణంగా చికిత్సను వాయిదా వేయకుండా, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా కంటి పరీక్షలు చేయించుకొని, ప్రజలు కూడా ఎలాంటి అపోహలు లేకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు నాగరాజు ,శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దినకర్,శంకర్, శాంతి, రుక్మిణి, డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్, ఆర్.వి. బాలాజీ, విష్ణువర్ధన్ రెడ్డి, పూల చైతన్య మోహన్, కిషోర్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, కుట్టి, గిరి,ఖాజా, చాంద్ బాషా, శ్రీధర్, అరుణ్, మదన్, నదీమ్, వెంకటరమణ, నేత్రాలయ వైద్య బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దుర్గా ఫార్మసీని ప్రారంభించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు జూలై 10 ( మనసులో మాట) :** పలమనేరు పట్టణంలోని లింగాయతి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా (ప్రైవేట్) ఫార్మసీని స్థానిక శాసనసభ్యులు అమరనాథ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఫార్మసీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మాట్లాడుతూ..ఆరోగ్య సేవల్లో ఫార్మసీల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన మందులను అందుబాటు ధరల్లో అందించడం ప్రతి ఫార్మసీ బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన మందులు తక్కువ ధరలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఫార్మసీ నిర్వాహకులు, వైద్య రంగానికి చెందిన ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాసపుస్తకాల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న కూరపాటి శంకర్ రెడ్డి




**సత్యవేడు జూలై 10(మనసులో మాట)**

సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం కేంద్రం దొరైవెల్ కల్యాణ మండపంలో ఈ రోజు నిర్వహించిన SIR కార్యక్రమంలో భాగంగా శంకర్ రెడ్డిని మర్యాద పూర్వకముగా కలిసిన చిలమత్తూరు టీడీపీ సీనియర్ నాయకులు M.కృష్ణమూర్తి రెడ్డి ఆయనకు శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం మండల అధ్యక్షులు పిన్నమరెడ్డి యుగంధర్ రెడ్డి,క్లస్టర్ ఇంచార్జి లు నిర్మల్, మళ్ళీ నాయుడు మరియు సత్యవేడు నియోజకవర్గం కూటమి నాయకులు రమేష్ బాబు, నాగరాజు పాల్గొన్నారు. దొర్రై వెల్ కల్యాణమండపంలో నిర్వహించిన ఈ SIR కార్యక్రమంలో కూరపాటి శంకర్ రెడ్డి అతిధిగా పాల్గొనగా మాజీ ఎమ్మెల్యే హేమలత, మరియు పిచ్చాటూరు మండల నాయకులు పాల్గొని లబ్ధి దారులకు పట్టా పాసు పుస్తకాలు అందజేశి అనంతరం ప్రజా సమస్యలపై చర్చించి, తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చెయ్యాలని అయన తెలుపుతూ ఓటర్ జాబితా సవరణ గురించి పార్టీ కార్యకర్తలకు వివరించారు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం సమిష్టిగా కృషి చేసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని నిలబెట్టుకోవాలని కార్యకర్తలకు అయన పిలుపునిచ్చారు.

# శ్రీ వెంగమాంబ బ్రహ్మోత్సవాల విజయంపై అధికారులకు మేకపాటి కృతజ్ఞతలు



**నెల్లూరు జిల్లా బ్యూరో /దుత్తలూరు, జూలై 10 (మనసులో మాట)**

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు వైభవంగా నిర్వహించిన శ్రీ వెంగమాంబ పేరంటాలు తల్లి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన అధికారులకు, సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థలకు, దాతలకు, మీడియా ప్రతినిధులకు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఉచిత అన్నదానం, మంచినీటి పంపిణీ, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసిన దాతల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, దేవాదాయ శాఖ, ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ శాఖ, పంచాయతీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విశేషంగా పనిచేశారని కొనియాడారు. శ్రీ వెంగమాంబ పేరంటాలు తల్లి బ్రహ్మోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడంలో దేవస్థానం వ్యవస్థాపక ప్రధాన ధర్మకర్త వేమూరు మునెయ్య, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్‌తో పాటు దేవస్థానం సిబ్బంది విశేష కృషి చేశారని తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం, పూజా ద్రవ్యాలు అందుబాటులో ఉంచడంతో పాటు శ్రీ వెంగమాంబ-గురువయ్య నాయుడు కళ్యాణోత్సవాన్ని కనులవిందుగా నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నారని అన్నారు. బ్రహ్మోత్సవాల విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మేకపాటి మాల్యాద్రి నాయుడు పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారి అన్నదనానికి పలమనేరు నుండి 10 టన్నుల కూరగాయలు వితరణ



**పలమనేరు జూలై 10( మనసులో మాట):**

పలమనేరు నియోజకవర్గం నుండి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నిత్య అన్నదాన ప్రసాద వితరణ కోసం పలమనేరు మార్కెట్ కమిటీ నుండి సంచార జాతుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు పూసల రవి ఆధ్వర్యంలో 10 టన్నుల కూరగాయలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా లాయర్ రవి మాట్లాడుతూ....శ్రీవారి అన్న ప్రసాదానికి మనం అందించే ప్రతి వేలాదిమంది భక్తుల ఆకలి తీరుస్తుంది. లోక రక్షకుడైన శ్రీనివాసునికి సేవ చేసుకునే ఈ సువర్ణ అవకాశం దాతలు ఇటువంటి మంచి కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని భక్తుల ఆకలి తీరుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం మన అందరి అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం వాహనానికి పూజలు నిర్వహించి రతాన్ని తరలించారు.

# గుక్కెడు నీటి కోసం మహిళల ధర్నా

- గ్రద్దగుంట సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన
- మూడు నెలలుగా తాగునీటి కష్టాలు.
- పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై మహిళల ఆగ్రహం.



**తడ , జూలై 10 (మనసులో మాట):**

తిరుపతి జిల్లా తడ మండలం గ్రద్దగుంట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత మూడు నెలలుగా గ్రామస్తులు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నా అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించకపోవడంతో మహిళలు శుక్రవారం భగ్గుమన్నారు. ఖాళీ బిందెలతో గ్రద్దగుంట సచివాలయం వద్ద ధర్నాకు దిగారు.రోజువారీ అవసరాలకు నీరు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు సైతం నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదని మండిపడ్డారు. నీటి సమస్యపై పలుమార్లు పంచాయతీ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని మహిళలు ఆరోపించారు. మూడు నెలలుగా ప్రజలు దాహంతో అల్లాడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? ప్రజల సమస్యలు పట్టించుకోకపోతే సచివాలయాలు ఎందుకు? పంచాయతీ సిబ్బంది బాధ్యత ఏమిటి?" అంటూ నిలదీశారు.కనీసం తాగునీరు అందించాల్సిన అధికారులు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ప్రజలకు గుక్కెడు నీరు అందించలేని పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రద్దగుంటలో తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని మహిళలు హెచ్చరించారు.

# ఈ నెల 11న మారెమ్మ దేవత ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలు



- మద్దిరేవుల అశోక్ కుమార్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లి ,10 జూలై ( మనసులోమాట):**

మండలంలోని మద్దిరేవుల గ్రామం వంకగడ్డ రాచపల్లి సమీపంలో వెలసిన శ్రీ శ్రీ మారెమ్మ దేవత 8వ వార్షికోత్సవం ను ఈ నెల 11న ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తుల నడుమ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మద్దిరేవుల ఓబుల్ సుబ్బారెడ్డి, మద్దిరేవుల సురేంద్రనాథ రెడ్డి, మద్దిరేవుల రఘునాథ రెడ్డి, మద్దిరేవుల రమేష్ రెడ్డి, మద్దిరేవుల శంకర్ రెడ్డి, మద్దిరేవుల నరసింహా రెడ్డి, మద్దిరేవుల సంజీవరెడ్డి, మద్దిరేవుల అశోక్ రెడ్డి లు తెలిపారు. కుర్నూతల అగ్రహారం కి చెందిన వెంకట్ నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం వార్షికోత్సవ పూజలు, హోమం, ఉంజల్ సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భక్తులు, మహిళలు, గ్రామస్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ నిర్వాహలు తెలిపారు. గురువారం మారెమ్మ దేవత అమ్మ వారి ఆలయం కు వెళ్లే రోడ్ మార్గం తో పాటు, ఆలయ చుట్టూ ప్రక్కల ఉండే పరిసరాలను భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా ఏర్పాట్లు చేయడం జరిగిందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయమును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.ఈ కార్యామనికి లక్కిరెడ్డిపల్లి ఏంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిరేవుల చిన్న రంగా రెడ్డి,దిలీప్ రెడ్డి, రామ్ రెడ్డి, మదన్ మోహన్ రాజు, సుబ్బ రాజు, శ్రీనివాసులు, చక్రపాణి రెడ్డి, జగదీష్, భాస్కహర్ రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, మద్దిరేవుల హరినాథ రెడ్డి, నాగేంద్ర, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తులు శాశ్వతం కాదు- చదువే విద్యార్థులకు శాశ్వత ఆస్తి



- ఎమ్మెల్యే కురుగొండ్ల

**వెంకటగిరి జులై 10 (మనసులో మాట):**

పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో కలెక్టర్లు, ఉన్నతాధికారులుగా ఎదగడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఉద్ఘాటించారు.ఈ రోజు వెంకటగిరి పట్టణములోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ట్రాక్ సూట్లు, స్పోర్ట్స్ షూస్, మరియు "శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ "విద్యా మిత్ర కిట్లను ఎమ్మెల్యే తన చేతుల మీదుగా విద్యార్థులకుపంపిణీ చేశారు. అనంతరం నూతన ట్రాక్ సూట్లు ధరించిన విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఉత్సాహంగా గడిపారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ, "హాస్టల్ భవనాలు, ఆస్తులు అనేవి శాశ్వతం కాదు, కానీ మీరు నేర్చుకునే చదువు మాత్రమే మీకు శాశ్వతమైన ఆస్తి. తల్లిదండ్రులకు భారం కాకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలి అనివిద్యార్థులకుసూచించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి (విజన్ 2020) ద్వారా గతంలో ఐటీ రంగం ఎలా అభివృద్ధి చెందిందో గుర్తుచేశారు. ఇప్పుడు 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందనితెలిపారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గౌరవ మంత్రి నారా లోకేష్ బాబువిదేశాల్లో సైతం పర్యటించి పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.ఈ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలమౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం సుమారు 54 లక్షల రూపాయలను మంజూరు చేసిందని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే నేరుగా పాఠశాల వంటగదిని పరిశీలించి, అధికారులతో కలిసి అన్నం,ఆలుగడ్డ కూర తదితర వంటకాలను స్వయంగాతనిఖీచేశారు.విద్యార్థులకు రోజూ అందించే మెనూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని, భోజనంలో నాణ్యత ఏమాత్రం తగ్గకూడదని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పొనుగోటి విశ్వనాథం , మండల విద్యాధికారి కొండయ్య నాయుడు , పట్టణ అధ్యక్షులు అవ్వరు సత్యనారాయణ , మాజీ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పులుకులు రాజేశ్వరరావు , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బేరం రాజేశ్వరరావు , వెంకటగిరి రూరల్, డక్కిలి మండలాల అధ్యక్షులు, రూరల్ మండల నాయకులు, మహిళ నాయకురాలు, స్థానిక స్కూల్ ప్రిన్సిపాల్, పట్టణ స్థానిక నాయకులు,ఉపాధ్యాయులు,అధికారులు మరియు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు సమక్షంలో మంత్రి ఆనం జన్మదిన వేడుకలు



**అమరావతి/నెల్లూరు, ప్రతినిధి, జూలై 10, మనసులో మాట:**

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వహస్తాలతో కేక్ కట్ చేయించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు కలిసి కేక్ కట్ చేసి ఆయనకు హృదయపూర్వక శు



భాకాంక్షలు అందజేశారు. రైతు పక్షపాతిగా, నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడిగా, ప్రజల మనిషిగా పేరొందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రజాసేవలో మరింత ఉన్నత విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజలకు సేవ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా మంత్రివర్గ సభ్యులు ఆకాంక్షించారు. ఈ వేడుకలు ఆప్యాయతపూర్వక వాతావరణం లో జరిగాయి. పలువురు నాయకులు, అధికారులు, శ్రేయోభిలాషులు మంత్రి ఆనంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ప్రజాసేవా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**నెల్లూరు, ప్రతినిధి, జూలై 10, మనసులో మాట:**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నెల్లూరు వేదాయపాళెం లోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు తదితర సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సోమిరెడ్డి స్వయంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొన్ని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని పీజీఆర్ఎస్ లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారం అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, ప్రజా, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బి.సి. బాలికల హాస్టల్‌లో ఆరోగ్య తనిఖీలు

- విద్యార్థినులకు అవగాహన ఎం ఎల్ హెచ్ పి ఎస్ ,

**ముదిగుబ్బ, జూలై 10 (మనసులో మాట):**





మండలంలోని దొరిగల్లు రోడ్డులో ఉన్న బి.సి. బాలికల హాస్టల్‌ను వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు .ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటగది, రెండు గదుల్లో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. యూనిట్లు, నీటి ట్యాంకును తనిఖీ చేసి పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి కాలానుగుణ వ్యాధుల నివారణ చర్యలపై ఆరోగ్య అవగాహన కల్పించారు.విద్యార్థినులకు హెచ్‌బి (హిమోగ్లోబిన్) పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి జ్వర నివారణ మాత్రలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సి. హెచ్.ఓ. సరస్వతమ్మ, ఎం.ఎల్.హెచ్. పి.ఎస్. కావేరి, స్వర్ణలత , లు ఎం.పి. హెచ్.ఏ.లు స్వర్ణ , సనావుల్లా , శివమ్మ ఆశా కార్యకర్త అనురాధ , తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మదన్మోహన్ జన్మదిన వేడుకలు



- రాష్ట్ర దళిత ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు ఓబులేసు

**లక్కిరెడ్డిపల్లి 10, జూలై (మనసులోమాట):**

రాష్ట్ర దళిత ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు ఆధ్వర్యంలో.. భారీ కేక్ కట్ చేసి లక్కిరెడ్డిపల్లి గవర్నమెంట్ హాస్పిటల్ నందు రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ సభ్యులు కొండూరు వెంకటరామరాజు, భాస్కర్ రెడ్డి, క్లస్టర్ కో కన్వీనర్ బోనాల ధనంజయ,టిడిపి నాయకులు ధర్మరాజు, వైయస్ రమణ,తుమ్మల మల్లికార్జున, చింతకుంటపల్లి బాబు, డీలర్ అన్వర్ భాష, నాగరాజు, పీరయ్య, సుబ్బరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, హేమంత్ నాయుడు, పీరయ్య, అశోక్, కావలి కిరణ్ కుమార్,కుర్ర సునీల్, బీసీ బీసీ నాయకులు రౌత్ శంకర్ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వై జంక్షన్‌లో మురుగు ఏరులు – ప్రజాగ్రహం



- కాలువ పనుల పేరుతో రహదారిపైకి మురుగునీరు.
- మున్సిపల్ నిర్లక్ష్యంపై మండిపాటు.
- దుర్వాసన, దోమల బెడదతో ప్రజల అవస్థలు వాహనదారులకు ప్రమాదకరంగా మారిన రోడ్డు - ప్రత్యామ్నాయ డ్రైనేజీ ఏర్పాటు చేయని అధికారుల నిర్లక్ష్యం

**సూళ్లూరుపేట, జూలై 10 (మనసులో మాట):**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని షార్ రోడ్డు వై జంక్షన్ వద్ద ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి స్థానికులను, వాహనదారులను తీవ్ర ఆగ్రహావేశాలకు గురిచేస్తోంది. పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న కాలువ పనుల సాకుతో సంబంధిత మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువ పూడికలు, నిర్మాణాలు చేపట్టినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అధికారులు, బాధ్యతారహితంగా మురుగునీటిని ప్రధాన రహదారిపైకి వదలడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వై జంక్షన్ రోడ్డుపై ఏరులై పారుతున్న మురుగునీటిని చూస్తుంటే, అదొక ప్రధాన రహదారిలా కాకుండా వరద బాధితులు ఆశ్రయం పొందే ప్రాంతంలా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన కూడలిలో మురుగునీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో కూడిన మురుగులో నుంచి వెళ్లాల్సి రావడంతో ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. అంతేకాకుండా దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అభివృద్ధి పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ డ్రైనేజీ ఏర్పాటు చేసి రహదారిపై నిలిచిన మురుగునీటిని తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# భవిష్యత్తులో చిత్తూరులోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు ,జూలై 10,(మనసులో మాట):**
చిత్తూరు నలువైపులా హైవే కనెక్టివిటీ పెరగడంతో భవిష్యత్తులో అనేక కంపెనీలు వస్తాయని, యువతకు స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. జిల్లా ఉపాధి కార్యాలయం, అడెక్కో ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజా దర్బార్ లో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, మంత్రి నారా లోకేష్ గారు ప్రపంచవ్యాప్తంగా తిరిగి ఆంధ్రప్రదేశ్ కు అనేక కంపెనీలు తెచ్చేందుకు శ్రమిస్తున్నారని.. వారి కృషి ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఏపీకు వస్తున్నాయన్నారు. చెన్నై బెంగళూరు అనుసంధానంగా చిత్తూరులో కంపెనీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారికి విన్నవించినట్లు చెప్పారు. జాబ్ మేళా కు హాజరైన అభ్యర్థులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి పద్మజ, అడెక్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

# టమోటా రైతులకు న్యాయం చేస్తాం - ఏఎంసీ చైర్మన్ కే. రాజన్న



**పలమనేరు జూలై 10( మనసులో మాట ):**
స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కే. రాజన్న టమాటా రైతులతో వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం టమోటా ధరలు పతనమవుతున్న నేపథ్యంలో మార్కెట్ యార్డులో జరుగుతున్న వేలం ప్రక్రియను చైర్మన్ కే. రాజన్న, ఉపాధ్యక్షులు పసుపులేటి దిలీప్, మార్కెట్ యార్డు కార్యదర్శి వి. సంజీవ కుమార్, పాలకవర్గ సభ్యులతో కలిసి స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు పండించిన టమోటాల ధరలు మరియు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. "రైతులకు అన్యాయం జరగనివ్వం. రైతు సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత" అని చైర్మన్ రాజన్న తెలిపారు. ప్రతిరోజు మార్కెట్ యార్డ్ ను సందర్శించి రైతుల యోగక్షేమాలను తెలుసుకుంటామని చెప్పారు. అదేవిధంగా వి.కోట ఉప మార్కెట్ యార్డ్ ను కూడా ప్రతిరోజు సందర్శించి అక్కడి రైతులు పండించిన టమోటాలు, కూరగాయల ధరలు ఇతర వివరాలను అడిగి తెలుసుకొని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్లు శంకరప్ప, గంగవరం టిడిపి కార్యదర్శి మంజునాథ్ సిబ్బంది. పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు





- ముఖ్యఅతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
- ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యం
- ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

**నెల్లూరు, ప్రతినిధి, జూలై 10, మనసులో మాట:**
ఆర్టీసీ ఉద్యోగులు సమక్షంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఆదర్శం ప్రజాసేవే పరమావధిగా, ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలకు అంకితం చేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వ్యాప్తంగా ఉచిత మెగా వైద్య పరీక్షల శిబిరాలను నిర్వహించారు. హ్యాపీ అండ్ హెల్తీ ఫ్యామిలీకి స్వాగతం అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరాలకు ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించగలదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో నారాయణ హాస్పిటల్, ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, జయభారత్ హాస్పిటల్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి జీజీహెచ్, ఈఎస్ఐ హాస్పిటల్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన నిపుణుల బృందాలు పాల్గొని ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు అందించాయి. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు నేత్ర పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కొంతమందికి పదవులు గౌరవాన్ని పెంచుతాయి అని, మరికొందరు తమ వ్యక్తిత్వంతో పదవులకే గౌరవం తీసుకొస్తారు అని అన్నారు. అలాంటి నాయకుల్లో సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఒకరు అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే యువ నాయకులను ప్రోత్సహిస్తూ వచ్చిన సురేష్ రెడ్డి తన రాజకీయ జీవితానికి కూడా స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్యోగుల సంక్షేమం కోసం పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని, ఆయన చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేగా తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు నిరంతరం సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వహించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఎదుర్కొంటారని, అందుకే ప్రతి ఉద్యోగి, వారి కుటుంబ సభ్యులు ఈ ఉచిత వైద్య శిబిరాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జిల్లాలోని అన్ని డిపోలలో దశలవారీగా ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జన్మదిన వేళ ఆడంబరాలకు దూరంగా ఉద్యోగుల ఆరోగ్యాన్ని కేంద్రబిందువుగా చేసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించిన సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి రాజకీయ, సామాజిక, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ షమీం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, ఆర్టీసీ ఉన్నతాధికారులు, బీజేపీ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం

**తిరుపతి బ్యూరో, జులై 10 (మనసులో మాట) :**
ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోంది. డిజిటల్ యుగానికి అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత సరళతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో వెబ్సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపు విధానంతో పాటు అధికారిక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, వేగవంతమైన, సురక్షితమైన, పారదర్శకమైన చెల్లింపు వ్యవస్థను అమలు చేస్తోంది. ప్రస్తుతం మొత్తం బిల్లుల్లో 49.50 శాతం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ శాతాన్ని దశలవారీగా 100 శాతానికి పెంచడమే సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ చెల్లింపులను మరింత



ప్రోత్సహించే దిశగా సంస్థ పలు చర్యలు చేపడుతోంది. ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలు (ఈఆర్ఓలు)లో కూడా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం కల్పిస్తోంది. బిల్లుల వసూళ్లలో పారదర్శకతను మరింత పెంపొందించేందుకు, నగదు లావాదేవీలను తగ్గించేందుకు దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే ప్రక్రియను అమలు చేస్తోంది. విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. విద్యుత్ బిల్లుల వసూళ్లలో పారదర్శకత పెంపొందించడంతో పాటు వంద శాతం డిజిటల్ చెల్లింపులను అమలు చేయాలని అన్ని జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఈ లక్ష్యంతో దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే చర్యలు కొనసాగుతున్నాయి. డిజిటల్ చెల్లింపుల సందర్భంగా గుర్తు తెలియని లింకులు, సందేశాలు, నకిలీ యాప్‌లను నమ్మి మోసపోవద్దు. విద్యుత్ బిల్లులను ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారిక మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాలని వినియోగదారులను కోరుతున్నాం. సురక్షితమైన, వేగవంతమైన, పారదర్శకమైన సేవల కోసం వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది

- సర్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో BLO లు, మరియు బి ఎల్ ఏ లు ప్రముఖ పాత్ర
- జూలై 14 లోపు ఓటరు వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నాము
- SIR ప్రక్రియ సంబంధించి వారం, వారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించుచున్నాము
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, జూలై 10(మనసు లో మాట):**

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (Special Intensive Revision-SIR) ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ (SIR) పై పాత్రికేయ మిత్రులతో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో DRO ,K. మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఈఆర్వోలు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) గత నెల 15వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల నుంచి సంతకాలు తీసుకుని, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, అనంతరం డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారని వివరించారు. జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లకు గాను 13,39,675 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 99.97 శాతం పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఇప్పటి వరకు 10,67,946 ఫారాలు డిజిటైజ్ చేయబడగా, మొత్తం డిజిటైజేషన్ పురోగతి 79.69 శాతానికి చేరుకుందని చెప్పారు. నియోజకవర్గాల వారీగా డిజిటైజేషన్ పురోగతి ఈ విధంగా ఉందన్నారు:
నగరి - 84.02 శాతం,జి.డి. నెల్లూరు - 81.37 శాతం, చిత్తూరు - 76.71 శాతం, పూతలపట్టు - 79.72 శాతం, పలమనేరు - 80.34 శాతం, కుప్పం - 76.18 శాతం
జిల్లాలో ఇప్పటివరకు 19,701 మంది మరణించిన ఓటర్లు, 8,344 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, 7,263 మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు, 789 మంది గైర్హాజరు, 108 ఇతర కేసులు గుర్తించబడ్డాయని తెలిపారు. మొత్తం 36,205 మంది (2.70 శాతం) అన్‌కలెక్టబుల్‌గా గుర్తించబడ్డారని చెప్పారు. తుది పరిశీలన అనంతరం ఈ సంఖ్య సుమారు లక్ష వరకు అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,511 మంది బీఎల్ఓలు పనిచేస్తుండగా, వారిలో 1,064 మంది బీఎల్ఓలు 85 శాతం కంటే తక్కువ డిజిటైజేషన్ పురోగతిలో ఉన్నారని తెలిపారు. గత 24 గంటల్లో 42,920 ఫారాలు డిజిటైజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు.అదేవిధంగా, డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ఈ నెల 21వ తేదీన విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల వద్ద ప్రతి బీఎల్ఓకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన సమాచారం కోసం వారు సంబంధిత బీఎల్ఓలను నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

**బీఎల్ఓతో 'కాల్ బుక్' సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి:**

ఎన్నికల సంఘం అందిస్తున్న డిజిటల్ సేవలను ప్రజలు ఉపయోగించుకుని ఓటరు సేవలను మరింత సులభతరం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఓటర్లు ECINET మొబైల్ యాప్‌లోని "Book a Call with BLO" ఆప్షన్ ద్వారా లేదా voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ సేవను ఉపయోగించుకోవచ్చని సూచించారు. కాల్ బుక్ చేసిన 48 గంటలలోపు సంబంధిత బీఎల్వో (BLO) స్వయంగా ఓటరును సంప్రదించి, వారికి కావలసిన సమాచారాన్ని అందిస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి పౌరుడూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు.. పేరు, వయసు, చిరునామా వంటి వివరాల్లో మార్పులు, సవరణలు ఉంటే ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, బీఎల్ఓలు, ఈఆర్వోలు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు.

# ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు ,జూలై 10,(మనసు లో మాట):**

ప్రజాదర్బార్ లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరడం జరిగింది. పలు సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే కి వినతి పత్రాలు సమర్పించారు. చిత్తూరులో గత కొన్ని ఏళ్లుగా ఉన్న కమర్షియల్ టాక్స్ కార్యాలయాన్ని తిరుపతికి తరలించవద్దని సంబంధిత ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు



- డ్రోన్ ద్వారా బీటీ ముందు పిచికారి.
- కమిషనర్ పి నరసింహ ప్రసాద్

**చిత్తూరు, జూలై 10,(మనసు లో మాట):**

నగరంలో దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. ఫ్రైడే డ్రైడే, డెంగీ నివారణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరపాలక పరిధిలోని దుర్గా నగర్ కాలనీలోని మురికి నీటిపై డ్రోన్ ద్వారా దోమల లార్వాలను నాశనం చేయడం కోసం బీటీ మందును పిచికారి చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డెంగీ నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. దోమల నియంత్రణ చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రధానంగా గృహ పరిసరాల్లో నిలువ నీరు లేకుండా చూడాలన్నారు. నగరపాలక పరిధిలో నిల్వ నీటి కుంటలు, మురుగునీటి నిల్వ ప్రాంతాలు, మనుషులు వెళ్ళలేని ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా దోమల లార్వాలను నాశనం చేయడం కోసం బీటీ మందు పిచికారి చేయిస్తున్నట్లు చెప్పారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని అన్ని వార్డుల్లో కాలువల్లో పూడికతీత పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.ఎంహెచ్వో డా. లోకేష్ మాట్లాడుతూ.. నగరంలో శుక్రవారం దుర్గా నగర్ కాలనీ, బాలాజీ నగర్, ధర్మరాజుల కాలనీ, ఓబనపల్లి గంగమ్మకుంట ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా బీటీ మందును పిచికారి చేయించామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతికి రూ.4.99 కోట్ల రహదారి పనులకు ఆమోదం

- ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి చొరవ ఫలితం.

**తిరుపతి బ్యూరో, జూలై 10 (మనసులో మాట) :**

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చేసిన నిరంతర కృషికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద ఎంపీ ప్రతిపాదించిన రహదారి పనులకు గతంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు తన సమ్మతిని తెలియజేస్తూ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి తక్షణ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 4 గ్రామీణ రహదారి పనులకు రూ.4.99 కోట్ల అంచనా వ్యయంతో ఆమోదం మంజూరు చేసినట్లు లేఖ ద్వారా ఎంపీకి తెలియజేశారు. మొత్తం 4.65 కిలోమీటర్ల పొడవున ఈ రహదారులు నిర్మించబడనున్నాయి. వీటి ద్వారా ఇప్పటివరకు సరైన రహదారి సౌకర్యం లేని నాలుగు గ్రామాలకు మెరుగైన రవాణా అనుసంధానం కలగనుంది.

**ఆమోదం పొందిన రహదారి పనులు ఇవి:**



చిల్లకూరు మండలం: తీగపాలెం పీఆర్ రోడ్డు నుండి పల్లివానిదిబ్బ వరకు - 1.28 కి.మీ (రూ.1.51 కోట్లు).
దక్కిలి మండలం: మోపూరు రోడ్డు నుండి ఎం .వెల్లంపల్లి వరకు - 1.28 కి.మీ (రూ.1.39 కోట్లు).
సత్యవేడు మండలం: తడ-సత్యవేడు రోడ్డు నుండి వానెల్లూరు గ్రామం వరకు - 1.05 కి.మీ (రూ.1.04 కోట్లు).
శ్రీకాళహస్తి మండలం: శ్రీకాళహస్తి-ముసలిపేడు రోడ్డు నుండి వేదం పెద్దమిట్ట కండ్రిగ వరకు - 1.04 కి.మీ (రూ.1.05 కోట్లు).
ఈ రహదారి పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. అలాగే పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.

## జాండ్రపేట పాఠశాలలో విద్యాసామాగ్రి పంపిణీ



**వాకాడు మనసులో మాట జూలై 10:**

తిరుపతి జిల్లా వాకాడు మండలం జాండ్రపేట ప్రాథమిక పాఠశాల ప్రీ ప్రైమరీ విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం నెల్లూరు జిల్లా కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి రావు ఫౌండేషన్ వారి సౌజన్యంతో విద్యార్థినీ విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎం పి పి పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రభావతి, మాట్లాడుతూ. ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ మా పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం సంతోషం గా ఉందన్నారు.అనంతరం విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.గ్రామస్తులకు విద్యార్థులకు వేసవి కాలంలో వచ్చే అమ్మవారు చికెన్ ఫాక్స్ లాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ రేణుక గ్రామస్తులు పాల్గొన్నారు.

---

## ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్ ) కార్యక్రమం పరిశీలించిన ఎమ్మెల్యే



**వెంకటగిరి జులై 10(మనసులో మాట ):**

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి శాసనసభ్యులుకురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. వెంకటగిరి పట్టణంలో 10వ వార్డు, మనులాలపేట,పరుశురాం కాలనీ మరియు 4వ వార్డ్, రహ్మత్ నగర్ లలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. క్షేత్ర స్థాయిలో వీధివీధినా కలియతిరుగుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.మన ఓటు.. మన బాధ్యత' అనే నినాదంతో, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో వీధివీధినా కలియతిరుగుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నుస్వయంగా పరిశీలించారు ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ఇంటింటికీ వచ్చి నిర్వహించే సర్వేలో ప్రజలందరూ విధిగా పాల్గొనలని,మీ ఇంటికి వచ్చే అధికారులకు సరైన గుర్తింపు పత్రాలను చూపించి, మీ ఓటు హక్కును కాపాడుకోవలన్నీ పిలుపునిచ్చారు. ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తెరగాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకమైన జాబితా పొందించేందుకు అధికారులకుప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమం లో తెదేపా పట్టణ అధ్యక్షులు అవ్వారు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ భీరం రాజేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మంకు ఆనంద్, బి ఎల్ ఓ, ప్రజలు పాల్గొన్నారు.

## బ్రహ్మం సాగర్ వాటర్ స్కీమ్ ఘనతవైసీపీ ప్రభుత్వందే!

**కడప జూలై 9 మనసులో మాట.**



కడప నగరంలోనిమాజీ డిప్యూటీ సీఎం నివాస కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించిన మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలోనే అమృత్ 2.0 పథకం కింద కడప నగర అభివృద్ధి కోసం సుమారు రూ.575 కోట్ల విలువైన పనులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని మాజీ డిప్యూటీ సీఎం, కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి. అంజాద్ భాషా తెలిపారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యే సమయంలో ఎన్నికల ప్రక్రియ రావడంతో పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. అయితే, ఇప్పుడు అదే ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి, కొత్తగా తామే తీసుకొచ్చిన అభివృద్ధి కార్యక్రమాలుగా ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని విమర్శించారు.* కడప ఎమ్మెల్యే మాటలకే పరిమితమయ్యారని, చేతల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా కడప నగర అభివృద్ధికి చిల్లిగవ్వ కూడా తీసుకురాలేకపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం రూపొందించి,పరిపాలనా అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టులకే ఇప్పుడు కొత్తగా క్రెడిట్ తీసుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత జీవోలను మార్చి కొత్త జీవోలు జారీ చేస్తూ, రెండేళ్ల తర్వాత అదే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టు పనులకు సంబంధించిన కాంట్రాక్టులను స్థానిక ఎమ్మెల్యే తన అనుచరులకు అప్పగించారని కూడా అంజాద్ భాషా ఆరోపించారు. బ్రహ్మంసాగర్ నుంచి కడప నగరానికి రోజుకు 95 ఎంఎల్‌డీ తాగునీటిని అందించే ప్రాజెక్టు కూడా జగన్ ప్రభుత్వం హయాంలోనే సిద్ధమైందని ఆయన తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులకు నేడు ఎమ్మెల్యే కూటమి నాయకులు ఫోజులు ఇవ్వడం వల్ల చరిత్ర మారదు... ప్రభుత్వ రికార్డులు, జీవోలు నిజాన్ని చెబుతూనే ఉంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడప నగర అభివృద్ధికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కొత్తగా కేటాయించలేదని, అయినప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి పనులకే శంకుస్థాపనలు చేసి "క్రెడిట్ చోరీ" చేస్తోందని విమర్శించారు. కడప ప్రజలు ఎవరు పనులు మంజూరు చేశారో, ఎవరు ఆలస్యం చేశారో బాగా తెలుసు. క్రెడిట్ చోరీతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించలేరు. క్రెడిట్ చోరీ చేయడంలో చంద్రబాబు నాయుడిని మించిన వారు లేరని అంజాద్ భాషా వ్యాఖ్యానిస్తూ, కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.*ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తే రాజకీయ ప్రచారాన్ని పక్కనపెట్టి, ఇప్పటికే మంజూరైన అమృత్ 2.0 పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.* *ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ పాక సురేష్, మాజీ కార్పొరేటర్లు మొహమ్మద్ షఫీ, ఆరిఫ్లా భాష, డిష్ జిలాన్ అజ్మతుల్లా ఖాన్, అలీ అక్బర్, షంషేర్, గంగరాజు, మల్లికార్జున, కే.బాబు, శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, రామచంద్రయ్య, త్యాగరాజు, రెడ్డి ప్రసాద్, బాలస్వామి రెడ్డి, ఆర్ వి రమణ, పత్తి రాజేశ్వరి, మరియలు, జమీల్, కంచుపాటి బాబు అబ్దుల్ సుభాన్ ఇతరులు పాల్గొన్నారు.*

---

## రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు సర్టిఫికెట్లు







**చెన్నూరు ,మనసులో మాట, జులై 10:**

గత సంవత్సరము స్కూల్ గేమ్స్ లో భాగంగా చెన్నూరు మండలం నుండి మొట్టమొదటిసారిగా 60 మంది రాష్ట్రస్థాయికి మరియు నలుగురు జాతీయ స్థాయికి స్కూల్ గేమ్స్ లో భాగంగా క్రీడాకారులు పాల్గొనడం తెలిసిందే .గతంలో కోకో, కబడి, నెట్ బాల్ క్రీడల్లో మాత్రమే జాతీయస్థాయి రాష్ట్రస్థాయివెళ్లారు. కానీ ఇప్పుడు రామనపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ కు ఫిజికల్ డైరెక్టర్ గా పొలంకి గణేష్ బాబు గా వచ్చిన తర్వాత స్విమ్మింగ్,బాక్సింగ్,నెట్, బాల్, గట్కా ,ఫుట్బాల్, సేపక్త్ర, రగ్బీ టెన్నిస్,బ్యాట్మెంటన్, స్విమ్మింగ్, మోడ్రన్ పెంటలియన్ ఇంకా అనేక రకములైన గేమ్స్ను ఫిజికల్ డైరెక్టర్ గారు శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్రస్థాయికి మరియు గట్కా ,రబ్బీ, నెట్బాల్ క్రీడలలో జాతీయ స్థాయికి తీసుకొని వెళ్లారు. స్కూల్ గేమ్స్ లో రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం రామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు, ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు మాట్లాడుతూ.. ఇప్పుడు మన రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు మరియు లోకేష్ స్పోర్ట్స్ కి ఎంతో ఆదరణ తీసుకొస్తూ మూడు పర్సెంట్ రిజర్వేషన్ కల్పించడం వల్ల క్రీడాకారులకు ఎంతో ఉపయోగంగా కరంగా ఉన్నది. వాటి వల్ల ఉద్యోగాల్లో గాని కాలేజీలలో గాని చేరుటకు క్రీడాకారులకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు ఈ తరుణంలో ఒక స్కూల్ నుండి 60మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి మరియు 4 జాతీయస్థాయి ఆడడం విశేషం అన్నారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి మాట్లాడుతూ పోలంకి గణేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ ను అభినందిస్తూ రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులను అనేక రకాలుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి గొప్ప క్రీడాకారులుగా తీర్చిదిద్దవలెను అని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఉమా మహేశ్వరి తో పాటు ఫిసికల్ డైరెక్టర్ గణేష్ బాబు బాబాయ్య ,సుబ్బారెడ్డి గారు,మహేశ్వర్ రెడ్డి లక్ష్మీకాంతమ్మ మేడం దుర్గా సుశీల మేడం,భాగ్యవతి మేడం,మంజులవాని పాల్గొని క్రీడాకారులకు మరియు ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేష్ బాబు గారికి అభినందలు తెలిపారు.

# ధర్మవరం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా అడ్వకేట్ బిల్లే రవి

- ఎన్డీఏ కార్యాలయంలో ఘన సన్మానం.

**ధర్మవరం జులై 9 (మనసులో మాట):**

ధర్మవరం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్ గా అడ్వకేట్ బిల్లే రవి ఎంపిక కావడం పట్ల ఎన్ డి ఏ కార్యాలయంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మంత్రి నియోజక వర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, బిజెపి నాయకులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ మంత్రి సత్య కుమార్ సహకారంతో బిల్లే రవికి కీలక బాధ్యత వహించడం జరిగిందని తెలిపారు. బిల్లే రవికి ప్రభుత్వ నియామకం రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ప్రజాసేవకు గుర్తింపు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్గా బిల్లే రవి నియామకము అని వారు స్పష్టం చేశారు. సేవను నమ్మినవారికి బాధ్యతలు తప్పక వస్తాయని, కష్టపడి పనిచేసిన కార్యకర్తకు బాధ్యతలు అప్పగించడం బిజెపి యొక్క ప్రత్యేకత అని వారు తెలిపారు. న్యాయవాది అయిన బిల్లే రవి



ఏబీవీపీలో 1999 నుంచి విద్యార్థి నాయకుడిగా ప్రయాణం చేశారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం భారతీయ జనతా యువ మోర్చాలో పట్టణ కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పదాధికారి వంటి పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని తెలిపారు. ధర్మవరం బార్ అసోసియేషన్‌లో రెండుసార్లు ట్రెజరర్‌గా బాధ్యతలు నిర్వహించి న్యాయవాదుల విశ్వాసాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, కొంక నాగార్జున, చిన్నలింగమయ్య, నారా కొండయ్య చౌదరి, భక్తవత్సలం నాయుడు, వడ్డే శీన, తదితరులు పాల్గొని బిల్లే రవి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాలుగు రోజుల్లో ఓట్ల అప్‌లోడ్ పూర్తి చేయాలి

- టీడీపీ నేతలకు సోమిశెట్టి వెంకటేశ్వర్లు దిశానిర్దేశం

**ధర్మవరం జులై 9 (మనసులో మాట):**

ధర్మవరం నియోజకవర్గంలో ఓట్ల అప్‌లోడ్ ప్రక్రియ పూర్తికి మరో నాలుగు రోజులే గడువు మిగిలి ఉండటంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని వేగవంతం చేయాలని ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల ప్రక్రియలో ఓట్ల నమోదు, అప్‌లోడ్ అత్యంత కీలకమని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ఇప్పటివరకు సుమారు 71 శాతం ఓట్ల అప్‌లోడ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను వచ్చే



నాలుగు రోజుల్లో శాతం శాతం పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. నాయకులు పార్టీ కార్యాలయాలకే పరిమితం కాకుండా వార్డులు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు, అప్‌లోడ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమయం తక్కువగా ఉన్నందున అందరూ సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పనిచేసి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.సమావేశంలో కమతం కాటమయ్య, మహేష్ చౌదరి, రాళ్లపల్లి షరీఫ్, మేకల రామాంజనేయులు, పరిసే సుధాకర్, ఫణికుమార్, లక్ష్మన్న, విజయ్ సారధి, సీబీఎన్ రామకృష్ణ, చింతపులుసు పెద్దన్న, కొత్తపేట ఆది, తలారి బాబు, విజయ్ చౌదరి, వంట రమేష్, ఏలుకుంట్ల రమణ, పోతుకుంట రవి, ఐటీడీపీ రాము, బిల్వంపల్లి బాబు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరికి వెలుగు అందించిన నాగరత్నమ్మ

**ధర్మవరం జులై 9 (మనసులో మాట)**

నేత్రదానముతో రెండు కుటుంబాల్లో వెలుగులు నింపిన నేత్రదాత నీలం నాగరత్నమ్మ అని యువర్స్ ఫౌండేషన్ మాజీ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని శివనగర్ చెందిన నీలం నాగరత్నమ్మ (62) గుండెపోటు తో మరణించగా యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి



అంగీకారం మేరకు అనంతపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డి.వై. కుల్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ వారి టెక్నీషన్ జి.రాఘవేంద్ర ఉదయం కంటి కార్నియా సేకరించడం జరిగింది



అని తెలిపారు. నేత్రదానానికి సహకరించిన దాత కుమారులు నీలం నవీన్, శివకుయువర్స్ ఫౌండేషన్ వారు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బీటీ కళాశాల అభివృద్ధికి సహకరిస్తా



- పి.కె.ఎం ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు

**మదనపల్లె,జులై 9(మనసులో మాట):**

స్థానిక చారిత్రాత్మక బి.టి.కళాశాలను గురువారం పలమనేరు,కుప్పం,మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు సందర్శించారు.ఆయన కళాశాలలోని విద్యార్థులను,అధ్యాపకులను కలుసుకొని కళాశాల అభివృద్ధికి చేయాల్సిన పనుల గురించి విచారించారు.కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని విద్యార్థులకు అధ్యాపకులకు ఆయన భరోసా ఇచ్చారు.కళాశాల విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్టును రూ.50 వేల రూపాయలతో కొనుగోలు చేసి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.తమ తండ్రి అయిన బి. ఆర్ దొరస్వామి నాయుడు,కుప్పం మాజీ ఎమ్మెల్యే 1967 సంవత్సరంలో ఈ కళాశాల విద్యార్థిగా ఉండి విద్యార్థి సంఘం చైర్మన్ గా ఎన్నికై పనిచేశారని గుర్తుచేసుకున్నారు.ఈ ప్రాంత విద్యార్థులు బి.టి కళాశాలలో చేరి ఇక్కడ ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్



**వాకాడు మనసులో మాట జులై 9:**

ఓటర్ల ఎస్ ఐ ఆర్ ప్రక్రియను గురువారం వాకాడు మండల పరిధిలోని బూతులను తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ పరిశీలించారు. వాకాడు, నెల్లిపూడి, ఎర్రగాటిపల్లి, బాలిరెడ్డిపాలెం, జమీన్ కొత్తపాలెం, కొండూరు, తిరుమూరు, కల్లూరు, బూతుల్లో ఉన్న ఓటర్ లిస్టు పరిశీలించి. ప్రతి వాటర్ లిస్ట్ ను బిఎల్వోలు,అధికారులు, క్షుణ్ణంగా పరిశీలించి ఓటు కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇటువంటి అవకతవకులు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## కావలిలో కొత్త చిరునామాలో సెల్ఫ్ డ్రైవ్ రెంటెడ్ కార్స్ బ్రాంచ్ ప్రారంభం



**కావలి, జూలై 10, మనసులో మాట:**

కావలి పట్టణంలోని బ్రహ్మంగారి ఆలయం సమీపంలో, గ్లోబల్ స్కూల్ వద్ద కొత్త చిరునామాలో ఏర్పాటు చేసిన సెల్ఫ్ డ్రైవ్ రెంటెడ్ కార్స్ బ్రాంచ్‌ను జనసేన నాయకుడు కిషోర్ గునుకుల శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కిషోర్ గునుకుల మాట్లాడుతూ తక్కువ అద్దె నుంచే సరికొత్త మోడల్ సెల్ఫ్ డ్రైవ్ కార్లను జీరో డిపాజిట్ సౌకర్యంతో వినియోగదారులకు అందుబాటు లోకి తీసుకువచ్చినందుకు సంస్థ నిర్వాహకులను అభినందించారు. గతంలో నిర్వహిస్తున్న బ్రాంచ్‌ను కొత్త ప్రాంగణానికి మార్చి మరింత విస్తృత సేవలతో ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నూతన బ్రాంచ్ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం యువతను విశేషంగా ఆకర్షిస్తున్న సరికొత్త మోడల్ సెల్ఫ్ డ్రైవ్ కార్లు కుటుంబ విహారాలు, వ్యాపార ప్రయాణాలు, ప్రత్యేక సందర్భాల కోసం అందుబాటులో ఉన్నాయని, సులభమైన అద్దె విధానంతో నాణ్యమైన సేవలు అందిస్తున్నామని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు కర్రెద్దుల అశోక్, భవాని దంపతులు, కావలి ఫ్రాంచైజీ యజమానులు, డ్రీమ్ బస్ అధినేత చిత్తూరు బాలాజీ, ష్టాకెంజో డైరెక్టర్ విష్ణు, తౌఫిక్, చరణ్, జనసేన నాయకులు ప్రశాంత్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు పాఠశాలను తనిఖీ చేసిన యం పి డి ఓ



**వాకాడు మనసులో మాట జూలై 10:**

వాకాడు మండలం కల్లూరు గ్రామంలోని పాఠశాలను శుక్రవారం ఎంపీడిఓ ఎం. సాయి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భనలో ఎంపీడీవో ఎం సాయి ప్రసాద్ తో పాటు వాకాడు మండల టీడీపీ ముఖ్య నాయకుడు దువ్వూరు. జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.పాఠశాలలో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, బోధన స్థితిగతులను ఎంపీడీవో ఎం. సాయి ప్రసాద్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల క్లస్టర్ ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ , పిల్లలు పాల్గొన్నారు.

# యువతకు వ్యసనం వద్దు, జ్ఞానోదయం కావాలి

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పిలుపు.




**ధర్మవరం జులై 9 (మనసులో మాట):**

యువతకు వ్యసనం వద్దు, జ్ఞానోదయం కావాలి అని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్మవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీని జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ కలిసి జండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ , డి ఎల్ ఎస్ ఏ రాజశేఖర్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని వారి పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సమాచారం కోసం 1972 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని తెలిపారు. ఎప్పుడూ సాధారణ ప్రజలతో మాట్లాడే తమకు, ఈరోజు ఉత్సాహవంతులైన యువతను, దేశానికి ఎంతో కీలకమైన విద్యార్థులను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.గంట సేపటి నుండి ఎంతో క్రమశిక్షణతో ఎదురుచూస్తున్న విద్యార్థుల తీరును ఆయన అభినందించారు.తాము చదువుకునే రోజుల్లో డ్రగ్స్ వంటి వాటి గురించి వినేవాళ్లం కాదని, కనీసం టీవీలు కూడా ఉండేవి కావని గుర్తుచేశారు.కానీ నేటి యువతను పక్కదారి పట్టించడానికి చుట్టూ ఎన్నో రకాల ఆకర్షణలు (ఇంట్లో టీవీ, చేతిలో మొబైల్, బయట బైక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా వంటివి) ఉన్నాయని పేర్కొన్నారు.ఇన్ని ఆకర్షణలు ఉన్నప్పటికీ, వాటిని ఎదిరించి విద్యార్థులు తమ కెరీర్‌ను మౌల్డ్ చేసుకుంటున్నారంటే.. నాటి తరం కంటే నేటి తరం ఎంతో గొప్పదని వారు కొనియాడారు.స్నేహితుల ఒత్తిడి వల్ల అలవాటయ్యే సిగరెట్లు, డ్రగ్స్ వంటి వ్యసనాలు మొదట నెమ్మదిగా ప్రారంభమై, ఆ తర్వాత వాటి నుండి బయటపడటం చాలా కష్టంగా మారుతుందని హెచ్చరించారు. యోగా/వ్యాయామం చేయడం, ఉపాధ్యాయులను గౌరవించడం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవడానికి మనస్సును అదుపులో ఉంచుకుని ప్రత్యేకంగా శ్రమించాల్సి ఉంటుందని ఉదాహరించారు. భగత్ సింగ్ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. యువత డ్రగ్స్ వంటి అలవాట్లకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు.జిల్లాలో ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. దీని కొరకు 1972 లేదా 112 టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి. అర్చన,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,ధర్మవరం తహసీల్దార్ దేవరాజ్ , మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు , రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ, బీజేపీ ఇంచార్జి,డాక్టర్ శ్రీనివాస రెడ్డి,సంధా రాఘవ, టీడీపీ ఇంచార్జి,శ్రీహరి, ఈగల్ విభాగం,డాక్టర్ జెథెస్వాని, సైకాలజిస్ట్,విద్యార్థులు,ఆశా వర్కర్స్, తధితరులు పాల్గొన్నారు.

## వరదయ్యపాలెంలో ఎమ్మెల్యే ఆదిమూలం సుడిగాలి పర్యటన



**వరదయ్యపాలెం జూలై10(మనసులో మాట)**

భారీ స్థాయిలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికిన వైనం ఈ మధ్యకాలంలో అనారోగ్యానికి గురైన టిడిపి సీనియర్ నాయకులు ముని చంద్రారెడ్డి ని, మాజీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు , శ్రీనివాస నాయుడు మరియు కొంతమందిని పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిమూలం ఎమ్మెల్యే మండల పర్యటనకు వస్తున్నారని తెలిసి భారీ సంఖ్యలో ఎమ్మెల్యేను కలవడానికి, చూడడానికి స్వచ్ఛందంగా తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు టిడిపి సీనియర్ నాయకుడు కరుణాకర్ నాయుడు ఆధ్వర్యంలో సంత వేలూరు నుండి వరదయ్యపాలెం వరకు బైక్ మరియు కార్ల ర్యాలీ యాదృచ్ఛికంగా ఎలాగో నాయకులు కార్యకర్తలు తనకోసం వచ్చారు కాబట్టి చిన్న పాటి సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే... ఆదిమూలం... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాబోయే స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని... పిలుపునిచ్చారు...అభివృద్ధికి కీలకమైన జడ్పిటిసి,ఎంపీటీసీ,ఎంపీపీ సర్పంచ్ పదవులు టిడిపి గెలుచుకునే విధంగా కష్టపడాలని తద్వారా గ్రామస్థాయిలో అభివృద్ధి జరుగుతుందని నాయకులను కోరారు ఈ నియోజకవర్గంలో ఇప్పటికీ ఎప్పటికీ టిడిపికి కంచుకోటనన్న సందేశాన్ని మనం మన అధినేత మన ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి కి పంపుదాం... అని తెలిపారు. నియోజకవర్గంలో రసవత్తర రాజకీయానికి తెర లేచిందనే చెప్పవచ్చు... రోజురోజుకు ఎమ్మెల్యే చెంత చేరే వారి సంఖ్య పెరుగుతుండడం దాన్ని ఆపాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్న కూడా లెక్కచేయకుండా ఏం జరుగుతుందో జరగని నిండా మునినోడికి చలి ఏముంది అనే విధంగా.... పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి ఈ సందర్భంగా కరుణాకర్ నాయుడు ఇచ్చిన విందు లో నియోజకవర్గ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.. పడి పడి పడి పడి లేచినోడు మామూలోడు అయితే మూలన కూర్చుంటాడు... కానీ ఇక్కడున్నది ఆదిమూలం.... పడి పడి లేచిన నిలవడు పరిగెత్తాడు... అంటున్న... అనుచరులు... అభిమానులు, టిడిపి కార్యకర్తలు... ఇదిలా ఉంటే మరోవైపు *కార్యక్రమం మధ్యలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు కోనేటి సుమన్ కార్యక్రమంలో పాల్గొనడంతో వాతావరణం పసుపు పండగల మారిందిని.... రీఛార్జ్ అయిన నాయకులు కార్యకర్తలు.

# రైతులకు న్యాయం జరిగే వరకు భూమి ఉన్నవారికి పెన్షన్ ఇవ్వాలి

- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి.

**రాయచోటి జూలై 10 మనసులో మాట:**



భూమి ఉన్న రైతులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉన్న భూమిని మరొకరికి అమ్మినా, లేదా ఇతరుల పేర్లకు బదిలీ చేసిన సందర్భాల్లో కూడా సంబంధిత రైతుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు కొనసాగుతున్న కారణంగా అనేక మంది వృద్ధ రైతులు పెన్షన్‌కుదూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన రైతు వద్ద భూమి లేకపోయినా, రికార్డుల్లో పేరు ఉండటంతో అధికారులు పెన్షన్ మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు.అలాగే, అసైన్‌మెంట్ భూములు కలిగిన పలువురు దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్నప్పటికీ, రికార్డుల సమస్యల వల్ల సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల కారణంగా పేద రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిశీలించి, భూమి ఉన్న రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వారికి ప్రత్యేక పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని వంగిమల్ల రంగారెడ్డి కోరారు. అర్హులైన రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించి, అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం తరపున ఆయన డిమాండ్ చేశారు.

# వెంగమాంబ అమ్మవారి మహిమకు భక్తుల కానుకల జల్లు..!

- ఒక్క ఏడాదిలోనే! రూ.12.71 లక్షల అదనపు ఆదాయం – రూ.50 లక్షలు దాటిన దేవస్థానం ఆదాయం

**దుత్తలూరు, జూలై 10 (మనసులో మాట):**

నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈసారి భక్తిశ్రద్ధలతో పాటు ఆదాయంలోనూ చరిత్ర సృష్టించాయి. అమ్మవారిపై భక్తుల అపార విశ్వాసానికి నిదర్శనంగా ఈ ఏడాది దేవస్థానం ఆదాయం రూ.50,33,770కు చేరి కొత్త రికార్డు నమోదు చేసింది. దేవస్థానం విడుదల చేసిన అధికారిక లెక్కల ప్రకారం, గత ఏడాది రూ.37,62,670గా ఉన్న మొత్తం ఆదాయం, ఈసారి రూ.12,71,100 పెరిగి రూ.50 లక్షల మార్క్‌ను దాటడం విశేషంగా మారింది.



**టికెట్లు – ప్రసాదాలకే భారీ ఆదరణ**

ప్రత్యేక దర్శనం, టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా గత ఏడాది రూ.12,51,080 ఆదాయం రాగా, ఈసారి అది రూ.18,86,930కు చేరింది. అంటే రూ.6,35,850 అదనంగా వసూలైంది.

**హుండీలోనూ కానుకల వెల్లువ**

భక్తులు సమర్పించిన హుండీ కానుకలు కూడా భారీగా పెరిగాయి. గత ఏడాది రూ.25,11,590 వచ్చిన హుండీ ఆదాయం, ఈసారి రూ.31,46,840కు చేరి రూ.6,35,250 పెరుగుదల నమోదైంది.

**భక్తుల విశ్వాసమే విజయానికి కారణం**

ఐదు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు, రథోత్సవం, సాంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు ఉదారంగా విరాళాలు సమర్పించడంతో దేవస్థానం చరిత్రలోనే అత్యధిక ఆదాయం నమోదైనట్లు తెలుస్తోంది.

**ఆదాయంలో రికార్డు... అభివృద్ధిలోనూ అదే జోరు ఉంటుందా?**

దేవస్థానానికి భారీగా ఆదాయం సమకూరిన నేపథ్యంలో, ఆ నిధులను భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆలయ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఎలా వినియోగిస్తారన్న అంశంపై ఇప్పుడు భక్తుల దృష్టి నెలకొంది. దేవస్థానం పారదర్శకంగా నిధులను వినియోగించాలని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రిటైర్డ్ టీచర్ పద్మావతి పేరు పై విద్యార్థులకు ఉచిత విద్యా సామాగ్రి కిట్ల పంపిణీ

**కలికిరి జూలై 10 (మనసులో మాట) :**

కలికిరి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 12 సంవత్సరాలు ప్రధానోపాధ్యాయురాలు గా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయిన శ్రీమతి పద్మావతి జ్ఞాపకార్థం గా వారి పుత్రుడు డాక్టర్ పవన్ గోపి, కుమార్తె సుధ వల్లి ల ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలోని విద్యార్థులందరికి నోట్ బుక్స్, అట్టలు, పెన్ను లతో కూడిన ఉచిత విద్యా సామాగ్రి కిట్ల ను వితరణ గా అందజేశారు. పద్మావతి సోదరి డాక్టర్ ప్రమీల ప్రతి సంవంత్సరం పదవ తరగతి విద్యార్థులకు పాఠశాలలో ప్రథమ స్థానం వచ్చిన వారికి 25,000 రూపాయలు, ద్వితీయ స్థానం వచ్చిన వారికి 15,000 రూపాయలు, తృతీయ స్థానం పొందిన వారికి 10,000 రూపాయలు ఇవ్వడం జరుగుతోంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జయమ్మ మరియు ఉపాధ్యాయులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేసారు.





# సర్ ఎన్యుమరేషన్ పూర్తి చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు, జూలై 10,(మనసు లో మాట) :**

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) సర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ పత్రాన్ని పూర్తి చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే వారి కార్యాలయంలో ఎన్యూమరేషన్ దరఖాస్తును పూర్తి చేసి సంబంధిత బిఎల్వోకు అందించారు.

# మృతి చెందిన తెదేపా కార్యకర్త కుటుంబానికి బీమా సొమ్ము అందజేత



**చిత్తూరు ,జూలై 10,(మనసులో మాట):**

తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త, కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. చిత్తూరు వల్లియ్యప్ప నగర్ చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కె. వంశీ మే నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు చేయించిన బీమా మంజూరు అయింది. రూ.5లక్షలు నామిని దివ్య ఖాతాకు జమ అయ్యింది. ఈ మేరకు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని తెలుపుతూ తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ గారు పంపిన లేఖను, బీమా మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం అందించారు.

# నేడు లక్కిరెడ్డి పల్లెలో విద్యుత్ కు అంతరాయం




- ట్రాన్సకో ఎ ఈ హరినాద్

**లక్కిరెడ్డిపల్లి జూలై 10 (మానసలోమాట ):**

శనివారము 11/07/26 తేదీన అనగా నేడు 33KV లక్కిరెడ్డిపల్లె ఫీడర్ ను మరమ్మత్తులు చేయుచున్నారు అందువలన ఉదయము 8:30 నుండి 02:30 వరకు లక్కీరెడ్డిపల్లి మండలం నందు కరెంటు ఉండదు. అని ఒక ప్రకటనలో విద్యుత్ ట్రాన్కో ఎఈ హరినాద్ తెలిపారు కావున లక్కీరెడ్డిపల్లి మండలం లోని రైతులు , విద్యుత్తు వినియోగదారులు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

# కమర్షియల్ టాక్స్ కార్యాలయాన్ని తిరుపతి తరలించవద్దు



- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కు ఉద్యోగుల వినతి..

**చిత్తూరు, జూలై 10,(మనసు లో మాట):**

చిత్తూరులో దశాబ్దాలుగా కొనసాగుతున్న కమర్షియల్ టాక్స్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లాకు తరలించవద్దని చిత్తూర్ డివిజన్ కమర్షియల్ టాక్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కు వినతి పత్రం అందించారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ని కలిసి వినతిపత్రం అందించారు. 1975 నుండి కమర్షియల్ టాక్స్ కార్యాలయం చిత్తూరులో కొనసాగుతోందని, ఈ పరిస్థితుల్లో కార్యాలయాన్ని తిరుపతికి తరలిస్తే వ్యాపారస్తులతో పాటు ఉద్యోగులు ఇబ్బందులు పడతారని వివరించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కమర్షియల్ టాక్స్ కార్యాలయాన్ని తిరుపతికి తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల సంఘం వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# జిల్లా ఫుట్బాల్ సెలక్షన్ లో సాయి కిషోర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపిక

**పలమనేరు జూలై 10( మనసులోమాట)**



ఇంటర్ డిస్ట్రిక్ ఫుట్బాల్ సెలక్షన్స్ బాలుర విభాగంలో సాయి కిషోర్ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నఇద్దరూ విద్యార్థులు డిస్టిక్ మీట్ కి సెలెక్ట్ అవడం జరిగిందన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులు ఈనెల 11, 12, 13,వ తేదీలో మదనపల్లిలోజరిగే ఏపీ ఇంటర్ డిస్టిక్ ఫుట్బాల్ పోటీలలో పాల్గొంటారని కళాశాల కరస్పాండెంట్ కే. కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలెక్ట్ అయిన ప్లేయర్ బద్రీ నారాయణ, కృష్ణ చైతన్య ఇద్దరి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా అధ్యాపక అధ్యాపక బృందం పీడీలు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిమ్మ తోటల్లో పూతపై రైతులు అప్రమత్తం

**బాలాయపల్లి (మనుసులో మాట):**



నిమ్మ తోటలలో పూత రాలకుండా ఉండేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలి కృష నిమ్మ సాగులో అనుసరించాల్సిన ఆధునిక యాజమాన్య పద్ధతు లపై రైతులు పాటించాలి నిమ్మ పూతను నియంత్రించడం ద్వారా అధిక ధరలు ఉన్న సమయంలో పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి మంచి ఆదాయం పొందవచ్చు. ఇందుకోసం జూన్, జులై నెలలో జిబ్బెరెలిక్ ఆమ్లం (GA□) 1 గ్రాము/20 లీటర్ల నీటికి (50 ppm) కలిపి పిచికారీ చేయాలి.అలాగే సెప్టెంబర్ నెలలో సైకోసెల్ 2 మిల్లీలీటర్లు/లీటర్ నీటికి (1000 ppm), అక్టోబర్ నెలలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు/ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వా రా పూత నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ విధానాలను పాటిస్తే వేసవి కాలంలో అధిక ధరలు ఉన్న సమయంలో మంచి దిగుబడి, అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని రైతులకు పాటించాలన్నారు.

# భక్తుల పాలిట కొంగు బంగారం మానసా దేవి..!

- 12వ వార్షికోత్సవాల్లో ఆధ్యాత్మిక వైభవం..
- అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక పూజలు
- సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్న ఎమ్మెల్యే

**వరికుంటపాడు జూలై 10 (మనసులో మాట):**



నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో వెలసిన శ్రీ మానసా దేవి అమ్మవారి 12వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నాగదేవతల రూపిణిగా, భక్తుల పాలిట కొంగు బంగారంగా కొలిచే మానసా దేవి అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, మండపారాధనలు, సర్వతోభద్ర ఆరాధనలు, 108 కలశాలతో పవిత్ర జలావాహనం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, మానసా దేవి హోమం, సౌర హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పంచసూక్త, ప్రాయశ్చిత్త, చతుర్వేద, రుద్ర, వాస్తు హోమాలతో ఆలయ ప్రాంగణం వేదమంత్రాల నినాదాలతో మార్మోగింది. ఈ మహోత్సవాల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, చంద్ర మధుసూదన్ రావు, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు గుర్రం గోపిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు హాజరవుతుండగా, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భక్తులందరికీ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మానసా దేవి అమ్మవారి మహిమను చాటే ఈ వార్షికోత్సవాలు వరికుంటపాడు మండలంలో ఆధ్యాత్మిక శోభను మరింత పెంచాయని భక్తులు పేర్కొంటున్నారు.

# రైతులకు గుడ్ న్యూస్..! - సొసైటీలో యూరియా అందుబాటు

- 24 గ్రామ పంచాయతీల రైతులకు 18 టన్నుల యూరియా నిల్వలు
- ఆధార్, ఈ-కేవైసీతో వెంటనే పొందండి
- సొసైటీ చైర్మన్ గుర్రం గోపి

**వరికుంటపాడు, జూలై 10 (మనసులో మాట):**



ఖరీఫ్ సాగు జోరందుకున్న నేపథ్యంలో వరికుంటపాడు మండల రైతులకు ఊరటనిచ్చే శుభవార్త అందింది. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) కార్యాలయంలో రైతులకు అవసరమైన 18 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులోకి వచ్చినట్లు సొసైటీ సీఈవో రత్తయ్య, సొసైటీ అధ్యక్షుడు గోపి తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియాను అందుబాటులో ఉంచినట్లు వారు వెల్లడించారు. రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని ఈకేవైసీ పూర్తి చేసుకుని సొసైటీ కార్యాలయానికి రావాలని సూచించారు. అర్హత కలిగిన రైతులు సొసైటీ సిబ్బందిని సంప్రదించి, నిబంధనల ప్రకారం యూరియాను పొందవచ్చని తెలిపారు. సాగు సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ఊపందుకున్న ఈ తరుణంలో యూరియా అందుబాటులోకి రావడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎంబీఏ స్కాలర్ రాజేంద్ర ప్రసాద్ కు వైవీయూ - డాక్టరేట్

**కడప, మనసులో మాట,జూలై 10:**



యోగి వేమన విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్మెంట్ విభాగ పరిశోధక విద్యార్థి రాజేంద్ర ప్రసాద్ కదిరి కి వైవియూ డాక్టరేట్ (పీహెచ్.డి. పట్టా) ను ప్రకటించింది. రాజేంద్ర ప్రసాద్ కదిరి వైవియూ బిజినెస్ అండ్ మేనేజ్మెంట్ విభాగ ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు, పర్యవేక్షణలో "హై ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ భారత స్టాక్ మార్కెట్లపై ప్రభావం" అనే అంశంపై పరిశోధన నిర్వహించి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి మార్గదర్శకాల మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు, వైవావోస్ కమిటీ సిఫారసుల ఆధారంగా రాజేంద్రప్రసాద్ డాక్టరేట్ పట్టాకు అర్హులని నిర్ధారించింది. ఈ మేరకు యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు పీహెచ్.డి. నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రాజేంద్ర ప్రసాద్ రాసిన పరిశోధన పత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మిత్రులు రాజేంద్ర ప్రసాద్ ను

# దేశ భాషలంటే తెలుగే లెస్స: రిజిస్టరర్ ఇంద్ర ప్రీత్ సింగ్ కోహ్లీ

ఏర్పేడు, జూలై 10 (మనసులో మాట) :

భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధనా సంస్థ (ఐఐఎస్ఈఆర్) తిరుపతిలో నిర్వహించిన ఏడవ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ మాజీ అండర్ సెక్రటరీ శ్రీ అందిరెడ్డి సింగ్ చేసిన ధన్యవాద ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ఆంగ్లం, హిందీతో పాటు తెలుగులోనూ ప్రసంగించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. తెలుగు భాషపై తనకున్న అభిమానం వ్యక్తం చేసిన అందిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ తనకు అందించిన అవకాశాలను స్మరించుకున్నారు. ప్రభుత్వ సేవలో వివిధ బాధ్యతలు నిర్వహించిన అనుభవాన్ని పంచుకుంటూ, ప్రజలతో మాతృభాషలో మాట్లాడటం ప్రత్యేక అనుభూతి నిచ్చిందన్నారు. కార్యక్రమం చివరలో ఆయన చేసిన తెలుగు ప్రసంగానికి సభికులు ఘనంగా చప్పట్లతో అభినందనలు తెలిపారు. విద్య అనేది ఉద్యోగాలకే పరిమితం కాకుండా దేశాభివృద్ధికి




దోహదపడే సాధనంగా మారాలని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, అధ్యాపకులు, సంస్థకు మంచి పేరు తీసుకురావడంతో పాటు నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలుగు సహా మాతృభాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని కూడా ఆయన సూచించారు.

# ధర్మవరంలో నేత్రదానానికి విశేష స్పందన రావడం సంతోషదాయకం

- రెడ్ క్రాస్ కమిటీ మెంబర్ డాక్టర్ సంకారపు నర్సింలు.

ధర్మవరం జులై 9 (మనసులో మాట)

ధర్మవరంలో నేత్రదానానికి విశేష స్పందన రావడం సంతోషాదాయకమని రెడ్ క్రాస్ కమిటీ మెంబర్, కుల అయ్యప్ప నేత్రదాన సేకరణ కేంద్రం డాక్టర్ సంకారపు నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్ర దానాలు పరంపరంగా కొనసాగుతున్నాయని ఇటీవల శాంతినగర్ లో గత రెండు రోజుల్లో వరుసగా సూర్యనారాయణ పేరుగల ఇద్దరు వ్యక్తులు నేత్రదా




నం చేయడం జరిగిందన్నారు. ఈ నేత్రాలను విశ్వదేపా సేవా సంఘం వారు ప్రోత్సహించడం జరిగిందని అదేవిధంగా మరసటి రోజు నాగరత్నమ్మ అనే మహిళ నేత్రాలను సేకరించడం జరిగిందని తెలిపారు. వీరిని యువర్ ఫౌండేషన్ వారు ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు. ఈ విజయం వెనుక నేత్రదానం పట్ల ప్రజల్లో పెరిగిన అవగాహన, స్వచ్ఛంద సంస్థల యొక్క కృషి అభినందనీయమని తెలిపారు. అందుకు వివిధ రకముల మీడియా సహకారం కూడా ప్రాముఖ్యత తో కీలకపాత్ర వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ధర్మవరం పట్టణం తో పాటు అనంతపురం జిల్లా సత్యసాయి జిల్లాలో నేత్రదానంలో ప్రథమ స్థానంలో ఉండుట మరింత గర్వకారణమని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే హామీతో ఆమందూరు బీసీ కాలనీ వాసులకు ఊరట



ఏర్పేడు, జూలై 10: (మనసులో మాట)

ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయితీ బీసీ కాలనీలో ఎస్ఎస్ కెనాల్ పైప్‌లైన్ నిర్మాణంలో భాగంగా మూడు ఇళ్లు తొలగించాల్సి వస్తుండటంతో బాధిత గ్రామస్తులు ఉదయం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల సమస్యను విన్న ఎమ్మెల్యే, ఇళ్లు కోల్పోయే ప్రతి కుటుంబానికి మూడు సెంట్ల స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మేఘా సంస్థతో మాట్లాడి వారికి కొత్త ఇళ్లు నిర్మించి ఇచ్చేలా ఏర్పాటు చేస్తామని భరోసా కల్పించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏర్పేడు తహసీల్దార్ రాజశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను వారికి వివరించి, మూడు సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు మెఘా సంస్థ ద్వారా ఇళ్లు నిర్మించేలా చర్యలు చేపడతామని తెలిపారు. దీనికి గ్రామస్తులు సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుణ యాదవ్, కేకే రమణ, రాచేటి సుబ్రహ్మణ్యం, కేశినేని సుబ్రహ్మణ్యం, వై. మనోహర్ నాయుడు, సర్వేయర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 11 కేవి విద్యుత్ స్థంభంను ఢీ కొన్న ప్రైవేట్ పాఠశాలల బస్సు

- డ్రైవర్ తో పాటు 15 మంది విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

లక్కిరెడ్డిపల్లి జూలై ,10 (మనసులో మాట):

మండలంలోని నల్లందానగర్లో ని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి నివాసం సమీపంలో శుక్రవారం సాయంత్రం 11 కేవి విద్యుత్ స్థంభం ను ప్రైవేట్ పాఠశాలల బస్సు ఢీకొనడం తో పెను ప్రమాదం తప్పింది. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు 15 మంది విద్యార్థులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడడంతో స్థానికులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పిలుచుకుంది. రోడ్డుపై ఉన్న 11 కెవి విద్యుత్ స్థంభం ను ఓ ప్రయివేట్ పాఠశాల కు చెందిన బస్సు రివర్స్ తీసుకునే సందర్భంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో 11 కెవి విద్యుత్ స్థంభం ఢీకొనడం తో స్థంభం పూర్తిగా విరిగిపోయి వంగిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండడం తో ఒక్కసారిగా కరెంటు సరఫరా లో అంతరాయం ఏర్పడడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాలకు పైన ఉన్న



11 కెవి వైర్లు కాస్త గట్టిగా ఉండడంతో స్థంభం విరిగినా బస్సుపై పడకుండా వైర్ల మీద నిలవడంతో పెను ప్రమాదం నుంచి విద్యార్థులు, డ్రైవర్, బస్సు బయట పడింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ సంబంధించిన ఏఈ హరినాథ్ సంఘటన స్థలం కు చేరుకుని విరిగిన విద్యుత్ స్థంభాన్ని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా కాలం చెల్లిన ప్రైవేటు స్కూల్ బస్సులు లో విద్యార్థుల ప్రాణాలు భద్రత సురక్షితమేనా అని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి



- గడువు ముగియడానికి నాలుగు రోజులే అప్రమత్తంగా ఉండండి
- తహసీల్దార్ వెంకటేశ్వర్లు

రామాపురం జూలై 10 మనసులో మాట :

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి రామాపురం మండల ప్రజలు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమానికి గడువు ముగియడానికి మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జులై 11వ తేదీలోపు ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా నింపి బీఎల్ఓలకు అందజేయాలని అధికారులకు సూచించారు.అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇంటి వద్దకు వచ్చే బీఎల్ఓలు, ఇతర అధికారులకు అవసరమైన పత్రాలను అందజేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో నివసిస్తున్న వారితో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులకు కూడా సమాచారం అందించి గడువులోపు ఫారాలు సమర్పించేలా చూడాలని సూచించారు.ఈ నెల 14వ తేదీ ఎస్ఐఆర్ కార్యక్రమానికి చివరి తేదీ కావడంతో ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకుని, అవసరమైన ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు కాబట్టి ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ఫారాలను సమర్పించని వారి పేర్లు డ్రాఫ్ట్ లిస్టులో కూడా ఉండదని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు గడువులోపు ప్రక్రియను పూర్తి చేసి అధికారులకు సహకరించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

## గంగలపూడి రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏఈకి సీపీఐ వినతి



**శ్రీకాళహస్తి రూరల్, జూలై 10 (మనసులో మాట) :**
శ్రీకాళహస్తి మండలం గంగలపూడి గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించి సాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విద్యుత్ శాఖ ఏఈ కరిముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గత ఐదు నెలలుగా రైతులు పంటలు సాగు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట భూములు బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ. బాలరాజయ్య, వెంకటసుబ్బయ్య, రాజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుచెరువుకండ్రిగలో 'జనబాట '



**బాలాయపల్లి (మనుసులో మాట):**
మండలంలోని నాయుడు చెరువుకండ్రిగ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో " జనబాట "కార్యక్ర మాన్ని విద్యుత్ శాఖ ఏ ఈ ఏడుకొండలు ఆద్వ ర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదృత్ శాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ప్రజలతో నేరుగా మాట్లాడి విద్యుత్ సరఫరా, బిల్లు లు, మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లో వోల్టేజ్ తదితర సమస్యలపై వినియోగదారులను అడిగి తెలుసుకు న్నారు. గ్రామస్థులు విద్యుత్ సమస్యలను అధికా రుల దృష్టికి తీసుకువచ్చారు,వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ వినియోగంలో భద్రతా నిబంధనలు పాటిం చాలన్నారు, విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలన్నారు.రైతులు వ్యవసాయ పోలాల కు అడవి పందులకు కరెంటు తీయకూడదని తెలిపారు.ప్రజలు కరెంటుతో నిర్లక్ష్యం చేయకూడదని హేచ్చారించారు.విదృత్తు తీగలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు.ఈ కార్యక్రమంలో ఏ ఎల్ ఎం సుధీర్ రెడ్డి, ఎండి ఆలీ, జేఎల్ఎం ఏకాంబరం, సుబ్రహ్మణ్యం, శ్రావణ్,చెంగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నరసయ్య గ్రామస్థులు, పాల్గొన్నారు.

# ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో ఘనంగా 7వ వార్షికోత్సవం







- **ఉత్తీర్ణులకు పట్టాలు, ప్రతిభావంతులకు బంగారు, వెండి పతకాలు**

**ఏర్పేడు, జూలై 10 (మనసులో మాట) :**
తిరుపతిలోని ఐఐఎస్ఈఆర్ (IISER)లో 7వ వార్షికోత్సవం సందర్భంగా కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2026లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్య అతిథి నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి, ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య చేతుల మీదుగా డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య, మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ఐఐఎస్ఈఆర్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించి ఉన్నత శిఖరాలకు చేర్చే సంస్థగా నిలుస్తోందని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ పరిశోధనల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల ఉన్నత విద్య, పరిశోధనలకు అందిస్తున్న పథకాలు, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింత మెరుగుపరచి దేశాభివృద్ధికి తోడ్పడే పరిశోధనలు కొనసాగించాలని సూచించారు.

# టీడీపీలో చేరిన వైసీపీ కీలక నేత అక్కెం బుజ్జిరెడ్డి



- **100 కుటుంబాలతో పార్టీలో చేరిక**

**నెల్లూరు, ప్రతినిధి, జూలై 10, మనసులో మాట:**
సర్వేపల్లి నియోజకవర్గం లోని పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీకి చెందిన వైసీపీ కీలక నేత అక్కెం బుజ్జిరెడ్డి తన అనుచరులు, సుమారు 100 కుటుంబాలతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. మరో 250 కుటుంబాలు కూడా టీడీపీకి సంఘీభావం ప్రకటించినట్లు వెల్లడించారు. నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అక్కెం బుజ్జిరెడ్డి, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో అక్కెం రాకేష్ రెడ్డి, చేవూరు వెంకట కృష్ణయ్య, గండవరపు పెంచలయ్య, కైతేపల్లి మస్తానయ్య, బడుగు కృష్ణయ్య, శేషం అంకయ్య, కైతేపల్లి మీరయ్య, రావుల అంకయ్య, గుమ్మళ్ల పెంచలయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, 2019కు ముందు టీడీపీలో కీలకంగా పనిచేసిన అక్కెం బుజ్జిరెడ్డి తిరిగి సొంత గూటికి చేరడం ఆనందంగా ఉందన్నారు. పొదలకూరు మండలం గతంలో అభివృద్ధికి దూరంగా ఉండేదని, రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నారని విమర్శించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కండలేరు ఎడమ కాలువకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో నీటిమట్టం తగ్గినా లిఫ్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందుతోందన్నారు. అలాగే సోమశిల దక్షిణ కాలువపై సైఫన్ నిర్మించి మండలానికి నీరు తీసుకొచ్చామని, మిగిలిన పనులు పూర్తి చేసి మరో మూడు గ్రామాలకు కూడా నీరు అందించడమే లక్ష్యమని చెప్పారు. నిమ్మకాయల మార్కెట్‌లో రోడ్లు, కొత్త దుకాణాలు నిర్మించి రైతులకు సౌకర్యాలు కల్పించామని, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అన్ని వసతులతో అభివృద్ధి చేసి ప్రస్తుతం డయాలసిస్ యూనిట్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఏడు మండలాల ప్రజలకు సేవలందిస్తున్న డయాలసిస్ కేంద్రానికి ప్రత్యేక భవనం నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. 30 పంచాయతీలకు మినరల్ వాటర్ అందించేందుకు గతంలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించిన ఆయన, అదానీ కృష్ణపట్నం పోర్టు సహకారంతో ఆ ప్లాంట్‌ను పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసివేసిందని, ఇప్పటికే ముత్తుకూరులో తిరిగి ప్రారంభించామని, పొదలకూరులో కూడా పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాకాణి రమణారెడ్డి పేరుతో ఉన్న స్టేడియాన్ని కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పొదలకూరు మండల ప్రజలు గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో ఆలోచించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధికి మద్దతుగా నిలవాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## 12, 13న ఒంటేరు రవిబాబు నెల్లూరు పర్యటన



**నెల్లూరు, ప్రతినిధి, జూలై 10, మనసులో మాట:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ ఒంటేరు రవిబాబు ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా జూలై 12వ తేదీ ఆదివారం సాయంత్రం నెల్లూరుకు చేరుకోనున్నారు. జూలై 13వ తేదీన జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలను సందర్శించి తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం2005 అమలవుతున్న తీరు, ప్రజలకు సమాచారం అందించే విధానం, దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ, చట్టంలోని నిబంధనల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు.

## తొట్టంబేడులో ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి, 9 మందికి గాయాలు





**తొట్టంబేడు, జూలై 10 (మనసులో మాట) :** తొట్టంబేడు మండలం రౌతు సూరమాల గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 9 మంది గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు గూడూరులో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతురాలు గూడూరుకు చెందిన ఆదెమ్మగా గుర్తించారు. గాయపడిన వారిలో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు కాగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి అతివేగం, సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో రౌతు సూరమాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# పంగూరులో అంబేద్కర్ విగ్రహానికి గ్రామస్తుల ఆమోదం



**ఏర్పేడు, జూలై 10 (మనసులో మాట) :** ఏర్పేడు మండలం పంగూరు గ్రామ హరిజనవాడలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పడిన అడ్డంకులు తొలగిపోయాయి. గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, మండల తహసిల్దార్ రాజశేఖర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తహసిల్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎమ్మార్వో, రెవెన్యూ అధికారులు గ్రామంలో ప్రజలతో సమావేశమై చర్చించారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా గ్రామస్తులంతా ఏకాభిప్రాయానికి వచ్చి, విగ్రహ ప్రతిష్ఠకు పూర్తి సహకారం అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ కే. శ్రీనివాసులు, న్యాయవాదులు కొప్పల సుబ్రహ్మణ్యం, పుట్టా గణేష్, రెవెన్యూ సిబ్బంది, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 107 పోలింగ్ కేంద్రంలో ఓటు చైతన్యం



**రైల్వే కోడూరు జూలై 10 మనసులో మాట:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని ఉప్పరపల్లి 107వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల గుర్తింపు, పునరుద్ధరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. శుక్రవారం ఇక్కడ కొనసాగుతున్న ప్రత్యేక సర్వే (సర్) కార్యక్రమంలో వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు, డిఆర్ యుసిసి సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు మాదినేని వెంకటరెడ్డి పాల్గొని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా నాయకులు ఇక్కడ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గత కొద్దిరోజులుగా ఓటర్ల సర్వేపై ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ప్రక్రియ ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది, ఎన్యూమరేషన్ పత్రాలను లోపాలు లేకుండా ఎలా పూరించాలి అనే అంశాలపై ఓటర్లకు పూర్తిస్థాయిలో వివరించారు. పూరించిన పత్రాలను స్థానిక బూత్ లెవెల్ అధికారులకు (బిఎల్ఓ) అందజేసి, ఆన్‌లైన్ ద్వారా ఓట్లను పునరుద్ధరించుకోవాలని సూచించారు. భవిష్యత్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడమే తమ సమిష్టి కృషి అని స్పష్టం చేశారు. నాయకులు స్వయంగా వీధుల్లోకి వచ్చి అవగాహన కల్పిస్తుండటంతో ఓటర్లలో మంచి స్పందన కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏలు), బిఎల్ఓలు మరియు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పులివెందులలో వైఎస్ జగన్‌ను కలిసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి



**రైల్వే కోడూరు జూలై 10 మనసులో మాట:** కడప జిల్లా పులివెందుల పర్యటనలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని పార్టీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు, డిఆర్ యుసిసి సభ్యుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందులలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ప్రస్తుత రాజకీయ, క్షేత్రస్థాయి పరిణామాలపై చర్చ సాగింది. ముఖ్యంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల సర్వే ప్రక్రియపై జగన్ ఆరా తీయగా, భరత్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయి వాస్తవాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల సర్వే అత్యంత పారదర్శకంగా సాగుతోందని అధినేతకు వివరించినట్లు తెలిపారు. పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏలు) నిరంతరం అన్ని వార్డుల్లో పర్యటిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఎక్కడా, ఏ ఒక్క అర్హుడైన ఓటరుకు నష్టం జరగకుండా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి ఓటును సక్రమంగా నమోదు చేయించేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామని వివరించారు. బిఎల్ఏలకు ఏవైనా సాంకేతిక లేదా ఇతర సమస్యలు ఎదురైతే తానే స్వయంగా రంగంలోకి దిగి వాటిని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓట్ల నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ చురుకైన పురోగతి పట్ల వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తూ, భరత్ కుమార్ రెడ్డి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ సాగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ప్రచురణ : హైదరాబాద్ - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 312 - శనివారం - 11 జులై 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ







## సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం



- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన

4

## అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న విచారణ



అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

4

## నాలుగు దశాబ్దాల తర్వాత..

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం..
- ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు



4

# కేసీఆర్ కుట్రలు సాగవు!



### ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కల్వకుంట్ల కుటుంబాన్ని తరిమి కొడతాం

- బావా బామ్మర్దుల అబద్ధాల ప్రచారం
- రాహుల్ గాంధీని ప్రధానిగా చూస్తాం
- బీజేపీతో హరీశ్ రావు మంతనాలు : సీఎం రేవంత్ రెడ్డి
- రైతులకు భరోసా నిధులు విడుదల

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని, బావా బామ్మర్దులు అబద్ధాలు ప్రచారం చేస్తూ ఊళ్ల మీద పడి తిరుగుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇదే సభలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూనే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిరలో ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ వేదికగా రైతులకు భరోసా నిధులను కూడా సీఎం విడుదల చేశారు.

-మధిర (మనసులో మాట): 2

## బీఆర్ఎస్‌ను తరిమి కొడతాం



- కాళేశ్వరం పేరుతో భారీ అవినీతి
- హరీశ్ రావువి పచ్చి అబద్ధాలు
- ఖమ్మం సభలో భట్టి ఫైర్

వివరాలు 2లో..





# పట్టిసీమకే గోదావరి జలాలు!

### తెలంగాణ ప్రాజెక్టులకు నీరు నిలుపుదల

## కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలి

### యాదాద్రిలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆందోళన

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు మహాధర్నాకు దిగాయి. ప్రాణహితలో వరద పారుతున్నా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు ఎత్తిపోయకుండా.. కేవలం ఏపీలోని పట్టిసీమ, తాడిపూడి పంప్‌హౌస్‌లకు సాయం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

3

- యాదాద్రి భువనగిరి, జూలై 9 (మనసులో మాట)

# ముందు కాంగ్రెస్‌లో చేరు

### పార్టీలోకి వస్తానంటే కమిటీలో చర్చిస్తాం

హరీశ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పీసీసీ చీఫ్



తనకు 3 నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి కష్టాలు తీరుస్తానన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. ఆయన ముందుగా కాంగ్రెస్‌లో చేరితే.. మంత్రి పదవి ఇవ్వాలా వద్దా అనేది కమిటీలో చర్చిస్తామని ఎద్దేవా చేశారు. 2

# అబద్ధాలకు పేటెంట్ రేవంత్!

- ఖమ్మం సభలో పచ్చి అబద్ధాలు
- మాట తప్పడం నీ సంస్కృతి
- రైతులపై కక్ష తీర్చుకోవద్దు
- భద్రాచలం ముంపు పేరుతో నాటకాలు
- బీఆర్ఎస్‌పై పోరాడండి రైతులపై కాదు
- సీఎం రేవంత్‌పై హరీశ్ ఫైర్



వివరాలు 2వ పేజీలో



# అక్క రాజ్యం చూపిస్తా

- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

2

# క్లౌడ్ కిచెన్లలో కుళ్లిన పదార్థాలు

- ప్రముఖ హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



శ్రీకాకుళం జిల్లాలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుల ఆశలు అడియాసలు అవుతున్నాయి. గతంలో పలు మంత్రి పదవులు చేపట్టిన సీనియర్ నాయకులు ఇప్పుడు ఎమ్మెల్యే పదవులకు మాత్రమే అంకితం అవుతున్నారు. 2



# నాకు తెలంగాణే ముఖ్యం

3

పార్టీ కంటే నా మొదటి ప్రాధాన్యం ప్రజలే

ఎంపీ ఈటల రాజేందర్

## భలే మాట!



KANCHARLA మనసులో మాట

# ముందు కాంగ్రెస్‌లో చేరు!

**పార్టీలోకి వస్తానంటే కమిటీలో చర్చిస్తాం**

**10 ఏళ్లు మంత్రిగా ఏం పీకారు**

**హరీశ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పీసీసీ**

**హైదరాబాద్ (మనసులో మాట):** తనకు 3 నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి కష్టాలు తీరుస్తానన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. ఆయన ముందుగా కాంగ్రెస్‌లో చేరితే.. మంత్రి పదవి ఇవ్వాలా వద్దా అనేది కమిటీలో చర్చిస్తామని ఎద్దేవా చేశారు. 10 ఏళ్లు మంత్రిగా ఉండి ఆయన కట్టిన ప్రాజెక్టే కుంగిపోయిందని, ఇప్పుడు 3 నెలల సమయం ఎందుకని ఆయన ఎండగట్టారు. బీఆర్ఎస్ పార్టీ నిధులపై కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉందని, ఒక ప్రాంతీయ పార్టీకి 1400 కోట్లు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన సవాల్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీటుగా బదులిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)లో చర్చిస్తామన్నారు. ఆయనను పార్టీలో చేర్చుకోవాలా వద్దా అనే దానిపై అక్కడే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. 10 ఏళ్లు మంత్రిగా ఉండి ఏమీ చేయని వారు, ఇప్పుడు 3 నెలల సమయంలో ఏం అద్భుతాలు చేస్తారని ఆయన నిలదీశారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని, దాని గురించి హరీశ్ ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.



**కవిత ఆరోపణలు నిజమే..**

బీఆర్ఎస్ పార్టీ నిధుల విషయంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణల్లో వంద శాతం నిజం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఒక ప్రాంతీయ పార్టీకి ఏకంగా 1400 కోట్లు ఫండ్ ఎలా వచ్చిందో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను తాము సరిచేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నీళ్ల దోపిడీ జరిగినప్పుడు బీజేపీ నేత ఈటల రాజేందర్ మంత్రిగానే ఉన్నారని ఆయన గుర్తుచేశారు.

**అంతర్గత వివాదాల పరిష్కారం..**

పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలపై కూడా పీసీసీ చీఫ్ స్పందించారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య, అలాగే తుంగతుర్తిలో నేతల మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరిస్తామని చెప్పారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు రావడం సహజమేనని, సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదని ఆయన అన్నారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉన్నందున, వివాదాల పరిష్కారం కోసం ఇద్దరు సీనియర్లను పరిశీలకులుగా నియమించామని తెలిపారు. వరంగల్ అంశాన్ని సచిన్ సావంత్‌కు, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించామని, అందరి వాదనలు విని ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతామని విపక్షాలు అన్నప్పుడే.. బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు.

# ఫీజు బకాయిలపై ధర్నా

**హైదరాబాద్,జూలై10:** విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజాభవన్‌ను ముట్టడించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలంటూ వామపక్ష విద్యార్థి సంఘాల బంద్‌లో భాగంగా ప్రజాభవన్ వద్ద ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవటం లేదని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆయన ఆడుకుంటున్నారని ధర్నాకు దిగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల సహా... ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల కట్టడికి చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

# కూలిన పాఠశాల గది పైకప్పు

**విద్యార్థులకు తప్పిన ముప్పు**

**నాగర్‌కర్నూలు,జూలై10:** ప్రభుత్వ పాఠశాల తరగతి గది పైకప్పు కూలిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రమాదం నుంచి విద్యార్థులు త్రుటిలో తప్పించుకున్నారు. విద్యార్థులు తరగతిలో ఉండగా ఒక్కసారిగా గది పైకప్పు ముందు భాగం కూలింది. విద్యార్థులకు కొద్ది దూరంలో కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు రోజులాగే ప్రార్థన అనంతరం తరగతి గదిలోకి వెళ్లిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో 107 మంది విద్యార్థులకు గాను శుక్రవారం.. 70 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ తెలిపారు. వర్ష కాలం వస్తే పాఠశాల గదులు వర్షపు నీటితో నిండిపోతాయని, కొన్ని గదుల్లో పెచ్చులూడిపడి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 70 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు.

# హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు

**పిల్ల జమిందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు**

**హైదరాబాద్,జూలై10:** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# కేసీఆర్ కుట్రలు సాగవు

- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం
- కల్వకుంట్ల కుటుంబాన్ని తరిమి కొడతాం
- బావా బామ్మర్దుల అబద్ధాల ప్రచారం
- రాహుల్ గాంధీని ప్రధానిగా చూస్తాం
- బీజేపీతో హరీశ్ రావు మంతనాలు
- రైతులకు భరోసా నిధులు విడుదల
- సీఎం రేవంత్ రెడ్డి



**మధిర (మనసులో మాట):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని, బావా బామ్మర్దులు అబద్ధాలు ప్రచారం చేస్తూ ఊళ్ల మీద పడి తిరుగుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇదే సభలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూనే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిరలో ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ వేదికగా రైతులకు భరోసా నిధులను కూడా సీఎం విడుదల చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాధపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి తొలగించే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరని హెచ్చరించారు. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదని, బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో లేదో భద్రాచలం రాముడిపై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెబుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అడుగుతున్నారని, అది ఆన్ చేస్తే భద్రాచలం రాముడి ఆలయంతో సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు.

**లక్ష్యం రాహుల్ గాంధీయే!**

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 20 పార్లమెంట్ సీట్లు గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, అప్పటికి అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కు, లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. 2029 మే-జూన్‌లో జరిగే ఎన్నికల్లో 182 స్థానాల్లో 117కు పైగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని చెప్పానని, 64 వచ్చాయని, ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచామని గుర్తుచేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

**మధిరకు ఇంజనీరింగ్ కళాశాల..**

మధిరలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి మేరకు దీన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పేదలు చదువుకునేందుకు కోరిన చిన్న కోరికగా దీన్ని ఆయన అభివర్ణించారు. అనంతరం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసేందుకు బటన్ నొక్కారు. 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో 1009.15 కోట్లు జమ చేశారు. అదే వేదికపై నుంచి ఈ-పట్టాదార్ పాస్ పుస్తకాలను జారీ చేశారు. తాజా విడుదలతో కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన మొత్తం సాయం 8759 కోట్లకు చేరిందన్నారు. ఈ సాయం ద్వారా 74 లక్షల మందికి లబ్ధి చేకూరిందని, 1.45 కోట్ల ఎకరాల సాగు భూములకు గానూ మొత్తం 7750 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌ను తరిమి కొడతాం!

- కాళేశ్వరం పేరుతో భారీ అవినీతి
- హరీశ్ రావువి పచ్చి అబద్ధాలు
- అప్పులు తీరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఖమ్మం సభలో భట్టి ఫైర్



**ఖమ్మం (మనసులో మాట):** తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్తగా 1009 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. గత ప్రభుత్వం రైతుబంధు కోసం 169 రోజులు తిప్పుకోగా.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే 9000 కోట్లు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ఆయన బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేవలం 2.5 ఏళ్లలోనే మహిళలకు 67000 కోట్ల రుణాలు అందించామని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ వారిని రాజుగా చూస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం 8759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామని వివరించారు.

**బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు 27000 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును 147000 కోట్లకు పెంచి, నాసిరకంగా కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీశ్ రావు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు ముగిసిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# క్లౌడ్ కిచెన్లలో కుళ్లిన పదార్థాలు

**ప్రముఖ హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం**

**ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు.. గడువు ముగిసిన పెరుగు వాడకం**

**సిబ్బందికి నకిలీ వైద్య ధ్రువపత్రాలు..**

**హైదరాబాద్ (మనసులో మాట):** హైదరాబాద్‌లోని పలు క్లౌడ్ కిచెన్లు, ప్రముఖ హోటళ్లు, హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. కొండాపూర్‌లోని ప్రముఖ క్లౌడ్ కిచెన్‌లో కుళ్లిపోయిన, గడువు ముగిసిన పదార్థాలతో వంటలు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పాడైపోయిన పెరుగుతో కస్టమర్లకు మజ్జిగ తయారు చేస్తుండటాన్ని గుర్తించి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని, నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసిన పలు సంస్థల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. కొండాపూర్‌లోని 'రెబెల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే క్లౌడ్ కిచెన్ సెంటర్ నుంచి పలు బ్రాండ్ల పేర్లతో ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ చేస్తున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ బృందం ఇక్కడ తనిఖీలు చేయగా గడువు తీరిపోయిన పెరుగు ప్యాకెట్లు, గ్రేవీని గుర్తించారు. పాడైపోయిన ఈ పెరుగుతోనే కస్టమర్ల కోసం మజ్జిగ తయారు చేస్తున్నట్లు కనిపెట్టారు. వంటగది పరిసరాల్లోని వాష్ రూమ్‌లు చాలా అపరిశుభ్రంగా ఉన్నాయి. అక్కడ పనిచేసే సిబ్బందికి సంబంధించిన హెల్త్ సర్టిఫికెట్లలో కూడా నకిలీవి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు మెడికల్ రిపోర్టులకు, వారు చూపించిన సర్టిఫికెట్లకు ఏమాత్రం సంబంధం లేదని తేల్చారు.

**కొన్ని సానుకూల అంశాలు..**

అనేక లోపాలు ఉన్నప్పటికీ ఆ సెంటర్‌లో కొన్ని మంచి పద్ధతులు కూడా కనిపించాయి. వంటల్లో కృత్రిమ రంగులు వాడకపోవడం, వంట చేసేవారు హెయిర్‌నెట్స్ ధరించడం, నూనె నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించడం వంటివి బాగున్నాయి. దీంతో పరిశుభ్రత రేటింగ్‌లో ఈ ఔట్‌లెట్‌కు 100కి 78 మార్కులు వచ్చాయి. అధికారులు గడువు ముగిసిన వస్తువులన్నింటినీ అక్కడికక్కడే పారవేయించారు. లోపాలన్నింటినీ తక్షణమే సరిదిద్దుకోవాలని యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల వ్యవహారంపై విడిగా విచారణ జరుపుతామని చెప్పారు.

**ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు..**

సైబరాబాద్ వ్యాప్తంగా పలు హోటళ్లు, క్లౌడ్ కిచెన్లు, ఇన్‌స్టామార్ట్ గోదాములు, కాలేజీ మెస్‌లలో అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. రెయిన్‌బో విస్టాస్ రెస్టారెంట్‌లో ఎలుకల వ్యర్థాలు, కుళ్లిపోయిన పుట్టగొడుగులు దొరికాయి. మాదాపూర్‌లోని శ్రీ చైతన్య, నారాయణ కాలేజీల సెంట్రల్ కిచెన్ పరిసరాల్లో పిల్లి మలం, వీధి కుక్కలు తిరుగుతూ కనిపించాయి. గాజులరామారం ఇన్‌స్టామార్ట్ గోదాములో గడువు ముగిసిన చీజ్, పెరుగు నిల్వ ఉంచారు. కొంపల్లి రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో గడువు ముగిసిన ప్యాకెట్లు, పురుగులు పట్టిన సరుకులు కనిపించాయి. చాలా చోట్ల ఆహార పదార్థాలు తయారు చేసే సిబ్బందికి కనీస వైద్య ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం పదే పదే జరుగుతున్నట్లు అధికారులు మండిపడ్డారు.

# అబద్ధాలకు పేటెంట్ రేవంత్

**ఖమ్మం సభలో పచ్చి అబద్ధాలు.. మాట తప్పడం నీ సంస్కృతి**

**రైతులపై కక్ష తీర్చుకోవద్దు ..భద్రాచలం ముంపు పేరుతో నాటకాలు**

**సీఎం రేవంత్‌పై హరీశ్ ఫైర్**

**హైదరాబాద్ (మనసులో మాట):** ఖమ్మం జిల్లాలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. మాట తప్పడం, పార్టీలు మారడం సీఎం సంస్కృతి అని, తనది కాదని ఆయన ఘాటుగా విమర్శించారు. భద్రాద్రి రాముడి సాక్షిగా చెప్పిన సంపూర్ణ రుణమాఫీ ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయలేని చేతగానితనాన్ని కవర్ చేసుకునేందుకే.. మోటార్లు ఆన్ చేస్తే భద్రాచలం మునుగుతుందంటూ కొత్త నాటకాలకు తెరతీశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఖమ్మంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డిలా తాను ఒట్టు వేసి ఒక మాట, వేయకుండా మరో మాట చెప్పనని ఆయన స్పష్టం చేశారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. ప్రతి సభలో సీఎం రేవంత్ రెడ్డి ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారని ఆయన ప్రశ్నించారు.



**రుణమాఫీ ఏమైంది రేవంత్**

సంపూర్ణ రుణమాఫీ అమలు చేస్తామని భద్రాద్రి రాముడి సాక్షిగా ఇచ్చిన హామీ ఏమైందని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రం సంగతి పక్కన పెడితే.. కనీసం సభ పెట్టిన ఖమ్మం జిల్లాలోనైనా రైతులకు రుణమాఫీ చేశారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీపై రాజకీయంగా పోరాడాలని, కానీ రైతులపై కక్ష తీర్చుకోవద్దని ఆయన హితవు పలికారు. అన్నదాతల ఉసురు తగిలితే ఈ ప్రభుత్వం శాపం నుంచి తప్పించుకోలేదని ఆయన హెచ్చరించారు.

**ఇది ప్రభుత్వ చేతగానితనం..**

కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని ప్రభుత్వ చేతగానితనాన్ని రేవంత్ రెడ్డి అబద్ధాలతో కవర్ చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. గోదావరిలో నీరు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాల్సింది పోయి.. మోటార్లు ఆన్ చేస్తే భద్రాచలం మునుగుతుందని సీఎం తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని ముప్పు ఇప్పుడే కొత్తగా ఎందుకు వచ్చిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఇలాంటి సాకులు చెబుతున్నారని హరీశ్ రావు ఎండగట్టారు.

# నాకు తెలంగాణే ముఖ్యం!

- పార్టీ కంటే నా మొదటి ప్రాధాన్యం ప్రజలే
- కాళేశ్వరం మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
- కాంగ్రెస్ బీఆర్ఎస్ కపట నాటకాలు
- ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్

**హైదరాబాద్ (మనసులో మాట):** తనకు పార్టీ, రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్రమే అత్యంత ముఖ్యం అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కావాలనే డ్రామాలు ఆడుతున్నాయని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోనని, అలాంటి వారిని చీల్చి చెండాడతానని గట్టిగా హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టును రిపేర్ చేయకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కపట నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ఉత్తర తెలంగాణకు మిడ్ మానేరు ప్రాజెక్టు జీవనాడి లాంటిదని, కరువు వస్తుందని తెలిసీ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన నిలదీశారు. ప్రాజెక్టులోని లో లెవల్ పాయింట్‌కు వచ్చే నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని పాలకులపై ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.



## నాకు తెలంగాణే ముఖ్యం..

తాను తెలంగాణ మట్టిబిడ్డనని, ఒక ఉద్యమకారుడినని.. అదే తన అసలైన గుర్తింపు అని ఈటల రాజేందర్ ఉద్ఘాటించారు. "నాకు తెలంగాణ ఫస్ట్.. ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత విషయాలు. రాజకీయాల కోసం తెలంగాణ ప్రజలకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోను. నష్టపరిచే వారిని ఏమాత్రం వదలను, చీల్చి చెండాడతా. నేను ఎవరి చేతిలో కీలుబొమ్మను కాను.. వేరొకరు ఆడిస్తే ఆడే వ్యక్తిని అంతకన్నా కాదు. మేం స్వయం ప్రకాశితులం. ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే చదివే వాళ్లం కాదు. అలా ఆరోపించే నీచులకు నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను కేవలం కాంగ్రెస్ లేదా ఇతర పార్టీలను తిట్టడానికే రాలేదని, పని చేయాల్సిన పాలకులను బాధ్యతగా నిలదీస్తున్నానని చెప్పారు.

## రైతులకు నష్టం చేయొద్దు..

దేవాదుల ప్రాజెక్టుకు బ్యారేజి లేకపోయినా నీళ్లు పంపింగ్ చేస్తున్నారని ఈటల గుర్తుచేశారు. మేడిగడ్డలో పూర్తిగా నీళ్లు నింపమని తాను అడగడం లేదని.. కేవలం అందుబాటులో ఉన్న నీటిని పంప్ చేయాలని మాత్రమే కోరుతున్నానని చెప్పారు. పనికిమాలిన రాజకీయాలు చేస్తూ రైతులను ఇబ్బందుల పాలు చేస్తే ఖబడ్దార్ అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే హైదరాబాద్ నగరానికి 107 ఎంజీడీల మేర నీటి సరఫరా తగ్గిందని, భవిష్యత్తులో తీవ్ర నీటి కొరత వస్తే ప్రజలు ఎటు పోవాలని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు.

# పట్టిసీమకే గోదావరి జలాలు!

- తెలంగాణ ప్రాజెక్టులకు నీరు నిలుపుదల
- రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఫైర్
- కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలి
- కాంగ్రెస్ అసమర్థ పాలనతో తీవ్ర నష్టం
- యాదాద్రిలో పార్టీ శ్రేణుల ఆందోళన



**యాదాద్రి భువనగిరి (మనసులో మాట):** కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు మహాధర్నాకు దిగాయి. ప్రాణహితలో వరద పారుతున్నా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు ఎత్తిపోయకుండా.. కేవలం ఏపీలోని పట్టిసీమ, తాడిపూడి పంప్‌హౌస్‌లకు సాయం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు సాగు, తాగునీటి అవసరాల కోసం కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలను వెంటనే ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్లు, క్యామ మల్లేశ్, కల్లూరి రామచంద్రారెడ్డి, ధర్మేందర్ రెడ్డి, కొల్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కోసమే కన్నెపల్లి బంద్..

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే దిగువకు వదిలేస్తున్నారని ఆరోపించారు. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50 టీఎంసీల ప్రాణహిత జలాలు దిగువకు తరలిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఈ సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా ఉపయోగించుకోవడమే అత్యంత ముఖ్యమని సూచించారు.

ఎత్తిపోయడానికి నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన గంటల్లోనే.. దిగువన పట్టిసీమ, తాడిపూడి పంప్‌హౌస్‌లను ఏపీ ప్రభుత్వం ఆన్ చేసిందని వారు గుర్తుచేశారు. తెలంగాణలో వానల్లేక పంటలు ఎండుతున్నా.. మేడిగడ్డలో ప్రాణహిత వరద పారుతున్నా వాటిని ఎత్తిపోయడానికి రేవంత్ సర్కారుకు చేతులు రావడం లేదన్నారు. కానీ, అందివచ్చిన అవకాశంతో చంద్రబాబు సర్కార్ మాత్రం ఏపీలో నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించిందన్నారు. పట్టిసీమకు నీళ్లు ఇచ్చేందుకే ఇక్కడ కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీ ప్రయోజనాల కోసమే రేవంత్ సర్కార్ పనిచేస్తోందని వారు విమర్శించారు.

# అక్క రాజ్యం చూపిస్తా

- మహిళల కోసం ప్రత్యేక ప్రణాళిక!
- పాంచజన్యంతో ప్రజల ముందుకు వస్తాం
- ఆదివాసీల హక్కుల కోసం పోరాటం
- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

**భద్రాద్రి కొత్తగూడెం (మనసులో మాట):** రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)ను గెలిపిస్తే అన్న రాజ్యం కాదు.. అక్క రాజ్యం ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేసి గౌరవిస్తామని ఆమె ప్రకటించారు. మహిళల కోసం ఓ వినూత్న ఆలోచన చేశానని, త్వరలోనే ప్రత్యేక కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. శుక్రవారం ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించి గిరిజనులు, ఆదివాసీల సమస్యలు తెలుసుకున్నారు. పాంచజన్యం పేరుతో తాను ప్రజల ముందుకు వస్తున్నానని, తన ప్రయాణానికి ప్రజల సహకారం కావాలని కవిత కోరారు. సమాజంలో ఉన్న వెనుకబడిన వ్యవస్థను మార్చడానికే తాను ఆడబిడ్డగా ధైర్యంగా ముందుకు వచ్చానని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామంతో పాటు పలు ఆదివాసీ నాయకపోడు గ్రామాల్లో పర్యటించారు.





గిరిజనుల సమస్యలను, వారి జీవన విధానాన్ని ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తాను రాజకీయాల కోసం రాలేదని, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే వచ్చానని చెప్పారు. వెనుకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే తాను తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించానని కవిత వివరించారు. ఈ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉందని, గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## నిరుద్యోగం, కరెంట్ కష్టాలు తీరలేదు..

రాష్ట్రంలో ఎక్కడా మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదన్నారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరమని, గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కవిత ఆరోపించారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని.. అది వారి ప్రాథమిక హక్కు అని ఆమె డిమాండ్ చేశారు.

## గిరిజనులకు లోన్లు ఎందుకు ఇవ్వరు?

తెలంగాణలో ఆదివాసీల బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని కవిత మండిపడ్డారు. బ్యాంకులను లూటీ చేసిన బడాబాబుల అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడ కూడా ఆదివాసీలకు 2 లక్షల నుంచి 2 కోట్ల రూపాయల వరకు బ్యాంకు లోన్లు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం దొరుకుతుందని, ప్రజల మద్దతుతో అద్భుతాలు సాధిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# దంపతుల మిస్సింగ్ కేసులో కొత్త కోణం

**అధిక వడ్డీ ఆశతో 50 కోట్లు ముంచినట్లు వెల్లడి**

**పలువురి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్,జూలై10:** హైదరాబాద్‌లోని చెర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో స్విట్జర్లాండ్‌కు వెళ్లినట్లు చెప్పి అదృశ్యమైన దంపతుల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో తాజాగా భారీ ఆర్థిక మోసం ఆరోపణలు వెలుగులోకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పబ్బా చంద్రశేఖర్ (51), ఆయన భార్య పబ్బా స్వప్న (42) జూన్ 22న స్విట్జర్లాండ్‌కు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ఆ తర్వాత జూలై 8 వరకు వారు కుటుంబ సభ్యులను ఫోన్ లేదా ఇతర మార్గాల్లో సంప్రదించలేదు. ఇద్దరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అనుమానం వ్యక్తం చేసిన వారి కుమార్తె పబ్బా శ్రేయ చెర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దంపతుల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో తాజాగా మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితమే పబ్బా చంద్రశేఖర్ దంపతులపై పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎక్కువ వడ్డీ ఇస్తామని, వివిధ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు పెట్టిస్తామని చెప్పి సుమారు రూ.50 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లో పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించిన అనంతరం పబ్బా చంద్రశేఖర్ దంపతులు స్విట్జర్లాండ్‌కు వెళ్లి అక్కడే తలదాచుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మిస్సింగ్‌గా కనిపిస్తున్న ఈ ఘటన వెనుక ఆర్థిక నేరం కోణం కూడా ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దంపతులు నిజంగా స్విట్జర్లాండ్‌కు వెళ్లారా.? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు.? వారు దేశం విడిచి వెళ్లడానికి ముందు ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి.? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అలాగే మోసం ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలిస్తూ.. ఈ రెండు కేసుల మధ్య సంబంధం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు దంపతుల ప్రయాణ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, బాధితుల ఫిర్యాదులు, విదేశీ ప్రయాణ రికార్డులను పరిశీలిస్తూ కేసును ఛేదించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనంగా మారింది.

# రోడ్డు ప్రమాద ఘటనలో మరో ఇద్దరు కూలీల మృతి

**రాజన్న సిరిసిల్ల,జూలై10:** వేములవాడ మండలం అనుపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరు కూలీలు మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా పూణెళి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇటీవల తెలంగాణకు వచ్చారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలంలోని జెగ్గారావుపల్లె వద్ద కొదురుపాకకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా ఇక్కడ వరినాట్లకు కూలీలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో వరి నాట్లు వేసేందుకు 17 మంది మహిళలు, ఆరుగురు పురుషులు వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం డ్రైవర్‌తో సహా మొత్తం 24 మంది టాటా ఏస్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారు అనుపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఆర్టీసీ అ÷-దదె వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో దాదాపు పది అడుగుల దూరంలోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవ్ (35) కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌తో పాటు 23 మందదికి తీవ్ర గాయాలయ్యాయయి. వారిని హుటాహుటిన వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

# ఫిల్మ్ నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

**మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు**

**హైదరాబాద్,జూలై10:** హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహరీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న య-ంవకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

# గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం

**టూవీలర్‌ను ఢీకొనడంతో యువతి మృతి**

**హైదరాబాద్,జూలై10:** హైదరాబాద్ గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అదుపు తప్పి రోడ్డుపై వెళ్తున్న యువతులను ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదం జరిగింది. హాస్టల్ లో ఉంటూ ప్రైవేట్ జాబ్స్ చేస్తున్న యువతులలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గచ్చిబౌలి ఫ్లై ఓవర్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది . వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి యాక్టివాపై వెళ్తున్న యువతులపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గచ్చిబౌలిలోని హాస్టల్ లో ఉంటూ సేల్స్ గర్ల్ గా పనిచేస్తున్న మల్లం భవాని(23) ఘటనాస్థలిలోనే చనిపోయింది. ఆమె స్నేహితురాలు సుభాషిని (30) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. భవాని, ఆమె స్నేహితురాలా సుభాషిని అంజయ్య నగర్ లోని హాస్టల్ లో ఉంటున్నారు.



# ఎత్తిపోతల పంచాయితీ!

## కాళేశ్వరం నీటి తరలింపుపై దాగుడు మూతలు

కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్దం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి. ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది. బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఎపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యసవర కార్యాచరణ సిద్దం చేయాలి. అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.



డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# నాలుగు దశాబ్దాల తర్వాత చారిత్రక అడుగు

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం.. ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు



**ఆక్లాండ్ (న్యూజిలాండ్), జూలై 10:** భారత విదేశాంగ చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ఆక్లాండ్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి లక్సన్ స్వయంగా స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ పర్యటనలో ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఇటీవల కుదిరిన సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో భారత్-న్యూజిలాండ్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఆక్లాండ్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడా రంగ ప్రముఖులతో ప్రధాని మోదీ సమావేశమవుతారు. అలాగే న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశాన్ని సందర్శించిన సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలకు కొనసాగింపుగా తాజా పర్యటనను భావిస్తున్నారు. అంతకుముందు మూడు రోజులపాటు ఆస్ట్రేలియాలో పర్యటించిన ప్రధాని మోదీ, ఆ పర్యటన అత్యంత ఫలప్రదంగా సాగిందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ పర్యటనతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన



**న్యూఢిల్లీ, జూలై 10 :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయ మూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, చేతిలోని కేసు పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తిపై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు. ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ:** అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జూలై 7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14 రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది. అయోధ్య ఘటనలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని నరేంద్ర కుమార్



గోస్వామి అనే పిటీషనర్ సుప్రీంను ఆశ్రయించారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందిన కాగ్ ఆడిట్ వివరాలను వెల్లడించాలని కోరారు. ఇదే కేసులో అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా పిటీషన్లు వేశారు.

# ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

## అణు కేంద్రం వద్ద పేలిన భవనం

**టెహ్రాన్, జూలై 10:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.



# భారత్‌కు తరలిస్తున్న 22 కేజీల కొకైన్ అమెరికాలో సీజ్



**న్యూఢిల్లీ:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్(జశీఝఱఅవ నావఅఓవస)ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు. ఆపరేషన్ స్ట్రయికర్ పేరుతో సీబీపీ ఆపరేషన్ చేపట్టారు. స్పీకర్లు, ఆంప్లిఫయర్లలో 8 ప్యాకెట్లు, నాలుగు బ్రిక్స్ రూపంలో వైట్ పౌడర్‌ను దాచిపెట్టినట్లు సీబీపీ అధికారులు తెలిపారు. ఆ పౌడర్‌ను కొకైన్ హైడ్రోక్లోరైడ్‌గా గుర్తిస్తూ అధికారులు నిర్ధారణ చేశారు. 22 కేజీలు ఉన్న ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లుగా ఉంటుందని కస్టమ్స్ అధికారులు చెప్పారు.



# పాత తరం మహా నటుడు సీఎస్ఆర్

ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలానికి ముందే అగ్ర నటుడిగా వెలిగిన చిలకాలపూడి

## 'మాయాబజార్' శకునిగా, 'పాతాళభైరవి' రాజుగా తెలుగు గుండెల్లో శాశ్వత స్థానం

## నేడు 'అభినవ శకుని' జయంతి

తెలుగు నాటకరంగం, వెండితెరపై పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రలకు తనదైన అభినయంతో ప్రాణ ప్రతిష్ఠ చేసిన మహానటుడు చిలకాలపూడి సీతారామాంజనేయులు(సీఎస్ఆర్). జూలై 11న ఆయన జయంతి సందర్భంగా తెలుగు చిత్రసీమ, ప్రేక్షకులు ఆ అభినవ శకునికి ఘన నివాళులర్పిస్తున్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి దిగ్గజాల ప్రవేశానికి ముందే, అంటే 1930ల కాలంలోనే సి.ఎస్.ఆర్ ఒక వెలుగు వెలిగారు. సుమారు 175కి పైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి మూడు దశాబ్దాల పాటు పరిశ్రమపై చెరగని ముద్ర వేశారు.

### రైటర్ టు స్టార్ యాక్టర్..

సి.ఎస్.ఆర్ 1907 జూలై 11న మచిలిపట్నం సమీపంలోని చిలకాలపూడిలో ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి లక్ష్మీనరసింహమూర్తి రెవెన్యూ విభాగంలో పనిచేసేవారు. పొన్నూరులో పాఠశాల విద్యాభ్యాసం పూర్తయ్యాక కొద్దిరోజులు సహకార పర్యవేక్షకుడిగా ఉద్యోగం చేసినా.. నాటకాలపై ఉన్న మక్కువతో రంగస్థల బాట పట్టారు. పద్యాలు పాడటం దేవుడిచ్చిన వరమైతే, కవితలు రాయడంలో ఆయన దిట్ట. అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన 'పతితపావన' అనే నాటకాన్ని రాసి, దర్శకత్వం వహించారు. దేశభక్తి నింపుకున్న ఆయన.. 'తుకారాం' నాటక ప్రదర్శనల ద్వారా వసూలైన రూ. 10,000 నిధులను నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్'కు విరాళంగా అందించి తన ఉదారతను చాటుకున్నారు.

### వెండితెరపై అప్రతిహత ప్రస్థానం

1932లో విడుదలైన 'రామపాదుకా పట్టాభిషేకం' చిత్రంతో సి.ఎస్.ఆర్ సినీరంగ ప్రవేశం చేశారు. 'శ్రీకృష్ణ తులాభారం'లో కృష్ణుడిగా, 'భక్త రామదాసు'లో రామదాసుగా, 'తుకారాం'గా పౌరాణిక, భక్తిరస పాత్రల్లో అద్భుతంగా నటించారు. 1950వ దశకంలో వచ్చిన క్లాసిక్ హిట్స్ ఆయన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. 'పాతాళభైరవి' చిత్రంలో ఉజ్జయిని రాజుగా ఆయన నటన అపూర్వం. భారతదేశపు మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడిన ఘనత ఈ చిత్రానికి దక్కింది. అలాగే, 'దేవదాసు' చిత్రంలో సావిత్రిని వివాహం చేసుకునే ముసలి జమీందార్ పాత్రలో సి.ఎస్.ఆర్ జీవించారు.

### నభూతో నభవిష్యతి.. శకుని పాత్ర

తెలుగు సినీ చరిత్రలో 'శకుని' అనగానే అందరికీ గుర్తొచ్చే ఏకైక రూపం సి.ఎస్.ఆర్. 'మాయాబజార్' చిత్రంలో ఆయన పోషించిన శకుని పాత్ర 'నభూతో నభవిష్యతి'గా నిలిచిపోయింది. ఆయన డైలాగ్ డెలివరీ, మాయావి పాత్రలో చూపించిన హావభావాలు ఇప్పటికీ నటులకు ఒక పాఠ్యపుస్తకం. 'పెళ్ళి చేసి చూడు', 'కన్యాశుల్కం' (రామప్ప పంతులుగా), 'రోజులు మారాయి', 'అప్పు చేసి పప్పు కూడు', 'జగదేకవీరుని కథ' వంటి ఎన్నో అజరామర చిత్రాల్లో ఆయన కీలక పాత్రలు పోషించారు.

### తుది శ్వాస వరకు నటనలోనే..

సి.ఎస్.ఆర్ కుటుంబం కూడా సినీ పరిశ్రమతో ముడిపడి ఉంది. ఆయన సోదరుడు నాగేశ్వరరావు మాయాబజార్, సువర్ణసుందరి వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేయగా.. మరో సోదరుడు సి.వి. రత్నం భరణి స్టూడియోస్ చిత్రాలకు ప్రొడక్షన్ మేనేజర్‌గా వ్యవహరించారు. 1962లో విడుదలైన 'చిట్టి తమ్ముడు' ఆయన కళ్లముందు విడుదలైన చివరి చిత్రం కాగా.. ఆయన మరణానంతరం 1964లో విడుదలైన 'బొబ్బిలి యుద్ధం' సి.ఎస్.ఆర్ నటించిన ఆఖరి చిత్రం. అక్టోబర్ 8, 1963న తన 56వ ఏట ఈ అభినయ చక్రవర్తి కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనా, ఆయన పోషించిన పాత్రలు, పలికిన సంభాషణలు తెలుగు సినీ చరిత్ర ఉన్నంత కాలం సజీవంగానే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జనాభా సమతుల్యతతోనే సుస్థిర ప్రగతి

## నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

చైనాను దాటి నూట నలభై నాలుగు కోట్లతో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా భారత్

సహజ వనరులపై పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి



ఒక నిర్ణీత భౌగోళిక సరిహద్దుల పరిధిలో జీవించే మానవ సమూహాల ఉనికిని, వారి సంఖ్యా బలాన్ని జనాభాగా పరిగణిస్తారు. ఏ దేశానికైనా ఆ దేశ జనాభా ప్రాథమికంగా ఒక అద్భుతమైన మానవ వనరుగా, ప్రగతి చక్రాలను నడిపించే ఇంధనంగా పనిచేస్తుంది. అయితే, అదే జనాభా ఆయా దేశాల పరిమిత సహజ వనరులను, ఆర్థిక ఉత్పాదక సామర్థ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను, ఉపాధి అవకాశాలను మించి అడ్డూ అదుపూ లేకుండా పెరిగినప్పుడు అది ప్రగతికి ఊతమిచ్చే శక్తిగా కాక, వ్యవస్థలను కుప్పకూల్చే మహా భారంగా మారుతుంది. జనాభా విస్ఫోటనం వల్ల తలెత్తే పర్యావరణ పతనాన్ని, మానవ జీవన ప్రమాణాల క్షీణతను నివారించేందుకు ప్రజల్లో చైతన్యం తేవడమే ప్రతి ఏటా జూలై 11న నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం.

### చారిత్రక నేపథ్యం..

1987 జూలై 11 నాటికి ప్రపంచ జనాభా ఐదు వందల కోట్లకు (5 బిలియన్లు) చేరుకుంది. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని, పెరిగిపోతున్న సంఖ్యపై ప్రపంచవ్యాప్తంగా మేధోమథనం జరగాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి దీనికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఆ తర్వాత, 1989లో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (ఖచీణూ) పాలక మండలి అధికారికంగా ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించగా, 1990 జూలై 11న ప్రపంచంలోని తొంభైకి పైగా దేశాల్లో మొదటిసారిగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. నాటి నుండి నేటి వరకు నిరంతరాయంగా ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక సామాజికాంశంతో ఈ దినోత్సవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

### 800 కోట్లు దాటిన గ్లోబల్ పాపులేషన్..

క్రీస్తుశకం వెయ్యో సంవత్సరంలో భూమిపై కేవలం 40 కోట్ల మంది మాత్రమే ఉండేవారు. కానీ, పారిశ్రామిక విప్లవం, ఆధునిక వైద్య ఆవిష్కరణల ఊతంతో 1804 నాటికి ఆ సంఖ్య వంద కోట్లకు చేరింది. ఆపై రెండు వందల కోట్ల మార్కును అందుకోవడానికి మరో నూట ఇరవై ఏళ్ల సమయం పట్టగా, ఇరవైయో శతాబ్దపు ద్వితీయార్థంలో సంభవించిన వైద్యరంగ పురోగతి, అంటువ్యాధుల నిర్మూలన, శిశుమరణాల రేటు తగ్గడం, సగటు ఆయుర్దాయం పెరగడం వల్ల జనాభా పెరుగుదల ఉధృతి ఊహకందని స్థాయికి చేరింది. 1974లో 400 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా, కేవలం యాభై ఏళ్ల వ్యవధిలోనే రెట్టింపై ప్రస్తుతం 820 కోట్లకు (8.2 బిలియన్లు) పైగా చేరింది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదికల ప్రకారం, రాబోయే 2050 నాటికి ప్రపంచ జనాభా 970 కోట్లకు, ఈ శతాబ్దపు అంతానికి అంటే 2100 నాటికి వెయ్యి కోట్లకు పైగా చేరుకుంటుందని అంచనా. అయితే ఐరోపా, ఉత్తర అమెరికా వంటి అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో జననాల రేటు క్షీణించి, వృద్ధుల జనాభా పెరిగిపోతుండగా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలలో జనాభా పెరుగుదల రేటు అత్యంత వేగంగా సాగుతోంది.

### భారత్‌లో జనాభా ఒత్తిడి - క్షేత్రస్థాయి వాస్తవాలు..

ఈ అంతర్జాతీయ జనాభా పరిణామాల నేపథ్యంలో, భారతదేశం చారిత్రాత్మకమైన మైలురాయిని దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అగ్రగామి దేశంగా అవతరించింది. చైనాను వెనక్కి నెట్టి మన దేశం మొదటి స్థానానికి చేరుకోవడం ఒక రకంగా యువశక్తి (డెమోగ్రాఫిక్ డివిడెండ్) పరంగా మనకు అపారమైన అవకాశాలను అందిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలు దేశ ప్రణాళికాకర్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. మన దేశంలో 1872లో బ్రిటీష్ వారి కాలంలో తొలిసారిగా జనాభా గణన ప్రక్రియ ప్రయోగాత్మకంగా ప్రారంభం కాగా, 1881 నుండి ప్రతి పదేళ్లకు ఒకసారి క్రమబద్ధమైన జనగణన నిరంతరాయంగా సాగుతూ వచ్చింది. స్వతంత్ర భారతంలో 1951లో మొదటి జనాభా లెక్కలు సేకరించగా, చివరగా 2011లో నిర్వహించిన 15వ జనగణన ప్రకారం భారత జనాభా 121 కోట్లుగా నమోదైంది. ఆ తర్వాత దేశంలో పూర్తి స్థాయి అధికారిక జనగణన జరగనప్పటికీ, ప్రస్తుత అంచనాల ప్రకారం దేశ జనాభా 144 కోట్లకు పైగా దాటినట్లు నిపుణులు ధ్రువీకరిస్తున్నారు. ఈ అపారమైన జనాభా ఒత్తిడి వల్ల దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ప్రజారవాణా వ్యవస్థల పైన అంతకుమించిన భారం పడుతోంది. ఏటా కోట్లాది మంది విద్యావంతులైన యువతీ యువకులు ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నప్పటికీ, వారి నైపుణ్యాలకు తగిన ఉపాధి కల్పించడం పాలకులకు కత్తిమీద సాములా మారింది.

### పర్యావరణంపై పడుతున్న పెను సవాలు..

జనాభా విస్ఫోటనం అనేది కేవలం ఒక సంఖ్యాత్మక సమస్యా మాత్రమే కాదు, అది దేశ సామాజిక పర్యావరణ మనుగడకు సంబంధించిన పెను సవాలు. అపరిమితమైన మానవ అవసరాల కోసం పచ్చని అడవులను నరికివేస్తూ కాంక్రీట్ జంగిళ్లుగా మారుస్తుండటం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. గతంలో పంటలు పండిన సారవంతమైన సాగుభూములు నేడు బహుళ అంతస్తుల భవనాలుగా, పారిశ్రామిక మండలాలుగా రూపాంతరం చెందుతున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతుండటంతో నీటి ఎద్దడి అల్లాడిస్తోంది. జీవనదులన్నీ పారిశ్రామిక వ్యర్థాలతో, ప్లాస్టిక్ కాలుష్యంతో జీవచ్ఛవాలుగా మారుతున్నాయి. ఒకవైపు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా దేశంలో ఆహారోత్పత్తి పెరుగుతున్నప్పటికీ, ఆ ఉత్పాదకతను మించి జనాభా పెరుగుతుండటంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ దుస్థితి సమాజంలో పేదరికం, తీవ్రమైన పోషకాహార లోపం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలను పెంచి పోషిస్తూ, నగరాల శివార్లలో మురికివాడల విస్తరణకు కారణమవుతోంది. ప్రకృతి ఇచ్చిన వనరులపై ఒత్తిడి పెరిగిన కొద్దీ మానవుల మధ్య నదీ జలాల వివాదాలు, భూమి కోసం ఘర్షణలు, ఉపాధి కోసం వలసలు పెరిగిపోయి అంతర్గత భద్రతకు కూడా ముప్పు వాటిల్లుతోంది.




### మహిళా విద్య - సాధికారతే ప్రధాన ఆయుధం

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 1952లో అధికారికంగా జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రకటించిన ఘనత భారతదేశానిదే. 'చిన్న కుటుంబమే చింత లేని కుటుంబం', 'ఇద్దరు లేదా ఒక్కరు' అనే నినాదాలతో ప్రభుత్వాలు విస్తృత ప్రచారం కల్పించడం వల్ల జాతీయ స్థాయిలో సగటు సంతానోత్పత్తి రేటు (ఒఖీ=) తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ, దేశంలోని కొన్ని వెనుకబడిన రాష్ట్రాలలో, గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న నిరక్షరాస్యత, తీవ్రమైన పేదరికం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, అన్నింటికీ మించి మగసంతానంపై ఉన్న మితిమీరిన వ్యామోహం వల్ల కుటుంబ నియంత్రణ ఆశించిన స్థాయిలో సత్ఫలితాలను ఇవ్వలేకపోయింది.జనాభా నియంత్రణకు, స్థిరీకరణకు మహిళా విద్య, సాధికారత అత్యంత ప్రధానమైన ఆయుధాలని అంతర్జాతీయ సామాజిక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక మహిళ చదువుకుని, ఆర్థికంగా తన కాళ్ల మీద తాను నిలబడినప్పుడు, ఆమె తన వివాహ వయసును, సంతాన నిర్ణయాధికారాన్ని స్వతంత్రంగా తీసుకోగలుగుతుంది. బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడం, వారి ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా బాల్య వివాహాలను అడ్డుకోవచ్చు, తద్వారా జననాల రేటును సహజ సిద్ధంగానే అదుపు చేయవచ్చు. జనాభా నియంత్రణ అనేది ఏదో ఒక ప్రభుత్వ చట్టం ద్వారా లేదా బలవంతపు నిబంధనల ద్వారా సాధించేది కాకూడదు. అది ప్రతి కుటుంబం యొక్క నైతిక బాధ్యతగా సమాజంలో అంతర్గత చైతన్యం తీసుకురావాలి.

**చిన్న కుటుంబం అంటే కేవలం దేశ జనాభాను తగ్గించడం మాత్రమే కాదు; ఆ కుటుంబంలోని ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని, అత్యుత్తమ వైద్య సదుపాయాలను అందించి ప్రయోజకులను చేయడమే అనే సత్యాన్ని ప్రజల ఆలోచనా విధానాల్లోకి చొప్పించాలి. భూమి విస్తీర్ణం పరిమితమైనది, ప్రకృతి ప్రసాదించే వనరులు తరిగిపోయేవి అనే సత్యాన్ని గ్రహించి, సుస్థిరమైన అభివృద్ధి పథంలో దేశం సాగాలంటే జనాభా స్థిరీకరణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలి. పాలకుల ప్రణాళికలు, పౌరుల బాధ్యతాయుత ప్రవర్తన, పర్యావరణ స్పృహ, మహిళా చైతన్యం సమాంతరంగా సాగినప్పుడే అపారమైన ఈ జనాభా దేశానికి అడ్డంకిగా మారకుండా, నవభారత నిర్మాణానికి అద్భుతమైన సంపదగా మారుతుంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మీ కారు ఈ-20కి అనుకూలమేనా?

**ఇలా సులభంగా తెలుసుకోండి**




**హైదరాబాద్, జులై 10:** దేశవ్యాప్తంగా ఈ--ఇరవై ఇంధనం వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, తమ కారు ఈ ఇంధనానికి అనుకూలంగా ఉందో లేదో తెలుసుకోవాలనే ఆసక్తి వాహనదారుల్లో పెరుగుతోంది. ముఖ్యంగా పాత కార్ల యజమానులు ఈ విషయంపై సందిగ్ధంలో ఉన్నారు. అయితే కొన్ని సులభమైన మార్గాల ద్వారా మీ వాహనం ఈ--ఇరవై ఇంధనాన్ని ఉపయోగించేందుకు అనుకూలంగా ఉందో లేదో సులభంగా నిర్ధారించుకోవచ్చు. ఈ-20 అనేది ఎనభై శాతం పెట్రోలు, ఇరవై శాతం ఇథనాల్ కలిపి తయారు చేసే మిశ్రమ ఇంధనం. చెరకు, ధాన్యాల వంటి పంటల నుంచి తయారయ్యే ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు వాహనాల వల్ల కలిగే కాలుష్యాన్ని కూడా నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఇంధనాన్ని ప్రోత్సహిస్తోంది. మీ కారు ఈ-20 ఇంధనానికి అనుకూలంగా ఉందో లేదో తెలుసుకోవడానికి ముందుగా ఇంధన ట్యాంకు మూతను పరిశీలించాలి. కొత్త వాహనాల్లో సాధారణంగా ఇంధన ట్యాంకు మూత వద్ద ఈ-20 ఇంధనం ఉపయోగించవచ్చని సూచించే ప్రత్యేక గుర్తు లేదా స్టిక్కర్‌ను సంస్థలు అమర్చుతున్నాయి. అలాంటి గుర్తు కనిపిస్తే మీ వాహనం ఈ ఇంధనాన్ని ఉపయోగించేందుకు సిద్ధంగా ఉందని అర్థం. ఇంధన ట్యాంకు మూతపై అలాంటి గుర్తు కనిపించకపోతే వాహనంతో పాటు ఇచ్చే యజమాని పుస్తకాన్ని పరిశీలించడం మంచిది. అందులో ఇంధనానికి సంబంధించిన విభాగంలో ఏ రకమైన ఇంధనాన్ని ఉపయోగించవచ్చో స్పష్టంగా పేర్కొంటారు. ముఖ్యంగా పాత వాహనాల యజమానులకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుంది. యజమాని పుస్తకంలో కూడా స్పష్టత లేకపోతే వాహనం యొక్క గుర్తింపు సంఖ్య ఆధారంగా అధికారిక సేవా కేంద్రాన్ని సంప్రదిం చవచ్చు. ఈ సంఖ్య వాహనం నమోదు ధ్రువీకరణ పత్రంలో, ముందు అద్దం సమీపంలో లేదా డ్రైవర్ తలుపు ఫ్రేమ్‌పై ఉంటుంది. ఆ సంఖ్య ఆధారంగా సంస్థ ప్రతినిధులు మీ వాహనం ఈ-20 ఇంధనానికి అనుకూలమో కాదో నిర్ధారించి చెబుతారు. అదే విధంగా వాహన తయారీ సంస్థల అధికారిక వెబ్‌సైట్లలో కూడా ఈ-20 ఇంధనానికి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. వాహనం మోడల్, తయారీ సంవత్సరాన్ని బట్టి అనుకూలత వివరాలను అక్కడ తెలుసుకోవచ్చు. కాలక్రమేణా ఇంధన ట్యాంకు మూతపై ఉన్న స్టిక్కర్లు చెదిరిపోయిన సందర్భాల్లో ఈ పద్ధతి మరింత ఉపయోగకరంగా ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ-20 ఇంధనానికి అనుకూలంగా రూపొందించిన వాహనాల్లో ఇంజిన్, ఇంధన వ్యవస్థకు సంబంధించిన భాగాలు అధిక ఇథనాల్‌ను తట్టుకునేలా తయారు చేస్తారు. అయితే పాత సాంకేతికతతో రూపొందించిన వాహనాల్లో దీర్ఘకాలం ఈ-20 ఇంధనాన్ని ఉపయోగిస్తే రబ్బరు భాగాలు, ఇంధన వ్యవస్థలోని కొన్ని పరికరాలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందువల్ల ఊహాగానాలపై ఆధారపడకుండా, మీ వాహనం ఈ-20 ఇంధనానికి అనుకూలమో కాదో అధికారికంగా నిర్ధారించుకుని మాత్రమే వినియోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# తగ్గిన అర్హతలతో గిరిజనులకు గృహ రుణాలు




**హైదరాబాద్, జులై 10:** గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వ రంగంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రత్యేక గృహ రుణ పథకాన్ని ప్రారంభించింది. సంప్రదాయ తనఖా, భూ యాజమాన్య సమస్యల కారణంగా బ్యాంకు రుణాలు పొందలేకపోతున్న అర్హులైన గిరిజన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించింది. ప్రస్తుతం ఈ పథకాన్ని గౌహతి, రాయ్‌పూర్ జోన్‌ల పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తుండగా, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. ఈ ప్రత్యేక గృహ రుణ పథకం కింద నెలసరి వేతనం పొందుతున్న ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులు నివాస గృహాలు, ఫ్లాట్లు కొనుగోలు చేయడం, కొత్త ఇల్లు నిర్మించడం, మరమ్మతులు చేయడం లేదా విస్తరణ చేపట్టడం కోసం రుణాలు పొందవచ్చు. ఉద్యోగులకు కనిష్ఠంగా లక్ష రూపాయల నుంచి గరిష్ఠంగా నలభై లక్షల రూపాయల వరకు రుణం అందుబాటులో ఉండగా, స్వయం ఉపాధి పొందుతున్నవారు, వ్యాపారులు, వృత్తి నిపుణులకు ఇరవై ఐదు లక్షల రూపాయల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. రుణాన్ని గరిష్ఠంగా పదిహేనేళ్ల వ్యవధిలో తిరిగి చెల్లించే అవకాశం కల్పించారు. వడ్డీ రేట్లు దరఖాస్తుదారుడి రుణ చరిత్ర, ఆర్థిక స్థితి, ఇతర అర్హతల ఆధారంగా నిర్ణయించబడతాయి. గిరిజన ప్రాంతాల్లో భూమి తనఖా సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉండటంతో వాటిని దృష్టిలో ఉంచుకుని సవరించిన అర్హత నిబంధనలను ఈ పథకంలో అమలు చేస్తున్నట్లు బ్యాంకు తెలిపింది. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని అర్హులైన కుటుంబాలు సులభంగా గృహ రుణాలు పొందగలుగుతాయని బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఎంపిక చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ శాఖల ద్వారా మాత్రమే ఈ రుణ సదుపాయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రజలకు అధికారిక రుణ వ్యవస్థను చేరువ చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రధాన అధికారుల్లో ఒకరైన సుబోధ్ కుమార్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల ప్రజలు గృహ రుణాల విషయంలో ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడం, అధికారిక బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడం, గిరిజన ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# ఆకట్టుకునేలా సోనీ కొత్త కెమెరా



**హైదరాబాద్, జులై 10 :** ఫోటోగ్రఫీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ సోనీ సరికొత్త బ్రిడ్జ్ కెమెరాను మార్కెట్‌లోకి తీసు కొచ్చింది. గతంలో మంచి ఆదరణ పొందిన మోడల్‌కు వారసుడిగా విడుదలైన ఈ [illegible] రూపకల్పనతో పాటు పలు సాంకేతిక మార్పులు చేశారు. లెన్స్ మార్చాల్సిన అవసరం లేకుండా విస్తృత జూమ్ సామర్థ్యాన్ని అందించేలా దీనిని రూపొందించారు. కొత్త కెమెరాలో మెరుగైన ఎలక్ట్రానిక్ వ్యూఫైండర్, ఆధునిక ప్రాసెసర్, కృత్రిమ మేధ ఆధారిత ఆటోఫోకస్ వ్యవస్థను అమర్చారు. మనుషులు, జంతువులు, పక్షులు, వాహనాలు వంటి పలు అంశాలను వేగంగా గుర్తించి ఫోకస్ చేసే సామర్థ్యం ఇందులో ఉంది. అలాగే సులభంగా ఉపయోగించుకునే కొత్త మెనూ వ్యవస్థ, మెరుగైన నియంత్రణ బటన్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. పగటి సమయంలో తీసే చిత్రాలు అత్యంత స్పష్టంగా, సహజ రంగులతో కనిపిస్తున్నాయని ఫోటోగ్రఫీ నిపుణులు పేర్కొంటున్నారు. విస్తృత జూమ్ లెన్స్ కారణంగా ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణులు, క్రీడా ఈవెంట్లు వంటి వాటిని చిత్రీకరించేందుకు ఇది అనువుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. వేగవంతమైన ప్రాసెసర్ కారణంగా చిత్రాల ప్రాసెసింగ్ కూడా త్వరగా పూర్తవుతోంది. అయితే తక్కువ వెలుతురులో చిత్రాల నాణ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం ఈ కెమెరాకు ప్రతికూలంగా మారింది. వెలుతురు తగ్గినప్పుడు చిత్రాల్లో స్పష్టత తగ్గడంతో పాటు శబ్దం ఎక్కువగా కనిపిస్తోందని సమీక్షలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆటోఫోకస్ వ్యవస్థ కూడా లక్ష్యాన్ని గుర్తించడంలో ఆలస్యం చేస్తోందని నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ ఒకే కెమెరాతో విస్తృత జూమ్, ఆధునిక సాంకేతికత, సులభ వినియోగాన్ని కోరుకునే వారికి ఈ కొత్త మోడల్ మంచి ఎంపికగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. పగటి ఫోటోగ్రఫీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారులను ఈ కెమెరా మరింత ఆకట్టుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# కల్యాణ్ జ్యువెలర్స్ షేర్ల జోరు..

**పెట్టుబడిదారులకు భారీ లాభాలు**

**హైదరాబాద్, జులై 10 :** దేశీయ ఆభరణాల విక్రయ రంగంలో ప్రముఖ సంస్థ కళ్యాణ్ జ్యువెలర్స్ షేర్లు వరుసగా మూడో రోజు కూడా బలమైన లాభాలతో దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన ట్రేడింగ్‌లో ఈ షేరు ఏడు శాతానికి పైగా పెరిగి అత్యధిక స్థాయిని తాకింది. దీంతో పెట్టుబడిదారులకు గణనీయమైన లాభాలు చేకూరగా, కంపెనీ మార్కెట్ విలువ కూడా భారీగా పెరిగింది. గత మూడు ట్రేడింగ్ రోజులలోనే ఈ షేరు దాదాపు 34 శాతం మేర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువకు సుమారు రూ.11,500 కోట్లు అదనంగా చేరాయి. ప్రస్తుతం సంస్థ మొత్తం మార్కెట్ విలువ రూ.48,850 కోట్లకు చేరుకుంది. ఈ ఏడాది ఆరంభంలో ఎదురైన నష్టాలను కూడా ఈ పెరుగుదలతో దాదాపు భర్తీ చేసుకుంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థ ఒకటి ఈ షేరుపై అనుకూల నివేదిక విడుదల చేయడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. సంస్థ షేర్లను కొనుగోలు చేయాలని సూచించడంతో పాటు ఒక్కో షేరుకు రూ.750 లక్ష్య ధరను నిర్దేశించింది. ప్రస్తుతం ఉన్న ధరతో పోలిస్తే భవిష్యత్తులో మరింత పెరుగుదలకు అవకాశం ఉందని పేర్కొంది. ఇటీవల ముగిసిన తొలి త్రైమాసికంలో సంస్థ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 38 శాతం పెరగడం కూడా పెట్టుబడిదారులను ఆకర్షించింది. దీర్ఘకాలంలో కంపెనీ వృద్ధి అవకాశాలు బలంగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో కూడా ఈ షేరు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






# బంగారం ధరలు మళ్లీ పెరుగుదల

**హైదరాబాద్, జులై 10 :** దేశంలో బంగారం ధరలు మరోసారి స్వల్పంగా పెరిగాయి. వరుసగా రెండో రోజు పసిడి ధరల్లో పెరుగుదల నమోదైంది. అయినప్పటికీ గత నెలతో పోలిస్తే ప్రస్తుతం ధరలు కొంత తక్కువ స్థాయిలోనే ఉన్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,820కు చేరుకుంది. గురువారంతో పోలిస్తే రూ.380 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.350 పెరిగి రూ.1,32,750గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,620 వద్ద కొనసాగుతోంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిల్లో కూడా 24 క్యారెట్ల బంగారం రూ.1,44,820, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,750 వద్ద విక్రయమవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం అత్యధికంగా రూ.1,45,640గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,44,950గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ధరలు దాదాపు హైదరాబాద్ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరల కదలికలు, డాలర్ మారకపు విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ప్రతిరోజూ మారుతున్నాయని బులియన్ వ్యాపారులు తెలిపారు. కొనుగోలు చేసే ముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

# ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓకు రంగం సిద్ధం




**హైదరాబాద్, జులై 10 :** భారతీయ బ్యాంకింగ్ రంగంలో ప్రముఖ సంస్థ స్టేట్ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ తన తొలి ప్రజా వాటాల విక్రయానికి సిద్ధమైంది. ఈ ఐపీఓ కోసం ఒక్కో షేరు ధరను రూ.545 నుంచి రూ.574 మధ్య నిర్ణయించారు. ఒక లాట్‌లో 26 షేర్లు ఉండగా, పెట్టుబడిదారులు కనీసం ఒక లాట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఐపీఓకు దరఖాస్తుల స్వీకరణ జులై 14న ప్రారంభమై 16తో ముగియనుంది. వాటాల కేటాయింపు అనంతరం జులై 21న కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కానున్నాయి. ఈ ఇష్యూ పూర్తిగా ఇప్పటికే ఉన్న వాటాల విక్రయం రూపంలోనే నిర్వహించబడుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా స్టేట్ బ్యాంక్ సుమారు 12.83 కోట్ల షేర్లను, అముండి ఇండియా సంస్థ 7.56 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. దేశంలో విశ్వసనీయ ఆర్థిక సంస్థగా గుర్తింపు పొందిన స్టేట్ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన సంస్థ కావడంతో ఈ ఐపీఓపై పెట్టుబడిదారుల్లో ఆసక్తి నెలకొంది. మార్కెట్ నుంచి భారీ నిధులు సమీకరించడమే ఈ ప్రజా వాటాల విక్రయ ప్రధాన లక్ష్యంగా కంపెనీ భావిస్తోంది.

# విశాఖ పాల ధర పెంపు




**విశాఖపట్నం, జులై 10 :** ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విశాఖ డెయిరీ పాలు, పెరుగు ధరలను పెంచింది. పాల సేకరణ, నిర్వహణ వ్యయాలు పెరగడంతో సవరించిన ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. తాజా ధరల ప్రకారం అర లీటర్ ఫుల్ క్రీమ్ పాల ప్యాకెట్ రూ.34 నుంచి రూ.36కు, లీటర్ ప్యాకెట్ రూ.68 నుంచి రూ.71కు పెరిగింది. అలాగే 400 గ్రాముల పెరుగు కప్పు రూ.32 నుంచి రూ.35కు, ఒక కిలో పెరుగు బకెట్ రూ.95 నుంచి రూ.100కు పెంచారు. ధరల పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పాలు, పెరుగు ధరలు కూడా పెంచడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలు, పెరిగిన నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ వర్గాలు వెల్లడించాయి.

# చెన్నైలో బిగ్‌బాష్ తొలి విదేశీ మ్యాచ్







**చెన్నై, జులై 10:** ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ పొందిన లీగ్‌లలో ఒకటైన ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా విదేశీ గడ్డపై అధికారిక మ్యాచ్‌ను నిర్వహించనుంది. బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్‌కు సంబంధించిన ప్రారంభ మ్యాచ్‌ను తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మెల్‌బోర్న్‌లో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించిన వివరాల ప్రకారం డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో ఈ చారిత్రాత్మక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు, పెర్త్ స్కార్చర్స్‌తో తలపడనుంది. ఈ పోరులో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ హోం జట్టుగా బరిలోకి దిగనుండటం విశేషం. విదేశీ దేశీయ క్రికెట్ లీగ్‌కు చెందిన అధికారిక మ్యాచ్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం మరో ప్రత్యేకతగా నిలిచింది. ఈ మ్యాచ్ విజయవంతంగా నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక అడుగుగా ఈ మ్యాచ్‌ను అభివర్ణించారు. చెన్నైలో జరిగే ఈ ప్రత్యేక పోరులో గెలుపోటముల కంటే ఆట స్ఫూర్తి, ఇరు దేశాల స్నేహబంధమే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. బిగ్‌బాష్ లీగ్‌ను భారత క్రికెట్ అభిమానులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌తో పాటు చెన్నైలో సాంస్కృతిక, చలనచిత్ర ఉత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా రెండు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆస్ట్రేలియాలో ఐపీఎల్‌కు బాటలు






**మెల్‌బోర్న్, జులై 10 :** భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ సంబంధాలు మరో కీలక మైలురాయిని చేరుకోనున్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ టీ20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా ఆ దేశం వెలుపల మ్యాచ్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం (చేపాక్) స్టేడియంలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ఈ చారిత్రాత్మక ప్రకటనను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సంయుక్తంగా వెల్లడించారు. రెండు దేశాల మధ్య దౌత్య, క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ సహకారం బిగ్‌బాష్ లీగ్‌తో మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను కూడా భవిష్యత్తులో ఆస్ట్రేలియాలో నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా మీడియా కథనాల ప్రకారం, చెన్నైలో బిగ్‌బాష్ ప్రారంభ మ్యాచ్‌ను ప్రతి ఏడాది నిర్వహించేలా ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనికి ప్రతిగా ఆస్ట్రేలియాలో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించాలని క్రికెట్ ఆస్ట్రేలియా భారత క్రికెట్ నియంత్రణ మండలికి ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఈ అంశంపై అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదనకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపితే, భవిష్యత్తులో మెల్‌బోర్న్, సిడ్నీ వంటి నగరాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఏర్పడనుంది. దీంతో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారత అభిమానులు తమ అభిమాన జట్ల మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం దక్కనుంది. క్రీడా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రెండు దేశాల మధ్య క్రికెట్ సహకారం మరింత బలపడటంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా టీ20 క్రికెట్‌కు కొత్త దిశను చూపించే పరిణామంగా నిలిచే అవకాశం ఉంది.



## లార్డ్స్‌లో భారత మహిళలకు చారిత్రక టెస్టు

**లండన్, జులై 10:** టీ20 ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శనతో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో కీలక సవాల్‌కు సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో శుక్రవారం భారత జట్టు బరిలోకి దిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత మహిళలు తొలుత బ్యాటింగ్ ప్రారంభించారు. లార్డ్స్ మైదానంలో భారత మహిళల జట్టు టెస్టు మ్యాచ్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందిన ఈ మైదానంలో తొలి టెస్టు ఆడుతూ భారత మహిళలు చారిత్రక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ మ్యాచ్ ద్వారా ఇరు జట్లు విజయంతో సిరీస్‌ను ముగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగాయి. భారత్ తరఫున టీ20 ప్రపంచ నంబర్-ఒకటి బౌలర్ శ్రీచరణి టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేస్తుండగా, ఇంగ్లండ్ తరఫున క్యాప్సీ, మ్యాడీలు తొలి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారు. ఈ అరంగేట్ర ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మహిళల టెస్టు మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు జరుగుతాయి. ఇంగ్లండ్ తుది జట్టు: నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), టామీ బీమౌంట్, మియా బౌచీర్, హీథర్ నైట్, క్యాప్సీ, అమీ జోన్స్ (వికెట్ కీపర్), మ్యాడీ, సోఫీ ఎకిల్‌స్టన్, ఇస్సీ వాంగ్, లారెన్ బెల్, లారెన్ ఫైలర్. భారత్ తుది జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, యాస్తికా భాటియా, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, సయాలీ, శ్రీచరణి, క్రాంతి గౌడ్.

# పర్ఫామెన్స్‌కు విలువ లేదా?

### టీ20ల్లో టీమిండియా వరుస పరాజయాలు

### సిఫార్సుల ద్వారానే ఛాన్స్‌లు..

### టీమిండియా ఎంపికలపై విమర్శలు!

### ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో ఓటమి

**ముంబై:** టీమిండియా గత 5-6 టీ20ల్లో వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో భారత్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఎంపికపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఆటగాళ్ల ఎంపికలో ప్రతిభ కంటే వ్యక్తిగత అనుబంధాలు, లాబీయింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అభిమానులు, నెటిజన్లు.. బీసీసీఐ, సెలెక్టర్లపై విమర్శలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైరల్ పోస్టులో టీమిండియా ఆటగాళ్ల ఎంపికపై నెటిజన్స్ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. అభిషేక్ శర్మకు యువరాజ్ సింగ్ మద్దతు కారణంగా అవకాశం దక్కిందని, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అతని వయస్సు కారణంగా ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని నెటిజన్స్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ మాత్రం దేశవాళీ క్రికెట్‌లో రాణించి తిరిగి భారత జట్టులోకి వచ్చిన ఏకైక ఆటగాడని అభిప్రాయపడ్డారు. శ్రేయస్ అయ్యర్ దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చి జట్టులో చోటు సంపాదించాడని పేర్కొన్నారు. శివమ్ దూబేను స్పిన్ బౌలర్లపై భారీ షాట్లు ఆడగలడనే ఉద్దేశంతో ఎంపిక చేసినా.. స్పిన్ బౌలింగ్‌కే బలవుతున్నాడని విమర్శించారు. తిలక్ వర్మ ఎంపిక వెనుక రోహిత్ శర్మ మద్దతు, ముంబై లాబీ ప్రభావం ఉందని ఆరోపించారు. అక్షర్ పటేల్‌కు 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆడిన కీలక ఇన్నింగ్స్, ఫీల్డింగ్ కారణంగా అవకాశాలు కొనసాగుతున్నాయని.. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాలకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు కారణమని ఆ పోస్టులో నెటిజన్స్ పేర్కొన్నారు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం ప్రదర్శన కంటే ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రజత్ పాటీదార్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ ప్రస్తుత టీ20 జట్టులోని చాలా మంది ఆటగాళ్ల కంటే మెరుగైన ప్రదర్శన చేయగలరని అభిప్రాయపడ్డారు. ఇషాన్, శ్రేయాస్ మాత్రమే అద్భుత ప్రదర్శనతో జట్టులో చోటు సంపాదించారని ఫాన్స్ పేర్కొంటున్నారు.

## టీ20ల్లో శ్రేయస్ అరుదైన రికార్డు

### జట్టు విఫలమైనా 'సర్పంచ్ సాబ్' ఒంటరి పోరాటం!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు వరుసగా నిరాశపరుస్తున్నా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం తన బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఇప్పటికే మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన భారత్.. బ్రిస్టల్ వేదికగా జరిగిన నాలుగో టీ20లోనూ బ్యాటింగ్‌లో తడబడింది. అయితే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒంటరి పోరాటంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ వరుసగా విఫలమైన వేళ శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా బ్యాట్ ఊపాడు. చివరి వరకు అజేయంగా నిలిచిన ఆయన 80 పరుగులు చేసి భారత్‌ను 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగుల వరకు తీసుకెళ్లాడు. శ్రేయస్ తర్వాత భారత బ్యాటర్లలో అత్యధిక స్కోరు కేవలం 22 పరుగులే కావడం ఆయన ఇన్నింగ్స్ ఎంత విలువైనదో చెప్పకనే చెబుతోంది. ఈ ఇన్నింగ్స్‌తో శ్రేయస్ అయ్యర్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. భారత జట్టులో మిగతా ఏ బ్యాటర్ కూడా 25 పరుగులు దాటని మ్యాచ్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు నమోదు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులు ఈ ప్రత్యేక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో తొలి స్థానంలో మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు. అమెరికాపై అజేయంగా 84 పరుగులు చేసిన ఆ మ్యాచ్‌లో మరో భారత బ్యాటర్ 25 పరుగులకు మించి చేయలేదు. రెండో స్థానంలో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఆస్ట్రేలియాపై ఆయన చేసిన అజేయ 82 పరుగుల ఇన్నింగ్స్ సమయంలో మిగతా బ్యాటర్లలో ఎవరూ 21 పరుగులు దాటలేదు. విశేషమేమిటంటే.. ఈ ప్రత్యేక జాబితాలో శ్రేయస్ అయ్యర్ పేరు ఒకసారి కాదు, మూడు సార్లు ఉంది. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులతో పాటు, శ్రీలంకపై అజేయ 73 పరుగులు, మరోసారి ఇంగ్లండ్‌పైనే చేసిన 67 పరుగుల ఇన్నింగ్స్‌లు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జట్టు మొత్తం విఫలమైన సందర్భాల్లో కూడా బాధ్యత తీసుకుని ఒంటరిగా పోరాడే బ్యాటర్‌గా శ్రేయస్ తన విలువను మరోసారి నిరూపించాడు.




## లార్డ్స్‌లో తొలి టెస్టు

### స్మృతి మంధాన అరుదైన ఘనత



భారత మహిళా జట్టు ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఆతిథ్య ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ ఏకైక టెస్టులో.. టీమిండియా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ కెరీర్‌లో అతి పిన్న వయసులో 300 మ్యాచ్‌లు ఆడిన బ్యాటర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన భారత మహిళల జాబితాలో స్మృతి మూడో స్థానంలో ఉంది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన స్మృతి.. ఇప్పటి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఈ జాబితాలో ప్రస్తుతం భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(374) అగ్రస్థానంలో ఉండగా, భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్(333) రెండో స్థానంలో కొనసాగుతోంది. 29ఏళ్ల స్మృతి ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచులు ఆడింది. మొత్తం 10వేలకుపైగా పరుగులు చేసింది. ఇందులో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 67 బంతుల్లో 56 పరుగులు చేసి క్రీజులో కొనసాగుతోంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. లంచ్ బ్రేక్ సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(0), యాస్తికా భాటియా(12) నిరాశ పర్చారు. జెమీమా రోడ్రిగ్స్(35) పరుగులు చేసి ఔటైంది. కాగా స్మృతి మంధాన(56బి), హర్మన్ ప్రీత్ కౌర్(14బి) క్రీజులో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, లారెన్ ఫైలర్, ఇస్సీ వాంగ్ తలొక వికెట్ పడగొట్టారు.

మనసులో మాట

# జన నాయగన్‌కు ఏ సర్టిఫికెట్

## పలు మార్పులు సూచించిన సెన్సార్ బోర్డు

తమిళనాడు సీఎం, నటుడు విజయ్ కథానాయకుడిగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అయితే మొత్తం మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో దాదాపు 12 కీలక మార్పులు చేయాలని బోర్డు సూచించింది. ఇందులో భాగంగా విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని. అలాగే 'అంబేడ్కర్ చట్టం' అనే డైలాగ్‌ను మార్చాలని, ఓ పుస్తకం కవర్‌పై అంబేడ్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలని బోర్డు స్పష్టం చేసింది. ఇక దేశభక్తికి సంబంధించిన అంశాల్లో భాగంగా భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు సినిమాలో 'రంగనాథర్', 'ఓం' అనే పదాలతో పాటు 'ఆపరేషన్ మేలుహా' వివరణలో వచ్చే 'న్యూ ఇండియా' అనే పదాన్ని మ్యూట్ చేయాల్సిందిగా పేర్కొంది. సమాజంలో సున్నితమైన అంశాలకు సంబంధించి ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలని బోర్డు వెల్లడించింది. అలాగే సినిమాలో 'షీలా రాణి' అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలని, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన సద్దాం హుస్సేన్ ఉరితీత డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలని సూచించింది. వీటితో పాటు మరికొన్ని సన్నివేశాల్లో వచ్చే వివాదాస్పద పదాలను కూడా మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డు ఆదేశాల జాబితాలో పేర్కొంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ మార్పులన్నింటినీ పూర్తి చేసుకుని జులై 24న 'జన నాయగన్' థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.






## 40 ప్లస్‌లోనూ స్టన్నింగ్ లుక్

### వైరల్ అవుతున్న విమలా రామన్ ఫొటోలు

మలయాళ, తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి విమలా రామన్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. 44 ఏళ్ల వయసులోనూ అదే ఫిట్‌నెస్, అదే గ్లామ-ర్‌ను మెయింటైన్ చేస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది. తమిళ చిత్రం 'పోయి'తో సినీ రంగంలో అడుగుపెట్టిన విమలా రామన్.. అనంతరం 'టైమ్' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. వరుసగా పలు మలయాళ చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తెలుగులో 'ఎవరైనా ఎప్పుడైనా' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. తొలి చిత్రంతోనే అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఇటీవల కాలంలో సినిమాల సంఖ్య తగ్గింది. సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం విమలా రామన్ చాలా యాక్టివ్‌గా ఉంటోంది. తరచూ తన గ్లామరస్ ఫోటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. లైట్ పింక్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో స్టైలిష్‌గా మెరిసిన విమలా.. ట్రెండీ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఎద, నడుము అందాలు హైలైట్ అయ్యేలా ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని ఫొటోల్లో కురులను ముఖంపైకి వదిలి, మరికొన్నింటిలో వెనక్కి సర్దుకుని డిఫరెంట్ లుక్స్‌లో కనిపించింది. ఒక చేతికి బ్రేస్‌లెట్, వేళ్లకు ఉంగరాలు ధరించి తన స్టైలింగ్‌కు మరింత అందాన్ని జోడించింది. మొత్తంగా 40 ప్లస్‌లోనూ తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి నిరూపించిన విమలా రామన్.. తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



## హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు

### పిల్ల జమీందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 10:** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, య-ువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా మోసం బయటపడటం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

## ఫిల్మ్ నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

### మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

హైదరాబాద్, జూలై 10: హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహారీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న య-ువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.





## కొత్త కథనంతో వచ్చిన లెనిన్

### అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయి-పోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్య, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్య, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ సబ్జెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్ధం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్ధం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు. ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్ధంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746



## తెలంగాణ సంస్కృతి వైభవం.. బోనాల జాతర

8

- ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాడ బోనాల జాతరను భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా నిర్వహించాలి
- లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు సేవలు అందించడంలో సంబంధిత విభాగాలన్నీ సహనంతో, సంయమనంతో వ్యవహరించాలి


# మనసులో మాట

KANCHARLA

# తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

శనివారం 11 జులై 2026 పేజీలు 16


- మధిర సభలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక రాజకీయ వ్యాఖ్యలు చేశారు.
- అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరుగుతాయని పేర్కొన్నారు.
- 2029లో జరిగే ఎన్నికల్లో 182లో 117కుపైగా సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.
- "భద్రాచలం రాముడిపై ఆన" అంటూ విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు.
- రైతులకు రెండున్నరేళ్లలో రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.
- వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని, ఉచిత విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వ పేటెంట్ అని అన్నారు.



# 117 సీట్లు మావే: సీఎం రేవంత్

**మధిర (మనసులో మాట) జూలై 10:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (Revanth Reddy) కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవన్నారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని.. 2029 మేజూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని, ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు సీఎంకు స్వాగతం పలికారు. ''ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది.

..మిగతా 2లో



2

## సంపూర్ణ రుణమాఫీ హామీ ఏమైంది?: హరీశ్‌రావు

- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు.
- మాట తప్పడం, పార్టీలు మారడం సీఎం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని విమర్శించారు.

## పెద్దపల్లిలో దారుణం.. భార్య చేతిలో భర్త హత్య!



6

## సీఎం ప్రజావాణిలో 247 దరఖాస్తులు



9

## బీటెక్ తొలి విడత అలాట్‌మెంట్ విడుదల

- తెలంగాణ ఎప్‌సెట్ (TG EAPCET) తొలి విడత బీటెక్ సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదల.
- వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయించిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి.



2



2

## పెద్దపల్లి కమాన్ విస్తరణ ఎప్పుడూ..?

- నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు.. అవస్థల్లో ప్రజలు
- కమాన్ జంక్షన్ విస్తరణ, బైపాస్ నిర్మాణం వేగవంతం చేయాలని డిమాండ్

# 117 సీట్లు మావే: సీఎం రేవంత్

**(మొదటి పేజీ తరువాయి)**
రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్ని స్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం'' అని రేవంత్ అన్నారు.

**కల్వకుంట్ల కుటుంబాన్ని పాతాళానికి తొక్కేవరకు విశ్రమించం**

కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. ''గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే అన్నా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం.



**భాజపాతో హరీశ్‌రావు మంతనాలు**

కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు. ఆ కుటుంబంలో ఒకరిని చూస్తే.. మరొకరికి నచ్చదు. మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అక్కడ నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుంది. మీ రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా?హరీశ్‌రావు భాజపా నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారు. అలా చేయడంలేదని భద్రాచలం రాముడిపై ఆయన ప్రమాణం చేస్తారా?'' అని రేవంత్ సవాల్ విసిరారు. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ''ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను వారు చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉంది'' అని రేవంత్ అన్నారు.



## పెద్దపల్లి కమాన్ విస్తరణ ఎప్పుడూ..?

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 10:**
పెద్దపల్లి పట్టణంలోని కమాన్ జంక్షన్ వద్ద రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. పట్టణంలోకి ప్రవేశించే, బయటకు వెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో ఈ జంక్షన్ నిత్యం రద్దీగా మారి, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి భారీ వాహనాల రాకపోకల కారణంగా కమాన్ జంక్షన్ వద్ద తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. రహదారి వెడల్పు సరిపోకపోవడంతో పెద్ద వాహనాలు మలుపులు తిరిగే సమయంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, పాదచారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవల వాహనాలు కూడా సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం సంభవించిన ఘటనలను గుర్తు చేస్తూ, తక్షణ చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కమాన్ జంక్షన్‌ను విస్తరించాలని, పట్టణంలోని ప్రధాన రహదారులను వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పెద్దపల్లి బైపాస్ రహదారి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి, భారీ వాహనాలను పట్టణం వెలుపలే మళ్లించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి తక్షణ చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా ప్రజలు కోరుతున్నారు.



## బీటెక్ తొలి విడత అలాట్‌మెంట్ విడుదల

**తెలంగాణ (మనసులో మాట) జూలై 10:**
తెలంగాణ ఎప్‌సెట్ (TG EAPCET) మొదటి విడత సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదలయ్యాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు బీటెక్ సీట్లను కేటాయించారు. ఏ కళాశాల, ఏ బ్రాంచీలో సీటు వచ్చిందో ఈ లింక్‌పై క్లిక్ చేసి విద్యార్థులు నేరుగా తెలుసుకోవచ్చు. అలాగే, క్యాండిడేట్ లాగిన్ ద్వారా అభ్యర్థులు తమ వివరాలను ఎంటర్ చేసి అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొత్తంగా 88,062 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోగా.. కన్వీనర్ కోటాలో ఈడబ్ల్యూఎస్ కలుపుకొని 88,053 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 4న మాక్ సీట్ల కేటాయింపు తర్వాత వేలాది మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు మార్చుకోగా.. తాజాగా శుక్రవారం రాత్రి అధికారులు తొలి విడత సీట్ల కేటాయింపు జాబితాను అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## బిడ్డ దగ్గరికి వచ్చి, అనంతలోకాలకు తండ్రి



**వెల్గటూర్ (మనసులోమాట) జూలై 10:**
ఎండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన దాస రాజు అనే వ్యక్తి స్పాట్ లోనే మృతి చెందాడు. రాజు ఈ ప్రాంతంలోనే ఉన్న తన కూతురు దగ్గరకు వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనం పై ధర్మారం వైపు వెళ్తున్న రాజును ఎండపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తల పగిలి రాజు స్పాట్ లోనే దారుణంగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని రోడ్డు క్లియర్ చేశారు.

# సంపూర్ణ రుణమాఫీ హామీ ఏమైంది?: హరీశ్‌రావు

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 10:**
ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని.. తనది కాదని విమర్శించారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. ''రేవంత్‌రెడ్డిలా ఒట్టు వేసి ఓ మాట.. వేయకుండా ఓ మాట చెప్పను. భద్రాద్రి రాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైంది? రాష్ట్రం సంగతి పక్కన పెట్టండి.. కనీసం ఖమ్మం జిల్లాలోనైనా రుణమాఫీ చేశారా? ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారు రేవంత్‌రెడ్డి?కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేస్తున్నారు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా పోరాడండి.. రైతులపై కక్ష తీర్చుకోవద్దు. అన్నదాతల శాపం నుంచి ఈ ప్రభుత్వం తప్పించుకోలేదు'' అని హరీశ్‌రావు అన్నారు.



# కోహెడలో రూ.47.03 కోట్ల ఎగుమతి ఆధారిత

**ఇబ్రహీంపట్నం (మనసులోమాట) జూలై 10:**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కోహెడలో చేపల ఎగుమతుల కేంద్రం ఏర్పాటు తెలంగాణ మత్స్యరంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సముద్రతీర ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఆధునిక మంచినీటి చేపల ఎగుమతి కేంద్రం ఏర్పాటు





కావడం విశేషమన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకారుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోహెడలో విలువైన భూమిని మత్స్యకారుల అభివృద్ధి కోసం కేటాయించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ ప్రాంతానికి మరో రూ.50 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టును మంజూరు చేయాలని మంత్రిని కోరగా, దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రాజెక్టు సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.




# శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర 2026 విజయవంతానికి సమన్వయ సమావేశం

**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:**

రానున్న శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర - 2026 ఏర్పాట్లను సమీక్షించేందుకు మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ విశ్వకర్మ ఫంక్షన్ హాల్‌లో ఒక ఉన్నత స్థాయి సమన్వయ (కన్వెర్జెన్స్) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) కుమారి రక్షిత కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) చ. శ్రీధర్, మహంకాళి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. రవికుమార్ లతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశానికి ఉజ్జయిని మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు, పలహారం బండి, తొటెల నిర్వాహకులు, వెల్కమ్ స్టేజ్ నిర్వాహకులు మరియు ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బోనాల జాతరను అత్యంత వైభవంగా, సురక్షితంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకోవాల్సిన ముఖ్యమైన ఏర్పాట్లు, ముందస్తు భద్రతా చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి అన్ని శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని డీసీపీ పేర్కొన్నారు. నిర్దేశిత పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ సందర్భంగా అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

# చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

- **జూలై 18న ప్రత్యేక లోక్ అదాలత్.. రాజీ ద్వారా శాశ్వత పరిష్కారానికి అవకాశం**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**

చెక్ బౌన్స్ కేసుల్లో ఇరుపక్షాలు రాజీ మార్గాన్ని ఎంచుకుని వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా రంగంపల్లిలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 1,659 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 476 కేసుల్లో వారెంట్లు జారీ అయినట్లు వెల్లడించారు. వారెంట్లు జారీ అయిన వ్యక్తులు కూడా భయపడకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని



సూచించారు. జూలై 18న నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఇరువర్గాల పరస్పర అంగీకారంతో చెక్ బౌన్స్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఒకేసారి మొత్తం మొత్తాన్ని చెల్లించలేని వారికి విడతల వారీగా చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రుణగ్రహీతలు సంబంధిత బ్యాంకు అధికారులతో చర్చించి రాజీకి రావచ్చని, అవసరమైన సందర్భాల్లో రాయితీలు కూడా లభించే అవకాశం ఉందన్నారు. యూనియన్ బ్యాంక్ సహా పలు చిట్‌ఫండ్ సంస్థలకు సంబంధించిన చెక్ బౌన్స్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని న్యాయవాదులకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ, తమ క్లయింట్లకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రజలు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోర్టు ఖర్చులు, సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పిలుపునిచ్చారు.

# ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

- **19, 26వ వార్డుల్లో పర్యటన.. శానిటేషన్ పనుల పరిశీలన, అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**

పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఇంటి యజమాని బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పిలుపునిచ్చారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 19, 26వ వార్డులను సందర్శించిన ఆయన స్థానిక కౌన్సిలర్లతో కలిసి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, గత నెల రోజులుగా అన్ని వార్డులను సందర్శిస్తూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కొంతమంది ఇంటి చెత్తను మురుగు కాలువల్లో వేయడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు తప్పనిసరిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సహకారంతో ఇటీవల 19వ వార్డులో రూ.1.87 కోట్లతో, 26వ వార్డులో రూ.46 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నల్లాల పద్మ, నల్లాల సురేష్, సుధమల్ల అభిషేక్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, సురేందర్, వార్డు అధికారులు సురేష్ నాయక్, సురేష్, జవాన్లు చిన్న, వేణులాల్, ఎలక్ట్రీషియన్ పులిపాక నరేష్, వాటర్ సప్లై సిబ్బంది మహేష్, మెప్మా ఆర్పీ హసీనా, ఆశా వర్కర్ తిరుమల, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యారంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎస్ఎఫ్ఐ ఆరోపణ

- విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.. విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

**మంథని (మనసులోమాట) జూలై 10:**




రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపులో భాగంగా గురువారం మంథని కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. ఇప్పటికీ రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకే పరిమితం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నంబర్లు 7, 8, 9లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయాలను నియంత్రించాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి తగిన నిధులు కేటాయించాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్‌కుమార్, నాయకులు తిరుపతి, రాకేష్, అవినాష్, సాయి, సుమన్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారుల కోసం..



- **60 యూనిట్ల రక్తం సేకరించిన జైభారత్ సంస్థ**

**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 10:**

తలసేమియా బాధిత చిన్నారుల కోసం జైభారత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీనగర్ లోని విజయ విహారం ఖల్సా భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఖదిజ్ఞాసి ఆత్మ సమర్పణ దీక్ష-2026, దీక్షా విరమణ దినం సందర్భంగా జైభారత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఆజాద్ షేక్ 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయవిహారం రమణమూర్తి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు ప్రతి నెల రెండు సార్లు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న వారికి రక్తదానం జీవనాధారంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని అన్నారు. జైభారత్ జాతీయ కార్యదర్శి రజని మాట్లాడుతూ ఒక్క యూనిట్ రక్తం ఒక తలసేమియా చిన్నారి ప్రాణాలను కాపాడగలదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా జైభారత్ తలసేమియా చిన్నారుల కోసం నిరంతరంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. ఖాదీ-2026 మహా ప్రవర్తక్ యోధ వంశీ కూడా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించి, యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభారత్ రాష్ట్ర నాయకులు స్వాతి, దుర్గారెడ్డి, రాజు, లక్ష్మి, ఉమా, లక్ష్మేశ్వర్, రాహెల్ ఖాన్, మల్లికా వల్లభ, బెనజీర్, సత్యనారాయణ గోల, తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్ లో అరుదైన శస్త్ర చికిత్స.. 4 కిలోల కణితి తొలగింపు

**హుజూరాబాద్ (మనసులోమాట) జూలై 10:**



హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఓ మహిళ కడుపు నుంచి సుమారు 4 కిలోల బరువున్న భారీ కణితిని (ట్యూమర్) వైద్యులు శస్త్రచికిత్స ద్వారా సురక్షితంగా తొలగించి ప్రాణాలు కాపాడారు.

**దీర్ఘకాలిక నొప్పితో నరకయాతన..**

హన్మకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల కొమరమ్మ అనే మహిళ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. రోజురోజుకూ కడుపు ఉబ్బిపోతుండటం, నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి రావడంతో స్థానికంగా పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించింది. అయితే అక్కడ పరీక్షల నిమిత్తం, ఆపరేషన్ కోసం భారీగా ఖర్చవుతుందని చెప్పడంతో.. అంత ఆర్థిక స్తోమత లేక ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం మెరుగైన చికిత్స నిమిత్తం ఆమె హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ (ఏరియా) ఆసుపత్రిని ఆశ్రయించింది.

**రంగంలోకి దిగిన నిపుణుల బృందం..**

ఆసుపత్రికి వచ్చిన కొమరమ్మకు వైద్యులు స్కానింగ్ సహా పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆమె కడుపులో ఒక భారీ కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అది ప్రాణాపాయంగా మారే అవకాశం ఉండటంతో తక్షణమే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలోని నిపుణులైన వైద్యుల బృందం శుక్రవారం ఉదయం ఈ క్లిష్టమైన సర్జరీని ప్రారంభించింది. గంటలపాటు శ్రమించిన వైద్య బృందం.. రోగి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా, అత్యంత జాగ్రత్తగా సుమారు 4 కిలోల బరువున్న భారీ కణితిని బయటకు తీశారు.

**రోగి పరిస్థితి నిలకడగా ఉంది...**

"శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం సదరు మహిళా రోగి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉంది. ఆమె వేగంగా కోలుకుంటున్నారు. త్వరలోనే ఆమెను డిశ్చార్జ్ చేస్తాం." అని ఆర్ఎం ఓ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

**వైద్య బృందానికి ప్రశంసల జల్లు..**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ఇలాంటి అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను ఉచితంగా, విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందాన్ని డిసిహెచ్ కృష్ణ ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీందర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఇక్కడ మరిన్ని క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఉచితంగా ఆపరేషన్ చేసి తమ కుటుంబంలో వెలుగులు నింపిన వైద్యులకు, ప్రభుత్వానికి బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

## హోటళ్లపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులు

**హాలియా (మనసులోమాట) జూలై 10:**

హాలియాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తనిఖీల్లో వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పలు హోటళ్ల నుంచి మొత్తం 10 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు పౌరసరఫరాల డీటీసీఎస్ ముక్తార్ తెలిపారు. అనంతరం సంబంధిత ఐదుగురు హోటల్ యజమానులపై 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు** చేసి, స్వాధీనం చేసుకున్న సిలిండర్లను స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు వెల్లడించారు. రెస్టారెంట్లు, హోటళ్లలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను ఉపయోగించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో దేవరకొండ డీటీసీఎస్ సయ్యద్ మూబిముల్లతో పాటు పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# '420' హామీలతో కాంగ్రెస్ దగా చేసింది

**గంగాధర (మనసులోమాట) జూలై 10:**



ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వాటిని అమలు చేయకుండా '420 పార్టీ'గా మారిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ఆ పార్టీని గద్దె దించే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. శుక్రవారం గంగాధర మండల కేంద్రంలో బీజేపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగ భృతి అమలు చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. జిల్లాలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. 'బీఆర్ఎస్ కాంగ్రెస్ దొందూ దొందే' అని విమర్శించారు. మరోవైపు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెస్తున్న జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ, ఈజీఎస్ నిధులతోనే కరీంనగర్ జిల్లా ముఖచిత్రం మారుతోందని కొనియాడారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానాన్ని మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, డిప్యూటీ మేయర్ సునీల్ రావు బలపరిచారు. కిసాన్ మోర్చా నేత సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రవేశపెట్టిన వ్యవసాయ తీర్మానాన్ని మేయర్ కోలగాని శ్రీనివాస్, బత్తుల లక్ష్మీనారాయణ బలపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదుపుతప్పి బైక్ బోల్తా



**మునగాల/కోదాడ (మనసులోమాట) జూలై 10:**

సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన షేక్ అజ్మల్, సమీర్‌లు నడిగూడెంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి కోదాడకు వస్తుండగా మునగాల మండల పరిధిలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై బలంగా పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్యశాలకు తరలించినట్లు తెలిసింది. వైద్యులు ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి కూడా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. అధిక వేగంతో ప్రయాణించడం, బైక్‌పై నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.

# సహకార సంఘాలు పారదర్శకంగా సేవలు అందించాలి

**రాజాపేట (మనసులోమాట) జూలై 10:**



రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) రైతులకు మరింత చేరువై పారదర్శకంగా సేవలు అందించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం రాజాపేటలో రేణికుంట పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన సేవలు అందించడం సహకార సంఘాల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాల సరఫరా, పంట రుణాల మంజూరు, ధాన్యం కొనుగోలు వంటి సేవలను సమర్థవంతంగా నిర్వహించి రైతులకు అండగా నిలవాలని సూచించారు. నూతన పాలకవర్గం రైతుల విశ్వాసాన్ని నిలబెట్టుకుని సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, డైరెక్టర్లు గుజ్జుక బాలరాజు, జంగా లక్ష్మి, భూక్య మన్య, కోరే మల్లయ్య, రాపోలు నారాయణరెడ్డి, మసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోటగిరి సంతోష్, జూకంటి వీరయ్య, గుడిసెల నరసింహులు, చెట్కూరి గౌరయ్య, చెక్కల బాలయ్య, చిగుళ్ల చంద్రపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజానాయకులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోజన శాలలు ఇలా.. భోజనం చేసేది ఎలా..!

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తోంది. పాఠశాల విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు చేస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన అందించాలనే దృఢ సంకల్పంతో పాఠశాలలలో విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు సౌకర్యంగా ఉండేందుకు డైనింగ్ హాల్ లను మంజూరు చేసింది. మన ఊరుమన బడి పథకం ద్వారా పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల హై స్కూల్ తో పాటు మండలంలోని వెదురుగట్ల, గుమ్మాపూర్, రాగంపేట ప్రభుత్వ పాఠశాలలలో డైనింగ్ హాల్ లను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వాటి నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నిలిచి పోయిన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకొని వినియోగంలోకి తీసుకురాక అవి నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే విద్యార్థులకు ఎంతో సదుపాయమని భావించి లక్షల నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన అవి ఉపయోగానికి దూరంగా ఉన్నాయి.

**భోజన సమయంలో విద్యార్థుల తిప్పలు..**

డైనింగ్ హాల్ లు ఉపయోగపడక విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల బెడద నుంచి రక్షణ,ఎండకు ఉపశమనం, గాలి వీచినప్పుడు దుమ్ము, వర్షం కురిసినప్పుడు సమస్యలు లేకుండా పరిశుభ్రతతో క్రమపద్ధతిలో విద్యార్థులు ఒకే చోట భోజనం చేయడానికి డైనింగ్ హాల్ లు దోహదం చేస్తాయి. అయితే ఈ అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్ లను వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**డైనింగ్ హాల్‌ను ప్రారంభించాలి: అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ అనుజ**

విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు ఉంటాయని భావించి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో పాఠశాలల్లో హాజరు శాతం పెరుగుతున్నాయి. విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మించిన డైనింగ్ హాల్ ను ప్రారంభించడానికి అధికారులు కృషి చేయాలని కోరుతున్నాం.

**వర్షంతో విద్యార్థులకు ఇబ్బందులు: కడారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్, చొప్పదండి**

భోజన శాల పూర్తి కాకపోవడంతో అందులో భోజనం చేస్తున్న సమయంలో వర్షం వస్తే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాల్ ను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసి అవసరమైన సామగ్రి సమకూర్చుతే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థుల సౌకర్యం కోసం దాతల సహాయంతో ఫ్యాన్ లు ఏర్పాటు చేశాం.

**నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది: జలీల్, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్**

డైనింగ్ హాల్ పూర్తి స్థాయిలో నిర్మాణం అయింది. నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ డైనింగ్ హాల్ ప్రాంతంలో ప్రహరీ గోడ లేనందున ఆ వైపు నుంచి మూత్ర విసర్జనకు లోనికి ప్రవేశించి అపరిశుభ్రత చేస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశాం.

# హైదరాబాద్ ఆశాడ బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున తెహజీబ్‌కు ప్రతీక

- పండుగల సందర్భాల్లో హిందూ, ముస్లిం సమాజాల పరస్పర సహకారం,
- వారు ప్రదర్శించే లౌకిక స్ఫూర్తి యావత్ దేశానికి గొప్ప సందేశాన్ని ఇస్తున్నది
- జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఆషాడ బోనాల ఉత్సవాల్లో తొలి బోనం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనయితీ
- భక్తులు సంతోషంగా అమ్మవారిని దర్శించుకుని, నిండు మనసుతో ప్రభుత్వాన్ని దీవించి,
- సంతృప్తిగా ఇళ్లకు తిరిగి వెళ్లేలా అన్ని ప్రభుత్వ శాఖలు కలసికట్టుగా పని చేయాలి
- దైవానికే అంకితమైన శివసత్తులకు బోనాల సమర్పణలో అన్ని శాఖలు సహకరించాలి
- గోల్కొండ కోటలో జరిగిన జగదాంబికా మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం
- అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఆషాడ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్ ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:**

హైదరాబాద్ లో ప్రతి ఏటా నిర్వహించే ఆశాడ బోనాల ఉత్సవాలు ఇక్కడి గంగా జమున తెహజీబ్ ప్రత్యేకతను చాటుతాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణ, ముస్లిం పండుగల సందర్భాల్లో హిందూ, ముస్లిం సమాజాల పరస్పర సహకారం, వారు ప్రదర్శించే లౌకిక స్ఫూర్తి యావత్ దేశానికి గొప్ప సందేశాన్ని ఇస్తున్నదని మంత్రి అన్నారు. శుక్వారారం హైదరాబాద్ లోని గోల్కొండ కోటలోని జగదాంబికా అమ్మవారి దేవస్థానంలో మంత్రి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, జిహెచ్ఎంసి, ఐ అండ్ పి ఆర్ తదితర శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గోల్కొండ జగదాంబికా అమ్మవారి చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఆషాడ బోనాల ఉత్సవాల్లో తొలి బోనం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనయితీగా వస్తున్నదని అన్నారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే గోల్కొండ బోనాల ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జూలై 16న లంగర్ హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి బోనం సమర్పణ, తొట్టెలు రథం ఊరేగింపు, మెట్ల పూజకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గోల్కొండ



జగదాంబిక మహంకాళి అమ్మవారికి జూలై 16, 19, 23, 26, 30, ఆగష్టు 2,6,9,13 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక, ప్రత్యేక బస్సులు తదితర ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. దేవాలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.

**భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగకుండా ..**

గోల్కొండ కోట పరిధిలోని రహదారులు, మెట్లు, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లు, సూచిక బోర్డులు, షెడ్లు తదితర సౌకర్యాలు ముందుగానే సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. అలాగే భక్తుల దర్శనం సాఫీగా సాగేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాలు కొనసాగినన్ని రోజులు పోలీస్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అనుమానితుల ఫొటోలతోకూడిన వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. జిహెచ్ఎంసి కాలపరిమితిని నిర్దేశించుకుని పనులు సకాలంలో పూర్తి చేయాలని మంత్రి నిర్దేశించారు. విద్యుత్ శాఖ కరెంటు వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి హెచ్చరించారు. పరిశుభ్రత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధులు గర్భిణీలు బాలింతల విషయంలో అన్ని శాఖలు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దైవానికే అంకితమైన శివసత్తులకు బోనాల సమర్పణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సహకరించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు సంతోషంగా అమ్మవారిని దర్శించుకుని, నిండు మనసుతో ప్రభుత్వాన్ని దీవించి, సంతృప్తిగా ఇళ్లకు తిరిగి వెళ్లేలా అన్ని ప్రభుత్వ శాఖలు కలసికట్టుగా పని చేయాలని మంత్రి ఆదేశించారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని పేర్కొన్న మంత్రి రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలా కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఆషాడ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్ ను మంత్రి ఆవిష్కరించారు. గోల్కొండ జగదాంబికా అమ్మవారి దేవస్థానానికి వచ్చిన మంత్రి కొండా సురేఖకి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. జగదాంబికా అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సమృద్ధిగా వర్షాలతో, పాడిపంటలతో పచ్చగా వుండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి అమ్మవారిని ప్రార్థించారు.

## పెద్దపల్లిలో దారుణం.. భార్య చేతిలో భర్త హత్య!



**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబపూర్ (కాశిపల్లి) గ్రామంలో కుటుంబ కలహాలు విషాదాంతానికి దారితీశాయి. భర్త వేధింపులను తట్టుకోలేక భార్య అతనిపై దాడి చేయడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కదంబపూర్ (కాశిపల్లి) గ్రామానికి చెందిన సయ్యద్ గోరేమియాకు ఆయన భార్య గోరేబీతో గత ఏడాది కాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గోరేమియా కొంతకాలంగా జగిత్యాలలో నివసిస్తూ, రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన గోరేమియా మరోసారి భార్యతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వేధింపులను తట్టుకోలేక గోరేబీ మట్టి పెల్లలతో భర్త తలపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాల కారణంగా గోరేమియా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి గోరేబీతో పాటు ఆమె కుమారుడు సయ్యద్ అలీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో కుటుంబ వేధింపుల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- 33, 19వ వార్డుల్లో ప్రత్యేక తనిఖీ.. మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుకు ఆదేశాలు

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**



జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని పెద్ద మసీదు సమీపంలోని 33వ వార్డు భారత్‌నగర్, 19వ వార్డు బండారికుంట ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రత్యేక నమోదు ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను సేకరిస్తున్న సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడంతో పాటు అవసరమైన సహాయం అందించేందుకు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు మున్సిపల్ సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సమైక్య సంఘాల సభ్యుల సహకారంతో ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కారించండి



- ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డికి డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల వినతి పత్రం
- సమస్యల పరిష్కారానికి హామీ

హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:

ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి విద్యాసాగర్‌ను కలిసి కళాశాలలు ప్రారంభమై నెలరోజులు గడిచినా గెస్ట్ లెక్చరర్ల రెన్యువల్ ప్రక్రియ, కొత్త నోటిఫికేషన్ విడుదలలో జాప్యం కారణంగా విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర ఈశ్వర్ లాల్‌తో పాటు నరేందర్, శ్రీనివాసులు కలిసి వివరించారు. గత పదేళ్లుగా గెస్ట్ లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతినిధులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేనతో ఫోన్‌లో మాట్లాడి గెస్ట్ లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ స్పందిస్తూ, ఉన్నత విద్యాశాఖ కమిషనర్, కార్యదర్శి నుంచి తగు సూచనలతో కూడిన ప్రతిపాదనలు అందితే వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు. గెస్ట్ లెక్చరర్ల ప్రధాన డిమాండ్లలో ప్రతి సంవత్సరం కొత్త నోటిఫికేషన్, త్రీమెన్ కమిటీ ద్వారా డెమో నిర్వహించే విధానాన్ని రద్దు చేసి గత విద్యా సంవత్సరంలో పనిచేసిన వారినే రెన్యువల్ చేయడం, పీరియడ్‌లు, యూనివర్సిటీ అల్మానక్‌కు అనుసంధానమైన వేతన విధానాన్ని రద్దు చేసి అకాడమిక్ ఇయర్ మొత్తం ప్రతి నెల రూ.50 వేల కన్సాలిడేటెడ్ గౌరవ వేతనం చెల్లించడం ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర ఈశ్వర్ లాల్‌తో పాటు నరేందర్, శ్రీనివాసులు, తారా వెంకటేష్, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాజు, నరసయ్య, కురుమూర్తి, నాగలక్ష్మి, సుధాకర్, ప్రదీప్, కృష్ణయ్య, వెంకట్, దశరథం, మంగళ్ దాస్, శంకరయ్య, రాహుల్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

- ఆర్టీసీ, రవాణా అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:



జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ, శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవీ లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మెన్ వై.నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణ లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా (తెలంగాణ ఎర్త్ వైడ్) ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, నాయకులు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల నాటి కాలువ సమస్యకు పరిష్కారం..

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. వార్డు సందర్శనలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి

రామగుండం (మనసులోమాట) జూలై 10:



ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న దీర్ఘకాలిక సమస్యలను వార్డు సందర్శనల ద్వారా గుర్తించి పరిష్కరిస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 23వ డివిజన్ ప్రగతి నగర్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ కాలువ నుంచి వచ్చే నీరు ఎన్‌టీపీసీ ప్రహరీ గోడ సమీపంలో అనేక సంవత్సరాలుగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ బెంద్రం సునీత-రాజిరెడ్డి మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన మేయర్ ఆదేశాల మేరకు జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో కాలువలో పెరిగిన చెట్ల గుబుర్లు, చెత్తను తొలగించి కాలువను పూర్తిగా శుభ్రం చేశారు. అనంతరం ఎన్‌టీపీసీ పీటీఎస్ పరిధిలోని డ్రెయిన్‌తో కాలువను అనుసంధానం చేయడంతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన నీరు సాఫీగా ప్రవహించడం ప్రారంభమైంది. మేయర్, కమిషనర్ స్వయంగా పీటీఎస్ పరిధిలోకి వెళ్లి అక్కడి డ్రెయిన్‌ను కూడా పరిశీలించి, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో ప్రగతి నగర్ నుంచి వచ్చే కాలువకు ఎలాంటి ఆటంకం లేకుండా నీటి ప్రవాహం పునరుద్ధరించబడింది. ఈ పరిణామంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఎన్‌టీపీసీ అధికారులు ఏర్పాటు చేసిన గ్రిల్స్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో కాలువ మూసుకుపోయి వర్షాకాలంలో ప్రగతి నగర్ ఇళ్లలోకి నీరు చేరే పరిస్థితి ఏర్పడేదని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా కాలువ వద్ద అవసరమైన పైపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారని చెప్పారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ చేపట్టిన పూడిక తొలగింపు కార్యక్రమాలతో వర్షాకాల ముంపు ప్రమాదం గణనీయంగా తగ్గిందని మేయర్ పేర్కొన్నారు. నగర ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ సీసాలు, చెత్తను కాలువల్లో వేయకుండా మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కాలువల నిర్వహణలో ఎన్‌టీపీసీ అధికారులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, టీపీఎస్ నవీన్, జూనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డి, శానిటరీ జవాన్ సంపత్, ఎకో వారియర్స్ కన్సల్టెన్సీ బృంద సభ్యులు స్వరూప్, మహేంద్ర, వాటర్ సప్లై సూపర్‌వైజర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ బోనాల పండుగకు ముందు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:

పెద్దమ్మ బోనాల పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఉన్న పెద్దమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో దేవాలయం పరిసరాల్లో విస్తృతంగా శుభ్రత పనులు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 1వ వార్డు కౌన్సిలర్ పురేళ్ల శైలజ-సుధాకర్ పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పెరిగిన పొదలను తొలగించి భక్తుల రాకపోకలకు అనువుగా మార్గాలను శుభ్రపరిచారు. బోనాల పండుగ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ఈ చర్యలను స్థానిక ప్రజలు, భక్తులు అభినందిస్తూ, పండుగకు ముందే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



**హుజూర్ నగర్ టౌన్ (మనసులోమాట) జూలై 10:**

రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో రూ.125 కోట్లతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల మోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లుల్లో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని, రాష్ట్ర విభజన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసినదని, తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల, కృషి, ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం అని, దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు. ఇందులో 10 కోట్లతో 32 వేల స్క్వేర్ ఫీట్ సైజ్ లో తెలంగాణ మోడల్ పబ్లిక్ బోర్డింగ్ స్కూల్ నిర్మాణం చేపట్టమన్నారు. ఇందులో 2,500 మంది హౌసింగ్ కాలనీ, హుజూర్ నగర్ లోకల్ పేద విద్యార్థులు చదువుకోడానికి వీలుంటుందని పూర్తిగా ఇంగ్లీష్ మీడియం లోనే విద్యాభ్యాసం ఉంటుందని మంత్రి అన్నారు. కాలనీలో గ్రీనరీ పెంచాలని అలాగే జిల్లాలోని హౌసింగ్ సిబ్బందితో ప్రతి ప్లాటు క్షుణ్ణంగా చెక్ చేసి, అన్ని పనులు పూర్తి అయినవో, ఇంకా ఏమైనా పెండింగ్లో ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ కు సూచించారు. ఒకే ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన ఇద్దరు పిల్లలు ఉంటే వారికి అదనంగా ఇంకో ప్లాటు మంజూరు చేయాలని, బాత్రూం, టాయిలెట్స్ చిన్నవిగా ఉన్నందువలన ఎవరైనా అతిథులు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది. కావున కాలనీలో బయట వైపు అదనంగా టాయిలెట్స్, బాత్రూమ్స్ మున్సిపాలిటీ వారితో నిర్మించి, వారికే మెయింటినెన్స్ అప్పగించాలని, ప్రతి హౌసింగ్ బ్లాక్ కి మూడు రంగులు స్పష్టంగా కనబడే విధంగా మరొక కోటింగ్ వేయించాలని, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోకి ప్రవేశించటానికి ప్రస్తుతం ఒకే రోడ్డు ఉన్నదని అదనముగా మరొక రోడ్డును కూడ వేయించడం జరుగుతుందని తెలిపారు. మోడల్ హౌసింగ్ కాలనీ అంటే మోడల్ గా క్వాలిటీ బ్రహ్మాండంగా ఉండాలని, అర్హులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయాలని, అర్హత లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లు మంజూరు చేయకూడదని ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించిన తర్వాత జనాభాను బట్టి వార్డులుగా విభజించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత, డీఎస్ఓ మోహన్ బాబు, హార్టికల్చర్ అధికారి నాగయ్య, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి వైభవం.. బోనాల జాతర

- **పిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
- **బోనాలు సమర్పించేందుకు తరలివచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి**
- **విఐపి, వివిఐపిలకు దర్శనం కల్పించడంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన కార్యాచరణను అమలు చేయండి**
- **సీఎం రేవంత్ రెడ్డి ఈ యేడాది బోనాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించడం హర్షణీయం**
- **సీఎం సూచనలకు అనుగుణంగా ఈ యేడాది బోనాల ఉత్సవాలను దేదీప్యమానంగా నిర్వహించాలి**
- **సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సన్నాహక సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:**

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే బోనాల జాతర రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రోజు సికింద్రాబాద్ లోని ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ బోనాల జాతర ఏర్పాట్లపై దేవాదాయశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సురేఖ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతర ఏర్పాట్లపై మంత్రి సురేఖకి వివరించగా, మంత్రి వారికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, డిసిపి (సికింద్రాబాద్ జోన్) రక్షితా కృష్ణ మూర్తి, అడిషనల్ డిసిపి (ట్రాఫిక్) రాములు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, డిసి వినోద్ రెడ్డి, ఎసిలు మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, జిహెచ్ఎంసి, ఐ అండ్ పిఆర్, వైద్యారోగ్యశాఖ, ఆర్ అండ్ బి, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ, టిజిఆర్టిసి తదితర శాఖలకు చెందిన అధికారులు, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ కోట నీలిమ, దేవాలయ కమిటి సభ్యులు, దక్కన్ మానవ సేవా సమితి, నల్లగుట్ట అభివృద్ధి సంఘం, మున్నూరు కాపు సంఘం, ఆర్యవైశ్య సేవా సమితిలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బోనాల జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. బోనాల జాతర సందర్భంగా జూలై 19న ఘటం ఎదుర్కోలు, ఆగస్టు 2న బోనాల ఉత్సవాలు, ఆగస్టు 3న రంగం (భవిష్యవాణి), గజారోహణ మహోత్సవం కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. ఈ నెల



19 న ఘటోత్సవముల ప్రారంభం నుంచి ఆగష్టు 3న రంగం కార్యక్రమం వరకు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరాంగ తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖకు సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, దివ్యాంగులకు, పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక క్యూ లైన్లు, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. బోనాల ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు, బోనాలు సమర్పించేందుకు వచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్, సులభ దర్శనం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బోనాల ఉత్సవాల్లో వారి నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. “ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది” అని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, పూలతో సుందరంగా తీర్చిదిద్దాలని, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాలు, పటిష్ట పోలీసు బందోబస్తు వంటి అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే పరిస్థితుల్లో, బోనాల సమర్పించేందుకు భక్తులు తీసుకువచ్చే దీపాల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అన్ని దేవాలయాల వద్ద తగిన అగ్నిమాపక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా దేవాదాయ శాఖ భక్తులకు లడ్డూలు, వడలు, పులిహోర ప్రసాదాలను నిరంతరాయంగా అందుబాటులో ఉంచాలని, సమాచార, ప్రసార సంబంధాల శాఖ జాతర ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిరంతరాయంగా లైవ్ ప్రసారాలు చేపట్టాలని, దేవాలయ పరిసరాల్లో స్క్రీన్ లు ఏర్పాట్లు చేసి ప్రత్యక్ష ప్రసారాలు చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంత రావు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేసి జాతరను దిగ్విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలీసుశాఖతో పాటు ఇతర శాఖలు బోనాల ఉత్సవ బాధ్యతను విధులుగా పరిగణించకుండా అమ్మవారికి సేవగా భావించి నిర్వర్తించాలని డిసిపి రక్షితా కృష్ణ మూర్తి పిలుపునిచ్చారు. సాంస్కృతిక శాఖ చేపట్టనున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆ శాఖ డైరెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం తదితర సంస్థల ప్రతినిధులు చేసిన సూచనలను కార్యరూపంలోకి తీసుకురావలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. సన్నాహక సమావేశం కోసం దేవాలయానికి చేరుకున్న మంత్రి సురేఖకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి సురేఖ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సన్నాహక సమావేశం తర్వాత మంత్రి అధికారులతో కలిసి ఉజ్జయిని మహంకాళి బోనాల పోస్టర్ ను ఆవిష్కరించారు.

# క్రీడలు మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరం
# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



**సికింద్రాబాద్ (మనసులో మాట) జూలై 10:**
క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. విజయపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు, ప్రోత్సాహం కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. నగరంలో ఆధునిక క్రీడా వసతులు పెరగడం ఆనందదాయకమని, పికిల్ బాల్ వంటి కొత్త క్రీడలపై యువత ఆసక్తి చూపించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి క్రీడా కేంద్రాలు మరింత మందిని ఆరోగ్యవంతమైన జీవనశైలి వైపు ప్రోత్సహిస్తాయని చెప్పారు. క్రీడలను వినోదంగా మాత్రమే కాకుండా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ అలవాటుచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పికిల్ బాల్ కోర్టు యజమాని షెహజాన్ ముహమ్మద్, అఫ్సర్ రియాజ్, రాజా, జునీద్, శాంసన్, మూర్తి, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణిలో
# 247 దరఖాస్తులు



- దరఖాస్తులు స్వీకరించిన ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్
- సీఎం ప్రజావాణిని సందర్శించిన క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

**హైదరాబాద్ (మనసులో మాట )జులై 10:**
మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 237వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 247 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 120, రెవెన్యూ శాఖకు సంబంధించి 45, హోం శాఖకు 17 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.సీఎం ప్రజావాణిని సందర్శించిన క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ సందర్శించారు. సీఎం ప్రజావాణి, ప్రవాసి సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కాగా డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్స్ తమకు ఫిక్స్డ్ గౌరవ వేతనం ఇప్పించాలని, ఎడాదికి పది నెలలు పని దినాలు కల్పించాలని కోరారు.స్పోర్ట్స్ కోటా కింద స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చిన్నారెడ్డి, విద్యా సాగర్ కృషి చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సమన్వయ వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, ప్రతినిధి పద్మారాణి కర్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు
## శ్రీకారం.. అక్టోబర్ 1న తుది జాబితా విడుదల

- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే.. జూలై 31న ముసాయిదా జాబితా..
- ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ ఫారమ్ సమర్పణకు అవకాశం.




**హైదరాబాద్, జూలై 10(మనసులో మాట ):**
భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ సర్ ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. జూన్ 25 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగియనుంది. తరచూ వలసలు, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు కావడం, మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం వంటి లోపాలను సరిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీ ఎల్ వో లు) ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేసి తిరిగి సేకరిస్తారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించి ఫారమ్‌ను పూర్తి చేసి బ్లాక్ కు అందజేయాలి. ఇంట్లో ఎవరూ లేకపోతే కుటుంబంలోని వయోజన సభ్యుడు కూడా ఫారమ్‌ను నింపి సమర్పించవచ్చు. ఎన్యుమరేషన్ ఫారమ్‌ను voters.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించే అవకాశం కల్పించారు. నమోదిత మొబైల్ నంబర్ లేదా EPIC నంబర్‌తో లాగిన్ అయి OTP ధృవీకరణ అనంతరం ఫారమ్‌ను అప్లోడ్ చేయవచ్చు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుండగా, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణలు స్వీకరిస్తారు. చిరునామా మార్పులు ఫారం 8 ద్వారా, కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు. అన్ని అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుంది. ఎన్యుమరేషన్ ఫారమ్‌ను సమర్పించని ఓటర్ల విషయంలో గైర్హాజరు, మరణం, చిరునామా మార్పు లేదా బహుళ నమోదులపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అవసరమైన సమాచారం కోసం 1950 హెల్ప్‌లైన్, సంబంధిత BLO లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

# ఆశలు పదింతలు!



**ఖమ్మం (మనసులో మాట) జూలై 10:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో హామీలపై ప్రజల ఆసక్తి వ్యవసాయ, పారిశ్రామిక ఆధారిత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటు సాగునీరు, ఇటు ఖనిజ వనరులకు కొదవలేదు.. భూగర్భ గనులు, అటవీ ఉత్పత్తులు, ప్రకృతి అందాలు పుష్కలంగా ఉన్నా వాటిని పూర్తి స్థాయిలో ఉపాధి వనరులుగా మార్చే ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో సాగడం లేదు. కొన్ని దీర్ఘకాలిక సమస్యలూ అపరిష్కృతంగానే ఉంటున్నాయి. రైతులకు భరోసా ఇవ్వడానికి శుక్రవారం జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, ఉపాధి పరంగా వరాల జల్లు కురిపిస్తారని, సాగుకు దన్నుగా నిలిచి.. యువతకు ఊతమిచ్చేలా పథకాలు ప్రకటిస్తారని ఉభయ జిల్లాల ప్రజలు ఆశిస్తున్నారు.

# ప్రహరీ గోడపైకి దూసుకెళ్లిన కారు.. ముగ్గురికి తీవ్రగాయాలు



**శంకరపట్నం (మనసులో మాట) జూలై 10:**

ఓ కారు అదుపుతప్పి ప్రహరీ గోడపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హుజురాబాద్ మండలం పోతిరెడ్డి పేట నుంచి వీణవంక మండలం గన్ముకుల గ్రామానికి ఓ కుటుంబం కారులో బయలుదేరింది. శంకరపట్నం మండలం మెట్ పల్లి గ్రామ పంచాయతీ పరిధి వెంకటేశ్వర్ల పల్లి గ్రామానికి చేరుకోగానే.. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ఓ ఇంటి ప్రహరీ గోడపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో రమణారెడ్డితో పాటు రమ్య, చిన్నారి అన్విక్ తీవ్రంగా, మరో మహిళ అర్చనకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స కోసం హుజురాబాద్ లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. ప్రమాద సమయంలో రోడ్డుపై వాహనాలు, బాటసారులు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**భువనగిరి (మనసులో మాట) జూలై 10:**

నియోజకవర్గంలోని వలిగొండ మండలం సంగెం, ధర్మారెడ్డిపల్లి, గోకారం గ్రామాల పరిధిలో రూ.124 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ధర్మారెడ్డి కాల్వ పునరుద్ధరణ, పనుల నాణ్యత, కాల్వ వెడల్పు, లోతు, నీటి ప్రవాహానికి చేపట్టిన ఏర్పాట్లు, కాల్వను ఆనుకుని నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ధర్మారెడ్డి కాల్వ శిథిలావస్థకు చేరిందన్నారు. కాల్వలో మట్టి, రాళ్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. కాల్వ పక్కన ఉన్న రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రూ.124 కోట్ల నిధులతో కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాల్వలో అడ్డంకులను తొలగించి, చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పనులు చేపట్టామన్నారు.

# ఆగ్రహించిన అన్నదాత..
## కొనుగోలు కేంద్రంలో వరి కుప్పలకు నిప్పు

**కామారెడ్డి (మనసులో మాట) జూలై 10:**



"మా గోడు వినేవారు లేరు.. అధికారులు స్పందించడం లేదు.." అంటూ కామారెడ్డి జిల్లా రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 40 రోజులుగా ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి విసిగిపోయిన అన్నదాతలు.. ఏకంగా వరి కుప్పలకే నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. 40 రోజులుగా ఎదురుచూసినా పట్టించుకోని అధికారులు: రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలోని ఐకేపీ (IKP) వరి కొనుగోలు కేంద్రంలో ఈ ఉద్రిక్తత చోటుచేసుకుంది. రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి దాదాపు 40 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగలేదు. ఎండ తీవ్రతతో పాటు అకాలవర్షాలకు.. ధాన్యం పాడైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు కష్టాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అంతేకాకుండా అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహానికి లోనైన రైతులు.. కొనుగోలు కేంద్రంలోనే ఉన్న వరి ధాన్యం కుప్పలకు నిప్పంటించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు:**

వరి కుప్పల దహనం వార్త తెలియగానే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా సరఫరా అధికారి (DSO) వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ (DRDO) సురేందర్, డీపీఎం సాయిలు, డీఎం శ్రీకాంత్ తదితర ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో అత్యవసర చర్చలు జరిపారు. హమాలీల కొరత, లారీల లభ్యత లేకపోవడం వల్లే ధాన్యం తరలింపులో కొంత ఆలస్యం జరిగిందని అధికారులు రైతులకు వివరించారు.

**హామీతో శాంతించిన రైతులు:**

హమాలీల సమస్యలను తక్షణమే అధిగమించి.. త్వరలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. అయితే ధాన్యం కుప్పలకు నిప్పంటించడంపై డీఎస్ఓ వెంకటేశ్వర్లు రైతుల తీరు పట్ల కొంత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

# చిరుప్రాయం.. మోయలేని భారం



**నిర్మల్ అర్బన్ (మనసులో మాట) జూలై 10:**

పుస్తక సంచుల మోత విద్యార్థుల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది. అవసరమైన పుస్తకాలకు మించి అంటగడుతుండడంతో పిల్లల తల్లిదండ్రులు, పోషకులకు ఆర్థిక భారం కావడంతోపాటు చిన్నారులు మోయలేక వెన్నెముక సమస్యలకు దారి తీసేలా పరిస్థితులు నెలకొన్నాయి. సంచుల బరువు ఎంత ఉండాలనే నిబంధనలు ఉన్నా కొన్ని విద్యాలయాలు పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఈఆర్టీ ద్వారా ఆయా తరగతులకు పాఠ్యపుస్తకాలు ఎంత బరువు ఉండాలనే విషయంపై సూచనలివ్వడంతోపాటు రాష్ట్రంలోనూ ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ వెల్లడించిన విద్యా సంవత్సరం కాలసూచీలో నెలలో మూడో శనివారం రోజున (నో బ్యాగ్ డే) విద్యార్థులు సంచి లేకుండా పాఠశాలకు రావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దానిని పలు విద్యాలయాలు అమల్లోకి తీసుకురాని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాలు అనేకంగా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్నవీ ఉన్నాయి. అనధికారికంగా విక్రయ కేంద్రాలను నెలకొల్పడం, తమకు అనుకూలమైన దుకాణదారులతో ఒప్పందాలు చేసుకొని పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, సాక్సులు, టై అమ్మకాలు చేస్తున్నారు. ఐఐటీ, నీట్, తదితర పోటీ పరీక్షలకు తమ పాఠశాల ప్రత్యేకం.. ఈ పుస్తకాలు తప్పనిసరి అని చెబుతూ అధిక ధరలు కలిగిన, అవసరం లేని పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నారు. తీరా వాటిని బ్యాగుల్లో సర్దుకొని రోజు పాఠశాలకు తీసుకెళ్లడం, తిరిగి ఇళ్లకు తీసుకొస్తుండటంతో పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**తల్లిదండ్రుల పాత్ర కీలకం**

తల్లిదండ్రులు, పోషకులు పిల్లల సంచుల బరువుల విషయంలో, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు పరిశీలించడం అత్యంత కీలకం. అనవసర వస్తువులు బరువును పెంచే అవకాశం ఉంది. భోజన డబ్బా, నీళ్ల సీసాను వేరే సంచిలో ఉంచడం వంటివి చేయాలి. పాఠశాలలు సమయసారిణి రూపొందించి ఏ పుస్తకాలు అవసరం.. ఏవి తీసుకురావాలి.. అనే విషయాలను విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, పోషకులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనవసరంగా అంటగడుతున్న, పుస్తక సంచుల మోత విషయంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయాలి. అధిక బరువు కలిగిన పుస్తక సంచులతో విద్యార్థులకు అనేక ఆరోగ్య ఇబ్బందులు తలెత్తనున్నాయి. ప్రస్తుత రోజుల్లో రాక్‌సాక్ (వీపు మీద పెట్టుకునే) బ్యాగులనే ప్రోత్సహిస్తున్నారు. బరువుతో వెన్నెముక, నడుమునొప్పి వంటి సంబంధిత సమస్యలు రానున్నాయి. చికాకు పెరిగి చదువుపై ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. బరువు తక్కువ, బలహీనంగా ఉన్న వారికి మరింత ఇబ్బందికరం. ఏ రోజు ఏ పుస్తకాలు అవసరమో వాటినే సదరు పాఠశాలల వారు ముందుగా తెలియజేయడం అత్యంత కీలకం.

# ఇక్రిశాట్‌లో సీడ్ ట్రేడ్ ఇన్నోవేషన్ సమ్మిట్ ప్రారంభం..

## పాల్గొన్న 24 దేశాల ప్రతినిధులు



**పటాన్ చెరు (మనసులో మాట) జూలై 10:**

దేశంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, ప్రపంచ విత్తన వాణిజ్యంలో భారతదేశాన్ని ఒక ప్రముఖ కేంద్రంగా మార్చడానికి అధునాతన పరిశోధనలు, వాతావరణ మార్పులను తట్టుకునే సాంకేతికత అంతర్జాతీయ భాగస్వామ్యం ఎంతో అవసరమని పలువురు విధాన నిర్ణేతలు, శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ వేదికగా అసోచామ్ ఆధ్వర్యంలో "అడ్వాన్సింగ్ గ్లోబల్ సీడ్ ట్రేడ్, ఇన్నోవేషన్ & సస్టెనబుల్ అగ్రికల్చర్" అనే థీమ్‌తో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'ఇండియా సీడ్ ట్రేడ్ & ఇన్నోవేషన్ సమిట్ 2026' గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు 24 దేశాల ప్రతినిధులతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు విత్తన కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సును ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

**వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా..**

ఈ సందర్భంగా సునీల్ శర్మ మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడంలో వ్యవసాయ ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వ్యవసాయ భవిష్యత్తు అనేది కేవలం ప్రభుత్వం లేదా పరిశోధనా సంస్థల వల్లే సాధ్యం కాదని, రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, ప్రైవేట్ రంగాలు ఉమ్మడిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సాంప్రదాయ వ్యవసాయ విధానాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారానే స్థిరమైన, సంపన్నమైన భవిష్యత్తును నిర్మించగలమని ఆయన స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గిన ప్రస్తుత తరుణంలో, రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ కాలపరిమితి గల పప్పుధాన్యాలు, నూనెగింజలతో పాటు తృణధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచించారు.

**విత్తనాల లభ్యత లైసెన్సింగ్‌లో ఎన్నో సవాళ్లు..**

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ తన కీలక ఉపన్యాసంలో, భారతదేశం వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతి సాధించినప్పటికీ, సబ్సిడీలు, విత్తనాల లభ్యత లైసెన్సింగ్ వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ పరివర్తన అనేది కేవలం స్వయంసమృద్ధి కోసమే కాకుండా, వాతావరణ మార్పులను తట్టుకునేలా పోషకాలతో కూడిన పంటలను పండించేలా ఉండాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ ఆవిష్కరణలను భారతదేశానికి తీసుకురావడంలోనూ, భారతీయ సాంకేతికతలను ప్రపంచ దేశాలకు చేర్చడంలోనూ ఇక్రిశాట్ ఒక బలమైన వారధిగా పనిచేస్తుందని ఆయన వివరించారు. దేశంలో నాణ్యమైన విత్తనాలు, ఆరోగ్యకరమైన నేల ఉంటేనే రైతాంగం అభివృద్ధి చెందుతుందని ఆయన గుర్తుచేశారు. అసోచామ్ అగ్రికల్చర్ కౌన్సిల్ ఛైర్మన్ డా. వెంకట్రామ్ వసంతవాడ స్వాగతోపన్యాసం చేస్తూ, ప్రతి వ్యవసాయ విప్లవానికి విత్తనమే మూలాధారమని, అది రైతు శ్రేయస్సుకు పునాది అని అన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో విత్తన సాంకేతికత ప్రాధాన్యత మరింత పెరిగిందని చెప్తూ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి విత్తన మార్కెట్‌గా ఎదుగుతోందని వివరించారు. ఈ సదస్సులో భాగంగా అసోచామ్‌గ్రాంట్ థోర్న్టన్ భారత్ సంయుక్తంగా రూపొందించిన ఒక ప్రత్యేక నాలెడ్జ్ రిపోర్టును విడుదల చేశారు. అలాగే, విత్తన పరిశోధనలు, ఆవిష్కరణలలో విశేష కృషి చేసిన పలు సంస్థలకు, వ్యక్తులకు "సీడ్ ఎక్సలెన్స్ అవార్డులను" అందజేశారు. సదస్సులో భాగంగా రాబోయే రోజుల్లో 'విత్తన పరిశోధనల్లో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం' మరియు జీన్‌ఎడిటింగ్ వంటి నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతలకు సంబంధించిన నిబంధనలపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించనున్నారు.

# మహిళా బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి



**ఆదిలాబాద్ నేర విభాగం (మనసులో మాట) జూలై 10:**

భార్యాభర్తల వివాదాల పరిష్కారంలో సున్నితంగా వ్యవహరిస్తూ సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కార విధానం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళల రక్షణ, భద్రతకు ఉమెన్ పోలీస్ స్టేషన్ కీలకమని పేర్కొంటూ, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితుల్లో విశ్వాసం కలిగించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ.. కేసుల దర్యాప్తును నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఫణిదర్, ఏఎస్సైలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గరళం గాల్లోకి.. గస్తీ నిద్రలోకి



- **వేల పరిశ్రమలకు మూడే నిఘా వాహనాలు**

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 10:**

కోటిన్నరకు పైగా జనాభా, వేలాది పరిశ్రమలున్న మహానగరంలో పర్యావరణ పరిరక్షణ గాల్లో దీపంలా మారింది. నగరంలో పెరుగుతున్న వాయు, శబ్ద, జల కాలుష్యాన్ని అరికట్టడంలో పీసీబీ ఘోరంగా విఫలమవుతోంది. సిబ్బంది కొరత, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన నిఘా వ్యవస్థలో లోపాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాలుష్య తనిఖీల కోసం కేవలం మూడు ప్యాట్రోలింగ్ వాహనాలు మాత్రమే ఉన్నాయి.

**కారకులను పట్టుకోవడంలో విఫలం..**

చెంగిచెర్ల పరిసర నివాస సముదాయాల్లోని ప్రజలకు అర్ధరాత్రివేళల్లో ఘాటు వాసనలు ఊపిరిసలపనివ్వడం లేదు. స్థానికంగా ఉన్న కొన్ని ల్యాబ్‌లు, చిన్న తరహా రసాయన పరిశ్రమలు అనేకం ఉండడంతో రాత్రివేళ విష వాయువులను నిశ్శబ్దంగా గాల్లోకి వదులుతున్నారు. రసాయన వ్యర్థాల పారబోత నిత్యకృత్యంగా మారింది. ఓ రోజున కాలుష్య నియంత్రణ మండలి నైట్ ప్యాట్రోలింగ్ సిబ్బందికి స్థానికులు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఇదిగో వస్తున్నామంటూ చెప్పిన సిబ్బంది నాలుగు గంటలైనా ఘటనా స్థలికి చేరుకోలేదు. కారణం ఆ వాహనం మరో ప్రాంతంలో వచ్చిన ఫిర్యాదు తనిఖీల్లో ఉంది. అది పూర్తయి చెంగిచెర్లకు చేరుకోగా.. అప్పటికే వాసన రావడం ఆగిపోయింది. దీంతో కారకులను పట్టుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

**పది వాహనాలు అవసరం..**

రాత్రివేళ రసాయన ఘాటు వాసనలు వెదజల్లే పరిశ్రమలు, హానికర వ్యర్థాలను జలాశయాలు, డ్రైనేజీల్లో వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నైట్ ప్యాట్రోలింగ్ సిబ్బందిదే. తూతూమంత్రంగానే నిఘా ఉందన్న విమర్శలున్నాయి. పీసీబీ కేంద్ర కార్యాలయం హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయ పరిధిలో ప్రస్తుతం మూడు నైట్ ప్యాట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నాయి. 5 వేలకు పైగా పరిశ్రమలున్న రాజధాని పరిధిలో కనీసం 610 ప్యాట్రోలింగ్ వాహనాలు అవసరం.

# నిండుగా గంగమ్మ.. రైతన్నకు దిక్కేదమ్మా!





- కోట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో పంట విరామం

**వికారాబాద్, ధారూర్, (మనసులో మాట) జూలై 10:**

జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు కోట్‌పల్లి పరిధిలో కాలువల పనులు జరుగుతుండడంతో అధికారులు ఈ ఏడాది పంట విరామం ప్రకటించారు. ఒకవైపు వర్షాలు కురవక వరిసాగుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక జలాశయ పరివాహక ప్రాంతంలోనూ వరి సాగు చేసే అవకాశం లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టు పరిధి ధారూర్, పెద్దేముల్ మండలాల పరిధిలో 18 గ్రామాలకు సాగు నీరు ఇవ్వలేమని అధికారులు తేల్చేయడంతో ఏమీ చేయాలో పాలుపోవడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 9,200 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రస్తుతం 3 నుంచి 4 వేల ఎకరాలకే నీరు అందుతోంది.

**కాలువలు, తూములు శిథిలం కావడంతో..**

ప్రాజెక్టు కాలువలు, తూములు పూర్తిగా శిథిలం కావడంతో మరమ్మతులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.68 కోట్లను గతేడాది అక్టోబరులో విడుదల చేసింది. కుడికాలువ 24 కిలోమీటర్లు కాగా, దీని పరిధిలో నాగసమందర్, మంబాపూర్, మారేపల్లితండా తదితర 16 గ్రామాలు ఉన్నాయి. ఎడమ కాలువ పొడవు 6.8 కిలోమీటర్లు. దీని పరిధిలో రుద్రారం, గొట్టెపల్లి తదితర గ్రామాలున్నాయి. మూడోది బేబీ కెనాల్ దీని పొడవు దాదాపు 2.5 కిలోమీటర్లు. ఇది కుడికాలువకు ఆనుకుని ఉంటుంది. దానికింద కూడా వందల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

**50 శాతమే పనులు పూర్తి..**

ప్రాజెక్టు కింద అలుగు పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత ప్రధాన కాలువ పనులు కొనసాగుతున్నాయి. పనులు కాస్త నెమ్మదించినా.. ఇప్పటి వరకు దాదాపు 50శాతం పూర్తయ్యాయని అక్కడ విధులు నిర్వహించే పర్యవేక్షించే అధికారి సాయి 'ఈనాడు'కు తెలిపారు. ప్రస్తుతం నీరు విడుదల చేస్తే పనులకు ఆటంకం జరుగుతుందన్నారు. గతేడాది కూడా కలెక్టర్ నిర్ణయం మేరకు విరామం ప్రకటించామని చెప్పారు. 24 కిలోమీటర్ల దూరంలో చాలా వరకు పనులు పూర్తయి, ప్రస్తుతం క్యూరింగ్ పనులు జరుగుతున్నాయని, కొన్ని గ్రామాలకైనా నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

# పారిపోతున్నా వెంటపడి.. మర్మాంగాలు నలిపేసి



- యువకుడి ప్రాణం తీసిన స్నేహితులు
- గంజాయి, అమ్మాయి విషయాలే కారణం

**హయత్‌నగర్ (మనసులో మాట) జూలై 10:**

స్నేహితులే కదా అని నమ్మి అర్ధరాత్రి తర్వాత వారితో వెళితే.. పసుమాములకు చెందిన నిషాని సుహాస్(22)ను దారుణంగా కొట్టి చంపినట్లు సమాచారం. గంజాయి వ్యాపారంలోని లావాదేవీలతో పాటు.. ఓ అమ్మాయి విషయంలో జరిగిన లొల్లి ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. అనుమానిత నిందితుల్లో ఒకరిని పోలీసులు విచారించినప్పుడు పలు విషయాలు వెలుగు చూశాయి. విశ్వసనీయంగా సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి.పసుమాములలో తల్లితో కలిసి ఉంటున్న సుహాస్‌కు గంజాయి వ్యసనంతోపాటు వ్యాపారం చేసిన అనుభవం ఉంది. సికింద్రాబాద్‌లో ఉన్న సమయంలో కుమారుడు పెడతోవ పడుతున్నాడని గ్రహించిన తల్లి నందిని పసుమాములలో సొంతిల్లు కొనుక్కొంది. భర్త చనిపోయినా.. కుమార్తెకు వివాహం చేసింది. ఆశలన్నీ కుమారుడు సుహాస్‌పైనే పెట్టుకొని జీవనం సాగిస్తోంది. సుహాస్‌కు పసుమాముల, పెద్దఅంబర్‌పేట్, సికింద్రాబాద్‌కు చెందిన రాకేష్, నడిమిట్ల పరశురాం, రాజులతో పాటు మరొకరితో బాగా స్నేహం ఉంది. సుహాస్‌కు చరవాణి లేకపోవడంతో ఈ నలుగురిలో ఒకరి సెల్‌ఫోన్ తీసుకున్నాడు. అతని గర్ల్‌ఫ్రెండ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేశాడు. సుహాస్ అసభ్యకరంగా సందేశాలు పెట్టడంతో పాటు ఆమె ఫోన్ చేస్తే కూడా అదేతీరులో మాట్లాడినట్లు సమాచారం. జరిగిన విషయమంతా యువతి తన బాయ్‌ఫ్రెండ్‌కు చెప్పింది. గతంలో కలిసి గంజాయి వ్యాపారం చేసిన సమయంలో ఆర్థిక లావాదేవీలపై జరిగిన గొడవలు తోడవ్వడంతో ఆగ్రహించాడు.అదే కారణంతో సుహాస్ అంతుచూడాలని హత్యకు పథకం వేసినట్లు తెలుస్తోంది. పరశురాం, రాజు, రాకేష్ సహా మరో వ్యక్తి బుధవారం తెల్లవారుజామున పరశురాం ఇన్‌స్టాగ్రామ్ నుంచి సుహాస్ తల్లి నందిని ఫోన్‌కు ఆడియో కాల్ చేశారు. ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో నేరుగా ఇంటికెళ్లారు. వారంతా స్నేహితులే కావడంతో తల్లి వారించినా సుహాస్ వారితో కలిసి బయటికెళ్లాడు. అక్కడ్నుంచి పసుమాముల గ్రామ శివారులోని మర్రిచెట్టు వద్దకు తీసుకెళ్లారు. విచక్షణరహితంగా దాడిచేశారు. తప్పించుకొని ప్రాణభయంతో అర కిలోమీటర్ దూరం పరుగు తీసినా.. స్నేహితుడని వదిలేయకుండా వెంటపడి మర్మాంగాలను నలిపేసి చనిపోయేదాకా కొట్టారు. ఆ తర్వాత పెద్దఅంబర్‌పేట్ పసుమాముల రోడ్డు లోని శ్మశానవాటిక ప్రహరీ పక్కన సిమెంట్ బెంచీపై పడుకోబెట్టి పారిపోయారని సమాచారం. వ్యసనాలు, పద్ధతి లేని స్నేహితులతో తిరగడంతో కుమారుడు చివరికి ప్రాణాలు కోల్పోయాడని సుహాస్ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

# ఆసుపత్రికని ఆటో ఎక్కితే అత్యాచారం



**ఘట్‌కేసర్ (మనసులో మాట) జూలై 10:**

ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన మహిళను డ్రైవర్ ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. పోచారం ఐటీ కారిడార్ సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భరత్‌నగర్‌లో ఉండే ఓ మహిళ బుధవారం ఉదయం ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. డ్రైవర్ కల్లు పార్సిల్ తీసుకుని ఘట్‌కేసర్ ఔటర్ సర్వీసు రోడ్డులోని ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. ఆమెకు కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి తాగించాడు. స్పృహ కోల్పోయిన తరువాత ఆమెపై అత్యాచారం చేసి ఫోన్, కొంత నగదు తీసుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీకెమెరాల ఆధారంగా ఆటో డ్రైవర్ అంగోతు జేత్యగా గుర్తించారు. గురువారం ఎస్సై రాజు, సిబ్బంది కలిసి అన్నోజిగూడలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆటో, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# వారం కిందట బిడ్డ పెళ్లి.. అంతలోనే తండ్రి మృతి



**బీర్కూర్ (మనసులో మాట) జూలై 10:**

వారం కిందట బిడ్డ పెళ్లి చేసిన తండ్రి గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఈ ఘటన బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (45) అనే రైతుకు మూడు ఎకరాల సొంత పొలం ఉంది. అదనంగా రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పొలానికి నీరు పారించేందుకు గురువారం మధ్యాహ్నం బోరు వేసేందుకు గట్టుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు శ్రీనివాస్‌గౌడ్ చేయి విద్యుత్తు నియంత్రికకు తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఘటనాస్థలిలోనే మృతి చెందారు. సమీపంలో ఉన్న గొర్రెల కాపరులు గమనించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకులు పోలీసులకు విషయాన్ని తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని పంచనామా చేసి మృతదేహాన్ని బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. రైతు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. బిడ్డ పెళ్లి చేసిన వారం రోజులకే అతను మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

# పంచాయతీలు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి



**దామెర (మనసులో మాట) జూలై 10:**

గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా దామెరలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో దామెర, ఆత్మకూరు, నడికుడ, పరకాల, శాయంపేట మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సొంత ఆదాయ వనరుల కల్పనపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి, పొడి కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ.. వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో బీఎల్ఓలు, రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో వనమహోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని, పూర్తిస్థాయిలో గుంతలు తీయాలని సూచించారు. సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, జడ్పీ సీఈవో శేషాద్రి, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవోలు శ్రీనివాస్ రెడ్డి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

# బస్సుల కోసం ప్రయాణికుల ఇబ్బందులు



**పరకాల (మనసులో మాట) జూలై 10:**

వరంగల్ జిల్లా పరకాల ఆర్టీసీ బస్టాండ్లో శుక్రవారం బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానిక డిపోలో మొత్తం 80 బస్సులు ఉండగా.. వాటిలో 53 బస్సులను ఖమ్మం జిల్లాలో సీఎం సభకు తరలివెళ్లాయి. మిగిలిన 27 బస్సులు ఆయా రూట్లకు సరిపోలేదు. హైదరాబాద్, హనుమకొండ, భూపాలపల్లి, జమ్మికుంట, హుజురాబాద్ వంటి రూట్లకు వెళ్లేందుకు సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్లో గంటల తరబడి పడిగాపులు కాశారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

# దోపిడీకి తరుగు ముసుగు

**వరంగల్ (మనసులో మాట) జూలై 10:**



వరంగల్ జిల్లాలో 25,929 మంది రైతులు 1,27,312 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను విక్రయించగా.. ఒక్కో రైతుపై రూ.2వేలు కోతను లెక్కించినా.. సుమారు రూ.5.18 కోట్లు అక్రమంగా.. ప్రైవేట్ గోదాంల నిర్వాహకుల జేబుల్లోకి వెళ్లినట్లే. ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతు శ్రమను కొందరు తరుగు పేరుతో దోచుకుంటున్నారు. ఈ ఏడాది అంచనాకు మించి మొక్కజొన్న పంట దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటా రూ.2,400 మద్దతు ధర ప్రకటించారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.1,500 నుంచి రూ.1,900కే కొనుగోలు చేయడంతో.. మెజార్టీ రైతులు ఆపసోపాలు పడి మద్దతు ధరకే అమ్ముకున్నారు. తీరా చెల్లింపుల్లో ఒక్కో రైతుకు ఒక బస్తా నుంచి 5 బస్తాల వరకు తరుగు తీస్తుండటంతో రైతులు మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ కార్యాలయాలకు వెళ్లి అధికారులను నిలదీస్తున్నారు.

**ప్రైవేట్ గోదాం నిర్వాహకుల మాయాజాలం**

కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తా బరువు (50 కిలోలు మొక్కజొన్న, 580 గ్రాములు గన్నీ బరువు) మొత్తం 50.580 కిలోలు ఉండాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే బస్తాలకు సుతిల్ వేసేటప్పుడు, రవాణా చేసే సమయంలో తరుగు పోతుందని.. ఒక్కో బస్తాను సుమారు 51కిలోల నుంచి 51.500 కిలోల వరకు తూకం వేశారు. గోదాంల నిర్వాహకులు నిబంధనలను పక్కనబెట్టి.. ఒక్కో బస్తా 51 కిలోల కంటే 10 గ్రాముల తక్కువున్నా.. మొత్తం సరకులో నుంచి 2 నుంచి 4 బస్తాల వరకు తరుగు తీస్తున్నారు. దీంతో ఒక్కో రైతు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు నష్టపోతున్నాడు.

**ఆధారాలు తుడిపేసేందుకు కుయుక్తులు**

కేంద్రాల్లో జనరేట్ చేసిన ట్రక్‌షీట్ ఆధారంగా.. గోదాంల నిర్వాహకులు సరకును తూకం వేస్తారు. అందులో తేడాలుంటే.. వెంటనే ఆధారాలను జతచేసి కేంద్రం ఇన్‌ఛార్జికి పంపించాలి. ఆ తర్వాతే సరకు వివరాలను ట్రిప్ ఐడీ ద్వారా ఆన్‌లైన్ చేయాలి. పైగా గోదాం వద్ద సరకు దిగుమతి తర్వాత.. కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలకు స్వీకరణ రసీదుతో పాటు రైతులకు మరో రసీదు ఇవ్వాలి. అయితే ఎలాంటి రసీదు ఇవ్వకుండానే.. సరకు దిగుమతి చేసుకుని.. ఇప్పుడు చెల్లింపుల సమయంలో.. తరుగు పేరుతో రైతుల నోటికాడ బుక్క లాక్కుంటున్నారు. విషయం బయటికి పొక్కకుండా.. తరుగు వచ్చిందని ముందే చెప్పి రైతుల సంతకాలు తీసుకుంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో మార్క్‌ఫెడ్, ప్రైవేట్ గోదాంలు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలు మిలాఖత్ అయినట్లు ఆరోపణలున్నాయి.ఈ విషయంపై మార్క్‌ఫెడ్ డీఎం చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. చెల్లింపుల్లో కోతలుంటే.. తమ దృష్టికి తీసుకురావాలని, తద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# గోరంత అనుమతి.. గుట్టంతా తవ్వకం

**వరంగల్ (మనసులో మాట) జూలై 10:**

గుత్తేదారు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, ఏళ్లనాటి భారీ వృక్షాలను ధ్వంసం చేస్తూ.. అనుమతుల పేరుతో ఎక్కువ మొత్తంలో మట్టి తరలిస్తున్నారని ఇటీవల పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ధర్నాలు, అధికారులకు వినతిపత్రాలు సైతం అందజేశారు. చిట్యాలకు చెందిన ఓ వ్యక్తి కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, అమిత్‌షా, పలువురికి ఆన్‌లైన్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో గనుల శాఖ జిల్లా డైరెక్టర్ విచారణ చేపట్టారు. నివేదిక వచ్చే వరకు మట్టి తరలింపు ఆపాలని గత నెల 4న చిట్యాల తహసీల్దార్ వసంతరావుకు నోటీసులు జారీ చేసినా.. ఈ తంతు ఆగడం లేదు.భూపాలపల్లి టౌన్, చిట్యాల, న్యూస్‌టుడే: రహదారుల నిర్మాణం ఆ ప్రాంత ప్రగతికి బాటలు వేయాలి. కానీ, ఇక్కడ మాత్రం ఏళ్లనాటి గుట్టలు అ'క్రమంగా' కనుమరుగవడానికి కారణమవుతోంది. మంచిర్యాలవరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం చేపట్టిన మొరం తవ్వకాల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట శివారు శాంతినగర్ గుట్టల నుంచి అనుమతులకు మించి రాత్రింబవళ్లు యంత్రాలతో మొరాన్ని తవ్వుతూ చిట్యాల, టేకుమట్ల మండలాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్నారు. ఈ దోపిడీపై స్థానికులు, పలు పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా.. యంత్రాంగంలో పట్టింపు కరవైంది.

**అనుమతి పేరుతో దోపిడీ..**

జాతీయ రహదారి నిర్మాణ పనులకు నవాబుపేట శివారులోని రెండు గుట్టల నుంచి మొరం తరలించేందుకు అనుమతులు తీసుకున్నామని గుత్తేదారు చెబుతున్నారు. అయితే అధికారులిచ్చిన అనుమతులు కొద్ది మొత్తానికేనని, క్షేత్రస్థాయిలో మాత్రం అనుమతులకు మించి మొరాన్ని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన అనుమతి ప్రాంతం నుంచి కాకుండా వేరేచోటు నుంచి తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రోజూ దాదాపు 30 టిప్పర్లలో.. ఒక్కో టిప్పర్ 10 చొప్పున రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మట్టి తీసే ప్రదేశంలో మైనింగ్ శాఖ అధికారి ఉండాల్సి ఉండగా.. అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఫిర్యాదు చేసినా.. ఆగని దందా..

**కొత్త ఎన్వోసీలను అనుమతి ఇవ్వలేదు..**



అనుమతుల కంటే ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాగా, గత నెలలో నోటీసులు జారీ చేశాం. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మైనింగ్ శాఖను కోరాం. విచారణ పూర్తయ్యేదాకా తవ్వకాలు చేయొద్దని గుత్తేదారును ఆదేశించాం. గతంలో తీసుకున్న అనుమతులతో ప్రస్తుతం గుట్టలోని మరో ప్రాంతం నుంచి మట్టి తీస్తున్నారు. కొత్త ఎన్వోసీలకు దరఖాస్తు చేసుకోగా.. అనుమతివ్వలేదు. మైనింగ్ అధికారులు విచారిస్తేనే పూర్తి వివరాలు వెల్లడవుతాయి.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి: సబితా ఇంద్రారెడ్డి



**బడంగ్ పేట్ (మనసులో మాట) జూలై 10:**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యుమరేషన్ ఫారాలు, ఓటరు జాబితా ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.

# ‘సర్’ లేరనడంతో ఉసూరు

**నిజామాబాద్ వైద్య విభాగం**

**(మనసులో మాట) జూలై 10:**



జిల్లాలో ప్రస్తుతం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం కొనసాగుతోంది. ఇందుకోసం నిజామాబాద్ కార్పొరేషన్‌లో సర్కిల్ కార్యాలయాలను కూడా ఏర్పాటు చేశారు. కరీంనగర్, ఖమ్మం, వరంగల్ వంటి నగరాల్లో లేనివిధంగా, ఇక్కడి నగరపాలికలో అధికారులు, సిబ్బందికే ‘సర్’ విధులు కేటాయించడంతో సాధారణ పాలన, పౌర సేవలు పడకేశాయి.

**ఎక్కడ చూసినా..**

గతనెల 25వ తేదీ నుంచి ‘సర్’ను మొదలుపెట్టారు. రాష్ట్రంలోని ఏ బల్దియాల్లో చూసినా రెవెన్యూ శాఖకు బాధ్యతలు అప్పగించారు. కానీ, గత నిర్ణయాల ఆధారంగా నగరపాలిక అధికారులు, సిబ్బందికే నేరుగా విధులు కట్టబెట్టారు. రెండు వారాలుగా పౌర సేవలతో పాటు రెవెన్యూ వసూళ్లపై తీవ్రప్రభావం పడుతోంది. గత సంవత్సరం కార్పొరేషన్ ఎన్నికలు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలతో రెవెన్యూ సిబ్బంది వసూళ్లపై దృష్టిసారించలేకపోయారు. ఏటా ఆస్తిపన్ను రూపంలో రూ.వంద కోట్లు వసూలు చేయాలని లక్ష్యం విధిస్తున్నారు. అందులో సగమైనా ఖజానాకు దక్కలేదు. కార్యాలయానికి వచ్చే పౌరులు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత ఉంది. ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హైదరాబాద్‌కు వెళ్లారు. ప్రస్తుతం ఒక్క టౌన్ ప్లానింగ్ అధికారే మిగిలారు. ఇంటి అనుమతులు ఇవ్వాలన్నా, హోర్డింగ్‌లు పరిశీలించి పన్నులు రాబట్టాలన్నా సిబ్బందే లేరు. ఫిర్యాదులపై తనిఖీలు చేపట్టేవారే లేరు. ఈ విభాగం ఖాళీగా ఉంది. ఇంజినీరింగ్, మెప్మా, జననమరణ ధ్రువీకరణ, ఎస్టాబ్లిష్‌మెంట్, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సైతం ‘సర్’ విధుల్లో బిజీగా ఉన్నారు. పన్నుల వసూళ్ల నుంచి రోజువారీ పారిశుద్ధ్య పనుల వరకు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. అభివృద్ధి పనుల పర్యవేక్షణ సైతం గగనమవుతోంది. ‘ప్రత్యేక సమగ్ర సవరణ విధులను రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కార్పొరేషన్ సిబ్బందే చూస్తున్నారు. వాస్తవానికి ఈ పనిని రెవెన్యూ వారు చూడాలి. గతంలో ఇలాంటి విధులను ఇక్కడి కమిషనర్లు సొంతంగా సిబ్బందితోనే చేశారని చెబుతున్నారు’

# నల్ల బంగారం.. సిరుల సింగారం



- **తాడిచెర్ల బ్లాక్-2 బొగ్గు తవ్వకాలతో పారిశ్రామిక వెలుగులు**

**మల్హర్ (మనసులో మాట) జూలై 10:**

భూగర్భ పొరల్లో దాగిన నల్ల బంగారం సిరులు కురిపిస్తోంది. పారిశ్రామిక వెలుగులు విరజిమ్ముతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్ల బ్లాక్2 బొగ్గు గని విస్తరణతో ఈ ప్రాంతం రూపరేఖలు మారనున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధిపై ఆశలు చిగురిస్తున్నాయి. సింగరేణిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు దొరికే అవకాశం ఉంది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో పురోగతి చెందనుంది. చిరు వ్యాపారాలకు చేతినిండా పని లభించనుంది. మానేరు నీరు సమృద్ధిగా ఉండటంతో విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తే మరింత ఉపాధి పెరగనుంది.

**ప్రగతి పరుగు..**

రెండో గని విస్తరణలో శాత్రాజ్‌పల్లి గ్రామం, భూములు పూర్తిగా, పెద్దతూండ్లలో పాక్షికంగా భూములు కోల్పోనున్నాయి. తాడిచెర్ల బ్లాక్1 బొగ్గు ఉత్పత్తితో కొంత ఉపాధి లభిస్తోంది. ఉపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్తున్న నిరుద్యోగులకు సింగరేణిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల, ప్రాంతాల్లో వ్యాపారం పెరగనుంది. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుకానున్నాయి.

**విద్యుత్తు కేంద్రంపై ఆశలు**

అపార బొగ్గు నిల్వలు, మానేరు నీరు సమృద్ధిగా ఉన్న ఇక్కడ విద్యుత్తు కేంద్రం నిర్మించాలని 1991లో తెరపైకి రాగా, అప్పట్లో నక్సల్స్ ప్రాబల్యం కారణంగా ఆ ప్రయత్నం మరుగున పడింది. ఆ తర్వాత చెల్పూర్‌లో విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించగా.. 1,100 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. తాడిచెర బ్లాక్1 గని నుంచి చెల్పూర్‌కు బొగ్గు తరలిస్తున్నారు. రెండో గని బొగ్గుతో స్థానిక అవసరాలకుపోగా, దూర ప్రాంతానికి తరలించనున్నారు. మానేరు నీటిని ఒడిసిపట్టి ఇక్కడే 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం నిర్మిస్తే పారిశ్రామిక వెలుగులు ప్రసరించనున్నాయి. ఆ దిశగా పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి**

పూర్వం నుంచి అటవీ ప్రాంతంలో జీవిస్తున్నాం. బొగ్గు తవ్వకాలతో ఊరు, భూములు కోల్పోతున్నాం. మాలాంటి పేదలకు ఎలాంటి జీవనాధారం లేదు. ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి.

**పెరగనున్న వ్యాపారాలు**

గ్రామంలో కిరాణం నడిపిస్తున్నాం. బొగ్గు తవ్వకాలతో కార్మిక కుటుంబాలు ఇక్కడే ఉండనున్నాయి. రవాణా సంబంధాలు మెరుగు కానున్నాయి. చిరు వ్యాపారాలకు మంచి లాభం రానుంది.

**గని స్వరూపం**

**భౌగోళిక విస్తీర్ణం: 7.7 చదరపు కి.మీ**
**బొగ్గు నిల్వలు: 182.07 మి.టన్నులు**
**పొరలు: 16, బొగ్గు రకం: జీ8**
**కోల్పోతున్న భూములు: 1,550 హెక్టార్లు**
**అటవీ: 1,300 హెక్టార్లు**
**సాగు భూములు: 250 హెక్టార్లు**

# మందలింపుతో బావిలోకి దూకిన బాలిక



**ఆసిఫాబాద్ (మనసులో మాట) జూలై 10:**

‘స్నానం చేయి’ అని కుటుంబ సభ్యులు మందలించినందుకు మనస్తాపానికి గురైన ఓ బాలిక బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడంది. ఈ ఘటన ఆసిఫాబాద్‌లో చోటు చేసుకుంది. అయితే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి బాలికను సురక్షితంగా బయటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌కు చెందిన స్వర్ణలత, పోచీరాంల కుమార్తె సాత్విక ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. అయితే బుధవారం సాయంత్రం స్నానం చేయాల్సిందిగా కుటుంబ సభ్యులు ఆమెను కాస్త గట్టిగా మందలించారు. కుటుంబ సభ్యుల మాటలకు తీవ్ర మనస్తాపం చెందిన సాత్విక.. వెంటనే పక్క వీధిలోని బజార్‌వాడిలో ఉన్న ఒక బావి వద్దకు వెళ్లి అందులోకి దూకేసింది. నీటిలో మునిగిపోతూ ప్రాణభయంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. బాలిక అరుపులు విన్న స్థానికులు వెంటనే అప్రమత్తమై ‘100’నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌హెచ్‌వో బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఫైటర్ నరేష్, ఫైర్‌మెన్ రాము, డ్రైవర్ ప్రవీణ్‌కుమార్‌లు తాడు, రక్షణ పరికరాలతో రంగంలోకి దిగారు. ఫైర్‌మెన్ రాము ప్రాణాలకు తెగించి తాడు సహాయంతో బావిలోకి దిగారు. నీటిలో కొట్టుమిట్టాడుతున్న బాలికకు లైఫ్ జాకెట్ తొడిగారు. అనంతరం సిబ్బంది సహాయంతో బాలికను సురక్షితంగా బావి పైకి తీసుకొచ్చారు.

# మూతపడి.. మెరుగు'బడి'



- విద్యార్థుల రాకతో పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు

**కామారెడ్డి విద్యావిభాగం (మనసులో మాట) జూలై 10:**

ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని రాజ్‌ఖాన్‌పేట బడి ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి నోచుకుంది. గతేడాది వరకు మూసి ఉన్న ఈ బడిలో పంచాయతీ కమిటీ ప్రత్యేక చొరవతో 29 మంది విద్యార్థులు చేరారు. తెరుచుకున్న బడిని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. విద్యార్థులు ప్రైవేటు విద్యాలయాల వైపు మళ్లకుండా అప్రమత్తమయ్యారు.రామారెడ్డి మండలం సున్నపురాళ్ల తండాలో ఉన్న ప్రాథమిక పాఠశాల మూడేళ్ల క్రితం మూతపడింది. సమీప మండల కేంద్రంలోని ప్రైవేటు బడికి పిల్లలను పంపడంతో ఈ పరిస్థితి తలెత్తింది. స్థానికులు తమ తండాలో బడిని తెరవాలని విద్యాశాఖకు విన్నవించారు. ప్రస్తుతం ఎనిమిది మంది విద్యార్థులను ఈ బడిలో చేర్పించారు. మరిన్ని ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నారు. మూతపడిన సర్కారు బడుల రూపురేఖలు మారుతున్నాయి. గ్రామవాసులు, పంచాయతీ పాలకవర్గాల కృషితో బడులు మళ్లీ తెరుచుకుంటున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటికే కొత్తగా రెండు బడులను ప్రారంభించారు. ఈ బడుల్లో 50 ప్రవేశాలే లక్ష్యంగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. భవిష్యత్‌లో మరిన్ని బడులు తెరుచుకునేలా యంత్రాంగం క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తోంది.

**గతేడాది ప్రారంభమైనవి ఇవి..**

మూతపడిన ఐదు సర్కారు బడులను గత విద్యాసంవత్సరం ప్రారంభించారు. భిక్కనూరు పరిధిలోని మోటాట్‌పల్లి, గాంధారి పరిధిలోని పల్లెమడుగు తండా, జుక్కల్ మండలం మాతుర తండా, మాచారెడ్డి మండలం నెమలిగుట్ట తండా, సదాశివనగర్ మండలం దగ్గి ప్రాథమిక బడులు గతేడాది ప్రారంభం అయ్యాయి. ఈ బడుల్లో ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు.

**బడిబాటలో చేర్పించారు..**

గ్రామీణ, తండా ప్రాంతాల్లో అనేక మంది పిల్లలను తల్లిదండ్రులు బడులకు పంపడం లేదు. తాము పని చేసే చోటకు పిల్లల్ని తీసుకెళ్తున్నారు. దీంతో వారు చదువులకు దూరమవుతున్నారు. కాగా ఈ విద్యాసంవత్సరం బడిబాటలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 186 మంది బాలలను గుర్తించి వారికి సమీప బడుల్లో ప్రవేశాలు కల్పించారు.

**ప్రైవేటుకు దీటుగా విద్య**

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతోంది. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. తల్లిదండ్రుల ఆలోచన సరళిలో మార్పు రావాలి. ప్రభుత్వ విద్యాలయాల్లోనే తమ పిల్లల్ని చేర్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

# సామ దుబ్బ తండాలో చిరుత పులి బీభత్సం

# మూడు లేగదూడలు మృతి

**కామారెడ్డి జిల్లా (మనసులో మాట) జూలై 10:**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడ పరిధిలోని సామ దుబ్బ తండాలో ఆదివారం అర్ధరాత్రి చిరుత పులి బీభత్సం సృష్టించింది. తండాకు చెందిన రమావత్ రమేష్ అనే రైతుకు చెందిన మూడు లేగ దూడలపై చిరుత దాడి చేసి హతమార్చింది.



**సామ దుబ్బ తండాలో చిరుత పులి బీభత్సం:**

బాధితుడు రమేష్ ఆదివారం రాత్రి తన పశువుల పాకలో లేగ దూడలను కట్టివేసి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో పాకపై దాడి చేసిన చిరుత పులి.. రెండు లేగ దూడలను అక్కడికక్కడే చంపేసింది. మరో దూడను కొంతదూరం లాక్కెళ్లి హతమార్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ దాడి వల్ల తనకు సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. తాను కూలి పనులు చేసుకునే నిరుపేదనని అన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రమేష్ వేడుకున్నాడు.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్:**

సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ జాదవ్ రేణుక గణపతి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అటవీ ప్రాంతానికి సమీపంలో తండాలు ఉండటంతో చిరుత పులుల సంచారం ఎక్కువైందని తెలిపారు. దీంతో తండావాసులు తీవ్ర భయాందోళనల మధ్య గడుపుతున్నారని పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి తండావాసులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో వన్యప్రాణులు పశువులపై దాడులు చేసినా.. అటవీశాఖ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తం అవ్వాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నష్టపోయిన రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

# దుబాయ్‌లో కడెం మండలవాసి మృతి



**నిర్మల్ (మనసులో మాట) జూలై 10:**

దుబాయ్‌లోని ఓ కంపెనీలో 18 ఏళ్లుగా పనిచేస్తున్న కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ అనుబంధంగా ఉన్న పెత్తర్పు గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మణ్ జులై 7న అకస్మాత్తుగా మృతి చెందారు. తొమ్మిదేళ్లుగా ఇంటికి రాకుండా ఒకే కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేసిన ఆయన మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. లక్ష్మణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలంటూ ఆయన భార్య సత్తవ్వ గురువారం కలెక్టరేట్ అధికారులను వేడుకున్నారు. ఆయన ఒరిజినల్ పాస్‌పోర్టు లేదని.. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి అయ్యే ఎంబాల్మింగ్, శవపేటిక, ఎయిర్ కార్గో, రవాణా ఖర్చులు భరించలేమని విలపించారు. జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి ముత్యంరెడ్డి, ఎన్నారై రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. లక్ష్మణ్ కుమారుడు, ఇద్దరు కుమార్తెల చదువు కొనసాగించడానికి సాయం చేస్తామని కార్మికశాఖ సహాయ అధికారి హామీ ఇచ్చారు. భారత విదేశాంగ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం మానవతా దృక్పథంతో స్పందించి ఐసీడబ్ల్యూఎఫ్ (ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్) ద్వారా ఆర్థిక సాయం అందించి లక్ష్మణ్ మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నారై సలహా కమిటీ సభ్యుడు పేర్కొన్నారు.

# బాసర ఆలయంలో భారీ చోరీ

## అమ్మవారి వెండి కిరీటం, హుండీ అపహరణ



**నిర్మల్ (మనసులో మాట) జూలై 10:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఆలయ పైఅంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి సన్నిధిలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో మహంకాళి ఆలయ ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడిలోని అమ్మవారి వెండి కిరీటంతో పాటు కానుకల హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదును కాజేసిన దొంగలు..ఖాళీ హుండీని సమీపంలోని **వ్యాసగుడి వద్ద పడేసి పరారయ్యారు.**

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్: మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాల కోసం వచ్చి చూసేసరికి గేట్లు విరగ్గొట్టి ఉండటం గమనించారు. లోపల కిరీటం, హుండీ కనిపించకపోవడంతో వెంటనే ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని సిసిటివి (CCTV) ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలిస్తున్నారు. అత్యంత భద్రత ఉండే బాసర ఆలయ పరిసరాల్లో ఈ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

## అత్తాపూర్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్..
## ఇంజెక్షన్లు, మాత్రలు స్వాధీనం



రాజేంద్రనగర్ (మనసులో మాట) జూలై 10:

అత్తాపూర్ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్ ముఠాను పట్టుకున్నారు. నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్, మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, అల్ప్రజోలం మాత్రలను అక్రమంగా విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. జూలై 8న న్యూ జలాల్ బాబా నగర్‌లోని ఓ అద్దె గదిపై పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 6.65 గ్రాముల ఎండీఎంఏ, 5 ఇంజెక్షన్లు, అల్ప్రజోలం మాత్రలు, రెండు సిరంజీలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.16,930 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో అత్తాపూర్‌కు చెందిన సయ్యద్ అబుల్ హసన్, సైఫ్ అలీ మీర్జా, అహ్మద్ హుస్సేన్, షేక్ అయూబ్, యాకుత్‌పురాకు చెందిన మీర్ షబ్బీర్ అలీ ఉన్నారు. ప్రధాన సరఫరాదారు బాకర్, మరో సబ్ పెడ్లర్ ముజాహిద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నిందితులు డ్రగ్స్ విక్రయాల్లోకి దిగినట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిందితుడిపై పాత నేర కేసులు ఉన్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఏసీపీ టి. శ్రీనివాస్, అత్తాపూర్ ఎస్‌హెచ్ఓ కె. నాగేశ్వరరావు, ఎస్ఓటీ బృందం ఈ ఆపరేషన్ నిర్వహించింది.

# మురుగులో మునిగిన రాజేంద్రనగర్ సర్కిల్
# ఉప కమిషనర్ నిద్ర వీడేనా?

- బాధ్యత ఎక్కడ? మురుగులో మగ్గుతున్న రాజేంద్రనగర్ సర్కిల్
- నెలలుగా వీధుల్లో మురుగునీటి ప్రవాహం
- దుర్వాసన, దోమలతో ప్రజల అవస్థలు
- ఫిర్యాదులు చేసినా స్పందన లేదని స్థానికుల ఆగ్రహం





రాజేంద్రనగర్ (మనసులో మాట) జూలై 10:

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్, బండ్లగూడ జాగీర్, హైదర్షాకోట్ డివిజన్లలో నెలలుగా మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రరూపం దాల్చినా పూడికతీత పనులు చేపట్టకపోవడం, మురుగు కాలువల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అనేక కాలనీలు దుర్వాసన, దోమల మధ్య నరకయాతన అనుభవిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి చేరి వీధులన్నీ కంపు కొడుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. దుర్వాసనతో పాటు దోమల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, ఇతరులు సీజనల్ వ్యాధులు, శ్వాసకోశ సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని కనీసం తాత్కాలిక చర్యలు కూడా చేపట్టకపోవడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, మురుగు కాలువలకు అత్యవసరంగా పూడికతీత పనులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు కోరుతున్నారు.

## ఉప్పల్‌లో ఎంఎంసీ కమిషనర్
## తనిఖీలు



ఉప్పల్ (మనసులో మాట) జూలై 10:

సీసీ రోడ్లు, వీధి దీపాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రతిపాదనలపై సమీక్షఆస్తి పన్ను అంచనాల కోసం పత్రాల పరిశీలనకు ఆదేశాలునాలా ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ తొలగింపుపై ప్రత్యేక దృష్టిసీ అండ్ డీ వ్యర్థాల నియంత్రణకు కఠిన చర్యలు - అక్రమ డంపింగ్‌పై జరిమానాలు విధించాలినాలా పరిసరాల్లో రితహారం చేపట్టి పచ్చదనం పెంపొందించాలిమల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఇవాళ (గురువారం) ఉప్పల్ భాగాయత్, రామంతాపూర్ భాగాయత్ ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, పట్టణ ప్రణాళిక, ఆదాయ విభాగం, పట్టణ జీవవైవిధ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీ నిర్వహించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

# ఓఆర్ఆర్‌పై ప్రమాదాలకు
# చెక్ 80 బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక నిఘా

హైదరాబాద్ సిటీబ్యూరో
(మనసులో మాట) జూలై 10:




హైదరాబాద్ మహా నగరాన్ని చుట్టుముట్టిన ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)పై రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ అధ్యక్షతన టీజీఐసీసీసీలో శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో రహదారి భద్రత, ప్రమాదాల నివారణ, ఆధునిక సాంకేతికత వినియోగంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి, ఎన్‌హెచ్ఏఐ, జీహెచ్ఎంసీ, హెచ్‌జీసీఎల్, ఐఆర్బీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత మే నెలలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించిన అధికారులు, ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 80 కీలక బ్లాక్‌స్పాట్లను గుర్తించి అక్కడ ఇప్పటికే ప్రత్యేక నిఘా, కట్టుదిట్టమైన ట్రాఫిక్ అమలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా అతివేగం, లేన్ ఉల్లంఘనలు, ఇతర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. దీంతో, పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఓఆర్ఆర్‌పై నమోదవుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనల్లో దాదాపు 99 శాతం రిపీట్ వైలేషన్లే ఉన్నాయని సజ్జనార్ వెల్లడించారు. ఈ పరిస్థితిని మార్చేందుకు కేవలం జరిమానాలు విధించడం సరిపోదని, వాహనదారుల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం.